సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 315

బుధవారం 5-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



వరుణ్‌కు 'వన్డే' అవకాశం

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన భారత స్పిన్నర్ - 14లో



'టారీఫ్' రిలీఫ్

ఈక్విటీ మార్కెట్ల భారీ ర్యాలీ... 5.96 లక్షల కోట్ల సంపద సృష్టి - 15లో



నేడే హస్తిన సమరం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ బుధవారం జరగనుంది. 1.56 కోట్ల మంది ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

- వివరాలు 6లో▶



మృతుల సంఖ్యను దాస్తున్నారు

మహాకుంభమేళా తొక్కిసలాట మృతుల సంఖ్యను యూపీ ప్రభుత్వం దాస్తోందని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు.

- వివరాలు 6లో▶



అమెరికా నుంచి భారత్‌కు...

205 మంది భారతీయ వలసదారులతో కూడిన అమెరికా సైనిక విమానం టెక్సాస్ నుంచి భారత్‌కు బయలుదేరింది.

- వివరాలు 6లో▶



చైనా ప్రతీకార సుంకాలు

అమెరికా సుంకాలపై చైనా ప్రతీకార చర్యలను చేపట్టింది. వివిధ రకాల ఉత్పత్తులపై 10 నుంచి 15 శాతం సుంకాన్ని విధించింది.

- వివరాలు 6లో▶

చరిత్రాత్మక ఘట్టం!

ఒకేరోజు కులగణన, ఎస్సీల వర్గీకరణపై 'నివేదిక'లకు కేబినెట్, అసెంబ్లీ ఆమోదం

ఎస్సీలకు క్రీమీలేయర్ సిఫార్సుకు మాత్రం కేబినెట్ తిరస్కరణ

ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా పాటిద్దామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ రోజు తన రాజకీయ జీవితంలో మర్చిపోలేనిదని వెల్లడి

దేశవ్యాప్త జనగణనలో కులగణనను భాగం చేయాలంటూ తీర్మానాన్ని ఆమోదించిన అసెంబ్లీ

శాసనమండలిలో భట్టి ప్రకటన..రెండు 'నివేదిక'లకు ఆమోదం



మంగళవారం అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, సభ్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండు కీలక సామాజిక ప్రక్రియలు మంగళవారం ఒకేరోజు పూర్తయ్యాయి. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వే నివేదికతో పాటు ఎస్సీల వర్గీకరణ అంశంలో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిటీ ఇచ్చిన నివేదికను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఆ తర్వాత ప్రభుత్వం ప్రవేశపెట్టిన.. కుల సర్వే నివేదికలోని వివరాలతో కూడిన ప్రకటనను, ఏకసభ్య కమిషన్ నివేదికను అసెంబ్లీ ఆమోదించింది. మంత్రివర్గం, ఆ తర్వాత అసెంబ్లీలో ఈ రెండు అంశాలపై కూలంకషంగా చర్చ జరిగింది. తొలుత దాదాపు రెండున్నర గంటల పాటు అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కేబినెట్ భేటీలో రెండు నివేదికలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అనంతరం అసెంబ్లీలో రెండు అంశాలపై వేర్వేరుగా దాదాపు ఎనిమిది గంటలకు పైగా చర్చ జరిగింది. కులగణన సర్వేపై సీఎం రేవంత్ అధికారికంగా ప్రకటన చేశారు. సభ చివరలో ఫిబ్రవరి 4వ తేదీని సామాజిక న్యాయ దినోత్సవంగా (సోషల్ జస్టిస్ డే)గా పాటిద్దామని పిలుపునిచ్చారు. ఈ రోజు తన రాజకీయ చరిత్రలో మర్చిపోలేనిదన్నారు.

కులగణనపై వాదోపవాదాలు

సీఎం కులగణన ప్రకటన ప్రవేశపెట్టిన తర్వాత బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆ తర్వాత ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐ సభ్యులు చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో నిర్వహించిన సమగ్ర కుల సర్వే (ఎస్‌కేఎస్)లోని గణాంకాలు, ప్రస్తుత సర్వే నివేదికలోని గణాంకాలపై వాగ్వాదం జరిగింది. అనంతరం కులగణన నివేదికను ఆమోదించిన అసెంబ్లీ.. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే చేపట్టనున్న జనగణనలో కులగణనను కూడా భాగం చేయాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఎస్సీల వర్గీకరణ నివేదికపై ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. ఎస్సీలను మూడు మిగతా 2వ పేజీలో ▶

రిజర్వేషన్లు లేకుండా ఎందుకీ నివేదిక?

- అసెంబ్లీలో చర్చ సందర్భంగా కేటీఆర్
- అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే వాయిదాపై బీఆర్ఎస్ అభ్యంతరం



- వివరాలు 2లో

స్వతంత్ర భారత్‌లో ఇదే తొలి కులగణన

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల స్థితిగతులు మెరుగు పరిచేందుకే తాజా సర్వే
- కులగణన సర్వేపై అసెంబ్లీలో సీఎం రేవంత్

2 లో

అత్యంత శాస్త్రీయతతో కుల సర్వే చేపట్టాం: భట్టి



- ఈ సర్వే ఆధారంగా మరింత మెరుగ్గా సంక్షేమ పథకాలు
- గత ప్రభుత్వం చేసిన సర్వేలో శాస్త్రీయత లేదు
- కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేపడుతాం

- వివరాలు 3లో

59 కులాలు.. 3 గ్రూపులు

ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించిన ఏకసభ్య కమిషన్

- ఆయా కేటగిరీలవారీగా రిజర్వేషన్లు అమలు చేయాలని సిఫారసు
- జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికలోని వివరాలతో అసెంబ్లీలో ప్రకటన ప్రవేశపెట్టిన ప్రభుత్వం... మొదటి గ్రూపులో 15, రెండో గ్రూపులో 18, మూడో గ్రూపులో 26 కులాలు

3 లో

లోక్‌సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ



రాజ్యాంగాన్ని అర్థం చేసుకోలేరు

రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

- విపక్ష నేతలు అర్బన్ నక్సలైట్ల భాష మాట్లాడుతున్నారు
- తప్పుడు హామీలతో ప్రజల్ని మభ్యపెట్టడం మాకు తెలియదు
- ప్రజల సొమ్ముతో అద్దాలమేడ నిర్మించుకోలేదు.. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చాం..
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో చర్చకు సమాధానం

6 లో

జేబుల్లో రాజ్యాంగం పెట్టుకొని తిరిగే వారికి మన దేశంలో ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు కళ్లకు కనిపించడం లేదు. మేం ముస్లిం సోదరీమణులకు హక్కులు కల్పించడానికి ట్రిపుల్ తలాఖ్ చట్టం తెచ్చాం. - మోదీ



మహా కుంభమేళాలో భూటాన్ రాజు పుణ్యస్నానం

భూటాన్ రాజు జింగ్మే ఖేసర్ నంగ్యాల్ వాంగ్‌చుక్ మంగళవారం మహాకుంభ్ నగర్‌ను సందర్శించారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం చేశారు. ఆయన వెంట యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. 6 లో

సచివాలయాన్ని పేల్చేస్తామని బెదిరింపులు

సచివాలయంలోని సీఎం కార్యాలయంలో ఉన్న అర్జీలు, ఫిర్యాదుల విభాగానికి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి భవనాన్ని పేల్చేస్తానని బెదిరించాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 16 లో



ప్రస్తుతం అధికారంలో ఉన్నది మనమే కాబట్టి నిఘా మన మీద పెట్టాడు సార్!

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

పది మందికి నోటీసులిచ్చిన అసెంబ్లీ కార్యదర్శి



- ఫిర్యాదులకు సమాధానం చెప్పాలని ఆదేశం
- నాలుగు నెలల గడువు కోరిన ముగ్గురు ఎమ్మెల్యేలు
- దానం నాగేందర్ నివాసంలో సోమవారం భేటీ
- అసెంబ్లీలో మంగళవారం వేం నరేందర్‌రెడ్డితో చర్చలు
- సుప్రీంకోర్టులో అనుసరించాల్సిన వ్యూహంపై మంతనాలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ బీఫారం మీద గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ సెక్రటేరియట్ నుంచి నోటీసులు వెళ్లాయని తెలిసింది. ఈ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు ఎలాంటి కాలపరిమితి విధించలేదని సమాచారం. అయితే, పార్టీ ఫిరాయింపులకు సంబంధించి ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులకు సమాధానాన్ని కోరినట్టు తెలిసింది. కాగా, నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు నాలుగు నెలల సమయం కావాలని ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్, కడియం శ్రీహరి లిఖితపూర్వకంగా కోరినట్లు సమాచారం. ఫిరాయింపులపై సుప్రీంకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలకు నోటీసులివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

చర్చోపచర్చలు

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పక్షాన దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు త్వరితగతిన విచారణ చేస్తున్న నేపథ్యంలో.. ఏం చేయాలన్న దానిపై ఆ ఎమ్మెల్యేలు చర్చోపచర్చలు జరుపుతున్నారు. సోమవారం సాయంత్రం వీరంతా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసంలో సమావేశమై చర్చలు జరిపారు. మంగళవారం కూడా అసెంబ్లీ లాబీల్లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కొందరు ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. సుప్రీంకోర్టులో వినిపించాల్సిన వాదనలపై వీరు చర్చించినట్టు తెలుస్తోంది. ఈ కేసులో అసెంబ్లీ తరఫున వాదించేందుకు అడ్వొకేట్ ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల పక్షాన కూడా ప్రత్యేకంగా న్యాయవాదిని పెట్టుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. త్వరగా ఢిల్లీ వెళ్లి ఈ పనులు చక్కబెట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది.

నిజాయితీగా, నిక్కచ్చిగా 'సోర్స్ కోడ్'



అమెరికా మార్కెట్‌లో విడుదలైన బిల్ గేట్స్ ఆత్మకథ

- మైక్రోసాఫ్ట్ స్థాపించి 50 ఏళ్ల పూర్తికావడంతోపాటు తండ్రి శతజయంతి సంవత్సరం నేపథ్యంలో విడుదల
- గెలుపోటముల్లో కుటుంబ ప్రభావంపై పుస్తకంలో విశ్లేషణ
- చిన్నప్పటి నుంచి అలవర్చుకున్న ప్రశ్నించేతత్వమే తన ఎదుగుదలకు దోహదపడిందని వెల్లడి

- వివరాలు 6లో



పుస్తకాలు మా ఇంటి సభ్యులు

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో సుధామూర్తి, అక్షతామూర్తి

తల్లిని ఇంటర్వ్యూ చేసిన కుమార్తె

తమ వ్యక్తిత్వాలపై పుస్తకాల ప్రభావం గురించి చర్చ

> నేను చిన్నప్పటి నుంచి డబ్బుతో కాకుండా పుస్తకాలతో పెరిగా. మా ఇంట్లో ఎవరి బర్త్‌డేకైనా ఇచ్చే గిఫ్ట్ పుస్తకమే. అలా పుస్తకాలు అలవాటు చేశారు. అజ్ఞానంతో పడిన తలుపులను తెరిచే తాళాలే పుస్తకాలు. అవి మనకు ఎన్నో నేర్పిస్తాయి. - సుధామూర్తి

నీకు గుర్తుందా అమ్మా.. మనింట్లో నీదో లైబ్రరీ ఉండేది. అందులో సాహిత్యం, చరిత్ర పుస్తకాలు ఉండేవి. నాన్నదో లైబ్రరీ ఉండేది. అందులో సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలుండేవి. ఆ రోజుల్లో ఇంటర్నెట్ లేదు కనుక మీ ఇద్దరి లైబ్రరీలు రిఫరెన్సుగా ఉండేవి. - అక్షతామూర్తి

- వివరాలు 13లో

అంతటా కడుపు 'కోతే'!



- రాష్ట్రంలో భారీగా జరుగుతున్న సిజేరియన్లు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ తగ్గిన సాధారణ ప్రసవాలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో 80 శాతం వరకు అవే...
- పురిటినొప్పుల భయంతో సాధారణ ప్రసవాలకు విముఖత చూపుతున్న కొందరు గర్భిణులు
- తగ్గిన మిడ్‌వైఫ్స్ సేవలు... అవగాహన కల్పించని సర్కార్

16 లో

డోజ్ బృందంలోకి భారత సంతతి యువకుడు



- ఎలాన్ మస్క్ ఎంపిక చేసిన ఆరుగురు యువ ఇంజనీర్ల బృందంలో 22 ఏళ్ల ఆకాశ్ బొబ్బ
- ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో నిపుణుడు
- మెటా, పలంటీర్ సంస్థల్లో ఇంటర్న్‌గా పనిచేసిన అనుభవం

6 లో

పెళ్లి మండపాల్లో 'డబ్బు' వాద్యాలు

'మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్' అన్నమాట ఎంతవరకు నిజమో కానీ, ఆచార సంప్రదాయాలు, వ్యవహారాలు, పెట్టుపోతలు ఇవన్నీ ఆడంబరాలుగా మారి పెళ్లిఖర్చును పెంచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మ్యారేజ్ ఇండస్ట్రీ, మధ్యతరగతి మీద ఎలాంటి ప్రభావం చూపిస్తోందో తెలియజేసే ప్రత్యేక కథనం

- వివరాలు 13లో

క్లుప్తంగా...

ప్రారంభమైన వెంటనే అసెంబ్లీ వాయిదా

సీఎం ప్రకటన జాప్యం నేపథ్యంలో..

సాక్షి, హైదరాబాద్: శాసనసభ మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కొద్ది నిమిషాలకే వాయిదా పడింది. మంత్రివర్గ సమావేశం కొనసాగుతుండడం, సభలో ప్రవేశపెట్టాల్సిన ముఖ్యమంత్రి ప్రకటనను ఇంకా సిద్ధం చేయాల్సి ఉండడంతో.. సభను వాయిదా వేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ సభ్యులు ఒక వైపు నిరసన తెలుపుతుండగానే.. సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

జనాభా లెక్కల్లో ఏది నిజం?

ఒక్కో సర్వేలో ఒక్కో రకంగా లెక్క తేలటమేంటి?: అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల, సామాజిక, ఆర్థిక సర్వేలో శాస్త్రీయత లోపించిందని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ విమర్శించారు. కులగణన సర్వే నివేదికపై అసెంబ్లీలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. '2011 జన గణన ప్రకారం రాష్ట్ర జనాభా 3.50 కోట్లు. 2014లో నిర్వహించిన సమగ్ర సర్వే ప్రకారం 3.66 కోట్లు. ఆధార్ కార్డుల ప్రకారం 3.80 కోట్లు. ఎన్నికల కమిషన్ లెక్కప్రకారం 3.35 కోట్లు. ప్రస్తుతం జరిపిన సర్వే ప్రకారం 3.54 కోట్లు. వీటిలో ఒకదానికి మరోదానికి ఏమాత్రం పోలిక లేదు. రాష్ట్రంలో ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతం, ముస్లిలు 12.56 శాతం, ఓసీ ముస్లింలు 2.4 శాతం, ఓసీలు 13.1 శాతం ఉన్నారని లెక్క తీశారు. బీసీలు 46.25 శాతం, బీసీ ముస్లింలు 10.8 శాతం కలిపి మొత్తంగా బీసీలు 56.33 శాతం అని తేల్చారు. గతంలో జరిపిన సర్వేలో బీసీలు 61 శాతం ఉంటే ఇప్పుడు ఎందుకు తగ్గింది? ప్రత్యేక సమావేశం పెడితే బీసీలకు అనుకూలంగా చట్టం తెస్తారని ఆశించాం. అసలు కుల గణన సర్వే నివేదికనే సభ ముందు పెట్టలేదు. వ్యక్తిగత డేటాను పక్కన బెట్టినా.. సమగ్ర వివరాలు సభ్యులకు ఇవ్వకపోతే ప్రయోజనం ఏమిటి? బీసీలకు అన్ని రంగాల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలుచేసే విషయాన్ని కులగణన నివేదికలో ఎక్కడా పొందుపర్చలేదు. బీసీ కార్పొరేషన్లకు ఎనిమిదేళ్లుగా కేటాయిస్తున్న నిధులు ఖర్చు చేయడం లేదు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు అన్ని కులాల్లోనూ ఉన్నారు. వారికి కూడా చేయూతనివ్వాలి'అని కోరారు.


హిందూ బీసీలు.. ముస్లిం బీసీలు ఉంటారా?

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో బీసీల ఓట్లు పొందేందుకే అన్ని రాజకీయపార్టీలు బీసీల నినాదం ఎత్తుకుంటున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రభుత్వం చేసిన సర్వే కూడా బీసీలను తక్కువ చేసి చూపించిందని చెప్పారు. శాసనసభలో ప్రవేశపెట్టిన సమగ్ర కులసర్వేపై బీజేపీ తరపున ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు, రాష్ట్ర జనాభాకు పొంతన లేదన్నారు. రాష్ట్ర ప్రస్తుత జనాభా 4.33 కోట్లు ఉండగా, కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.76 కోట్లు అని తేల్చారని చెప్పారు. రాష్ట్రంలో జనాభా తగ్గడానికి 14 సంవత్సరాలుగా కాపురాలు జరగడం లేదా? పిల్లలు పుట్టడం లేదా అని వ్యాఖ్యానించారు. బీసీలు అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్నారా అని ప్రశ్నించారు. బీసీల్లో హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అనే వర్గాలు ఉంటాయా అని ప్రశ్నించారు. ఇలా కేటగిరీ చేస్తే కోర్టులు కొట్టేస్తాయని, అమలు చేయడం ఇష్టం లేకనే రాజకీయంగా తప్పించుకునేందుకు ఈ ప్రయత్నాలని ఆరోపించారు. మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ కల్పించుకొని కులగణన సర్వే జరిగిన తీరును వివరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయొద్దని హితవు పలికారు.

సర్వే సరే.. ఇప్పుడేం చేస్తారు?: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: సమగ్ర కులగణన సర్వే చేపట్టడం హర్షణీయమని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అయితే ఈ నివేదిక తర్వాత బీసీలకు జరిగే ప్రయోజనం ఏమిటో చెప్పాలని కోరారు. దీని వల్ల పెద్దగా ఉపాధి అవకాశాలు ఉంటాయని తాను భావించడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే లేవని, ఉన్నవి కూడా కాంట్రాక్టు ఉద్యోగాలని, ఇందులో రిజ్వేషన్లు పాటించేందుకు అవకాశమే లేదని చెప్పారు. గతంలో నిర్వహించిన సమగ్ర సర్వేపై శాస్త్రీయత సందేహాలకు తావిస్తోందన్నారు. ప్రస్తుత సర్వేపై అనుమానాలుంటే, గ్రామసభల్లో పెట్టి, ఇంకెవరినైనా చేర్చాల్సి ఉంటే చేర్చమని సూచించారు. నివేదిక ద్వారా బీసీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా మార్చబోతున్నారో, ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తారో చెప్పాలని కోరారు.

స్వతంత్ర భారత్‌లో ఇదే తొలి కులగణన

కులగణన సర్వేపై శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

- దేశంలో 1931లో జరిగిన కులగణనే చివరిది
- ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ, ఎక్కడా సర్వే జరగలేదు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల స్థితిగతులు మెరుగు పరిచేందుకే సర్వే చేపట్టామని వెల్లడి



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన, బలహీన వర్గాల హక్కుల కోసం ఉద్దేశించిన తొలి సమగ్ర కుల గణన, స్వతంత్ర భారతదేశంలో తెలంగాణలోనే జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 4న రాష్ట్ర మంత్రిమండలి కుల గణన సర్వే ప్రక్రియపై నిర్ణయం తీసుకుంటే, సరిగ్గా సంవత్సరానికే దీనిపై నివేదిక శాసనసభ ముందుకు వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల స్థితిగతులను మెరుగు పరిచేందుకు, వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల కోసం ప్రణాళికలను రూపొందించి అమలు చేయడం కోసం ఈ సర్వేను చేపట్టినట్లు పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీల జనాభా లెక్క తేలిందని తెలిపారు. ఇది భవిష్యత్‌కు మోడల్‌గా మారుతుందని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఈ నివేదికే ప్రామాణికంగా ఉంటుందని స్పష్టం చేశారు. 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024' నివేదికపై మంగళవారం శాసన సభ ప్రత్యేక సమావేశంలో సీఎం ప్రకటన చేశారు.

ఇదే కచ్చితమైన, శాస్త్రీయమైన సర్వే..

'దేశంలో 1931లో జరిగిన కులగణన తర్వాత మళ్లీ ఏ రాష్ట్రంలోనూ కులగణన జరగలేదు. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల జనాభా వివరాలే ఉండేవి. దీంతో వెనుకబడిన, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతూ వచ్చింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కులగణనపై హామీ ఇచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత తెలంగాణలో ఈ సర్వే చేపట్టాం. గతంలో బిహార్ వంటి రాష్ట్రాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క వంటి మంత్రులతో కమిటీ ఏర్పాటు చేశాం. సర్వేకు శ్రీకారం చుట్టాం. దీనిపై అధ్యయనం చేయించాం. మేమెంతో మాకంత ఇవ్వమన్న ఆయా వర్గాల డిమాండ్‌కు అనుగుణంగా రూ.160 కోట్లు వెచ్చించి సర్వే చేశాం. ఇదే కచ్చితమైన, శాస్త్రీయమైన సర్వే..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

అన్ని వర్గాల అభిప్రాయాలతో సర్వే షెడ్యూల్

'వివిధ ప్రజా సంఘాలు, సామాజికవేత్తలు, మేధావులు, ఇతర స్టేక్ హోల్డర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని హౌస్ లిస్టింగ్ షెడ్యూల్, సర్వే షెడ్యూల్, ఎన్యూమరేటర్లకు మార్గదర్శకాల ఆధారంగా సర్వే షెడ్యూల్ రూపొందించాం. సర్వే ఫామ్‌లో 57 ప్రశ్నలు ఉండగా, అదనపు ఉప ప్రశ్నలతో కలిపి మొత్తం 75 విభాగాల్లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల అంశాలకు సంబంధించిన సమాచారం సేకరించాం. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను ఒక్కొక్కటి 150 కుటుంబాలతో కూడిన 94,261 ఎన్యూమరేషన్ బ్లాకులుగా ఏర్పాటు చేశాం. ప్రతి బ్లాక్‌కి ఒక ఎన్యూమరేటర్‌ను, ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ని నియమించాం. రాష్ట్ర వ్యాప్తంగా 1,03,889 ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఈ సర్వేలో పాలుపంచుకున్నారు..' అని సీఎం తెలిపారు.

క్షేత్ర స్థాయిలో సర్వే..

'రాష్ట్రంలో 2024 నవంబర్ 6న సర్వే ప్రారంభమై 2024 డిసెంబర్ 25తో పూర్తయింది. హౌస్-లిస్టింగ్ చేసిన కుటుంబాలు 1,15,71,457 కాగా 1,12,15,134 కుటుంబాల సర్వే జరిగింది. అంటే సర్వే కవరేజ్ 96.9 శాతం. వివిధ కారణాల వల్ల సర్వే చేయని కుటుంబాల సంఖ్య 3,56,323. ఇవి జీహెచ్‌ఎంసీ, ఇతర నగరాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. సర్వేలో నమోదైన కుటుంబాల ఆధారంగా రాష్ట్రంలో 3,54,77,554 మందిని సర్వే చేయగా, సామాజిక వర్గాల వారీగా చూస్తే ఎస్సీల్లో 61,84,319 మందిని (17.43 శాతం), ఎస్టీల్లో 37,05,929 మందిని (10.45 శాతం) ముస్లిం మైనారిటీ మినహా బీసీల్లో 1,64,09,179 మందిని (46.25 శాతం), ముస్లిం మైనారిటీ బీసీలు 35,76,588 (10.08 శాతం) మందిని, ముస్లిం మైనారిటీల్లో మొత్తం 44,57,012 (12.56 శాతం) మందిని సర్వే చేయడం జరిగింది. ముస్లిం మైనారిటీల్లో ఓసీలు 8,80,424 (2.48 శాతం) మంది కాగా ఓసీలు 56,01,539 మంది (15.79 శాతం), ముస్లిం మైనారిటీ మినహా ఓసీలు 47,21,115 (13.31శాతం) మంది ఉన్నారు. మొత్తం 3.70 కోట్ల జనాభాగా తేలింది..' అని రేవంత్ చెప్పారు.

బీసీలు తగ్గిందెక్కడ?

- బీఆర్‌ఎస్ చెబుతున్న 2014 సర్వేలో బీసీలు 51 శాతమే.. ఇప్పుడు 56.33 శాతం
- కులగణనపై అసెంబ్లీలో విపక్ష సభ్యుల అభ్యంతరాలపై సీఎం రేవంత్
- అబద్ధాల సంఘం ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి రాజకీయ ప్రయోజనాలకు తావు లేకుండా, బీసీల ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవాలనే చిత్తశుద్ధితో కులగణన సర్వే జరిపామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే అంటూ బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న నివేదికకు ఎలాంటి ప్రామాణికత లేదని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే నివేదిక కేవలం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ వెబ్‌సైట్‌లో తప్ప మరెక్కడా అందుబాటులో లేకుండా చేశారని పేర్కొన్నారు. వాళ్లు చేశారని చెపుతున్న సర్వేలో కూడా బీసీల జనాభా 1,85,61,856 మంది అంటే 51 శాతం మాత్రమే కాగా, తాజా కులగణన సర్వేలో బీసీల సంఖ్య 56.33 శాతమని తేలిందని, అలాంటప్పుడు తగ్గింది ఎక్కడో చెప్పాలని సీఎం అన్నారు. ఇక ఓసీలు 71,18,858 మంది అంటే 21 శాతం కాగా, ఇప్పుడు తాము శాస్త్రీయంగా చేసిన సర్వేలో 15.7 శాతంగా తేలిందని తెలిపారు. అలాగే అప్పుడు ఎస్సీలు 18 శాతం కాగా ఎస్టీలు 10 శాతమని చెప్పారు. ముస్లిం కేటగిరీనే చూపించలేదన్నారు. శాసనసభలో మంగళవారం సమగ్ర కుల గణనపై జరిగిన చర్చ సందర్భంగా విపక్ష పార్టీలు దానిపై పలు అభ్యంతరాలు లేవనెత్తాయి. ఈ సందర్భంగా సీఎం జోక్యం చేసుకుని మాట్లాడారు.

బీసీల జనాభాను తగ్గిస్తే నాకు లాభమేంటి?

'బీసీల జనాభాను తగ్గిస్తే నాకు వచ్చే లాభం ఏమిటి? దీనిపై అనవసరంగా అపోహలు సృష్టించవద్దు. ఎక్కడిదో పోగేసుకుని వచ్చి ఇక్కడ మాట్లాడుతున్నారు. మీరు సర్వే చేసి మంత్రివర్గానికి, శాసనసభకు నివేదికను ఇవ్వకపోవడానికి కారణం ఏమిటి? కులగణనలో పాల్గొనని వారికి సభలో మాట్లాడడానికి అవకాశం ఇవ్వొద్దు. తమ లెక్కలు బయటపడతాయనే కేసీఆర్ కుటుంబం సర్వేలో పాల్గొనలేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డితో పాటు బీజేపీ ఎంపీ డీకే అరుణ వంటి వారు తమ వివరాలు ఇవ్వలేదు. స్వాతంత్ర్యం రాకముందు నుంచి ప్రతి పదేళ్లకోసారి దేశంలో జనాభా లెక్కలు తీశారు. 2011 తర్వాత 14 ఏళ్లుగా జనాభా లెక్కలు లేవు. 2014లో ప్రధానిగా మోదీ వచ్చిన తర్వాతే ఈ పరిస్థితి నెలకొంది. రాహుల్‌గాంధీ పార్లమెంటులో డిమాండ్ చేసినా స్పందన లేదు. అబద్ధాల సంఘం (బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి) ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. 2014 డాక్యుమెంటును మీరెందుకు బహిర్గతం చేయలేదు? ఒక కుటుంబం కోసం చేసిన సర్వే అది. ఇప్పుడు శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేశాం. ఇవే అధికారిక లెక్కలు. వీటికి కట్టుబడి ఉంటాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి. అది సాధ్యమయ్యే అవకాశం ప్రస్తుతానికి లేదు. రాజ్యాంగ సవరణ జరిగే వరకు పార్టీ తరఫున 42 శాతం సీట్లు బీసీలకు ఇస్తాం. ఇందుకు మా పీసీసీ అధ్యక్షుడిని కూడా ఒప్పించా. మీరు సిద్ధమా? బీజేపీ, బీఆర్‌ఎస్ తేల్చుకోవాలి..' అని సీఎం సవాల్ విసిరారు. 'కుల గణన సర్వే నివేదికను సభ ముందుంచడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే, సర్వే నివేదిక మొత్తం నాలుగు పుటలుగా ఉంది. ఇందులో మూడు పుటలు కులగణన, ఇతర వివరాలు కాగా నాలుగో భాగంలో ప్రజల వ్యక్తిగత వివరాలున్నాయి. వీటిని బయటపెట్టడం చట్ట రీత్యా నేరం. కాబట్టి మిగతా మూడు పుటలను సభ ముందు ఉంచడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు..'అని ముఖ్యమంత్రి అన్నారు.

రిజర్వేషన్లు లేకుండా ఎందుకీ నివేదిక?

శాసనసభలో చర్చ సందర్భంగా కేటీఆర్

- అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే వాయిదాపై బీఆర్‌ఎస్ అభ్యంతరం



సాక్షి, హైదరాబాద్: హడావుడిగా ప్రత్యేక సమావేశాలు పెడితే 42 శాతం రిజర్వేషన్ బిల్లు తెస్తారని అందరూ అనుకున్నారని, తీరా ప్రయోజనం లేని నివేదిక పెట్టారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీ రామారావు విమర్శించారు. కులగణనపై శాసనసభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ బిల్లు తెస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రేవంత్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. తమ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే జరుగుతుంటే రేవంత్ రెడ్డి వివరాలు ఇవ్వొద్దని ప్రజలకు బహిరంగంగా పిలుపునిచ్చారని, 57 రకాల వివరాలను ఎవరికి పడితే వారికి ఎలా ఇస్తాం? అని మాట్లాడారని కేటీఆర్ తెలిపారు. 2014లో తాము ప్రభుత్వ అధికారులతోనే సర్వే చేయించామని, ఇది ముమ్మాటికీ అధికారిక పత్రమేనన్నారు. దాన్ని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ వెబ్‌సైట్‌లో పెట్టామని చెప్పారు. తమ హయాంలో నిర్వహించిన సర్వేలో 1.03 కోట్ల కుటుంబాలు, 3.68 కోట్ల జనాభా పాల్గొన్నారని కేటీఆర్ వెల్లడించారు. ఈ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 1,85,61,856గా ఉందని, బీసీలు 51 శాతం ఉన్నారని, ముస్లిం బీసీలు 10 శాతం కలుపుకుంటే 61 శాతమని పేర్కొన్నారు. 51 శాతం ఉన్న బీసీల సంఖ్య 46 శాతానికి ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. అధికార పార్టీ ఎమ్మెల్సీనే ఈ సర్వే తప్పుల తడకగా ఉందని దాన్ని తగలబెట్టండని చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో చెప్పిన విషయాలనే సభలోనూ చెప్పారని విమర్శించారు.

ప్రభుత్వ కుట్రకు నిరసనగా వాకౌట్: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలు, బలహీన వర్గాలకు చేసిన ద్రోహానికి నిరసనగా వాకౌట్ చేస్తున్నట్టు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రకటించారు. షెడ్యూల్ కులాల్లోని ప్రత్యేక వర్గాల ఉపవర్గీకరణను స్వాగతిస్తూనే, బీసీలకు చేసిన ద్రోహానికి వాకౌట్ చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద్, చింతా ప్రభాకర్, సీహెచ్.మల్లారెడ్డి, రాజశేఖరరెడ్డి తదితరులు బీసీ వ్యతిరేక కాంగ్రెస్ పార్టీ డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ సభ నుంచి బయటకు వెళ్లారు. అంతకుముందు ఎస్సీ వర్గీకరణపై చర్చపై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ మాట్లాడుతూ బీసీల సంఖ్యను ఐదు శాతం తగ్గించి బీసీల గొంతుకోసిన ప్రభుత్వ కుట్రకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపైన ప్రభుత్వం చేసిన ప్రకటనకు బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ప్రభుత్వం వర్గీరణ కోసం చేసే ప్రతి ప్రయత్నానికి అండగా ఉంటామని తెలిపారు.

వాట్ ఏ ఫెంటాస్టిక్ పర్ఫార్మెన్స్

'అసెంబ్లీలో ఓవైపు సమగ్ర కుటుంబ సర్వే అంశం ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో ఎంసీహెచ్ఆర్‌డీ వెబ్‌సైట్ నుంచి సర్వే నివేదికను అధికారులు మాయం చేశారు' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. 'వెల్‌డన్ తెలంగాణ సీఎంఓ.. వాట్ ఏ ఫెంటాస్టిక్ పర్ఫార్మెన్స్' అని ఎద్దేవా చేశారు.

సభ వాయిదాపై అభ్యంతరం: మంగళవారం ఉదయం అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించడంపై బీఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. శాసనసభాపతి చాంబర్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కోవా లక్ష్మి, కౌశిక్‌రెడ్డి, చింతా ప్రభాకర్ భేటీ అయ్యారు. దీనిపై మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో స్పందిస్తూ 'అసెంబ్లీ ప్రారంభమైన 2 నిమిషాలకే వాయిదా వేయడమేంటి? కేబినెట్ భేటీ ఇంకా కొనసాగుతున్నదని, సబ్జెక్ట్ నోట్స్ సిద్ధం చేయలేదని సభను వాయిదా వేయాలని మంత్రి శ్రీధర్‌బాబు కోరడం హాస్యాస్పదం. నాడు ప్రతిపక్షంలో ఉన్నా ప్రిపేర్ కాలేదు. నేడు పాలకపక్షంలో ఉన్నా ప్రిపేర్ కాలేదు' అని పేర్కొన్నారు.



అంకెల గారడీతో ప్రజల్లో అపోహలు సృష్టించొద్దు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అంకెల గారడీతో అనవసరంగా ప్రజల్లో అపోహలు, అనుమానాలు సృష్టించొద్దని విపక్షాలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు. మంగళవారం రాష్ట్ర శాసనసభలో కులగణనపై జరిగిన చర్చలో బీజేపీకి చెందిన సభ్యుడు పాయల్ శంకర్ లేవనెత్తిన సందేహాలపై ఆయన స్పందించారు. వివిధ రంగాల్లో రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు మేలు జరిగేలా భారీస్థాయిలో కసరత్తు చేశామని, క్రమశిక్షణతో నిబద్ధతతో సర్వే నిర్వహించామన్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో ఓసీల శాతం 21 శాతం ఉంటే అది 15 శాతానికి తగ్గిందన్నారు. బీసీల శాతం 51శాతం ఉండగా, తాజాగా నిర్వహించిన సర్వేలో బీసీల శాతం 56 శాతానికి పెరిగిందన్నారు. గణాంకాలు ఇంత స్పష్టంగా ఉంటే ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. తప్పులు గుర్తిస్తే సరిదిద్దుకోవడంలో వెనకకుపోమని ఆయన తేల్చి చెప్పారు. ప్రతిపక్షాలకు అనుమానాలు ఉంటే ప్రెజెంటేషన్ ద్వారా నివృత్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

రాహుల్‌గాంధీ స్ఫూర్తితోనే బీసీ కులగణన

తెలంగాణలో బీసీ కులగణన రాహుల్‌గాంధీ స్ఫూర్తితోనే జరిగిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో ఆయన తనను కలిసిన మీడియాతో చిట్‌చాట్ చేశారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తెలంగాణ చరిత్రలో నిలిచిపోతాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కులగణన సర్వే జరిగినట్టు విన్నాను కానీ.. పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదన్నారు. కాగా, అసెంబ్లీలో బీసీ కులగణన బిల్లుపై తీర్మానం చేసి డెడికేషన్ కమిషన్‌కు పంపిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రి ఉత్తమ్ శాలువాతో సన్మానించారు.

ఏడాదిలోనే నిర్ణయం నుంచి నివేదిక దాకా

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తి చేశామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కులసర్వేపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ బలహీనవర్గాల ఆకాంక్షను నిజం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బృహత్తరమైన కులగణన చేపట్టిందన్నారు. మంత్రిమండలి నిర్ణయం నుంచి శాసనసభలో నివేదిక ప్రవేశపెట్టడం వరకు ఏడాదిలో కార్యసాధన చేసినట్టు చెప్పారు. ఈ మేరకు రోడ్‌మ్యాప్ రూపొందిస్తే భవిష్యత్‌లో బడుగు,బలహీన వర్గాలకు జనాభా ప్రకారం తగిన న్యాయం జరుగుతుందని తెలిపారు. బీసీల జనాభా తగ్గిందని, రాష్ట్ర జనాభా తగ్గిందని కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. 1931 తర్వా త కులాల వారీగా జనాభా లెక్కలే లేనప్పుడు తక్కువ, ఎక్కువ ఎక్కడిదని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల్లో రాష్ట్రంలో 3.5 కోట్ల మంది ఉంటే, ఇప్పుడు 3.70కోట్ల మంది అయ్యారన్నారు. జాతీయ సగటు ప్రకారం దక్షి ణ భారతదేశంలో జనాభా తగ్గిందన్నారు. సున్నిత అంశాన్ని రాజకీయం చేయొద్దన్నారు.

ఇక ఎస్సీల రిజర్వేషన్లు పెంచండి

కడియం శ్రీహరి



సాక్షి, హైదరాబాద్: జనాభాకు తగ్గట్టుగా ఎస్సీల రిజర్వేషన్లను పెంచాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. ఆ వర్గం జనాభాకు తగ్గట్టుగా పంజాబ్, హరియాణా, తమిళనాడు రిజర్వేషన్ల మొత్తాన్ని పెంచాయని తెలిపారు. ఎస్సీల వర్గీకరణ అంశంపై సభలో జరిగన చర్చలో భాగంగా కడియం మాట్లాడారు. కాంట్రాక్టుల కేటాయింపుల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. గతంలో హామీ ఇచ్చినట్టుగా రాష్ట్రంలో మాల, మాదిగ కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్గీకరణకు దశాబ్దాలపాటు పోరాటం చేసిన మంద కృష్ణ, వర్గీకరణ అమలులో కీలకంగా మారిన సీఎం రేవంత్‌గొప్ప వ్యక్తులుగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

మాలల సంఖ్య తక్కువని కించపరిచేవాళ్లు: వివేక్

రాష్ట్రంలో మాలల సంఖ్య చాలా తక్కువగా ఉందని పేర్కొంటూ ఆ వర్గం వారిని కించపరిచే వారని, ఇప్పుడు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని కాంగ్రెస్ సభ్యుడు వివేక్ పేర్కొన్నారు. ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

దళిత ద్రోహి పార్టీ బీఆర్‌ఎస్: వేముల వీరేశం

దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని దగా చేసిన బీఆర్‌ఎస్ పార్టీ, అత్యంత కీలకమైన ఎస్సీల వర్గీకరణ అంశంపై చర్చలో పాల్గొనకుండా సభ నుంచి నిష్క్రమించటం ద్వారా దళిత ద్రోహి పార్టీగా నిలిచిపోతుందని కాంగ్రెస్ సభ్యుడు వేముల వీరేశం పేర్కొన్నారు.

కేసీఆర్ రాజీనామా చేయాలి: కోమటిరెడ్డి

90 శాతం మందికి సంబంధించిన అంశాలపై సభలో చర్చ జరిగితే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు హాజరు కాకపోవటం దారుణమని, ఆయన వెంటనే రాజీనామా చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.

దళిత సమాజానికి ఇదో చరిత్రాత్మక దినం

సభలో వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ భావోద్వేగం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో షెడ్యూల్ కులాల్లోని ప్రత్యేక వర్గాల ఉపవర్గీకరణ నివేదికపై చర్చ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ భావోద్వేగానికి గురయ్యారు. దళిత సమాజం, దార్శనికత్వానికి ఇదొక చరిత్రాత్మక దినమని, ఇది సామాజిక న్యాయ దినమని పేర్కొన్నారు. 'ఇది జీవితకాల అవకాశం. చరిత్రలో నిలిచిపోవాలి. ఎస్సీ వర్గీకరణ అమలు ద్వారా 30, 40 ఏళ్ల కల సంపూర్ణంగా సాకారం కాబోతోంది. త్వరలోనే దీనికి సంబంధించి ప్రభుత్వపరంగా తదుపరి చర్యలు ఉంటాయి'అని ఆయన తెలిపారు. సీఎం, సబ్‌కమిటీ చైర్మన్, సభ్యులకు తమ జాతి తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దార్శనికత కలిగిన నేతగా ఈ సమస్యపై స్పందించి పరిష్కారం కనుగొన్నారని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 14 నెలలే అవుతున్నా చరిత్రను తిరగరాయబోతున్నామని ఆయన వ్యాఖ్యానించారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మరోసారి స్పష్టమైందన్నారు. రిజర్వేషన్లు అమల్లోకి వచ్చి ఇన్నేళ్లయినా కొన్ని వర్గాల్లో ఇంకా అభద్రత, అసమానతలు, అసంతృప్తి కొనసాగుతున్నాయన్నారు. వర్గీకరణ అనేది ఒక ఆకాంక్ష, కల, తపన అని పేర్కొన్నారు. దేశంలో సాంఘిక అసమానతలు, అంటరానితనం కొనసాగాయని, ఈ బాధ, అవమానాలు ఎదుర్కొన్న వర్గాల నుంచే తానూ వచ్చానన్నారు.

కులగణన సర్వే శాస్త్రీయంగా లేదు

హైదరాబాద్‌లో 30 శాతం కూడా సర్వే జరగలేదు: తలసాని



సాక్షి, హైదరాబాద్: కులగణన సర్వేలో శాస్త్రీయత కనిపించడం లేదని.. బీసీల జనాభా తగ్గిపోయిందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సర్వేలో లక్షలాది కుటుంబాలను పరిగణనలోకి తీసుకోలేదని..జీహెచ్ఎంసీలో 30 శాతం సర్వే కూడా చేయలేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టిన 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024'పై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ పక్షాన తలసాని ప్రసంగించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో జనాభా 3.54 కోట్ల జనాభా ఉంటే.. 14 ఏళ్లలో 14 లక్షల జనాభానే పెరిగిందా అని ప్రశ్నించారు. బీసీల జనాభా గణనీయంగా తగ్గడం వల్ల వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జనాభా తగ్గి.. ఓసీల జనాభా పెరిగినట్టు ఈ సర్వేలో చూపారని, ఇది బీసీలకు జరిగిన అన్యాయంగా అభివర్ణించారు. కేవలం సర్వే చేయించి తీర్మానం చేస్తే సరిపోదని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాల్సిందేనన్నారు. కులగణన సర్వే ప్రొఫార్మా మార్చి రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ, ఎస్సీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా?

ప్రభుత్వానికి అసలు బీసీ, ఎస్సీలపై చిత్తశుద్ధి ఉందా అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బీసీ మంత్రులను 11 గంటలకు అసెంబ్లీకి రమ్మని.. ఒక్కమాట లేకుండా సభను వాయిదా వేసి బీసీలను అవమానించారని విమర్శించారు.

చరిత్రాత్మక ఘట్టం!

▶ మొదటి పేజీ తరువాయి

కేటగిరీలుగా విభజించి 1, 9, 5 శాతం చొప్పున మొత్తం 15 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. అయితే ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో క్రీమీలేయర్ పాటించాలని ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసినప్పటికీ, ఆ ప్రతిపాదనను మంత్రిమండలి తిరస్కరించిందని చెప్పారు. అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ అంశంపై మాట్లాడారు. చివర్లో ముఖ్యమంత్రి మరోసారి ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేశారు. అనంతరం ఈ నివేదికను అసెంబ్లీ ఆమోదిస్తున్నట్టు ప్రకటించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభను నిరవధికంగా వాయిదా వేశా రు. మరోవైపు శాసనమండలిలోనూ ఈ రెండు నివేదికలకు ఆమోదం లభించింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ప్రభుత్వం తరపున రెండు నివేదికలపై ప్రకటనలు చేశారు. దీనిపై చర్చలో పాల్గొనకుండా బీఆర్‌ఎస్ వాకౌట్ చేయగా, ఇతర సభ్యులు చర్చించి ఆమోదించారు.

నా కోసం ఏదైనా పేజీ రాసుకోవాల్సి వస్తే అది ఫిబ్రవరి 4 గురించే..

అసెంబ్లీలో బీసీల కులగణనపై చర్చ సందర్భంగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు తన రాజకీయ చరిత్రలో చాలా కీలకమని, తన కోసం ఏదైనా పేజీ రాసుకోవాల్సి వస్తే ఫిబ్రవరి 4 గురించే రాయాల్సి ఉంటుందని చెప్పారు. నివేదిక మొత్తాన్ని సభ ముందు ఉంచాలనే ప్రతిపక్షాల డిమాండ్‌ను తోసిపుచ్చిన ముఖ్యమంత్రి.. మంచి కోరి తాము చేస్తున్న ప్రయత్నానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఎలాంటి ఆటంకాలు ఎదురు కాకుండా దీనికి చట్టబద్ధత కల్పించాల్సి ఉందన్నారు.

అమరులకు నివాళులు

ఎస్సీల వర్గీకరణ కోసం దశాబ్దాలుగా జరిగిన పోరాటంలో అమరులైన వారికి సీఎం నివాళులర్పించారు. వారి పోరాటం వృథా కాకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. భవిష్యత్తులో జనగణన చేపట్టినప్పుడు అందులో కులగణన చేపట్టాలే కేంద్రంపై ఒత్తిడి తెద్దామని చెప్పారు.

సున్నిత అంశాలకు సాహసోపేత పరిష్కారం

రాష్ట్రంలోని రెండు ప్రధాన సామాజిక వర్గాలకు చెందిన సున్నిత అంశాలను అత్యంత సాహసోపేతంగా పరిష్కరించగలిగామని కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది. అటు బీసీలు, ఇటు ఎస్సీలకు సంబంధించిన విషయంలో ప్రతిపక్షాలు అపోహలను సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని, మంచి చేయాలనుకుంటున్న తమకు చెడును ఆపాదించే విధంగా ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతున్నాయని చెప్పినట్టు సమాచారం. అలాంటి వాటిని అడ్డుకోకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. సమగ్ర కుల సర్వేకు ఎలాంటి అధికార ఆమోదం, శాస్త్రీయత లేదని, ఒక్కరోజులో అడ్డగోలుగా నిర్వహించిన ఆ సర్వే గణాంకాలను ప్రజల్లో పెట్టేందుకు బీఆర్‌ఎస్ శతథా ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

కులగణన నివేదికను ఆమోదించడంతో పాటు జనగణనలో భాగంగా కేంద్రం కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానం చేసినందుకు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బీసీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో సన్మానించారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, ఈర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి తదితరులున్నారు. కాగా ఎస్సీల వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిశారు.

క్లుప్తంగా...

బీఆర్ఎస్ విప్‌ల నియామకం
మండలి విప్‌గా సత్యవతి రాథోడ్, శాసనసభలో వివేకానంద




సాక్షి, హైదరాబాద్: శాసనసభ, శాసనమండలిలో పార్టీ విప్‌లను నియమిస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. శాసనమండలిలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, శాసనసభలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బీఆర్ఎస్ విప్‌లుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి లేఖను అందజేశారు.

కులగణన, వర్గీకరణ గొప్ప విజయాలు
టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ మేరకు కులగణన, ఎస్సీ వర్గీకరణ జరిగిందని, ఇదీ కాంగ్రెస్ మార్క్ విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. దీనికి కృషి చేసిన సీఎం రేవంత్, మంత్రుల బృందానికి టీపీసీసీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ సాహసోపేతమైన నిర్ణయాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు అవాకులు చెవాకులు పేలడం మానుకోవాలని హితవు పలికారు. బీసీ, ఎస్సీల కోసం పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో కవిత, కేటీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తీన్మార్ మల్లన్నకు త్వరలో షోకాజ్
క్రమశిక్షణ చర్యలకు సిద్ధమవుతున్న టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ షోకాజ్ నోటీసులు జారీ చేయనుంది. పార్టీ విధానాలకు భిన్నంగా ఆయన బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ.. త్వరలో నోటీసులు జారీ చేసేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. గతంలో నల్లగొండ, ఇటీవల వరంగల్ వేదికగా తీన్మార్ మల్లన్న ఇతర కులాలనుద్దేశించి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. పీసీసీకి కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సమాచారం. ఫిర్యాదుల నేపథ్యంలో షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీసీసీ నిర్ణయించిందని తెలుస్తోంది. నోటీసుల జారీ అనంతరం మల్లన్న ఇచ్చే సమాధానాన్ని బట్టి.. ఆయనపై క్రమశిక్షణ చర్యలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

కులగణనకు అసెంబ్లీ ఆమోదంతో సంబరాలు
గాంధీభవన్‌లో ఎస్సీ, బీసీ సెల్ ఆనందం

సాక్షి, హైదరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు గాంధీభవన్‌లో పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాయి. భారీగా బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్న నాయకులు, కార్యకర్తలు డప్పులు, వాయిద్యాలతో సంబురాలు జరిపారు. బీసీ, ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నివేదిక ఇవ్వడంపై బీసీ, దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సంబురాలలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ వెంకట్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, చైర్మన్లు నూతి శ్రీకాంత్, మెట్టు సాయి, చైర్మన్ ప్రీతమ్, మాజీ మంత్రులు చంద్రశేఖర్, పుష్పలీల, ఏపూరి సోమన్న, నమిల్ల శ్రీనివాస్, సతీశ్ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. సీఎం రేవంత్ మొదటి నుంచి ఎస్సీ వర్గీకరణకు అండగా ఉన్నారని ప్రశంసించారు.


బీసీలపై బీఆర్ఎస్ చిత్తశుద్ధి ఏమైంది?: ప్రభుత్వ విప్‌లు

సాక్షి, హైదరాబాద్: బీసీలపై బీఆర్ఎస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏమైందని ప్రభుత్వ విప్‌లు ప్రశ్నించారు. గతంలో ఒక్కరోజు సర్వే చేసి నివేదిక బయట పెట్టని బీఆర్ఎస్ నేతలు ఈరోజు బీసీ కులగణనపై మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్.. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేసి దేశానికి తెలంగాణను రోల్‌మోడల్‌గా నిలిపిందని పేర్కొన్నారు. బీసీలపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని ధ్వజమెత్తారు. మీలా నలుగురు నాలుగు గోడల మధ్య మాట్లాడి సభ ముగించే పద్ధతి తమది కాదన్నారు. గంగుల కమలాకర్‌కు బీసీ కుల గణనపై మాట్లాడే హక్కు లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వే లెక్కలను ఫామ్‌హౌస్‌లో దాచిపెట్టిందని, రాజకీయంగా, విద్య, ఉపాధి పరంగా బీసీలను అణగదొక్కారని ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తామని, లెక్కలతో సహా అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని చెప్పారు. మీలాగా ఇంటి దగ్గర తయారు చేసిన స్క్రిప్ట్ తాము చదవడం లేదన్నారు.

59 కులాలు | 3 గ్రూపులు

- ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించిన ఏకసభ్య కమిషన్
- ఆయా కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేయాలని సిఫారసు
- జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికపై ప్రకటనను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- మొదటి గ్రూపులో 15, రెండో గ్రూపులో 18, మూడో గ్రూపులో 26 కులాలు
- ప్రస్తుతం ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్
- గ్రూప్–1కు 1 శాతం, గ్రూప్–2కు 9 శాతం, గ్రూప్–3కి 5 శాతం రిజర్వేషన్ సిఫారసు
- గ్రూపుల వారీగా రోస్టర్ పాయింట్లు సైతం నిర్దేశించిన కమిషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) జనాభాకు రిజర్వేషన్లను మూడు కేటగిరీలుగా అమలు చేయాలని ఏక సభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ గతేడాది నవంబర్ 11నుంచి 82 రోజుల పాటు వివిధ కోణాల్లో అధ్యయనం చేసింది. సోమవారం 199 పేజీలతో కూడిన పూర్తిస్థాయి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలోని వివరాలతో కూడిన ఒక ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. 2011 జనగణన ఆధారంగా రాష్ట్రంలో ఎస్సీ కేటగిరీ కింద ఉన్న 59 కులాలను వారి సామాజిక స్థితిగతుల ఆధారంగా మూడు గ్రూపులుగా కమిషన్ వర్గీకరించింది. గ్రూప్–1లో 15 కులాలు, గ్రూప్–2లో 18 కులాలు, గ్రూప్–3లో 26 కులాలను చేర్చింది.



ఎస్సీల్లోని కులాలకు సంబంధించిన గ్రూపులు, ఏ గ్రూపులో ఏ కులాలు, ఎస్సీల్లో వారి జనాభా శాతం, జనాభా ఆధారంగా సిఫారసు చేసిన రిజర్వేషన్ల శాతం వివరాలు ఇలా..

కేటగిరీ	ఏ కులాలు	ఎన్ని కులాలు	ఎస్సీల్లో వీరి జనాభా%	రిజర్వేషన్%
గ్రూప్-1	సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా అత్యంత వెనుకబడిన, పట్టించుకోనివి	15	3.288	1
గ్రూప్-2	మధ్యస్తంగా లబ్ధి పొందినవి	18	62.748	9
గ్రూప్-3	మెరుగైన ప్రయోజనం పొందినవి	26	33.963	5

ఉద్యోగ నియామకాల్లో వారికి కేటాయించిన రిజర్వేషన్లకు వన్‌మెన్ కమిషన్ రోస్టర్ పాయింట్ నంబర్లను కూడా నిర్దేశిస్తూ సిఫారసు చేసింది.

గ్రూప్	ప్రతిపాదిత రోస్టర్ పాయింట్ నంబర్లు
గ్రూప్-1	7
గ్రూప్-2	2,16,27,47,52,66, 72,87,97
గ్రూప్-3	22,41,62,77,91

ఏ గ్రూపులో ఏయే కులాలు, వారి జనాభా, శాతం

..: గ్రూప్-1 :..

కులం పేరు	జనాభా	శాతం
బావూరి	127	0.002
బేడ(బుడగ) జంగం	1,11,710	2.141
చచాటి	125	0.002
డక్కల్, డొక్కల్వార్	2,558	0.049
జగ్గలి	2,579	0.049
కొలుపులవాండ్లు, పంబాడ, పంబండ, పంబాల	931	0.018
మాంగ్	13,260	0.254
మాంగ్ గరోడి	1,392	0.027
మన్నె	29,656	0.568
మాష్టి	1,246	0.024
మాతంగి	704	0.013
మెహతర్	6,973	0.134
ముండాల	212	0.004
సంబన్	108	0.002
సప్రు	44	0.001
మొత్తం	1,71,625	3.288

..: గ్రూప్-2 :..

కులం పేరు	జనాభా	శాతం
అరుంధతీయ	107	0.002
బైండ్ల	13,082	0.251
చమర్, మోచి, ముచి, చమర్- రవిదాస్, చమర్-రోహిదాస్	17,068	0.327
చంబర్	632	0.012
చండాల	64	0.001
దండాసి	86	0.002
డోమ్, డోంబరా, పైడి, పానో	1,926	0.037
ఎల్లమ్మల్వార్, ఎల్లమ్మలవాండ్లు	504	0.010
గోడాది	208	0.004
జాంబవులు	108	0.002
మాదిగ	32,33,642	61.967
మాదిగ దాసు, మష్టీన్	1,663	0.032
పామిడి	51	0.001
పంచమ, పరియ	63	0.001
సమగర	1,046	0.020
సింధొల్లు (చిందోల్లు)	3,872	0.074
యాటల	163	0.003
వల్లువన్	92	0.002
మొత్తం	32,74,377	62.748

..: గ్రూప్-3 :..

కులం	జనాభా	శాతం
ఆది ఆంధ్ర	2,289	0.044
ఆది ద్రావిడ	651	0.012
అనాముక్	17	0.0003
ఆరే మాల	1,992	0.038
అర్వ మాల	8,398	0.161
బారికి	83	0.002
బ్యాగర్, బ్యాగరి	9,672	0.185
చలవాది	160	0.003
డోర్	2,146	0.041
ఘాసి, హడ్డి, రెల్లి, చాచండి	84	0.002
గోసంగి	23,351	0.447
హోలేయా	358	0.007
హోలేయా దాసరి	8,482	0.163
మాదాసి కురువ, మదారి కురువ	3,707	0.071
మహర్	31,938	0.612
మాల, మాల అయ్యవార్	15,27,143	29.265
మాల దాసరి	6,630	0.139
మాల దాసు	925	0.018
మాల హన్నాయ్	37	0.001
మాల జంగం	3,187	0.061
మాల మస్టీ	108	0.002
మాలసాలే, నేతకాని	1,33,072	2.550
మాల సన్యాసి	162	0.003
మిత అయ్యల్వార్	3,118	0.060
పాకీ, మోటీ, తోటి	947	0.018
రెల్లి	3,025	0.058
మొత్తం	17,71,682	33.963

మూడింటికి ఓకే.. ఒక సిఫారసుకు నో

ఎస్సీ వర్గీకరణ అమలుకు జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు సిఫారసులు చేసింది. ఇందులో మూడింటికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపగా, ఒక సిఫారసును తిరస్కరించింది.

- ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉండగా, ఇందులో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడిన, ఇంతవరకు పట్టించుకోని షెడ్యూల్డ్ కులాలను కమిషన్ గ్రూప్-1 కేటగిరీలోకి చేర్చింది. వీరి జనాభా మొత్తం ఎస్సీల్లో 3.288 శాతం ఉండడంతో వారికి ఒక (1)శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సిఫారసు చేసింది.
- ఎస్సీల్లో మధ్యస్తంగా లబ్ధి పొందిన షెడ్యూల్డ్ కులాలను గ్రూప్-2లో చేర్చింది. ఎస్సీల్లో వీరి జనాభా 62.748 శాతం ఉండగా, వారికి 9% రిజర్వేషన్ కల్పించాలని సిఫారసు చేసింది.
- మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూల్డ్ కులాలను గ్రూప్-3లో చేర్చింది. ఎస్సీ జనాభాలో 33.963%ఉన్న వీరికి 5% రిజర్వేషన్ ఇవ్వాలని సిఫారసు చేసింది.
- ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ప్రవేశపెట్టాలని కమిషన్ సిఫారసు చేసింది. ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్మన్, మేయర్ తదితర ప్రజాప్రతినిధులతో పాటు గ్రూప్-1 సర్వీసుల్లో ఉన్న వారిని క్రీమీలేయర్ కేటగిరీగా పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ వ్యక్తులకు సంబంధించి రెండో తరానికి రిజర్వేషన్ల ప్రయోజనం నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించింది. అయితే ఈ సిఫారసును రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది.
- ఇక ఉద్యోగ నియామకాల్లో క్రమపద్ధతిలో అనుసరించేందుకు వన్‌మెన్ కమిషన్ ప్రాధాన్యత నమూనాను రూపొందించింది. గ్రూప్-1లో నోటిఫై చేసిన అలాగే భర్తీ చేయని ఖాళీలను తదుపరి ప్రాధాన్యత గ్రూప్‌లో అంటే గ్రూప్-2లో భర్తీ చేయాలి. ఇందులో భర్తీ చేయని ఖాళీలను గ్రూప్-3లో భర్తీ చేయాలి. అన్ని గ్రూపుల్లో తగిన అభ్యర్థులు అందుబాటులో లేకుంటే ఆ పోస్టులను క్యారీ ఫార్వర్డ్ చేయాలి.



ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు. చిత్రంలో పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, వేముల వీరేశం, కడియం శ్రీహరి, బీర్ల అయిలయ్య, కాలె యాదయ్య, కె.సత్యనారాయణ, లక్ష్మీకాంతరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, కుంభం అనిల్ కుమార్, రాజ్‌ఠాకూర్, విజయరామారావు



కులగణన సర్వేని అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, శంకర్, రాజ్‌ఠాకూర్, బీర్ల అయిలయ్య, పాయం వెంకటేశ్వర్లు, ప్రేమ్‌సాగర్‌రావు, రాజగోపాల్‌రెడ్డి తదితరులు

అత్యంత శాస్త్రీయతతో కుల సర్వే చేశాం..

- ఈ సర్వే ఆధారంగా మరింత మెరుగ్గా సంక్షేమ పథకాలు
- గత ప్రభుత్వం చేసిన కుటుంబ సర్వేలో శాస్త్రీయత లేదు
- కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేపడతాం
- మండలిలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి
- సర్వే వివరాలు ఇవ్వలేదని బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్



మండలిలో మాట్లాడుతున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: ప్రజా సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలుచేసేందుకు తమ ప్రభుత్వం నిర్వహించిన 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే- 2024'సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్‌లో అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ఈ సర్వే గణాంకాల ఆధారంగానే చేపడుతా మని చెప్పారు. శాసనమండలిలో మంగళవారం ఆయన సమగ్ర కుల సర్వేతోపాటు, ఎస్సీ వర్గీకరణ నివేదికలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. దేశంలో ఇంతటి శాస్త్రీయతతో ఏ రాష్ట్రంలోనూ సర్వే చేయలేదని తెలిపారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ప్రత్యేక రూట్‌మ్యాప్ ఆధారంగా సర్వే నిర్వహించామని చెప్పా రు. 50 రోజులపాటు నిర్వహించిన సర్వేలో 96.9% స్పష్టమైన వివరాలు వచ్చాయని వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేకు శాస్త్రీయత లేదని, ఆ వివరాలను అప్పటి ప్రభుత్వం ఎక్కడా బహిర్గతం చేయలేదని విమర్శించారు. సర్వేలో ఉద్దేశపూర్వకంగా పాల్గొనని పెద్ద మనుషులు కూడా ఉన్నారని ప్రతిపక్షాలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సర్వేలో పాల్గొనని వారి వివరాల నమోదుకు మరోమారు అవకాశం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

సర్వే వివరాలు బయటపెట్టకుండా చర్చ ఏంటి?

సమగ్ర సర్వేకు సంబంధించిన వివరాలు సభ్యులకు ఇవ్వకుండా సభలో చర్చఎలా నిర్వహిస్తారని మండలిలో ప్రతిపక్ష నేత మధసూదనాచారి ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వ నిర్ణయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరికాదని అన్నారు. ప్రకటనలు ప్రవేశపెట్టేందుకు అసెంబ్లీ వేదిక కాదని, కనీసం లోతైన చర్చ కూడా జరపకపోవడం దారుణమని ఆగ్ర హం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వేలో అన్ని వర్గాల జనాభా తగ్గిందని, ఓసీల జనాభాను మాత్రం భారీగా పెంచి చూపించారని ఆరోపించారు.

బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వండి: బండ ప్రకాశ్

గత ప్రభుత్వం చేసిన సమగ్ర సర్వే వివరాలు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైబ్‌సైట్‌లో ఉన్నాయని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. అందుకు సభ్యులు కూడా మద్దతుగా నిలుస్తారని తెలిపారు. సర్వే విషయంలో ప్రభుత్వం నుంచి సమాచారం అందకపోవడం, స్పష్టత లేకుండా సభ నిర్వహించడంపై నిరసన వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ చర్చలో పాల్గొన్నారు. సమగ్ర కుటుంబ సర్వే, ఎస్సీ వర్గీకరణపై సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు.

దేశవ్యాప్తంగా కుల సర్వే చేపట్టండి
కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

సాక్షి, హైదరాబాద్: వివిధ కులాల జనాభా స్థితిగతులను అర్థం చేసుకునేందుకు తెలంగాణలో నిర్వహించిన మాదిరిగానే దేశవ్యాప్తంగా ఇంటింటి సమగ్ర సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య రాజకీయ, కుల సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మంగళవారం రాత్రి అసెంబ్లీలో ఈ తీర్మానాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపినట్టు స్పీకర్ ప్రకటించారు. 'తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుల సర్వేలో భాగంగా రాష్ట్రంలోని వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ స్థితిగతులను వెలుగులోకి తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులు (బీసీ), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), ఇతర బలహీన వర్గాల అభివృద్ధి కి కట్టుబడి ఉంది. వివిధ కులాల మధ్య నెలకొన్న అసమానతలను తగ్గించడానికి అనుకూల విధానాలు, అఫర్మేటివ్ పాలసీలను రూపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది'అని తీర్మానంలో పేర్కొన్నారు.

బీసీల్లో ముదిరాజ్‌లే టాప్
26 లక్షలకుపైగా జనాభాతో అగ్రస్థానం.. ఆ తర్వాత యాదవులు
తాజా కులగణనలో వెల్లడైన ప్రధాన కులాల గణాంకాలు!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని బలహీనవర్గాల జాబితాలో మొదటి నుంచి అంచనా వేస్తున్న విధంగానే ముదిరాజ్‌లదే అగ్రస్థానమని వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 26 లక్షల మందికి పైగా ముదిరాజ్ కులస్తులు ఉన్నారని కులగణన సర్వేలో స్పష్టమైంది. ఆ తర్వాతి స్థానంలో యాదవులున్నారని, వీరి జనాభా 20 లక్షల కంటే ఎక్కువ ఉందని తేలినట్టు సమాచారం. అలాగే తెలంగాణలో గౌడ కులస్తుల జనాభా కూడా గణనీయంగా ఉందని, వారు 16 లక్షలకు పైగా ఉన్నట్టు సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాత నాలుగో స్థానంలో మున్నూరుకాపులు ఉండగా, వారి జనాభా 13.70 లక్షలకు పైగా ఉన్నట్టు తేలింది. 5వ స్థానంలో 12 లక్షలకు పైగా జనాభాతో పద్మశాలీలున్నారని తాజా సర్వేలో వెల్లడైనట్టు తెలిసింది. తెలంగాణలో మొత్తం 1.60 కోట్ల మంది బీసీలున్నారని తాజా సర్వేలో తేలగా, ఈ ఐదు కులాలు కలిపి మొత్తం బీసీ జనాభాలో సగం మంది కంటే ఎక్కువ ఉన్నారని సర్వే వెల్లడించింది. ఇక అగ్రవర్ణాల విషయానికి వస్తే రెడ్ల జనాభా 17 లక్షల కంటే ఎక్కువే ఉందని సర్వేలో తేలినట్టు సమాచారం. అయితే, ఈ లెక్కలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం.

ఎస్సీల వర్గీకరణకు త్వరలో చట్టం

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం.. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ చరిత్రలో ఫిబ్రవరి 4కు అత్యంత ప్రాధాన్యం ఉంది. దశాబ్దాల నాటి ఎస్సీ వర్గీకరణకు వీలుగా తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర మంత్రిమండలి 2024 ఫిబ్రవరి 4న ఆమోదం తెలిపింది. వర్గీకరణ నివేదికను 2025 ఫిబ్రవరి 4న మంత్రిమండలి ఆమోదించింది. దశాబ్దాలుగా నలుగుతున్న జటిల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది ఈ రోజే. అందువల్ల ఈ రోజును సామాజిక న్యాయ దినోత్సవంగా గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎస్సీల వర్గీకరణ నివేదికపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ అమలుకు త్వరలోనే చట్టం తేవటం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూస్తామని చెప్పారు. ఎస్సీల రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానాన్ని తిరస్కరించటం ద్వారా భవిష్యత్తులో సమస్య రాకుండా చేసుకున్నామన్నారు.

వర్గీకరణ అమలు బాధ్యత తీసుకుంటాం: ఎస్సీ వర్గీకరణ అమలుచేసే బాధ్యతను తమ కేబినెట్ తీసుకుంటుందని రేవంత్ చెప్పారు. వర్గీకరణ నివేదికపై ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఉమ్మడి ఏపీలో సీఎంలుగా ఉన్న 16 మందికి, తెలంగాణ ఏర్పడ్డాక సీఎంగా ఉన్న వారికి రాని అవకాశం నాకు వచ్చింది. ఈ సంతోషం చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది..' అని పేర్కొన్నారు. గతంలో ఇదే అసెంబ్లీలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే తనను, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, సంపత్‌కుమార్‌లను సభ నుంచి బహిష్కరించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇదే అసెంబ్లీలో సభానాయకుడిగా వర్గీకరణ అమలుకు నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు.

ఆ అంకెలేవీ అసెంబ్లీలో చెప్పలేదు: మంత్రి ఉత్తమ్
2014లో గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసినా ఆ అంకెలేవి అసెంబ్లీలో చెప్పలేదని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనల మేరకు కొత్తగూడెంలో నూతన ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటు చేయ డానికి కేంద్రం 'ఫీజబులిటీ రిపోర్ట్' కోరిందని ఆయన వెల్లడించారు.

వైఎస్ హయాంలోనూ తీర్మానం

ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మధ్యలో అడ్డంకులు ఎదురైనా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దీనిపై రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ అసెంబ్లీ తీర్మానం చేసి పంపించారని గుర్తుచేశారు. ఎస్సీలను చాలా రాజకీయ పార్టీలు ఓటుబ్యాంక్ గానే చూశాయని, సమాజంపై ఆయా వర్గాలు విశ్వాసం కోల్పోకుండా చేసే అవకాశం తమకు దక్కిందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ జరిగేందుకు తన వంతు సాయం అందిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. చర్చలో పాల్గొన్న సభ్యులకు, వర్గీకరణపై ఏర్పడ్డ మంత్రివర్గ ఉపసంఘానికి, ఆ నివేదికను ఆమోదించిన మంత్రివర్గానికి, నివేదిక కోసం కష్టపడిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్ ఆత్మహత్య చేసుకుంటారా?

- 'ఉప ఎన్నికలు ఎందుకొస్తాయ'ని ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్య
- కులగణన, ఎస్సీ వర్గీకరణతో దేశానికి రోడ్‌మ్యాప్ ఇస్తున్నాం
- అసెంబ్లీ లాబీలో మీడియాతో ముఖ్యమంత్రి చిట్‌చాట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని కొందరు మాట్లాడుతున్నారని, అలాంటివేమీ రావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'కేటీఆర్ ఏమైనా ఆత్మహత్య చేసుకుంటారా.. సిరిసిల్లకు ఉపఎన్నిక రావడానికి?'అని ఆయన వ్యాఖ్యానించారు. ఉపఎన్నికలు వస్తాయని కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను సీఎం దృష్టికి మీడియా ప్రతినిధులు తీసుకుని రాగా పైవిధంగా స్పందించారు. అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో కేబినెట్ సమావేశం ముగిసిన తరువాత తన చాంబర్‌కు వెళ్తున్న సమయంలో సీఎం మీడియాతో చిట్‌చాట్ చేశారు. శాసనభ్యులకు స్పీకర్ నోటీసులు ఇచ్చారని మీడియా ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకురాగా.. అదంతా ప్రొసీజర్‌లో భాగమేనని సీఎం స్పందించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణకు దేశానికి తెలంగాణ నుంచి రోడ్‌మ్యాప్‌ను ఇస్తున్నామని, ఈ రెండింటి విషయంలో తాము చేసిన పని ద్వారా కేంద్రంపై ఒత్తిడి తేవడానికి వీలవుతుందని అన్నారు. సభలో ప్రవేశపెట్టే ఈ కులగణన సర్వే డాక్యుమెంట్ భవిష్యత్‌లో ఎప్పుడైనా రెఫరెన్స్‌గా అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు, మంత్రివర్గ ఉపసంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకు వెళ్తామన్నారు. ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేవని, వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదని అన్నారు. కీలకమైన రెండు అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రతిపక్ష నాయకుడు సభకు రావాలి కదా అని ప్రశ్నించారు. తాము 88 జనరల్ సీట్లలో 30 సీట్లు బీసీలకు ఇచ్చామని చెప్పారు. కోర్టు ఇచ్చిన క్రీమీలేయర్‌ను తమ ప్రభుత్వం తిరస్కరించిందని తెలిపారు, బీసీ రిజర్వేషన్లపై కోర్టు ఆదేశాల మేరకు కమిషన్‌ను నియమించామని, కోర్టు ఆదేశాల మేరకే కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసినట్లు చెప్పుకుంటున్న సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ ఎక్కడుందో కూడా తెలియదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము ఎన్నికల కోసం కులగణన చేయలేదని, అభివృద్ధి ఫలాలు అందించాలన్నదే తమ తాపత్రయమని సీఎం తెలిపారు.



ప్రయత్నం మీరే చేయాలి.
గురువులు కేవలం మార్గం మాత్రమే సూచిస్తారు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 5 ఫిబ్రవరి 2025

ఆసక్తి రేపుతున్న అగ్నిపరీక్ష

దేశ రాజధాని ప్రాంతం ఎన్నికల సమరానికి సిద్ధమైంది. నేడు జరగనున్న ఢిల్లీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఉత్కంఠ ఇంత చలిలోనూ వేడి పుట్టిస్తోంది. ఆప్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోటీలో 70 స్థానాల్లోని 699 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1.56 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ సమరమిది. సోమవారం సాయంత్రం గడువు ముగిసేవరకు హోరాహోరీగా సాగిన ప్రచారంలో పార్టీల పరస్పర నిందారోపణలు పతాక స్థాయికి చేరాయి. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి ఆతిశి తమ పాలన నమూనాను ఆదర్శంగా చూపితే, ఆ పాలనంతా అవినీతిమయమంటూ, అగ్రేసర కమలనాథులు మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలు శాంతి భద్రతల సమస్యను సైతం లేవనెత్తారు. గత రెండు ఢిల్లీ ఎన్నికల్లో కనీసం ఖాతా అయినా తెరవలేకపోయిన కాంగ్రెస్ పక్షాన రాహుల్, ప్రియాంకలు మిగతా రెండు పార్టీలపై విమర్శలు గుప్పించారు. అధికారిక నివాసాలకు ఆప్ ప్రజాధన దుర్వినియోగం, యమునా నది నీటి నాణ్యత, ఓటర్ల జాబితాలో అవకతవకల ఆరోపణలు పతాకశీర్షికలకు ఎక్కితే, ప్రతి పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసిన ఉచిత కానుకలు ప్రజాకర్షణకు పోటీలు పడ్డాయి. నేటి ఓటింగ్, శనివారం నాటి కౌంటింగ్‌లతో కానీ రానున్న రోజులకు కానున్న ఢిల్లీ సుల్తాన్ ఎవరో తేలనుంది.

ఏకోన్ముఖంగా సాగిన గడచిన 2015, 2020 నాటి ఎన్నికలకు భిన్నంగా ఈసారి ఉత్కంఠభరిత పోరాటం సాగనుంది. ముచ్చటగా మూడోసారి ఆప్ విజయం నల్లేరుపై బండి నడక కాదని కేజ్రీవాల్‌కూ తెలుసు. అయితే, ప్రస్తుతం ఎక్సైజ్ పాలసీతో అనుచిత లబ్ధి కేసులో బెయిల్‌పై ఉన్న కేజ్రీవాల్ ఇప్పటికీ కాషాయ పార్టీకి బలమైన ప్రత్యర్థే. చిత్రమేమిటంటే... ఓటర్లను కుదిపేస్తాయనుకున్న అనేక అంశాలు క్షేత్రస్థాయిలో ఏమంత ప్రభావం చూపడం లేదట. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా పలువురు 'ఆప్' అగ్ర నేతల్ని జైలుకు పంపిన ఎక్సైజ్ కుంభకోణం కానీ, ప్రజాధన దుర్వినియోగంతో కేజ్రీవాల్ ఆర్భాటంగా 'శీష్ మహల్' కట్టుకున్నారన్న ఆరోపణలు కానీ ఓటరుల్ని పెద్దగా ఆకర్షించడం లేదని వార్త. కూటి కోసం, కూలీ కోసం దేశ రాజధానికి వచ్చి కష్టాలు పడుతున్న బడుగు వర్గాలు కాస్తంత ఊపిరి పీల్చుకొనేందుకు ఎంతో కొంత చేయడంలో ఆప్ సఫలమైంది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత మంచినీరు, ఉచిత ఆస్పత్రి – వైద్యం లాంటి ప్రభుత్వ సౌకర్యాలు అన్నీ అందరికీ సక్రమంగా అందకున్నా, ఎంతో కొంత లబ్ధి చేకూరడంతో ఆ వర్గాల్లో పార్టీ కొంత బలంగా ఉందని ఓ విశ్లేషణ.

అదే సమయంలో 'ఇండియా' కూటమిలోని ఆప్, కాంగ్రెస్‌లు ఢిల్లీలో పరస్పరం అస్త్రాలు సంధించుకోవడం చిత్రమైన స్థితి. 2024 హరియాణా ఎన్నికల్లో తమ మధ్య పోరు చివరకు బీజేపీకి లాభించిన చేదు నిజం నుంచి ఈ భాగస్వామ్య పక్షాలు పాఠం నేర్చుకున్నట్టు లేదు. గతంలో ఏకధాటిగా 15 ఏళ్ళు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉంది. పోగొట్టుకున్న ఇమేజ్‌ను కూడగట్టుకొనేందుకు హస్తం పార్టీ తంటాలు పడుతోంది కానీ, పరిస్థితి 'అప్ప ఆరాటమే కానీ... బావ బతికే మార్గం లేదు' అన్నట్టుంది. గమ్మత్తేమిటంటే, దశాబ్దిన్నర క్రితం కాంగ్రెస్‌పై కోపంతో మార్పు కోరిన మధ్యతరగతి జనాభా సైతం ప్రస్తుతం ఆప్ ఉచిత హామీలు, అంతంత మాత్రపు అభివృద్ధితో కినిసినప్పటికీ మళ్ళీ మార్పు కావాలనీ, మళ్ళీ కాంగ్రెస్ రావాలనీ కోరుకోవట్లేదు. వెరసి, పోటీ అంతా బలమైన ఆప్‌కీ, బీజేపీకీ మధ్యనే! హరియాణాలోని బీజేపీ సర్కార్ ఢిల్లీకి వచ్చే యమునా జలాల్ని విషతుల్యం చేస్తోందన్న కేజ్రీవాల్ బాధ్యతారహిత ఆరోపణ ఎన్నికల సంఘం (ఈసీ) తాఖీదుకు దారి తీసినా, వివరణతో ఆయన దాన్ని అధిగమించారు. బీజేపీని ఆత్మరక్షణ ధోరణిలో పడేసి, ఆరోపణలకు జవాబివ్వడంలోనే ఆ పార్టీకి పుణ్యకాలం గడిచిపోయేలా చేశారు.

స్థానిక ఢిల్లీ పీఠంపై ఆప్ 11 ఏళ్ళు గడపడంతో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత సహజం. అదే సమయంలో కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ, 27 ఏళ్ళుగా ఢిల్లీ అసెంబ్లీపై జెండా ఎగరేయలేకపోయిన బీజేపీ ఈసారి చరిత్ర తిరగరాయాలని బలంగా సంకల్పించింది. దిగువ శ్రేణి జనం ఆప్‌కు అండగా నిలబడితే, ఆదాయపు నిచ్చెనలో పైకి పోయినకొద్దీ అవకాశాలను అందుకుంటున్న ప్రజానీకం మాత్రం మోదీ మార్కు బీజేపీ అభివృద్ధి మాటల వైపు మొగ్గుతున్నారు. ఈ సంకుల సమరంలో బీజేపీ సైతం ఓటర్ల కోసం ఉచితాల బాట తొక్కక తప్పలేదు. పనిలోపనిగా ఇంతకాలంగా భారం మోస్తున్న మధ్య తరగతి వర్గానికి తాజా కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను నుంచి భారీ ఊరట అందించింది. ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో ఢిల్లీకి ప్రత్యేకించే ఏదీ చేయరాదంటూ నెల క్రితం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) హూంకరించినా, జరిగింది వేరు. పన్ను మినహాయింపు 'ఢిల్లీకి మోదీ సర్కార్ కానుక' అంటూ పత్రికల్లో మొదటి పేజీలో బీజేపీ భారీ ప్రకటనలు గుప్పించినా ఈసీ కిమ్మనలేదు. గత పదేళ్ళలో అధికారాలతో బలోపేతుడైన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కానీ, ఓటర్ల జాబితాల్లో గోల్‌మాల్ ఆరోపణలు సహా అనేక అంశాల్లో ఇప్పుడు ఈసీ కానీ నిష్పక్షపాతంగా ఉన్నట్టు నమ్మించలేకపోయారు. ఈ నెలలోనే రిటైర్ కానున్న సీఈసీపై ఆప్ ఆరోపణల నేపథ్యంలో ఈసీ వివరణనిచ్చుకోవాల్సి వచ్చిన దుఃస్థితి. ఆరోపణలు, అనుమానాల నేపథ్యంలో 'ఢిల్లీలో కేజ్రీవాల్... కేంద్రంలో మోదీ' అన్న మాట మారిపోయే అవకాశమూ లేకపోలేదు. అందువల్లే, ఈసారి ఢిల్లీ ఎన్నికలు ఆప్‌కు అగ్నిపరీక్షయ్యాయి. ఈ ఏటి బిహార్ ఎన్నికలపై, వచ్చే ఏటి బెంగాల్ ఎన్నికలపైనా ఈ ఫలితాల ప్రభావం తథ్యం గనక ఆసక్తి రేపుతున్నాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి: శు.అష్టమి రా.3.10 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: భరణి రా.11.19 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: ఉ.9.55 నుండి 11.23 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.54 నుండి 12.42 వరకు, అమృతఘడియలు: సా.6.50 నుండి 8.20 వరకు

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఖర్చు పెట్టించేందుకు ఇది చాలదు!

విశ్లేషణ



అనింద్యో చక్రవర్తి

భారతదేశ మధ్య తరగతి బహుశా గడచిన మూడు దశాబ్దాల్లో ఇలాంటి బడ్జెట్ చూడలేదు. ఆదాయ పన్నులో ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తుందని మోదీ సర్కారుపై అందరూ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇంత భారీ ఊరట లభిస్తుందని మాత్రం ఊహించలేదు.

నగరాల్లో నెలకు కనీసం లక్ష రూపాయల ఆదాయం ఉన్నవారిని మాత్రమే మధ్య తరగతిగా పరిగణించాలని నేను గతంలో వాదించాను. అయితే, ఇలాంటి వాళ్ల దేశం మొత్తమ్మీద నాలుగైదు శాతం మాత్రమే ఉంటారు. ఇంత మొత్తం ఆర్జిస్తున్నవాళ్లు కూడా పన్నులు కట్టే పని లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు.

ఎందుకీ ఉపశమనం?

ఫలితంగా ఈ స్థాయి ఆదాయమున్న వారి జేబుల్లోకి ప్రతి నెల ఆరు వేల రూపాయలు అదనంగా వచ్చి చేరుతుంది. ఈ డబ్బును ఇంటికి కావాల్సిన వస్తువుల కొనుగోలుకు వాడుకోవచ్చు. లేదంటే దాచుకుని చిరకాలంగా ఆశపడుతున్న స్మార్ట్‌ఫోన్ నైనా సొంతం చేసుకోవచ్చు.

మీ ఆదాయం నెలకు రెండు లక్షల రూపాయలనుకుంటే, మారిన పన్ను రేట్ల కారణంగా మీకు నెల నెలా రూ. 9,000 అదనంగా ఆదా అవుతుంది. దీన్ని రోజువారీ ఖర్చుల కోసం వాడుకోవచ్చు. ఫ్యాన్సీ రెస్టారెంట్‌కు వెళ్లి భోంచేయొచ్చు. ఏడాదిలో రూ. 1.10 లక్షలు మిగులుతుంది. ఈ డబ్బుతో 55 అంగుళాల టీవీ, అత్యాధునిక వాషింగ్ మెషీన్ కొనుక్కోవచ్చు.

ఇంకోలా చెప్పాలంటే, పన్నుల మినహాయింపు పొందిన మధ్య తరగతి విరగబడి కొనుగోళ్లు చేస్తుందనీ, తద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతమొస్తుందనీ మోదీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇదే జరిగితే దేశంలో, ముఖ్యంగా నగర మధ్యతరగతి వినియోగం తగ్గుతోందన్న ఫిర్యాదులకు ఫుల్‌స్టాప్ పడుతుంది.

2022–23లో దేశంలో దాదాపు 7 కోట్ల మంది ఏడాదికి రూ.15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం సంపాదించారని దాఖలైన ఆదాయ పన్ను రిటర్న్స్ చెబుతున్నాయి. వీరిలో దాదాపు రెండు కోట్ల మంది పన్నులు చెల్లించారు. ప్రస్తుతం వేతనాల్లో పెంపును పరిగణనలోకి తీసుకున్నా, పన్ను రేట్లలో వచ్చిన మార్పుల కారణంగా సుమారు 1.5 కోట్ల మంది పన్ను పరిధిలోంచి జారిపోతారు. అంటే, పన్ను చెల్లింపుదారుల సంఖ్య సుమారు 1.4–1.6 కోట్లకు పడిపోనుంది. వీరిలో ఏడాదికి రూ.15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం సంపాదించే వారూ ఉంటారు. ఇది మొత్తం మన శ్రామిక శక్తిలో కేవలం 4 శాతం మాత్రమే.

ప్రభుత్వ అంచనా వేరే!

పరిస్థితి ఇలా ఉంటే, ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ పన్ను రాబడుల లెక్కలు ఇంకోలా ఉన్నాయి. 2025 బడ్జెట్ అంచనాల ప్రకారం, ఆదాయపు పన్ను రూపంలో వచ్చే మొత్తం రూ.1.8 లక్షల కోట్లు ఎక్కువ కానుంది. ఇంకోలా చెప్పాలంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చిన దానికంటే రానున్న సంవత్సరం వచ్చే మొత్తం 14 శాతం ఎక్కువ. గతేడాది ప్రభుత్వ అంచనాలతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువ. దీన్నిబట్టి చూస్తే ఆర్థిక మంత్రి చెప్పినట్లుగా పన్ను రేట్లలో మార్పుల వల్ల ప్రభుత్వానికి ఒక లక్ష కోట్ల రూపాయల నష్టం జరగడం లేదు. పాత రేట్లు, శ్లాబ్స్ కొనసాగి ఉంటే ప్రభుత్వం 22 శాతం వరకూ ఎక్కువ ఆదాయపు పన్నులు వసూలు చేసి ఉండేది.



ఆదాయ పన్ను రాబడి పెరిగేందుకు ఒకే ఒక్క మార్గం... వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రజల వ్యక్తిగత ఆదాయం బాగా పెరగడం! ఇలా జరిగే సూచనలైతే లేవు. నిజానికి కృత్రిమ మేధ, వేర్వేరు ఆటోమేషన్ పద్ధతుల ప్రాచుర్యం పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగాల సంఖ్య తగ్గేందుకే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫలితంగా జీతాలు కూడా స్తంభించిపోతాయి. తగ్గినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఇప్పుడు ఏడాదికి రూ.12 లక్షల ఆదాయం ఆర్జిస్తున్న వ్యక్తి గురించి ఆలోచిద్దాం. ఆదాయపు పన్ను కొత్త విధానాన్ని ఎంచుకుంటే ఇతడికి రూ.70 వేల వరకూ మిగులుతుంది. ఇంత మొత్తాన్ని వస్తు, సేవల కోసం ఖర్చు పెట్టగలడు. ఒకవేళ ఆదాయం పది శాతం తగ్గితే? అప్పుడు పన్ను మినహాయింపులు అక్కరకు రావు. వాస్తవికంగా ఖర్చు పెట్టడం ఇప్పటికంటే మరింత తక్కువైపోతుంది.

ఇంకో పెద్ద ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఖర్చు చేయడం తగ్గించుకుంటోంది కాబట్టి ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారనుంది. గత ఏడాది కంటే ఈసారి ప్రభుత్వం పెట్టిన ఖర్చు 6.1 శాతం మాత్రమే ఎక్కువ. వచ్చే ఆర్థిక సంవత్సరం ఇంకో 5 శాతమే అదనంగా ఖర్చు పెట్టాలని యోచిస్తోంది. ద్రవోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే ఈ పెంపుదల కేవలం 1.5 శాతమే అవుతుంది.

పెట్టుబడులు తగ్గించుకుంటున్న ప్రభుత్వం

రోడ్లు, హైవేలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వం గతంలో ఖర్చు పెట్టినదానికి ఇది పూర్తి భిన్నం. ఆ ఖర్చులో పెరుగుదల జీడీపీ పెంపునకు దారితీసింది. ఈసారి మూలధన వ్యయం గత ఏడాది కంటే కేవలం ఒకే ఒక్క శాతం ఎక్కువ ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణిస్తే అసలు మొత్తం ఇంకా తక్కువగా ఉంటుంది కాబట్టి... ఈ ఏడాది మౌలిక వసతులపై పెట్టే ఖర్చు తగ్గినా ఆశ్చర్యపోనవసరం లేదు.

అంటే, మౌలిక వసతుల రంగానికి అనుబంధమైన స్టీల్, సిమెంట్, తారు, జేసీబీల్లాంటి భారీ యంత్రాలు, బ్యాంకులు కూడా డిమాండ్‌లో తగ్గుదల నమోదు చేయవచ్చు. ఇదే జరిగితే ఆ యా రంగాల్లో వేతనాల బిల్లులు తగ్గించుకునే ప్రయత్నం అంటే... వేతనాల్లో కోతలు లేదా ఉద్యోగాల కుదింపు జరుగుతుంది. ఇది మధ్య తరగతి వారి ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

ప్రభుత్వం ఈ ఏడాది కార్పొరేట్ కంపెనీల ద్వారా ఎక్కువ ఆదాయపు పన్ను ఆశించడం లేదని అంచనా కట్టింది. జీడీపీ విషయంలోనూ ఇంతే. వృద్ధి నామమాత్రమేనని ప్రభుత్వం భావిస్తోంది.

పెట్టుబడులు పెరగకపోతే?

ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం తాను లక్ష్యించుకున్న కార్పొరేట్ పన్నులు కూడా పూర్తిగా వసూలు చేయలేకపోయింది. మొత్తం 10.2 లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీల ద్వారా వస్తుందని ఆశిస్తే వసూలైంది రూ.9.8 లక్షల కోట్లు మాత్రమే. అదే సమయంలో ఆదాయపు పన్ను రాబడులను మాత్రం రూ.11.9 లక్షల కోట్ల నుంచి రూ.12.6 లక్షల కోట్లకు సవరించింది. అంటే ప్రభుత్వం కార్పొరేట్ పన్నుల కంటే 28 శాతం ఎక్కువ ఆదాయపు పన్ను రూపంలో వసూలు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా కార్పొరేట్ పన్నుల కంటే ఆదాయపు పన్నులు 33 శాతం ఎక్కువ వసూలు చేస్తామని చెబుతోంది. ఇది ఆర్థిక వ్యవస్థ బాగు పడుతోందనేందుకు ఏమాత్రం సూచిక కాదు.

ప్రభుత్వం లేదా ప్రైవేట్ రంగం నుంచి ఎక్కువ పెట్టుబడుల్లేకుండా... కేవలం ఆదాయపు పన్ను రాయితీలతోనే వినియోగం పెరిగిపోతుందని ఆశించడంలో ఉన్న సమస్య ఇది. మధ్య తరగతి ప్రజల జేబుల్లో కొంత డబ్బు మిగిల్చితే, కొన్ని రకాల వస్తు సేవలకు తాత్కాలిక డిమాండ్ ఏర్పడవచ్చు. కానీ, ఆర్థిక వ్యవస్థ విస్తృత స్థాయిలో ఎదగకపోతే ఆ డిమాండ్ ఎక్కువ కాలం కొనసాగదు.

ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌పై మరింత పెట్టుబడి పెట్టేందుకు కంపెనీలు సిద్ధంగా కనిపించడం లేదు. వీరి ప్రాజెక్టుల్లో అధికం ప్రభుత్వ మౌలిక వసతుల కల్పనకు సంబంధించినవే. అవే తగ్గిపోతే, కార్పొరేట్ కంపెనీలు కూడా తమ పెట్టుబడులను కుదించుకుంటాయి. దీంతో పరిస్థితి మొదటికి వస్తుంది. ఆదాయపు పన్ను రిబేట్లు ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం సాయం చేయనివిగా మిగిలిపోతాయి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, ఆర్థికాంశాల విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

- పన్ను మినహాయింపు పొందిన మధ్యతరగతి విరగబడి కొనుగోళ్లు చేస్తుందనీ, తద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతమొస్తుందనీ మోదీ ప్రభుత్వం అంచనా వేస్తోంది.
- మధ్య తరగతి ప్రజల జేబుల్లో కొంత డబ్బు మిగిల్చితే, కొన్ని రకాల వస్తు సేవలకు తాత్కాలిక డిమాండ్ ఏర్పడవచ్చు. కానీ, ఆర్థిక వ్యవస్థ విస్తృత స్థాయిలో ఎదగకపోతే ఆ డిమాండ్ ఎక్కువ కాలం కొనసాగదు.
- ప్రభుత్వం నిజానికి మౌలిక వసతులపై పెట్టుబడులను తగ్గించుకుంటోంది కాబట్టి ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారనుంది. ఇది మధ్యతరగతి ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

సోషల్ మీడియా

ఏం రాబట్టగలరు?



ఒక పక్క భారత అక్రమ వలసదారుల మొదటి బ్యాచ్‌ను సైనిక విమానంలో వెనక్కి పంపుతూనే, మరో పక్క మోదీని వచ్చేవారంలో వైట్ హౌజ్‌కు ఆహ్వానించడం స్పష్టమైన సంకేతం పంపుతోంది– ట్రంప్ కఠినంగా ఉంటారు. ఆయన ఇండియా నుంచి కొన్ని రాయితీలు ఆశిస్తున్నారు, మరి మోదీ స్వదేశానికి ఏం తెస్తారు?

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

నీళ్ల మాఫియా



ఢిల్లీకి నీటిని సరఫరా చేయడం కోసం హరియాణలో అక్రమంగా బోరు బావులు వేస్తూ, వ్యవసాయ ప్రదేశాల్లో భూగర్భ నీటిమట్టాలను క్షీణింపజేస్తున్న వాటర్ మాఫియాను హరియాణా ప్రభుత్వం నియంత్రించాలి.

– స్మితా ప్రకాశ్, జర్నలిస్ట్

వచ్చినా బతకొచ్చు!



క్యాన్సర్ అనేది అంతం కాదు. పోరాటం ఆపొద్దు. జీవితాన్ని సంపూర్ణంగా జీవించండి. (ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినం.)

– గౌతమి తాడిమళ్ల, నటి, క్యాన్సర్ సర్వైవర్

భయం ఉండొద్దు!



సక్సెస్‌లో ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఆలోచనలు స్వేచ్ఛగా పంచుకోగలిగి, ప్రయోగాలను ప్రోత్సహించడం. వైఫల్య భయం వెన్నాడకుండా రిస్క్ తీసుకోగలిగినప్పుడే కొత్త కల్పనలు పుడతాయి.

– హర్ష్ మారీవాలా, వ్యాపారవేత్త

సానుకూల కోణం



ప్రతికూల భావనల ఉద్దేశం మిమ్మల్ని దురవస్థకు లోను చేయడం కాదు. తప్పులను నివారించడం కోసం. కోపం అనేది దేనితో పోరాడాలో చూపుతుంది. వ్యాకులత దేనికి సిద్ధమవ్వాలో సూచిస్తుంది. పశ్చాత్తాపం ఎవరిని పట్టించుకోవాలో వెల్లడిస్తుంది. దుఃఖం అనేది ఎవరు ప్రియమైనవాళ్లో చెబుతుంది. బాధ అనేది కాపాడుకోవాల్సిన విలువలకు గైడ్‌గా ఉంటుంది.

– ఆడమ్ గ్రాంట్, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

మరి పురుషులకు?



మహిళలు, బాలికల సంక్షేమం కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.4.49 లక్షల కోట్లు కేటాయించారు. ఇది 2024-25 బడ్జెట్‌లో కేటాయించిన రూ.3.27 లక్షల కోట్లతో పోల్చితే 37.25 శాతం ఎక్కువ. కానీ భారత ప్రభుత్వం పురుషుల సమస్యల కోసం ఏమీ వెచ్చించడం లేదు.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, పురుష హక్కుల కార్యకర్త

నిజమైన ప్రమాదం




నల్లమందు పెంపకం అనేది దేశానికి ప్రమాదం. దాన్ని నిర్మూలం చేయాల్సిందే. కానీ నార్కోటిక్స్‌లో నిజమైన సమస్య ఉన్నది సింథటిక్ డ్రగ్స్‌తో! ఇవి పొలాల్లో పెరగవు, ల్యాబుల్లో తయారవుతాయి.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

ఇన్ బాక్స్

తొలితరం జానపథికుడు

జానపద సాహిత్యం కోసం అనంతమైన కృషి చేసినవారు తంగిరాల వెంకట సుబ్బారావు. ఆ సాహిత్యాన్ని సేకరించి, విశ్లేషించి, వేలాది పుటల గ్రంథాలను వెలుగులోనికి తీసుకొచ్చారు. 'తెలుగు వీరగాథా కవిత్వం'పై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకొన్నారు. తెలుగులోని వీరగాథా వైశిష్ట్యాన్ని లోకానికి చాటడంలో తంగిరాల సఫలీకృతులైనారు. ఈ సిద్ధాంత గ్రంథంలో వీరగాథల పుట్టుపూర్వోత్తరాలు, వీరగాథా విభజన, శక్తి కథాచక్రం, పలనాటి వీర కథా చక్రం, కాటమరాజు కథాచక్రం, బొబ్బిలి వరుస కథలు, పదాలు, జంగం కథలు, లఘు వీర గాథలు, వీర గాథానుకరణాలు, వీరగాథలో రసం, భాష, ఛందస్సు, వీరగాథల వైశిష్ట్యం వంటి పరిశోధనా విషయాలను కూలంకషంగా చర్చించి వివరించారు.



తంగిరాల వెంకట సుబ్బారావు

తంగిరాల 'రేనాటి సూర్యచంద్రులు' అనే పెద్ద పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులో భారతదేశంలో మొదటి స్వాతంత్ర్య పోరాట వీరుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వీరగాథల్ని సవివరంగా పరిశీలించి తెలుగు వారికి అందించారు. అలాగే రేనాటి సూర్య చంద్రులు రెండవ సంపుటాన్ని ప్రచురించి అందులో రాయలసీమ దాన కర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి సాహిత్యాన్ని విడమరచి చెప్పారు.

'చైతన్య కవిత' అనే పత్రికను స్థాపించి ఎన్నో ఏళ్ళు దానికి సంపాదకుడిగా పని చేశారు. 'శ్రీకృష్ణ కర్ణామృతం' గ్రంథానికి కూడా సంపాదకత్వం వహించారు. రంగనాథ రామాయణం, సుమతి శతకాలను తంగిరాలతో కలిసి కొంతమంది ఆంగ్లంలోకి అనువదించారు. 'అంకమ్మ కథలు' పేరుతో శక్తి కథాచక్రాన్ని ప్రచురించారు. వందలాది పరిశోధనా వ్యాసాలను రచించారు.

తంగిరాల చేసిన సేవలకు గాను 2025 జనవరి 4న ఆయనకు 'అజో విభో కందాళం ఫౌండేషన్ జీవిత సాఫల్య పురస్కారం' పొందారు. ఇది జరిగిన ఇరవై ఒకటో రోజే (జనవరి 25) ఆయన తుదిశ్వాస విడిచారు. తెలుగులో జానపద సాహిత్యం ఉన్నన్నినాళ్లూ ఆచార్య తంగిరాల జీవించే ఉంటారు.

– ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి | ఏపీ తెలుగు అకాడమీ మాజీ సంచాలకుడు

ఏఐ... పిల్లలూ... తల్లిదండ్రులూ!

ఏఐ ప్రాధాన్యం రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పిల్లల ప్రపంచం తీవ్ర ప్రభావానికి లోనవుతున్నది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు బిడ్డల పెంపకంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది అత్యంత ముఖ్యమైన అంశం అయ్యింది.

2025 నుంచి 2039 మధ్య జన్మించే పిల్లలు బీటా తరం కిందకు వస్తారు. మొన్న జనవరి 1వ తేదీ అర్ధరాత్రి 12.03 నిమిషాలకు మిజోరంలోని ఐజ్వాల్ ఆసుపత్రిలో జన్మించిన అబ్బాయిని భారతదేశంలో మొదటి తరానికి చెందే తొలి 'బీటా చిన్నారి'గా గుర్తించారు. అసలు ఆల్ఫా, బీటా... అంటూ ఈ వర్గీకరణ అంతా ఏమిటి అనుకుంటున్నారా?

పిల్లలు ఏ తరంలో జన్మించారు అన్న అంశం వాళ్ల సామాజిక వ్యవహార శైలిని నిర్దేశిస్తుంది. అప్పుడు ఉండే సాంకేతికత, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలు వాళ్ల వ్యక్తిత్వాన్ని, అనుభవాలను ప్రభావితం చేస్తాయి. అంతేకాదు. రాజకీయంగా వాళ్ల ఐడియాలజీని, వినియోగదారునిగా వాళ్ల మనస్తత్వాన్ని నిర్దేశిస్తాయి.

ఇప్పుడు పుట్టుకొస్తున్న బీటా బేబీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నిండిపోయిన సాంకేతిక ప్రపంచంలో జీవిస్తారు. అంటే వాళ్ల రోజువారీ జీవితం చిన్న రోబోల మధ్య సాగుతుంది. అవి చెప్పినట్టే వాళ్లు నడుచుకుంటారు. ఒక రకంగా చెప్పాలంటే అవి వీళ్లకు ట్యూటర్లు అన్న మాట. దాంతో పాటు వాటికవే నడిచే డ్రైవర్ లేని కార్లను చూస్తారు. 2035 నాటికి మొత్తం జనాభాలో 16 శాతం మంది బీటా తరానికి చెందిన వాళ్లే ఉంటారని అంచనా.



తరాల విభజన

1901 నుంచి 1927 మధ్య పుట్టినవాళ్లను 'గ్రేటెస్ట్ జనరేషన్' లేదా 'జీఐ జనరేషన్'గా పిలుస్తారు. తర్వాతది సైలెంట్ జనరేషన్. 1946 నుంచి 1964 మధ్య పుట్టినవాళ్లను 'బేబీ బూమర్స్' అంటారు. 1965–1980 మధ్య జన్మించిన వాళ్లను 'జనరేషన్ ఎక్స్'గానూ, 1981 నుంచి 1996 వరకూ పుట్టినవాళ్లను 'జనరేషన్ వై' గానూ (వాళ్లను మిలీనియల్ జనరేషన్ అని కూడా అంటారు), 1997 నుంచి 2010 వరకూ పుట్టిన వాళ్లను 'జెన్ జడ్' గానూ వ్యవహరిస్తారు. 2010 నుంచి మొన్న 2024 వరకూ పుట్టినవాళ్లు 'జనరేషన్ ఆల్ఫా'. ఇప్పుడొచ్చే తరం 'బీటా జనరేషన్'.

బీటా తరంలో పుట్టిన పిల్లలు ఆల్ఫా తరం కంటే చురుగ్గా, తెలివిగా, టెక్ సావీగా ఉంటారు. ఉదాహరణకి 'వీల్స్ ఆన్ ద బస్' ఆట ఆడాలంటే 'అలెక్సా'ను పిలుస్తారు. లెక్కల్లో హెచ్చవేతలు అంటే మల్టిప్లికేషన్ వంటివి తెలియకపోతే 'బ్లాక్ బాక్స్'ను ఆశ్రయిస్తారు. ఈ పరిస్థితుల్లో పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ముందుగా మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న యాప్స్, ప్లాట్ ఫారమ్స్ గురించి తెలుసుకోవాలి. ట్రెండ్స్‌ను అనుసరించాలి. అప్పుడు పిల్లలకు ఏవి ఉపయోగపడతాయి? ఏవి ఉపయోగపడవు అనేది తెలుసుకోగలుగుతారు. పిల్లలు ఎక్కువ టెక్నాలజీ మధ్య ఉంటారు గనుక సైబర్ మోసాల బారిన పడే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు ఈ విషయంలో పిల్లలకు తగినంత అవగాహన పెంచాలి. ఎక్కువ డివైజ్‌లపై ఆధారపడకుండా బాహ్య ప్రపంచంలో వాళ్లకు మంచి అనుభవాలను అందించాలి. కొత్త ప్రదేశాలకు తీసికెళ్లటం, బంధువులు, స్నేహితుల మధ్య గడపటం నేర్పాలి.

ఇంట్లో కొంత ప్రదేశాన్ని 'టెక్ ఫ్రీ జోన్'గా మలచాలి. ప్రధానంగా కుటుంబ సభ్యులు అందరూ కలిసి భోజనం చేసే డైనింగ్ టేబుల్ మీద ఎలాంటి డివైజ్‌లూ లేకుండా చూసుకోవాలి. పుస్తకాలు చదవటం, ఇంట్లో అమ్మానాన్నలతో మాట్లాడటం వంటివి అలవాటు చేయాలి. ఏది ఏమైనా బీటా తరం కొత్త ప్రపంచాన్ని చూస్తుంది. చుట్టూ ఉన్న వాళ్లకు కొత్త అనుభవాలను అందిస్తుంది. అవి ఎలా ఉంటాయో రానున్న రోజుల్లో మనకు అర్థం అవుతుంది.

– డా|| పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్ | 99088 92065

దానం–ఉద్దేశం

జ్యోతిర్మయం

మంచి ఉద్దేశంతో మంచి చేసేదే 'దానం' అని భీష్ముడు పాండవులతో అన్న సన్నివేశం ఇది. భీష్మాచార్యుడు అంపశయ్యపై ఉన్నప్పుడు ధర్మరాజు తన సోదరులు, ద్రౌపదితో కలిసి ఆయన్ని సందర్శించి 'పితామహా! మీరు మాకు నీతి, నిజాయితీ, రాజకీయం, ధర్మం గురించి ఉపదేశించండి' అని అడిగాడు. అప్పుడు ద్రౌపది 'దుర్యోధనుడి సభలో దుశ్శాసనుడు నన్ను పరాభవిస్తున్నప్పుడు భీష్మాచార్యులు సభలో ఉండి వినోదంలా తిలకించారు కాని ఒక్కమాటైనా మాట్లాడారా? అటువంటి ఆయన నుంచి ఉపదేశమా' అంది. పాండవులు ఏం మాట్లాడాలో తెలియక నిశ్శబ్దంగా ఉండిపోయారు.

భీష్ముడు ఓ చిన్ననవ్వు నవ్వి ఇలా చెప్పాడు: 'ద్రౌపది ప్రశ్న సముచితమైనదే. ఆమెకు నేను జవాబు చెప్పి తీరాలి. దుర్యోధనుడు ఏ సమయంలోనైనా ఎవరు వచ్చినా కడుపు నిండా అన్నం పెట్టి సపర్యలు చేస్తాడు. స్వార్థ చింతనతో అన్నం పెట్టి వారిని తన కార్యాలకు ఉపయోగించుకునేవాడు. ఇందుకు శల్యుడు, కర్ణుడు ఉదాహరణలు. ఒకరు స్వచ్ఛమైన మనసు లేకుండా వంచనతో దుష్టాలోచనతో ఇతరులకు అన్నం పెడితే ఆ దుష్టగుణమే తిన్నవారి రక్తంలో కలుస్తుంది. నేను దుర్యోధనుడు పెట్టిన అన్నం తిన్నాను. కనుక నాలో అతని దుర్గుణం కలిసింది. అందుకే పాంచాలిని అవమానించినప్పుడు నేను ఏదీ మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నాను. కానీ ఇప్పుడు పార్థుడు ఏర్పాటు చేసిన అంపశయ్యపై శయనించిన తర్వాత నా దేహంలోని దుష్టగుణాలు బయటకు పోయాయి. ఇప్పుడు నా దేహాన స్వచ్ఛమైన ఆత్మ మాత్రమే ఉంది. మంచి మనసు కలిగి, సదుద్దేశంతో చేసిందే నిజమైన దానం అని గుర్తించండి' అన్నాడు.

– యామిజాల జగదీశ్



నామాల కోడి.. ఊరంతా సందడి

తల పైభాగం నుంచి తెల్లటి ముక్కుతో ఉండేదే నామాల కోడి

క్రేక్‌బర్డ్ కుటుంబానికి చెందిన యురేషియన్ కూట్ వలస నీటి పక్షులు (బుడుబుంగ).. పెద్దపల్లి జిల్లా హనుమంతునిపేట గ్రామ చెరువులో సందడి చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో నివసించడానికి ఇష్టపడే ఈ పక్షులు.. యూరప్, ఆస్ట్రేలియా, ఉత్తర ఆఫ్రికా దేశాలలో కనిపిస్తుంటాయని, శీతాకాలంలో సరస్సులు గడ్డ కట్టడంతో వలస వెళ్తాయని పక్షి ప్రేమికులు తెలిపారు. ఇదివరకెప్పుడూ ఇలాంటి పక్షులు రాలేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

'ఎవర్ గ్రీన్'బీ ఈటర్!

ఇదో రకమైన పిచ్చుక. ఆకుపచ్చని రంగు, నల్లటి ముక్కు, నీలిరంగు కంఠం, పొడవైన సన్నని తోక కలిగి పిట్టల్లో అరుదుగా కనిపించే గ్రీన్‌బీ ఈటర్ పిట్ట చెట్టు కొమ్మపై సందడి చేసింది. సాధారణ పిచ్చుకలకు విభిన్నంగా.. పచ్చని ప్రకృతిలో కనువిందు చేసింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



కన్నాలు పెట్టే.. కాపర్‌స్మిత్ బార్బెట్

నల్లటి ఇనుములాంటి ముక్కు, ఎరుపు తల, పసుపు బుగ్గలు, కడుపుపై బూడిద రంగు చారలు, ఎరుపు రంగు కాళ్లతో ఉండే కాపర్‌స్మిత్ బార్బెట్ అరుదైన పక్షి. చెట్టు తొర్రల్లో రంధ్రాలు చేసి కీటకాలు, చెద పురుగులను తింటూ.. అడవుల్లో జీవిస్తుంది. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు ఈ పక్షులు కనిపిస్తుంటాయని, అరుదుగా కనిపించే జాతుల్లో కాపర్‌స్మిత్ బార్బెట్ ఒకటని చెబుతున్నారు పక్షి ప్రేమికులు. పెద్దపల్లి పట్టణ శివారులోని ఓ చెట్టుపై అరుదైన కాపర్‌స్మిత్ బార్బెట్ పక్షులు కనువిందు చేశాయి.
- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



క్లుప్తంగా...

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనుల హతం

- బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల దుశ్చర్య



గిరిజనుల మృతదేహాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను దారుణంగా నరికి చంపారు. మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని తలబ్‌పారాకు చెందిన రాజు కారం (32), బుడ్డిచెరువుకు చెందిన మున్నా మడివి (27)లను మావోయిస్టులు రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశారు. విచారించిన తర్వాత వారు ఇన్‌ఫార్మర్లని ఆరోపిస్తూ హత్య చేశారు. ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందువల్లే హతమార్చామని, ఇలా ఎవరు వ్యవహరించినా ఇదే గతి పడుతుందంటూ మృతదేహాల వద్ద వదిలిన కరపత్రాల్లో మావోయిస్టులు హెచ్చరించారు. మృతుడు రాజు కారం కొంత కాలం మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యునిగా పనిచేసి లొంగిపోయి ప్రస్తుతం గ్రామంలోనే ఉంటున్నాడు.

ప్రెజర్‌బాంబు పేలి ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు

బీజాపూర్ జిల్లాలో కూంబింగ్‌కు వెళ్లిన జవాన్లు.. మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలడంతో తీవ్రంగా గాయపడ్డారు. గంగులూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన బలగాలతోపాటు డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు మంగళవారం ఉదయం కూంబింగ్‌కు బయలుదేరారు. ఆ మార్గంలో ప్రెజర్‌బాంబును గమనించని ఓ జవాన్ దాన్ని తొక్కడంతో.. పేలింది. దీంతో అతనితో పాటు వెనుక, ముందు నడుస్తున్న మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉన్నతాధికారులు హెలీకాప్టర్ ద్వారా రాయ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వైటీడీబీ ఏర్పాటుకు ఆర్డినెన్స్?

- ఎన్నికల కోడ్ ముగియగానే ప్రకటన
- వైటీడీఏ స్థానంలో వైటీడీబీ

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు (వైటీడీబీ) ఏర్పాటుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ తేనుంది. గత నెల సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైటీడీబీ ఏర్పాటుపై చర్చించారు. ఈ నెల 12వ తేదీలోగా వైటీడీబీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ తేవాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో కోడ్ ముగిసిన తర్వాత ఆర్డినెన్స్‌ను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆర్డినెన్స్‌ను ఆరు నెలల్లోపు ఆమోదించాల్సి ఉంటుంది కాబట్టి ఈ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంది.

చైర్మన్, పాలకవర్గం నియామకం

యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డుకు చైర్మన్‌తోపాటు పాలకవర్గం సభ్యులు 11 మందిని నామినేట్ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. వీరికి తోడు ఆరుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులను నియమిస్తారు. ప్రస్తుతం ఉన్న వంశపారంపర్య ధర్మకర్త దేవస్థానం పాలకవర్గంలో సభ్యుడిగా ఉంటారు. కాగా, సీఎం చైర్మన్‌గా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వైటీడీఏ) మొత్తం నూతనంగా వచ్చే వైటీడీబీ పరిధిలోకి రానుంది. దేవస్థానం పరిపాలన వ్యవహారాలు, ఉద్యోగుల బదిలీలు, భక్తుల వసతులు, దేవస్థానం అభివృద్ధి పనులను వైటీడీబీ పర్యవేక్షణలోకి తేనున్నారు.

స్వాగత తోరణానికి రంగులు

యాదగిరిగుట్ట దేవస్థానం స్వాగత తోరణానికి రంగులు వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. కొండపైన భక్తులకు స్వాగతం పలికే తోరణాన్ని సిమెంట్‌తో నిర్మించారు. నవంబర్‌లో సీఎం యాదగిరిగుట్టకు వచ్చిన సమయంలో తోరణం నిర్మాణ శైలి వివరాలను తెలుసుకున్నారు. గత నెలలో జరిగిన సమీక్షా సమావేశంలో స్వాగత తోరణానికి ఆకర్షణీయమైన రంగులు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు పనులు ప్రారంభించారు.

యాదగిరి క్షేత్రంలో రథ సప్తమి వేడుక

ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి స్వర్ణ రథంపై ఊరేగిన స్వామివారు



ఆలయ ఉత్తర మాఢవీధిలో సూర్యప్రభ వాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: రథ సప్తమిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అర్చకులు మంగళవారం విశేష వేడుకలు జరిపించారు. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరచిన అర్చకులు గర్భాలయంలో, ముఖ మండపంలో శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను అలంకరించారు. తర్వాత శ్రీస్వామి అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై అధిష్ఠించి, తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. తూర్పు రాజగోపురం ముందున్న మాడ వీధిలో శ్రీస్వామి వారి సూర్యప్రభ సేవను అధిష్ఠించి, చతుర్వేద పారాయణం నిర్వహించి, రథ సప్తమి విశిష్టతను భక్తులకు వివరించారు. రాత్రి శ్రీస్వామి వారిని స్వర్ణ రథంపై ఊరేగించారు.

మస్తాన్‌సాయి పోలీస్ కస్టడీకి ఏర్పాట్లు

- లైంగిక వేధింపుల కేసులో ప్రశ్నించనున్న పోలీసులు
- నేడు కోర్టులో కస్టడీ పిటిషన్ వేసే అవకాశం
- ఫిర్యాదుదారు లావణ్యను మరోసారి విచారించిన అధికారులు



న్యాయవాది నాగూర్‌బాబు, మస్తాన్‌సాయి

మణికొండ: అమాయక యువతులు, మహిళలను లోబరుచుకుని అఘాయిత్యాలకు పాల్పడిన మస్తాన్‌సాయిని లోతుగా ప్రశ్నించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. అతడి అకృత్యాలు నిక్షిప్తమై ఉన్న హార్డ్ డిస్క్ కోసం లావణ్య ఇంటిపై దాడిచేసిన కేసులో మస్తాన్‌సాయిని నార్సింగి పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఆ హార్డ్ డిస్క్‌లోని వీడియోలను నిశితంగా పరిశీలిస్తున్న పోలీసులు.. అతడిని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఫిర్యాదుదారు లావణ్యను మంగళవారం మరోసారి స్టేషన్‌కు పిలిపించారు. ఫిర్యాదులో ఆమె పేర్కొన్న వివరాలు, వాటిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నట్టు తెలిసింది. బుధవారం కోర్టులో పిటిషన్ వేసి మస్తాన్‌సాయిని 10 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అంతకుముందే మస్తాన్‌సాయికి నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం.

వెలుగులోకి వస్తున్న అకృత్యాలు..

కొన్నేళ్లుగా మస్తాన్‌సాయి పబ్‌లు, వీఐపీ పార్టీలలో యువతులు, వివాహిత మహిళలను మచ్చిక చేసుకుని వారితో ఏకాంతంగా గడిపిన వీడియోలు, వాట్సాప్ చాటింగ్‌లు, ఫోన్ రికార్డింగులను హార్డ్ డిస్క్‌లో భద్రపరిచాడు. ఆ హార్డ్ డిస్క్‌ను మస్తాన్‌సాయి ఇంటినుంచి తీసుకున్న లావణ్య.. పోలీసులకు అందించారు. ఆ హార్డ్ డిస్క్ కోసమే మస్తాన్‌సాయి తన ఇంటిపై దాడిచేసి తనను చంపేందుకు ప్రయత్నించాడని ఫిర్యాదు చేశారు. కాగా, తనను డ్రగ్స్ కేసులో మరోమారు ఇరికించేందుకు మస్తాన్‌సాయి, శేఖర్‌బాషా యత్నిస్తున్నారని లావణ్య న్యాయవాది నాగూర్‌బాబు ఆరోపించారు. వారి మధ్య జరిగిన సంభాషణ రికార్డులను మంగళవారం పోలీసులకు అందించామని తెలిపారు. లావణ్య ఇంట్లో పార్టీ ఏర్పాటు చేసి, ఇంట్లో డ్రగ్స్ పెట్టి పోలీసులకు పట్టించాలనే పథకం వేశారని ఆరోపించారు. ఆ వివరాలన్నీ పోలీసులకు అందించి చర్యలు తీసుకోవాలని కోరామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో డీసీఆర్‌బీ ఎస్సై దుర్మరణం

- ఇదే ఘటనలో బ్యాంక్ ఉద్యోగి కూడా మృతి
- అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టిన ఎస్సై కారు



కారులో పడి ఉన్న ఎస్సై శ్వేత మృతదేహం, ఎస్సై శ్వేత(ఫైల్)



నరేశ్ మృతదేహం

గొల్లపల్లి: జగిత్యాల–ధర్మారం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డీసీఆర్‌బీ(డిస్ట్రిక్ క్రైం రికార్డ్స్ బ్యూరో) ఎస్సై శ్వేత అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఇదే ఘటనలో మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన బ్యాంక్ ఉద్యోగి నరేశ్ కూడా మృత్యువాత పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామానికి చెందిన శ్వేత జగిత్యాల డీసీఆర్‌బీ ఎస్సైగా పనిచేస్తున్నారు. ప్రతిరోజూ తన కారులో రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం తన స్వగ్రామం నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో చిల్వకోడూర్ శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పి కుడి వైపునకు దూసుకెళ్లి బ్యాంకు ఉద్యోగి మల్యాల నరేశ్ (26) బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో శ్వేత ఛాతీ, తల భాగంలో బలమైన గాయాలు కావడంతో స్టీరింగ్ సీటు నుంచి పక్క సీటులో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందారు. నరేశ్ రోడ్డు పక్కనే ఉన్న ముళ్లపొదల్లో పడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. నరేశ్ హెల్మెట్ ధరించినా ఫలితం లేకుండాపోయింది. నరేశ్ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో డీబీఎస్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, అడిషనల్ ఎస్పీ భీంరావు తదితరులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీటు బెల్ట్ పెట్టుకుంటే ప్రాణాలు నిలిచేవి

నరేశ్ హెల్మెట్ ధరించినా ప్రమాద తీవ్రత కారణంగా ఎగిరి ముళ్లపొదల్లో పడి చనిపోయాడు. ఎస్సై శ్వేత మాత్రం సీటుబెల్ట్ పెట్టుకోకపోవడంతో ప్రమాదం సమయంలో బెలూన్ తెరుచుకోలేదు. ఒకవేళ బెలూన్ తెరుచుకొని ఉంటే శ్వేత ప్రాణాలతో బయట పడేవారే.

ఆస్తి కోసం మరిది హత్య

- సుపారీ ఇచ్చి చంపించిన వదిన
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

బషీరాబాద్: మరిదిని చంపితే అతని వాటా ఆస్తి తమకు వస్తుందని హత్యచేయించింది ఓ వదిన. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవల్గా గ్రామంలో జరిగింది. పోలీసులు, హతుడి కుటుంబ సభ్యులు, తెలిపిన వివరాల ప్రకారం.. నవల్గాకు చెందిన మాల శ్యామప్ప (39) గ్రామ గేటు సమీపంలో హత్యకు గురయ్యాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడ్డు తొలగిస్తే.. ఆస్తి దక్కుతుందని..

నవల్గాకు చెందిన మాల మల్లమ్మకు మాల నర్సిములు, శ్యామప్ప (39), శ్యామమ్మ సంతానం. అయితే శ్యామప్ప



మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

భార్య నాలుగేళ్ల క్రితం భర్తను వదిలేసి కూతురును తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శ్యామప్ప తన చెల్లితో కలిసి ఉంటున్నాడు. అదే ఇంట్లోని రెండో భాగంలో అన్న నర్సిములు, వదిన సుగుణ నివసిస్తున్నారు. మరిదిని అంతమొందిస్తే ఇల్లు పూర్తిగా తమ సొంతం అవుతుందని భావించింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొత్త విజయ్, విశ్వనాథ్, శివకుమార్‌లతో కలిసి వారం రోజుల క్రితం శ్యామప్ప హత్యకు పథకం వేసింది. అతన్ని చంపితే రూ.50 వేలు ఇస్తానని చెప్పి, శనివారం అడ్వాన్స్‌గా రూ.10 వేలు అందజేసింది. ఈ క్రమంలో సుపారీ తీసుకున్న ముగ్గురు శ్యామప్ప హత్యకు పక్కా ప్లాన్ వేశారు. సోమవారం సాయంత్రం బషీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో గ్లౌజ్‌లు తీసుకున్నారు. మద్యం తాగేందుకని రాత్రి శ్యామప్పను తీసుకుని గ్రామ శివారులోని ఓ పొలంలోకి వెళ్లారు. మద్యం తాగిన తర్వాత శ్యామప్ప తలపై రాళ్లతో కొట్టి హత్య చేశారు. దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పొలానికి ఆనుకుని ఉన్న బషీరాబాద్– తాండూరు ప్రధాన మార్గం వద్దకు ఈడ్చుకెళ్లి పడేశారు. హత్య సమాచారం అందుకున్న ఎస్ఐ శంకర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్ హత్య తీరును పరిశీలించారు. హతుడి తల్లి మల్లమ్మ, సోదరి శ్యామమ్మను విచారించి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. అనుమానం వచ్చిన పోలీసులు వదిన సుగుణను ఠాణాకు తరలించి విచారించారు. హత్యకు సంబంధం ఉన్నట్లు గుర్తించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. ఈ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు బుధవారం వెల్లడిస్తామని సీఐ మీడియాకు తెలిపారు.

సీడీపీఓ ధనలక్ష్మి ఆత్మహత్యాయత్నం

విచారణ లేకుండా సస్పెండ్ చేశారని మనస్తాపం



సీడీపీఓ ధనలక్ష్మి

ములుగు/వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల కేంద్రంలోని తన అద్దె గృహంలో మంగళవారం ఉదయం వెంకటాపురం అంగన్‌వాడీ ప్రాజెక్టు సీడీపీఓ ధనలక్ష్మి ఆత్మహత్యాయత్నం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపై కనీసం విచారణ లేకుండానే ఏకపక్షంగా సస్పెండ్ చేశారని మనస్తాపానికి గురై ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బాధితురాలి వీడియో క్లిప్ సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. గతంలో ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న తతంగంపై కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదని, ప్రస్తుతం సమాన వృత్తిలో ఉన్న ములుగు సీడీపీఓ, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ చెప్పినట్లుగా వినడం తప్ప ఎదుట వ్యక్తి విషయాలను పరిగణనలోకి తీసుకోవటం లేదని ఆమె వీడియోలో పేర్కొన్నారు. సెంటర్లు నడవని కేంద్రాలకు ఎందుకు అద్దె చెల్లిస్తున్నారని, రిటైర్ అయిన ఆయాకు వేతనం ఎలా ఇస్తారని అడిగానని, వీటిని మనసులో పెట్టుకుని కలెక్టర్ ద్వారా సస్పెన్షన్ లెటర్ వచ్చేలా చేశారన్నారు. వీటన్నింటికి కారణం డీడబ్ల్యూఓ శిరీష అని పునరుద్ఘాటించారు. కాగా, సీడీపీఓ ధనలక్ష్మి తమపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ శనివారం వెంకటాపురం(కె) ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు ధర్నా చేశారు. అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకుని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ ధనలక్ష్మిని పిలిపించి మాట్లాడారు. ఇది జరిగిన అరగంటలోనే సీడీపీఓను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు రావడంతో ఆమె ఆందోళన చెందారు. ఈ క్రమంలో మంగళవారం ఆమె ఆత్మహత్యాయత్నం సంచలనం సృష్టించింది. ఈ విషయమై డీడబ్ల్యూఓ శిరీషను వివరణ కోరగా తాను ఆమెను ఏమీ ఇబ్బంది పెట్టలేదని వివరణ ఇచ్చారు.

205 మందిని వెనక్కి పంపిన అమెరికా

శాన్ ఆంటోనియో నుంచి బయలుదేరిన సైనిక విమానం ● అమెరికాలో చట్టవిరుద్ధంగా 7,25,000 మంది భారతీయులు

వాషింగ్టన్: అక్రమ వలసదారులపై డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అణచివేతను ముమ్మరం చేసింది. 205 మంది భారతీయ వలసదారులతో కూడిన అమెరికా సైనిక విమానం సీ–17 స్థానిక కాలమానం ప్రకారం సోమవారం శాన్ ఆంటోనియో నుంచి భారత్‌కు బయలుదేరింది. విమానం 24 గంటల తరువాత పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకుంటుందని, వెనక్కి పంపే ముందు ప్రతి ఒక్కరినీ పరిశీలించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ విమానం ఇంధనం కోసం జర్మనీలోని రామ్‌స్టీన్‌లో ఆగనుంది. ఈ పరిణామాలను ధ్రువీకరించడానికి యూఎస్ ఎంబసీ నిరాకరించింది.

18వేల మందితో జాబితా..

అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స (ఐసీఈ) దాదాపు 18,000 మంది డాక్యుమెంట్లు లేని భారతీయ పౌరుల తొలి జాబితాను రూపొందించింది. టెక్సాస్‌లోని ఎల్‌పాసో, కాలిఫోర్నియాలోని శాన్‌డియాగో నుంచి 5,000 మందికి పైగా వలసదారులను బహిష్కరించాలని నిర్ణయించినట్లు పెంటగాన్ ప్రకటించింది. ప్యూ రీసెర్చ్ సెంటర్ డేటా ప్రకారం, 725,000 మంది భారతీయులు అక్రమంగా అమెరికాలో నివసిస్తున్నారు, మెక్సికో, ఎల్ సాల్వడార్ తరువాత అనధికారిక వలసదారుల జనాభాలో భారత్ మూడోస్థానంలో ఉంది. డాక్యుమెంట్లు లేని భారతీయులను చట్టబద్ధంగా తమ దేశానికి తిరిగి తీసుకురావడానికి భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని గత నెలలో న్యూఢిల్లీ తెలిపింది. దీనికి ఏ దేశం మినహాయింపు కాదని, చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉన్నవారిలో భారతీయులు ఉంటే చట్టబద్ధంగా స్వదేశానికి తీసుకు రావడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని జైశంకర్ తెలిపారు. చట్టవిరుద్ధంగా అమెరికాకు వచ్చిన భారతీయ వలసదారులను వెనక్కి రప్పించే విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరైనదే చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ జనవరిలో ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా సైనిక విమానాలు గ్వాటిమాలా, పెరూ, హోండురాస్ దేశాలకు వలసదారులను తరలించాయి. ఇమ్మిగ్రేషన్‌పై తన ఎమర్జెన్సీ డిక్లరేషన్ లో భాగంగా ట్రంప్ గత వారం మిలటరీ బహిష్కరణ విమానాలను ప్రారంభించారు. ఇప్పటివరకు ఆరు విమానాల్లో వలసదారులను లాటిన్ అమెరికాకు విమానాల్లో పంపారు. అందులో రెండో సి –17 కార్గో విమానాల ల్యాండింగ్‌కు కొలంబియా నిరాకరించింది. దీంతో నాలుగు మాత్రమే గ్వాటిమాలాలో ల్యాండ్ అయ్యాయి.


ప్రతీకాత్మక చిత్రం

ముహూర్తం కోసం చూస్తున్నారా?

● విదేశీయులను ఎందుకు వెనక్కి పంపడం లేదు?
● అస్సాం ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: అస్సాంలోకి అక్రమంగా ప్రవేశించిన విదేశీయులను ఇంకా బయటకు పంపించకపోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏదైనా ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారా? అని అస్సాం ప్రభుత్వంపై మండిపడింది. ప్రభుత్వం అసలు నిజాలు బయటపెట్టడం లేదని ఆక్షేపించింది. అస్సాంలోని నిర్బంధ కేంద్రాల్లో సుదీర్ఘకాలంగా ఉంటున్న బంగ్లాదేశ్ పౌరులను వారి స్వదేశానికి పంపించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. విదేశీయులుగా నిర్ధారించినవారిని నిర్బంధ కేంద్రాల్లో ఎక్కువ కాలం ఉంచడం సరైంది కాదని స్పష్టంచేసింది. వారి చిరునామాలు తెలియవని, అందుకే పంపించడం లేదని ప్రభుత్వం చెప్పడం పట్ల ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తంచేసింది. అది తమకు సంబంధం లేని విషయమని, బంగ్లాదేశ్ పౌరులను వారి సొంత దేశానికి పంపించాల్సిందేనని పేర్కొంది. చిరునామా తెలియకపోయినా వెనక్కి పంపించవచ్చని తెలియజేసింది. తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది.

రాజ్యాంగాన్ని అర్థం చేసుకోలేరు

విపక్ష నేతలు అర్బన్ నక్సలైట్ల భాష మాట్లాడుతున్నారు

● లోక్‌సభలో రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం
● తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడం మాకు అలవాటు లేదు
● ప్రజల సొమ్ముతో అద్దాలమేడ నిర్మించుకోలేదు.. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చాం..
● రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు మోదీ సమాధానం



న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేతలు బహిరంగంగా అర్బన్ నక్సలైట్ల భాష మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంపై యుద్ధం ప్రకటించిన వ్యక్తులు మన రాజ్యాంగాన్ని, దేశ ఐక్యతను ఏనాడూ అర్థం చేసుకోలేరని అన్నారు. కొన్ని పార్టీలు (ఆమ్ ఆద్మీ పార్టీ) యువత భవిష్యత్తుకు ఆపదగా మారాయని విమర్శించారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలతో ఎంతో ప్రజాధనం ఆదా అయ్యిందని పేర్కొన్నారు. జనం సొమ్ముతో తాము అద్దాల మేడలు కట్టుకోలేదని స్పష్టంచేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై పరోక్షంగా మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చకు ప్రధాని మోదీ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల తీరును ఎండగట్టారు. పేదల గుడిసెల్లోకి వెళ్లి ఫొటో సెషన్లు పెట్టుకొని సంబరపడే కొందరు నాయకులు అదే పేదల గురించి పార్లమెంట్‌లో మాట్లాడడం నీరసమైన వ్యవహారంగా భావిస్తున్నారని విమర్శించారు. జేబుల్లో రాజ్యాంగం పెట్టుకొని తిరిగేవారికి మన దేశంలో ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు కళ్లకు కనిపించడం లేదని మండిపడ్డారు. ముస్లిం సోదరీమణులకు హక్కులు కల్పించడానికి ట్రిపుల్ తలాఖ్ చట్టం తీసుకొచ్చామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

మా పాలనలోనే గరీబీ హఠావో..

తప్పుడు హామీలు ఇవ్వడం, ప్రజలను మభ్యపెట్టడం మాకు అలవాటు లేదు. అభివృద్ధి చేసి చూపించడమే మాకు తెలుసు. గరీబీ హఠావో నినాదం ఐదు దశాబ్దాలపాటు వినిపించింది. కానీ, జరిగిందేమీ లేదు. మేము అధికారంలోకి వచ్చాక పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదలకు 4 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చాం. 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. కేవలం ఐదేళ్లలో 12 కోట్ల కుటుంబాలకు కుళాయి నీటి సౌకర్యం కల్పించాం. పేదల కష్టాలు ఏమిటో మాకు తెలుసు. ఎందుకంటే మేము స్వయంగా పేదరికం అనుభవించాం. నిరుపేదల అగచాట్లు, సామాన్య ప్రజల బాధలు అర్థం చేసుకోవాలంటే స్పందించే హృదయం ఉండాలి. అది కొందరు నాయకులకు లేదు. రాజ్యాంగం నిర్దేశించినట్లు నడుచుకుంటున్నాం. రాజ్యాంగమే మాకు స్ఫూర్తి. విషపూరిత రాజకీయాలను నమ్ముకోవడం లేదు. 21వ శతాబ్దం కోసం సిద్ధం కావాలంటూ పదే పదే నినదించిన ఓ ప్రధానమంత్రి(రాజీవ్ గాంధీ) 20వ శతాబ్దపు అవసరాలను సైతం తీర్చలేకపోయారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉందని కొందరు వ్యక్తులు(సోనియా గాంధీ) విమర్శించడం దారుణం. దేశ ప్రథమ పౌరురాలిని, పేద కుటుంబం నుంచి వచ్చిన ఒక మహిళను కించపర్చడం సహించరానిది. రాజకీయంగా మీరు నిరాశలో ఉండొచ్చు. అంతమాత్రాన రాష్ట్రపతిని అవమానించాలా? ఇదెక్కడి పద్ధతి? మన దేశంలో ఏదైనా ఎస్సీ లేదా ఎస్టీ కుటుంబం నుంచి ఒకేసారి ముగ్గురు ఎంపీలైన సందర్భాలు ఉన్నాయా? పేదల సంక్షేమం గురించి కొందరు మాట్లాడుతున్నారు. వారి మాటలకు, చేతలకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటోంది. అది భూమికీ, ఆకాశానికి.. చీకటికి, వెలుతురు మధ్యన ఉన్నంత వ్యత్యాసం.

ప్రజలకు రూ.40 లక్షల కోట్లు బదిలీ

కొందరు నాయకులు(అరవింద్ కేజ్రీవాల్) వారి ఖరీదైన ఇళ్లల్లో స్టైల్‌గా ఉండే నీటి షవర్లు, వేడినీటి ఈత కొలనులు ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెడితే మేము ప్రతి ఇంటికీ నీరు అందించడంపై దృష్టి పెట్టాం. కొందరు ప్రజల సొమ్ముతో అద్దాల మేడ కట్టుకుంటే మేము పేదలకు ఇళ్లు ఇచ్చాం. పదేళ్ల క్రితం దాకా పత్రికల్లో కుంభకోణాలు, అవినీతిపై నిత్యం వార్తలు కనిపించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 2014 నుంచి రూ.లక్షల కోట్లు ఆదా చేశాం. సంక్షేమ పథకాల విషయంలో 10 కోట్ల మంది నకిలీ లబ్ధిదారులను ఏరిపారేశాం. దాంతో రూ.3 లక్షల కోట్లు ఆదా చేశాం. ప్రజల డబ్బును దేశ నిర్మాణం కోసమే ఖర్చుపెడుతున్నాం. వివిధ పథకాల కింద రూ.40 లక్షల కోట్లను నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశాం.

కులం గురించి మాట్లాడడం ఫ్యాషనైపోయింది

మా ప్రభుత్వం ఇటీవల అద్భుతమైన బడ్జెట్ ప్రవేశపెట్టింది. మా ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.2 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఉండేది కాదు. ప్రస్తుతం ఆ పరిమితిని రూ.12 లక్షలకు పెంచాం. పేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభించాం. కానీ, కొన్ని రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేయడం లేదు. దీనివల్ల పేదలు ఎన్నో కష్టాలు పడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నాం. ప్రతి రంగంలోనూ వారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నాం. కులం గురించి మాట్లాడడం కొందరికి ఫ్యాషనైపోయింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల కోసం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను భారీగా పెంచాం. వేలాది సీట్లు వారికి అందుబాటులోకి వచ్చాయి. మా ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీల సంఖ్య 387 నుంచి 780కి చేరింది'' అని ప్రధాని మోదీ వివరించారు.

నేడు మహాకుంభ మేళాకు మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు ప్రధాని మోదీ 5న హాజరవుతున్నారు. ఈ మేరకు మంగళవారం ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ప్రయాగ్ రాజ్‌కు చేరుకుంటారు. ఉదయం 11 గంటల సమయంలో త్రివేణి సంగమంలో మోదీ స్నానమాచరించి, గంగాదేవికి పూజలు చేస్తారు. జనవరి 13న మొదలైన మహాకుంభ మేళా ఈ నెల 26న మహా శివరాత్రి రోజున ముగియనుంది.


ఘటన జరిగిన రిస్‌బెర్గ్‌స్కా క్యాంపస్ వద్ద భద్రతా సిబ్బంది, ఎమర్జెన్సీ బృందం

స్వీడన్‌లో కాల్పులు.. 10 మంది మృతి

ఒరెబ్రో: ప్రశాంత వాతావరణానికి మారుపేరైన స్వీడన్‌లో కాల్పులు కలకలం రేపాయి. రాజధాని స్టాక్‌హోంకు 200 కిలోమీటర్ల దూరంలోని ఒరెబ్రోలో జరిగిన కాల్పుల ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. నగర శివార్లలోని రిస్‌బెర్గ్‌స్కా వయోజన విద్యా కేంద్రం క్యాంపస్‌లో మంగళవారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. ఇక్కడ ప్రైమరీ, అప్పర్ సెకండరీ స్కూళ్లు ఉన్నాయి. ఇక్కడే వలసదారులకు స్వీడిష్ బోధిస్తారు. తరగతులు ముగియడంతో చాలా మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారని, కాల్పుల సమయంలో అక్కడ కొద్ది మంది మాత్రమే ఉన్నట్లు సమాచారం. మృతుల్లో కాల్పులకు తెగబడిన వ్యక్తి కూడా ఉన్నాడు. అతడొక్కడే ఈ దారుణానికి పాల్పడినట్లుగా భావించడం లేదని పోలీసులు తెలిపారు. దుండగుడిని గుర్తించాల్సి ఉందన్నారు. గాయాలతో చికిత్స పొందుతున్న వారి సంఖ్యను పోలీసులు వెల్లడించలేదు. ఘటన ప్రాంతంలో భీతావహ పరిస్థితిని బట్టి చూస్తే మరణాల సంఖ్యను కచ్చితంగా చెప్పలేమని ఓ అధికారి చెప్పడం గమనార్హం. దారుణానికి దారి తీసిన కారణాలపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు చెప్పారు. ప్రస్తుతానికైతే ఉగ్ర లింకులున్నట్లు చెప్పలేమన్నారు. అధికారులు మృతులను గుర్తించే పనిలో ఉన్నారు.

డోజ్ బృందంలోకి ఆకాశ్ బొబ్బ



వాషింగ్టన్: ఎలాన్‌మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) బృందంలోకి మరో భారతీయుడు చేరాడు. డోజ్‌కు ఎంపిక చేసిన ఆరుగురు యువ ఇంజనీర్ల బృందంలో భారత సంతతికి చెందిన ఆకాశ్ బొబ్బ ఉన్నారు. 22 ఏళ్ల ఆకాశ్ బొబ్బ బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో మేనేజ్‌మెంట్, టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌కు హాజరయ్యారు. మెటా, పలంటీర్ సంస్థల్లో ఇంటర్న్‌గా పనిచేశారు. ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బ్రిడ్జ్‌వాటర్ అసోసియేట్స్‌లోనూ కొంత కాలం పనిచేసిన ఆకాశ్.. ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో నిపుణుడు. ప్రభుత్వ యంత్రాంగ ప్రక్షాళన, మితిమీరిన నిబంధనలకు కోత, అనవసర ఖర్చు తగ్గింపు, ఫెడరల్ ఏజెన్సీల పునర్వ్యవస్థీకరణ తదితరాలను డోజ్ పర్యవేక్షించనుంది. డోజ్‌లోకి తొలుత భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిని ట్రంప్ ఎంపిక చేశారు. ఒహాయో గవర్నర్‌గా పోటీ చేయడం కోసం వివేక్ రామస్వామి డోజ్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎలాన్ మస్క్ ఒక్కరి నేతృత్వంలోనే ఉన్న డోజ్‌లోకి కొత్తగా ఈ ఆరుగురు యువ ఇంజనీర్లను తీసుకున్నారు.

'కుంభమేళా' మృతుల సంఖ్యను దాచిపెడుతున్నారు

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం
ఇప్పటికైనా నిజాలు బయటపెట్టాలని డిమాండ్

న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళాలో జరిగిన తొక్కిసలాటలో చాలామంది చనిపోయారని, వారి సంఖ్యను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దాచిపెడుతోందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మృతుల సంఖ్యపై ఇప్పటికైనా నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో మాట్లాడారు. కుంభమేళాను సక్రమంగా నిర్వహించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని అన్నారు. అక్కడ జరిగిన వైఫల్యాల సంగతి బయటకు రాకుండా తొక్కిపెడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిజిటల్ కుంభమేళా నిర్వహిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం మృతుల సంఖ్యను మాత్రం బయటపెట్టడం లేదని మండిపడ్డారు. 'బడ్జెట్ సంఖ్యల గురించి గొప్పలు చెప్పుకోవడం కాదు కుంభమేళా తొక్కిసలాట మృతుల లెక్కలు చెప్పండి' అని అఖిలేశ్ యాదవ్ నిలదీశారు. ఒకవైపు మృతదేహాలు మార్చురీలో ఉంటే, మరోవైపు కుంభమేళా జరుగుతున్న ప్రాంతంపై హెలికాప్టర్ ద్వారా పూలు చల్లారని, ఇదెక్కడి సనాతన సంప్రదాయమని ధ్వజమెత్తారు. జేసీబీలతో మృతదేహాలను నదిలోకి నెట్టేశారని ఆరోపించారు. కుంభమేళాలో ఎంతోమంది భక్తులు చనిపోతే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కనీసం విచారం వ్యక్తం చేయలేదని విమర్శించారు. కుంభమేళా ఏర్పాట్లపై చర్చించడానికి అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. కుంభమేళాలో భద్రతా ఏర్పాట్లు చూసే బాధ్యతను సైన్యానికి అప్పగించాలని సూచించారు.



భూటాన్ రాజు పుణ్య స్నానం

మహాకుంభ్ నగర్: భూటాన్ రాజు జింగ్మే ఖేసర్ నంగ్యాల్ వాంగ్‌చుక్ మంగళవారం మహాకుంభ్ నగర్‌ను సందర్శించారు. త్రివేణీ సంగంలో పుణ్య స్నానం చేశారు. ఆయన వెంట యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. అంతకుమునుపు వీరు సూర్య భగవానునికి అర్ఘ్యం సమర్పణ తదితర పూజలు చేశారు. భూటాన్ సంప్రదాయ దుస్తుల్లో విమానాశ్రయంలో ల్యాండైన వాంగ్‌చుక్ కాషాయ రంగు కుర్తాపైజామా ధరించి పుణ్యస్నానాల్లో పాల్గొన్నారు. వాంగ్‌చుక్, యోగితోపాటు సతువా బాబాగా అందరూ పిలిచే జగద్గురు సంతోష్ దాస్ మహారాజ్ కూడా ఉన్నారు. అనంతరం భూటాన్ రాజు అక్షయ్‌వత్, బడే హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. డిజిటల్ మహా కుంభ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కూడా సందర్శించారు. వాంగ్‌చుక్ సోమవారం థింపూ నుంచి లక్నోకు చేరుకున్నారు.


అదేమంత పెద్ద ప్రమాదం కాదు

కుంభమేళాలో తొక్కిసలాటపై ఎంపీ హేమమాలిని

న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా సందర్భంగా జనవరి 29న జరిగిన దుర్ఘటనపై బీజేపీ ఎంపీ హేమ మాలిని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అదేమంత పెద్ద ఘటన కాకున్నా, పెద్దదిగా చూపారని పేర్కొన్నారు. మొత్తమ్మీద కుంభమేళా నిర్వహణ చాలా బాగుందని కితాబిచ్చారు. అప్పటి ఘటనలో కనీసం 30 మంది చనిపోగా 60 మందికి పైగా గాయపడినట్లు యంత్రాంగం ప్రకటించింది. హేమ మాలిని మంగళవారం పార్లమెంట్ సముదాయంలో మీడియాతో మాట్లా డారు. 'కుంభమేళాకు మేం వెళ్లాం. చక్కగా స్నానాలు చేశాం. అదే రోజు తొక్కిసలాట చోటుచేసుకుంది. అది అంత పెద్ద ఘటన అని నాకు తెలియదు. కానీ, దానిని పెద్దగా చూపారు. చాలా మంది వస్తున్నారు. అంతమందిని అదుపు చేయడం చాలా కష్టం..అయినప్పటికీ నిర్వహణ అంతా చాలా బాగుంది'అంటూ వ్యాఖ్యానించారు. తొక్కిసలాట మరణాలపై ప్రతిపక్షాల విమర్శలపై ఆమె.. అబద్ధాలు చెప్పడమే ప్రతిపక్షాల పని అంటూ ఆరోపించారు.

నిజాయితీగా, నిక్కచ్చిగా సోర్స్ కోడ్!

బిల్ గేట్స్ ఆత్మకథ



న్యూఢిల్లీ: అపర కోటీశ్వరుడు, తిరుగులేని విజయం సాధించిన కార్పొరేట్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్(70) స్వీయ చరిత్ర 'సోర్స్ కోడ్–మై బిగినింగ్స్'మంగళవారం అమెరికా మార్కెట్‌లోకి విడుదలైంది. మైక్రోసాఫ్ట్ కంపెనీ స్థాపించి 50 ఏళ్లవుతోంది. అదేవిధంగా, తన తండ్రి శత జయంతి సంవత్సరం. ఈ సందర్భాన తన ఎదుగుదలకు కారణమైన తల్లిదండ్రులు, బాల్య స్నేహితుల గురించీ చెప్పాలనిపించినట్లు ఒక సందర్భంలో ఆయనే చెప్పారు. తన సమకాలికులతో పోలిస్తే బిల్ గేట్స్ ఎప్పుడూ కొన్ని దశాబ్దాలకు ముందు వెళ్లి ఆలోచిస్తారని చాలా మంది అంటుంటారు. అటువంటిది, ఆత్మ కథ కోసం ఆయన కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్లారు. ఒక మనిషి ఎదుగుదల లేదా పతనాలకు కుటుంబం ప్రభావం ఎలా ఉంటుందో గేట్స్ ఈ పుస్తకంలో వివరించారు.తన స్వీయ రేఖా చిత్రం తాలూకూ స్కెచ్ ఎంతో శ్రద్ధగా గీసి, దానికి అవసరమైన రంగులద్ది ఎంతో ప్రతిభావంతంగా రూపొందించిన పెయింటింగ్‌లా ఉంది ఈ స్వీయచరిత్ర. తన తండ్రి గేట్స్ సీనియర్ కుటుంబం, సమాజం అంటే ఎంతో నిబద్ధతతో ఉండేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. పిల్లలంటే ఎంతో దయతో ప్రేమతో వ్యవహరించేవారని చెప్పారు. ఆయనకు ఒకే ఒకసారి బాగా కోపం వచ్చిందట. అది కూడా తన లోపమేనంటారు బిల్ గేట్స్. డైనింగ్ టేబుల్ దగ్గర ఏదో విషయమై మూర్ఖంగా వాదించేసరికి ఉండబట్టలేక ఆయన గ్లాసులో ఉన్న నీటిని బిల్ గేట్స్‌పై ముఖంపై చిమ్మారట. వెంటనే 'థాంక్స్ ఫర్ ది షవర్స్'అంటూ బిల్ అక్కడి నుంచి వెళ్లిపోయారట. ఈ ఘటనను గుర్తు చేసుకుంటూ ఎప్పుడూ శాంతంగా ఉండే తన తండ్రి తన ప్రవర్తన ద్వారా సహనం కోల్పోయేలా చేశానని బిల్ రాశారు. ఎక్కడికి వెళ్లినా పెద్ద వాళ్లతో చొరవగా మాట్లాడటం, వారిని ప్రశ్నలతో వేధించడం, సంతృప్తి కరమైన జవాబు వచ్చే వరకు ప్రశ్నల పరంపరను కొనసాగించడం అలవాటైందని, జీవితంలో ఎదుగుదలకు అది ఎంతగానో తోడ్పడిందని ఆయన చెప్పుకున్నారు.

నేడే హస్తిన సమరం

● ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు పూర్తయిన ఏర్పాట్లు
● ఓటు హక్కు వినియోగించుకోనున్న 1.56 కోట్ల మంది
● ఈ నెల 8న ఓట్ల లెక్కింపు

2020లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు (మొత్తం స్థానాలు 70)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
ఆప్	62	53.57
బీజేపీ	8	38.51
కాంగ్రెస్	0	4.26

న్యూఢిల్లీ: అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. 1.56 కోట్ల మంది ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. ఎన్నికల సంఘం అధికారులు మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 13,766 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 3,000 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈసారి 699 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 220 కంపెనీల పారామిలటరీ బలగాలను, 35,626 మంది ఢిల్లీ పోలీసు సిబ్బంది, 19,000 మంది హోంగార్డులను మోహరించారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియనుంది. ఢిల్లీ ఎన్నికల్లో ఈసారి ఎన్నికల సంఘం వినూత్న ప్రయత్నం చేస్తోంది. క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్(క్యూఎంఎస్) యాప్‌ను తీసుకొచ్చింది. ఏయే పోలింగ్ కేంద్రాల్లో ఎంతమంది ఓటర్లు బారులు తీరి ఉన్నారో దీనిద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. జనం తక్కువగా ఉన్న సమయంలో వెళ్లి ఓటు వేయొచ్చు. అలాగే వృద్ధులు, దివ్యాంగుల కోసం 733 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికల్లో ఇప్పటికే 6,980 మంది ఇంటి నుంచి ఓటు వేశారు. ఈ నెల 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

ఆప్, బీజేపీ మధ్యే ప్రధాన పోరు

దేశ రాజధానిలో వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆరాట పడుతుండగా, పూర్వవైభవం సాధించాలని బీజేపీ తహతహలాడుతోంది. కాంగ్రెస్ సైతం అధికారం కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ప్రధానమైన పోటీ ఆప్, బీజేపీ మధ్యే కేంద్రీకృతమైంది. ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పోటీపడి మరీ హామీలు గుప్పించాయి. ప్రజలు ఎవరిని విశ్వసించారో మరో నాలుగు రోజుల్లో తేలిపోనుంది. ఓటింగ్ శాతం సైతం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఓటింగ్ శాతం భారీగా నమోదైతే ఆమ్ ఆద్మీ పార్టీ లాభపడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీజేపీ అభ్యర్థుల విజయం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు. ఆ పార్టీ అగ్రనేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఆప్ తరఫున పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం హోరెత్తించారు. కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా రంగంలోకి దిగారు. కేజ్రీవాల్ నిర్మించుకున్న అద్దాల మేడ, యమునా నది కాలుష్యం, ఓట్ల తొలగింపు వంటి అంశాలను పార్టీలు ప్రత్యేకంగా ప్రస్తావించాయి. పదేళ్ల పాలనలో తాము చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందని ఆప్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆప్ అవినీతి పాలన పట్ల ఢిల్లీ ఓటర్లు విసుగెత్తిపోయారని, డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, తాము అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ పెద్దలు తేల్చిచెబుతున్నారు.

అమెరికాపై చైనా ప్రతీకార సుంకాలు

● అమెరికా బొగ్గు, ఎల్ఎన్‌జీలపై 15 శాతం
● ముడిచమురు, ఇతరత్రా వాటిపై 10 శాతం సుంకాలు

హాంకాంగ్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాతో మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. అమెరికా సుంకాలపై చైనా ప్రతీకార చర్యలను చేపట్టింది. బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై 15% పన్నును, ముడి చమురు, వ్యవసాయ యంత్రాలు, పెద్ద వాహనాలు, పికప్ ట్రక్కులపై 10% సుంకాన్ని విధించింది. ఈ చర్యలు ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. అంతేకాదు.. రెండు డజన్లకు పైగా లోహ ఉత్పత్తులు, సంబంధిత సాంకేతికతలపై సుంకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ, చైనా కస్టమ్స్ అడ్మినిస్ట్రేషన్ ప్రకటించింది. పారిశ్రామిక, రక్షణ రంగాల్లో ఉపయోగించే కీలక ఖనిజమైన టంగ్‌స్టన్, సోలార్ సెల్స్ తయారీకి ఉపయోగించే టెల్లూరియం కూడా ఇందులో ఉన్నాయి. అమెరికాకు చైనా దిగుమతులపై డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 10 శాతం సుంకం శనివారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో చైనా నుంచి ఈ ప్రకటనలు వెలువడ్డాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)కు ఫిర్యాదు చేయడం ద్వారా తమ హక్కులను కాపాడుకుంటామని, అందుకు తగిన ప్రతిచర్యలు తీసుకుంటామని చైనా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా ఏకపక్షంగా సుంకాలు పెంచడం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనంది. అమెరికా సుంకాలు.. సమస్యలను పరిష్కరించకపోవడమే కాక, చైనా–అమెరికా మధ్య సాధారణ ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని కూడా దెబ్బతీస్తుందని చైనా అధికారిక ప్రకటన పేర్కొంది. సుంకాలతో ఆగని చైనా అమెరికాపై ప్రతీకారంగా టెక్ దిగ్గజం గూగుల్‌పై యాంటీ ట్రస్ట్ ఉల్లంఘనపై దర్యాప్తు చేస్తామని ప్రకటించింది. దర్యాప్తునకు సంబంధించిన మరిన్ని వివరాలను పేర్కొనలేదు.

సాక్షి హైదరాబాద్

బుధవారం ౹ 5 ౹ ఫిబ్రవరి ౹ 2025



కూల్ జర్నీ

వేసవిలో నగరవాసులకు చల్లటి ప్రయాణ సదుపాయాన్ని అందజేసేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. సుమారు 100కు పైగా ఏసీ బస్సులను ప్రవేశపెట్టనుంది. -8లో



మామిడి సీజన్.. బాటసింగారంలోనే

మామిడి సీజన్ ఈ ఏడాది కూడా బాటసింగారంలోనే నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్కెట్‌లో ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/19.0

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పూట పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 34, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



ఆఫ్రికా అతిథులు!

నగరంలోని నెహ్రూ జూ పార్కులో విదేశీ అతిథులు సందడి చేయనున్నాయి. అరుదైన వన్య ప్రాణులు త్వరలోనే ఇక్కడ అడుగిడనున్నాయి. జంతు మార్పిడిలో భాగంగా వీటిని ఇక్కడికి తీసుకురానున్నారు. సుమారు 16 దేశాల నుంచి తెల్ల సింహం, జీబ్రాలు, పులులు తదితర జంతువులను జూ అధికారులు రప్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆఫ్రికా నుంచి రానున్న ఈ చింపాంజీలు అలరించనున్నాయి. - వివరాలు సిటీప్లస్‌లో▸



దాహార్తి తీరేలా..

గండిపేట నుంచి మరో పైపులైన్

ఇప్పటికే 18 నుంచి 22 ఎంజీడీల నీటి తరలింపు

- కాండూట్ లీకేజీలతో సగానికిపైగా మధ్యలోనే వృథా
- ఒకవైపు మరమ్మతులు.. మరోవైపు రెండో పైపులైన్
- అదనపు జలాల తరలింపునకు ప్రభుత్వం పచ్చజెండా
- సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు జలమండలి కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: శతాబ్ద కాలంగా నగర దాహార్తి తీరుస్తున్న గండిపేట (ఉస్మాన్‌సాగర్) నుంచి మరో పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని తరలించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. నగరం నలుదిక్కులా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు మరింత పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జంట జలాశయాలతో పాటు కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూర్ ప్రాజెక్టుల నీటిని తరలిస్తున్నా.. అవి సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో అందుబాటులో ఉన్న వనరుల నుంచి మరిన్ని జలాలను మహా నగరానికి తరలించేందుకు జలమండలి ప్రణాళిక రూపొందిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ రిజర్వాయర్ వరకు మరో పైపులైన్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ వేగిరం చేసింది. ఇప్పటికే గండిపేట నుంచి కాండూట్ లైన్ ద్వారా తరలిస్తున్న జలాలు మార్గమధ్యలో లీకేజీల కారణంగా సగానికిపై వృథా అవుతున్నాయి. ఒకవైపు కాండూట్ లైన్‌కు మరమ్మతులు చేస్తున్న జలమండలి.. తాజాగా దాని సమాంతరంగా కింద భాగంలో పైపులైన్ వేసేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పన కోసం కసరత్తు చేస్తోంది.

14.5 కి.మీ వరకు కాండూట్

గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ వరకు నీటిని తరలించేందుకు సుమారు 14.5 కి.మీల వరకు నేచురల్ స్లోప్‌తో రాతి కాలువ (కాండూట్)ను నిర్మించారు. తరలించిన నీటి శుద్ధి కోసం సుమారు 25 ఎంజీడీ సామర్థ్యమున్న ఫిల్టర్ బెడ్స్‌ను ఆసిఫ్‌నగర్‌లో నిర్మించారు. గండిపేట నుంచి కోకాపేట, నార్సింగి, మణికొండ, టోలిచౌకి, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు నిర్మించిన కాలువ ద్వారానే ఇప్పటి వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. దీన్ని వారసత్వ కట్టడంగా కూడా గుర్తించారు. గండిపేట జలాశయం పరిధిలోకి వచ్చే జీఓ 111 నిబంధనలు ఈ కాండూట్‌కు కూడా వర్తిస్తాయి. ఇక్కడి నుంచి వంద మీటర్లు ఇటూ.. అటూ ఎవరూ నిర్మాణాలు చేయకూడదని నిబంధన ఉంది.

సగానికిపైగా నీటి వృథా

గండిపేట నుంచి కాంటూన్ ద్వారా నగరానికి తలిస్తున్న నీటిలో సగం నీరు వృథా అవుతోంది. వాస్తవానికి ఈ జలాశయం నుంచి సుమారు 26 ఎంజీడీలకుపైగా తాగునీరు తరలించే అవకాశం ఉంది. ప్రస్తుతం మహానగరానికి ప్రతి నిత్యం సుమారు 20 నుంచి 22 ఎంజీడీల నీరు తరలిస్తుండగా.. కాండూట్‌కు అడుగడుగునా లీకేజీల కారణంగా దాదాపు 8 నుంచి 10 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వరకు ఉన్న సుమారు 14.5 కిలోమీటర్ల పొడవు కాండూట్‌కు దాదాపు 45 ప్రాంతాల్లో లీకేజీ సమస్య ఉంది. నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా జర్మన్ టెక్నాలజీతో లీకేజీల మరమ్మతు పనులు చేస్తున్నారు. దీంతో సుమారు 1 నుంచి 2 ఎంజీడీల నీటి వృథాను అరికట్టగలిగారు.



గండిపేట జలాశయం

గ్రావిటీ ద్వారా..

గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు పైసా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీటి సరఫరా అవుతోంది. ప్రస్తుతం కృష్ణా, గోదావరి జలాలు పంపింగ్ ద్వారా నీటిని తరలిస్తున్నారు. గండిపేట నుంచి మాత్రం కాండూట్ మార్గంలో సుమారు 14.5 కిలోమీటర్లు వరకు నీటి తరలింపు ఎలాంటి పంపింగ్ లేకుండా గ్రావిటీ ద్వారానే కొనసాగుతోంది. ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధి అనంతరం డివిజన్ 3, 4, 5, 6 పరిధిలో వినియోగదారులకు తాగునీటి సరఫరా సాగుతోంది.

నిండు కుండలా ఉండేందుకు..

గత ప్రభుత్వం సెంటిమెంట్‌తో గండిపేట జలాశయం నిండు కుండలా ఉండేందుకు రెండేళ్లు నీటిని నిల్వలను వినియోగించలేదు. వాస్తవంగా నాగార్జునసాగర్ నుంచి మూడు దశల్లో కృష్ణా జలాలు, శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలు, మరోవైపు మంజీరా, సింగూర్ జలాలు తరలిస్తుండటంతో గండిపేట నీటి వినియోగం బాగానే తగ్గింది. గత రెండేళ్ల నుంచి వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా గండిపేట జలాశయం నుంచి నీటి తరలింపు పునఃప్రారంభమైంది. గండిపేట ఒకసారి జలాశయం భూగర్భ జలాలు, వర్షపు నీటితో నిండిందంటే 17.395 కిలోల లక్షల లీటర్లకు చేరుకుంటుందని అంచనా. వర్షపు నీటి పరిరక్షణ మాన్యువల్ అంచనా ప్రకారం 100 చదరపు మీటర్ల పోరస్ భూమిలో వార్షిక వర్షపాతం 800 మి.మీ ఉంటే సంవత్సరానికి 80,000 లీటర్ల నీటి లభ్యత ఉంటుంది. ఉస్మాన్‌సాగర్ జలాశయం నీటితో నిండి ఉంటే నగరంలోని ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్‌లోని పశ్చిమ భాగాలలోనూ భూగర్భ జలమట్టం పెరిగే అవకాశాలుంటాయి. జలాశయం ఎండిపోతే మాత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పడిపోవడం ఖాయమని నిపుణులు పేర్కొంటున్నారు.




నేత్రపర్వం.. పెద్దమ్మ తల్లి రథోత్సవం



రంగు రంగుల విద్యుద్దీపాల కాంతులు.. డప్పు చప్పుళ్లు.. కళాకారుల నృత్యాల నడుమ జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి రథం నేత్రపర్వంగా సాగింది. వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవారి రథ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. - బంజారాహిల్స్

రూలంటే .. రూలే!



కమిషనర్ పేషీ వద్ద..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి.. తనను కలిసేందుకు వచ్చేవారికి నిబంధనలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే తన పేషీలో పోలీసులు.. జీహెచ్ఎంసీ రెండు ప్రధాన ద్వారాల వద్ద సందర్శకుల రాకపోకలు తెలిసేలా టీవీలు ఏర్పాటు చేసిన కమిషనర్.. సాధారణ సందర్శకులకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య వచ్చేవారికి అవకాశం కల్పిస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు సైతం ప్రత్యేక సమయం కేటాయించారు. ప్రజాప్రతినిధులు కలిసేందుకు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకని పేర్కొంటూ కమిషనర్ పేషీలో అంటించారు. సాధారణ ప్రజలు నేరుగా రాకుండా తొలుత పేషీలోకి వెళ్లే ముందే కౌంటర్‌లో ఉండే కంప్యూటర్ ఆపరేటర్ వద్ద తమ పేరు, వివరాలు, ఎందుకొచ్చిందీ వంటి వివరాలు వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలి. నమోదు కాగానే వారి ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని చూపించి కమిషనర్‌ను కలిసేలా ఏర్పాట్లు చేశారు. నిర్ణీత సమయంలోగా వచ్చి నమోదు చేయించుకున్న వారందరికీ.. తనను కలిసేందుకు అవకాశం ఇస్తున్నట్లు జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి.

25న స్టాండింగ్ కమిటీ ఎన్నిక

నేడు నోటిఫికేషన్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి 15 మంది సభ్యుల ఎన్నిక ఈ నెల 25న జరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఎన్నిక షెడ్యూలు విడుదల చేశారు. ప్రస్తుతం పాలకమండలిలో సభ్యులుగా ఉన్న 146 మంది వార్డు సభ్యులు (కార్పొరేటర్లు) స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. షెడ్యూలు ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

ఎన్నిక నోటిఫికేషన్: 5-2-2025


- **నామినేషన్ల స్వీకరణ:** ఫిబ్రవరి 10 నుంచి 17వ తేదీ వరకు. 16 తేదీ ఆదివారం మినహా మిగతా అన్ని రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు.
- **నామినేషన్లు స్వీకరించే స్థలం:** సెక్రటరీ కార్యాలయం, జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయం.
- **నామినేషన్ల జాబితా వెల్లడి:** 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత.
- **నామినేషన్ల పరిశీలన:** 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి.
- **అర్హుల తుది జాబితా:** 18న పరిశీలన పూర్తయ్యాక.
- **నామినేషన్ల ఉపసంహరణ గడువు:** 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు.
- **పోటీలో మిగిలిన అభ్యర్థుల జాబితా:** 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత.
- **ఎన్నిక:** 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు.

ఎన్నిక జరిగే ప్రదేశం: కమిషనర్ కార్యాలయం.

- **ఓట్ల లెక్కింపు:** 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత.
- **ఫలితం వెల్లడి:** ఓట్ల లెక్కింపు పూర్తికాగానే.

రసవత్తరం.. బరిలో ఎవరో?

- ఈసారి స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక రసవత్తరంగా మారనుంది. ప్రస్తుత పాలకమండలి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ బీఆర్ఎస్-ఎంఐఎం మైత్రీబంధంతో స్టాండింగ్ కమిటీకి నామినేషన్లు దాఖలు చేశారు. పోటీ లేకుండా ఏకగ్రీవంగానే ఎన్నికలు జరిగాయి. పాలకమండలి ఎన్నికలప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటం, కార్పొరేటర్లు సైతం బీఆర్ఎస్ నుంచి ఎక్కువమంది గెలవడం తెలిసిందే. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం రెండు సీట్లు.. తర్వాత ఉప ఎన్నికలో ఒక వార్డు గెలుపుతో మూడు స్థానాల్లో మాత్రమే ఉండగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం జీహెచ్ఎంసీలో పార్టీల బలాలు మారాయి.
- బీఆర్ఎస్, బీజేపీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం కాంగ్రెస్ బలం 24గా ఉంది. మరోవైపు గత స్టాండింగ్ కమిటీ ఎన్నికల వరకు బీఆర్ఎస్-ఎంఐఎం మైత్రీ బంధం కొనసాగినప్పటికీ, ప్రస్తుతం ఎంఐఎం కాంగ్రెస్‌తో సఖ్యతగా ఉంటోంది. పలు సందర్భాల్లోనూ ఆ విషయం వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఎంఐఎం ఈసారి బీఆర్ఎస్‌కు మద్దతిచ్చే అవకాశాలుండవని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు బీజేపీ సైతం బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ సర్వసభ్య, బడ్జెట్ సమావేశంలో ఈ అంశం వెల్లడైంది.
- సభలో గందరగోళం జరపుతూ కార్యకలాపాలకు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ సభ్యులందరినీ మార్షల్స్‌తో సభ నుంచి బయటకు పంపాక సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలో ఏయే పార్టీలు పరస్పరం సహకరించుకుంటాయి.. ఏవి మద్దతిస్తాయి.. ? ఎవరు ఎవరికి వ్యతిరేకంగా వ్యవహరించనున్నారనేది ఆసక్తికరంగా మారింది. త్వరలో గడువు ముగియనున్న స్టాండింగ్ కమిటీలో బీఆర్ఎస్ నుంచి ఎనిమిది మంది, ఎంఐఎం నుంచి ఏడుగురుండగా, ఎంఐఎం సభ్యుల్లోని ఎర్రగడ్డ కార్పొరేటర్ షాహీన్‌బేగం మృతి చెందడంతో ఆ సీటు ఖాళీగానే ఉంది.



అబ్బురపడేలా..

జేబీఎస్ మెట్రో హబ్‌పై కసరత్తు

- పీపీపీ పద్ధతిలో మెట్రో టెర్మినల్
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి
- షాపింగ్ మాల్స్ , రెస్టారెంట్లు, కార్యాలయాలు
- మోడల్ మెట్రో స్టేషన్‌గా విస్తరణ
- ప్రణాళికలు రూపొందిస్తున్న హెచ్ఎంఆర్ఎల్



సాక్షి, సిటీబ్యూరో:

జేబీఎస్ మెట్రో స్టేషన్ ప్రపంచస్థాయి మెట్రో హబ్‌గా అవతరించనుంది. సింగపూర్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాల్లోని మెట్రో హబ్‌లకు దీటుగా జేబీఎస్ మెట్రో హబ్‌కు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక్కడ బస్ స్టేషన్‌లు, పార్కింగ్ సదుపాయం, రెస్టారెంట్‌లు, మల్టీప్లెక్స్ థియేటర్‌లు, మాల్స్, కార్యాలయాలు వంటి అన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. కేవలం మెట్రో రైళ్ల రాకపోకలకే పరిమితం కాకుండా చక్కటి షాపింగ్, డైనింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జేబీఎస్ హబ్‌పై దిశానిర్దేశం చేసినట్లు అధికారులు తెలిపారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో జేబీఎస్ మెట్రో హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. మెట్రో రెండో దశలో భాగంగానే సికింద్రాబాద్ నుంచి మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో విస్తరణ చేపట్టనున్నారు. ఈ మేరకు కొద్దిరోజుల క్రితం హెచ్ఏఎంఆర్ఎల్ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఈ రెండు కారిడార్‌లపైనా సీఎం తాజాగా సమీక్షించారు.

లక్షలాది మందికి ప్రయాణ సదుపాయం..

- ప్రతిపాదిత జేబీఎస్ నుంచి మేడ్చల్ (23కి.మీ.), జేబీఎస్ – శామీర్ పేట్ (22 కి.మీ) కారిడార్‌లలో లక్షలాది మంది రాకపోకలు సాగించనున్నారు. ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య కనెక్టివిటీలో జేబీఎస్ కీలకం కానుంది.
- రెండు రూట్లలో హెచ్ఎండీఏ ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్లపై మెట్రో కారిడార్‌లు రానున్నాయి. కానీ.. బేగంపేట విమానాశ్రయ సరిహద్దు వెంట ప్యారడైజ్ నుంచి బోయినపల్లి మధ్య 600 మీటర్ల వరకు భూగర్భ మార్గం రానుంది. దీంతో డబుల్ ఎలివేటెడ్ సాధ్యం కాదు. దీంతో బోయిన్‌పల్లి వద్ద ఎలివేటెడ్ మెట్రో రానుంది.
- ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే వారితోపాటు, సికింద్రాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఈ కారిడార్‌లు కీలకం కానున్నాయి.

అతిపెద్ద ప్రాంగణంగా విస్తరణ..

సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో జేబీఎస్ మెట్రో హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రస్తుతం మెట్రోకు జేబీఎస్ వద్ద అందుబాటులో ఉన్న స్థలంతో పాటు రక్షణ శాఖకు చెందిన భూములను కూడా సేకరించనున్నారు. ప్రస్తుతం నగరంలోని మెట్రోస్టేషన్‌ల పార్కింగ్ సదుపాయాలు అరకొరగా ఉన్నాయి. దీంతో మెట్రోల్లో ప్రయాణం చేయాలని భావించినప్పటికీ.. పార్కింగ్ వసతులు లేకపోవడంతో చాలామంది సొంత వాహనాలనే వినియోగిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో నిర్మించనున్న మెట్రో స్టేషన్‌లను పార్కింగ్ సదుపాయాలతో ప్రత్యేకంగా డిజైన్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు జేబీఎస్ మెట్రో హబ్ వద్ద సెల్లార్‌లో అతిపెద్ద పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాల కోసం రెండంతస్తుల్లో నిర్మించే అవకాశం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్‌స్టేషన్ ఉంటుంది. ప్రయాణికులు బస్సు దిగి నేరుగా మెట్రో స్టేషన్‌కు వెళ్లవచ్చు. దీంతో సీమ్‌లెస్ జర్నీ సదుపాయం లభించనుంది. వివిధ ప్రాంతాల మధ్య లాస్ట్‌మైల్, ఫస్ట్‌మైల్ కనెక్టివిటీకి కూడా పార్కింగ్, బస్‌స్టేషన్ సదుపాయాలు దోహదం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

స్కైవాక్ కనెక్టివిటీ...

జేబీఎస్ మెట్రో హబ్ విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్యారడైజ్, జేబీఎస్ స్టేషన్‌లతో పాటు కొత్తగా మేడ్చల్ కారిడార్ కోసం నిర్మించనున్న స్టేషన్‌ల మధ్య స్కైవాక్ ఏర్పాటు చేస్తారు. దీంతో ప్రయాణికులు అన్ని వైపులా రాకపోకలు సాగించేందుకు అవకాశం లభిస్తుంది. మేడ్చల్, శామీర్‌పేట్‌ల నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 60 కిలోమీటర్ల ప్రయాణ సదుపాయం లభించనుంది. ఈ హబ్ వల్ల నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా సులభంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం లభించనుంది. అన్ని సదుపాయాలతో కూడిన 'అర్బన్ యాక్టివిటీ సెంటర్'గా జేబీఎస్ హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు చెప్పారు. హైదరాబాద్ సాంస్కృతిక జీవితాన్ని ప్రతిబింబించేలా ఉంటుందని పేర్కొన్నారు. రెస్టారెంట్‌లు, మల్టీప్లెక్స్‌లతో పాటు కో- వర్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కొన్ని ఐటీ సంస్థలు మెట్రో స్టేషన్‌లలో ఇలాంటి సదుపాయాలను వినియోగించుకుంటున్నాయి. కార్యాలయాల నిర్వహణ భారం దృష్ట్యా కో-వర్కింగ్ ప్లేస్‌లకు ప్రాధాన్యం ఏర్పడింది.

రాచకొండ ఐటీ సెల్ పనితీరు భేష్

రాచకొండ సీపీ సుధీర్‌బాబు



సాక్షి, సిటీబ్యూరో: సంక్లిష్టమైన కేసులను ఛేదించడంలో రాచకొండ ఐటీ సెల్ కీలక పాత్ర పోషిస్తున్నదని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం సోషల్ మీడియా, సీసీటీఎన్ఎస్, కోర్ టీమ్, సీఐఆర్, ప్రజావాణి ఫిర్యాదుల వంటి పలు విభాగాల పనితీరుపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్య, ఆస్తి తగాదాలు, చైన్ స్నాచింగ్, వాహన, మొబైల్ దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల వంటి పలు కేసులను త్వరితగతిన ఛేదించడంలో సాంకేతికంగా అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. సమర్థవంతమైన పనితీరుతోనే అసలైన నిందితులను వీలైనంత తక్కువ సమయంలోనే పట్టుకోవడం సాధ్యమైందన్నారు. సీసీ టీవీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజల్లో మరింతగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇప్పటికే అమర్చిన కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. నేర శాతాన్ని తగ్గించడానికి రాచకొండ పోలీసులు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను సామాజిక మాధ్యమాల్లో మరింతగా ప్రచారం చేయాలని, కళాశాలల్లో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో ఎంతో ముఖ్యమైన ఐటీ సెల్‌ను సాంకేతికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపెరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఐటీ సెల్ ఏసిపి నరేందర్ గౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పెడ్లర్ అరెస్ట్

56.28 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న పెడ్లర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద 56.28 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ జావేద్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన లక్ష్మణ్ సాంబాజి వృత్తిరీత్యా రైతు కూలి. ట్రైన్ యాక్సిడెంట్‌లో 2006 సంవత్సరంలో ఎడమ చేయి విరిగింది. ఈ క్రమంలో ఈజీ మనీకి అలవాటు పడిన లక్ష్మణ్ గంజాయి రవాణా చేస్తూ డబ్బులు సంపాదించేవాడు. మహారాష్ట్రకు చెందిన మనోరంజన్ దాస్ అనే వ్యక్తితో ట్రిప్‌కు రూ.5 వేల చొప్పున ఒప్పందం కుదుర్చుకొని ఇప్పటికే మూడు సార్లు ఒడిశాలోని ఛత్రాపూర్ నుంచి మహారాష్ట్రలోని పుణేకు అక్రమంగా గంజాయి తరలించాడు. అదే విధంగా ఈ నెల 2వ తేదీన ఛత్రాపూర్ నుంచి పూణేకు గంజాయి తరలించేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ కోచ్‌లో ఎక్కాడు. ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మూడు బ్యాగుల గంజాయిని లక్ష్మణ్‌కు ఇచ్చాడు. ఈ నెల 3న ఉదయం 11.30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లోని ప్లాట్ ఫామ్ నంబర్ 10కి రైలు చేరుకుంది. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా రైల్వే పోలీసులు అనుమానస్పదంగా కనిపిస్తున్న ప్రయాణికుల బ్యాగులు సోదా చేస్తుండగా లక్ష్మణ్ వద్ద సుమారు రూ.14.07 లక్షల విలువగల 56.28 కిలోల గంజాయి లభించింది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకొని పెడ్లర్ లక్ష్మణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ సరస్వత్, ఎస్ఐ రమేష్, ఆర్పీసీ వెంకటేశ్వర్, ఎస్ఐ నజీమా బేగం, శక్తి టీమ్ లావణ్య, వందన సింగ్, మాధురి సింగ్, సుధ పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

హుడాకాంప్లెక్స్: నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయలేరని తెలంగాణ మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ అన్నారు. తెలంగాణ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం సరూర్‌నగర్ పోలీసులు బాలకిషన్‌ను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొందరి కుట్రలకు తలొగ్గి, ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెడుతున్నాయని ఆరోపించారు.

కూల్ జర్నీ

వేసవికి మరిన్ని ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు

- మార్చి నాటికి 100 కొత్త సర్వీసులు
- అద్దె ప్రాతిపదికన తీసుకోనున్న ఆర్టీసీ
- దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణ



సాక్షి, సిటీబ్యూరో: సిటీ బస్ కూల్ జర్నీ.. వేసవిలో నగరవాసులకు చల్లటి ప్రయాణ సదుపాయాన్ని అందజేసేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. మార్చి నాటికి గ్రేటర్‌లో అందుబాటులోకి రానున్న సుమారు 286 ఎలక్ట్రిక్ బస్సుల్లో 100కు పైగా ఏసీ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు 90 ఏసీ మెట్రో లగ్జరీ బస్సులు ఉన్నాయి. సికింద్రాబాద్, కూకట్‌పల్లి, బేగంపేట్, జేబీఎస్ తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా ఈ బస్సులు తిరుగుతున్నాయి. హైటెక్ సిటీ, ఐటీ కారిడార్‌లతో పాటు వివిధ ప్రాంతాల మధ్య నడుస్తున్న ఏసీ బస్సులకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తోంది. దీంతో వేసవిలో మరిన్ని ప్రాంతాలకు ఏసీ బస్సులను విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రిక్ బస్సులతో పాటు మరికొన్నింటిని అద్దె ప్రాతిపదికన తీసుకొని నడిపేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే నగరంలోని వివిధ మార్గాల్లో 254 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయి. హయత్‌నగర్–2 డిపోలో కొత్తగా 45 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టారు.త్వరలో మరో 286 బస్సులను సిటీలో ప్రవేశపెట్టనున్నారు.దీంతో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 530 కి చేరనుంది. దశలవారీగా గ్రేటర్ పరిధిలోని 28 డిపోల్లో డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఎలక్ట్రిక్ అద్దె బస్సులు రానున్నాయి. కాలుష్య, పర్యావరణహిత ప్రజారవాణా సదుపాయంలో భాగంగా కూల్ జర్నీ కూడా అందుబాటులోకి రానుంది.

సిటీలో ఆర్టీసీ

మొత్తం డిపోలు:	28
ప్రస్తుతం బస్సుల సంఖ్య :	2,800 (సుమారు)
ఎలక్ట్రిక్ బస్సులు (ఆర్డినరీ) :	74
మెట్రో ఎక్స్‌ప్రెస్ :	80
మెట్రో లగ్జరీ ఏసీ :	90
ఆర్టీసీ రూట్లు :	1,100 (సుమారు)
ప్రయాణికుల సంఖ్య:	20 లక్షలు

ప్రయాణికుల సంఖ్య పెంచడమే లక్ష్యం..

మహాలక్ష్మి పథకంతో నగరంలో పురుష ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 20 లక్షల మంది సిటీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో 14 లక్షల మంది వరకు మహిళలే ఉన్నట్లు అంచనా. దీంతో ఆర్టీసీకి టికెట్లపై నగదు రూపంలో ఆదాయం లభించడం లేదు. మహిళలకు ఇచ్చే జీరో టికెట్లపై ప్రభుత్వం విడుదల చేసే నిధులు మాత్రమే ఆర్టీసీ ఖాతాలోకి చేరుతున్నాయి. నగదు కొరత కారణంగా రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు సమానంగా మెట్రో డీలక్స్, మెట్రో ఏసీ లగ్జరీ బస్సులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. దీంతో పురుష ప్రయాణికుల సంఖ్య పెరిగి టికెట్ విక్రయాలపై రోజువారీ ఆదాయం వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

కిలోమీటర్‌కు రూ.57 చొప్పున అద్దె..

ఎలక్ట్రిక్ అద్దె బస్సుల నిర్వహణతో ఆర్టీసీకి ఎలాంటి సంబంధం ఉండదు. వాటికి డిపోల్లో చార్జింగ్, మౌలిక సదుపాయాలు కల్పించడం వరకే ఆర్టీసీ పరిమితమవుతుంది. ఎలక్ట్రిక్ ఏసీ, నాన్ ఏసీ బస్సులపై ఆర్టీసీకి వచ్చే ఆదాయంలో కిలోమీటర్‌కు రూ.57 చొప్పున ప్రైవేట్ సంస్థలకు చెల్లిస్తారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం రాష్ట్రాలకు కేంద్రం అందజేసే ఆర్థిక ప్రోత్సాహంలో భాగంగా ఒక్కో బస్సుకు రూ.35 లక్షల సబ్సిడీ లభించనుంది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణకు అవకాశం ఏర్పడింది. వచ్చే మూడేళ్లలో నగరంలో సుమారు 2800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో కనీసం 40 శాతం వరకు ఏసీ బస్సులు ఉండే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం నగరంలోని డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించనున్నారు.

టీమ్ ఇండియా మేనేజర్‌కు సన్మానం



దేవరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది జరుగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి టీమ్ ఇండియా మేనేజర్‌గా నియామకమైన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవరాజ్‌ను మంగళవారం నిజాం క్రికెట్ క్లబ్ సెక్రటరీ మోమిన్‌పటేల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీసీఐకి అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ సీఈవో సునీల్, మీర్జా మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6న ఉదయం 10.30 నుంచి 2.30 గంటల వరకు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని రిటైల్, ఈ కామర్స్, బ్యాంకింగ్, బీపీఓ రంగాల్లో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ డిప్లమా పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్ల లోబడి ఉండాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, శాంతినగర్ మల్లేపల్లిలో హాజరుకావాలన్నారు. వివరాలకు 99634 93453, 90630 99306 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భౌతికశాస్త్రంలో పురస్కారం



హరికుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: భౌతిక శాస్త్రం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా అందజేసే ఉత్తమ పరిశోధన పురస్కారం (2024) నామ హరికుమార్‌ను వరించింది. ప్రస్తుతం ఆయన సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజిక్స్ విభాగం హెచ్ఓడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పరిశోధనా పుర్కసారంతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. 2024లో హరికుమార్ రాసిన వ్యాసాలు స్కోపస్ సైన్స్ ఇండెక్స్ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆయన శ్రమను గుర్తించిన పరిశోధనా సంఘం ఈ పురస్కారాన్ని బహూకరించింది. కుటుంబ సభ్యులు, కళాశాల సిబ్బంది, సహచరులు హరికుమార్‌ను అభినందించారు.

దళారులు దగా చేశారని..

- దంపతులు, కుమారుడి ఆత్మహత్యాయత్నం
- బేగంపేట ప్రకాష్‌నగర్‌లో ఘటన



బాధిత కుటుంబం ఇంటి వద్ద పోలీసులు, బ్యాంక్ అధికారులు



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ భరత్‌భూషణ్, భరత్, అనసూయ

సనత్‌నగర్: ఫైనాన్స్ పేరుతో ఇంటి పత్రాలను తాకట్టు పెట్టుకున్నారు.. యజమానులకు తెలియకుండా ఆ గృహాన్ని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు.. అంతేకాకుండా దానిపై రూ.కోటి రుణం తీసుకున్నారు. వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకర్లు జప్తు చేసేందుకు వచ్చారు. ఈ హఠాత్పరిణామంతో బాధిత కుటుంబ సభ్యులు ముగ్గురూ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం .. బేగంపేట ప్రకాష్ నగర్‌కు చెందిన భరత్ భూషణ్, అనసూయ దంపతులు. వీరు 2019లో తమ కూతురు వివాహం కోసం భానుప్రకాష్, షఫీ అనే ఇద్దరు దళారులను ఆశ్రయించారు. తమ ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లను తాకట్టు పెట్టి మూడు దఫాలుగా రూ.7 లక్షలు తీసుకున్నారు. ఈ క్రమంలో దళారులు భానుప్రకాష్, షఫీ 2019లోనే భరత్ భూషణ్, అనసూయలను కవాడిగూడ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రప్పించారు. అక్కడ దినకర్, రజని దంపతులను వీరికి పరిచయం చేసి.. వీరే మీకు అప్పు ఇచ్చారని, మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ కార్యాలయంలోకి తీసుకువెళ్లారు. ఇంటిని దినకర్, రజని పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఇవేమీ తెలియని బాధితులు వారు చెప్పిన చోటల్లా వేలిముద్రలు వేశారు. అనంతరం నిందితులు సదరు ఇంటిని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో తనఖా పెట్టి రూ.కోటి రుణం తీసుకున్నారు. నిందితులు వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు రెండు మూడుసార్లు నోటీసులు పంపించారు. ఈ నోటీసుల గురించి నిందితులను భరత్‌భూషణ్ ప్రశ్నించగా.. దాంతో మీకు సంబంధం లేదని, అది తమ వ్యక్తిగతమని చెబుతూ వచ్చారు. ఈ క్రమంలోనే మంగళవారం బ్యాంక్ అధికారులు ఇంటిని జప్తు చేయడానికి రావడంతో భరత్ భూషణ్, అనసూయ, వీరి కుమారుడు భరత్ తట్టుకోలేకపోయారు. తమకు చావే శరణ్యమంటూ ఇంట్లోకెళ్లి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని కాపాడారు. న్యాయమూర్తి మూడు రోజుల సమయం కోరడంతో బ్యాంక్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



రోడ్డు ప్రమాదంలో మరణించిన వైద్యుడు



మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉషప్ప

మేడ్చల్ రూరల్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..బోయిన్‌పల్లిలో నివాసం ఉండే ఉషప్ప(40) మరో ఇద్దరు మిత్రులు ఆంజనేయులు, శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై మేడ్చల్ వైపు వస్తుండగా చెక్‌పోస్ట్ వద్ద వీరి బైక్‌ను గుర్తు తెలియని లారీ ఢీ కొట్టింది. దీంతో ఉషప్ప అక్కడికక్కడే మృతి చెందగా ఆంజనేయులు, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ముగ్గురు మేస్త్రీ పని చేస్తుంటారని సమాచారం.

మరో ఘటనలో వైద్యుడి మృతి..

బుల్లెట్ బైక్‌ను కంటైనర్ వెనుక నుండి ఢీ కొట్టడంతో వైద్యుడు మృతి చెందిన ఘటన అత్వెల్లి సమీపంలో చోటుచేసుకుంది. మహబూబాబాద్‌కు చెందిన వైద్యుడు కిరణ్ (28) కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. నగరంలోని పద్మారావునగర్‌లో ఓ మిత్రుడిని కలిసేందుకు కామారెడ్డి నుండి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో రేకుల బావి వద్ద 44వ జాతీయ రహదారిపై వెనుక నుండి వచ్చిన కంటైనర్ ఢీ కొట్టింది. బైక్‌పై ఉన్న కిరణ్ తలకు హెల్మెట్ పెట్టుకున్నప్పటికి తలపై నుండి టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కెమికల్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

చర్లపల్లి పారిశ్రామికవాడలో బూడిదైన ఫ్యాక్టరీ

- మరో మూడు కంపెనీలకు వ్యాపించిన మంటలు
- మూడు గంటలు శ్రమించి మంటలు అదుపు చేసిన ఫైర్ సిబ్బంది
- ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు



ఘటనా స్థలాన్ని సందర్శించిన సీపీ సుధీర్‌బాబు



కంపెనీ నుంచి ఎగసిపడుతున్న మంటలు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో మంగళవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఓ కెమికల్ కంపెనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకోవడంతో మంటల్లో కాలి బూడిదైంది. వివరాల్లోకి వెళ్తే..చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్–1లోని సర్వోదయ కెమికల్స్‌లో వేస్ట్ కెమికల్స్‌ను ప్యూరిఫై చేస్తుంటారు. ఇలా శుద్ధి చేసిన కెమికల్స్‌ను వేలకొద్ది డ్రముల్లో స్టోర్ చేసి ఉంచుతారు. మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో సర్వోదయ కెమికల్స్ నుంచి దట్టమైన పొగలతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వడంతో అప్రమత్తమైన చర్లపల్లి పారిశ్రామికవాడ ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మంటల కాస్తా పక్కనే ఉన్న ఫ్లోరోషీల్డ్ గ్లాస్ లైనింగ్, మహాలక్ష్మి రబ్బర్ కంపెనీలతో పాటుగా నిర్మాణంలో ఉన్న హైటెక్ ఇంజనీరింగ్ కంపెనీకికూడా వ్యాపించాయి. అప్రమత్తమైన ఫైర్ సిబ్బంది అదనపు ఫైర్ ఇంజన్లు రప్పించి మంటలను అదుపు చేశారు. సుమారు 3–4 గంటల పాటుగా శ్రమించి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో కంపెనీలోని ఓ భవనం కూలిపోయినట్లు తెలిసింది. ప్రమాదానికి గంట ముందే కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బంది అంతా తమ విధులు ముగించుకొని వెళ్లినట్లు సమాచారం. దీంతో ప్రాణహాని తప్పిందంటున్నారు. అగ్నిప్రమాదం జరిగిన నాలుగు కంపెనీల నష్టం రూ.కోట్లలో ఉంటుందని అంచనా.

ఘటన స్థలాన్ని సందర్శించిన రాచకొండ సీపీ

అగ్ని ప్రమాదం విషయం తెలిసిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయనతో పాటుగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్‌తో పాటుగా ఇన్‌స్పెక్టర్లు ఘటన స్థలం వద్దే ఉండి పర్యవేక్షించారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు ఎలాంటి ప్రాణహాని లేదన్నారు.

పీసీబీ అధికారుల నిర్లక్ష్యం వల్లే..

పీసీబీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఐలా చైర్మన్ జక్కా రోషిరెడ్డి ఆరోపించారు. ఇలాంటి ప్రమాదకరమైన పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఉంచ కూడదంటు పలుమార్లు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆరు నెలల క్రితం కంపెనీని మూసివేశారని, తిరిగి అనుమతి ఇవ్వడంతో యథావిధిగా కంపెనీని నిర్వహించారని, ఈ క్రమంలోనే ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కెమికల్ కంపెనీలను చర్లపల్లి పారిశ్రామికవాడ నుంచి తరలించాలని డిమాండ్ చేశారు.

గంజాయి పట్టివేత

నిందితుల రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఓటీ, పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల ఏరోస్పేస్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆనంద్‌కుమార్ శర్మ(29), అవినాష్ యాదవ్(20)లు గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. వీరి వద్ద 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీని విలువ రూ.37,500 ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ఇబ్రహీంపట్నం: ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అందలం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ హామీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. ఉచిత రెండు వందల యూనిట్ల విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్, రైతు రుణమాఫీ నామమాత్రంగా అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు పరుస్తున్నట్లు ప్రకటనలను ఇస్తుండటం సిగ్గుచేటన్నారు. ఈ నెల 6 నుంచి మండలాల వారీగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, నాయకులు బుగ్గరాములు, రమేశ్, కిషన్‌గౌడ్, బహదూర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, బాష, రాంరెడ్డి, చక్రవర్తిగౌడ్, కృపేశ్, వెంకటరెడ్డి, రాజేందర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, విఠల్‌రెడ్డి, యాదయ్య, నర్సింగ్, వెంకటేశ్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



సంబురాల్లో నూతి శ్రీకాంత్, ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: బీసీ కులగణన విజయవంతంగా పూర్తిచేసి మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌ని ఎర్రగడ్డ బీసీ, ఎస్టీనేతలు కలిసి సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్‌తో బీసీ, ఎస్సీ–ఎస్టీలు అభ్యున్నతిలో ముందున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, టీపీసీసీ ఎస్టీ సెల్ స్టేట్ కోఆర్డినేటర్ రమేష్‌నాయక్, ఎర్రగడ్డ బీసీ నేతలు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని గౌరీశంకర్ వైన్స్‌షాపు ఎదుట ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తుండగా సమాచారం అందుకోవడంతో బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిలింనగర్ వినాయకనగర్‌కు చెందిన ఈ.బాలజీ, జి.సాయితేజ, ఏ.జుగల్‌రాజు ముగ్గురూ కలిసి గంజాయి సేవిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి 12 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కలెక్టర్ కారును ఢీకొట్టిన మరో కారు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 నుంచి రోడ్డునెంబర్–13 వైపు కలెక్టర్ బంగ్లాకు వెళ్తున్న కలెక్టర్ అధికారిక వాహనాన్ని ఎదురుగా అదుపుతప్పి వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని కలెక్టర్ బంగ్లాలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉంటున్నారు. ఆయన డ్రైవర్ హేమంత్‌కుమార్ రోడ్డునెంబర్–12 నుంచి రోడ్డునెంబర్ –13 వరకు కలెక్టర్ కారులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మినీ కూపర్ కారు ఢీకొట్టింది. దీంతో కలెక్టర్ కారు ముందు భాగం దెబ్బతింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్: పనికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సయ్యద్ యూనస్ మొయిద్దీన్ మూసాపేటలో ప్రైవేట్ జాబ్ చేస్తూ వీడియోగల్లీలో తన తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈనెల 2వ తేదీన విధులకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి సయ్యద్ బాదర్బీకి ఫోన్ చేయగా స్విచాఫ్ వస్తుంది. మూసాపేట వెళ్లి అడగ్గా యూనస్ డ్యూటీకి రాలేదని చెప్పారు. దీంతో ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో సామగ్రి మాయం

వెంగళరావునగర్: పంక్చర్ చేయించుకొని వచ్చేలోగా ఆటో సామగ్రి మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లాకు చెందిన కె.సురేష్ స్థానిక జవహర్‌నగర్‌లో ఉంటూ ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఆటో పంక్చర్ కావడంతో రహమత్‌నగర్ చౌరస్తాలో ఆటో నిలిపి టైర్ పంక్చర్ చేయించుకొని వచ్చి స్టార్ట్ చేయగా పని చేయలేదు. పరిశీలించగా ఆటోలో ఉండాల్సిన బ్యాటరీ, పరిసరాలు మాయం అయ్యాయి. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

వెంగళరావునగర్: మద్యం సేవించడమే కాకుండా అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన ముగ్గురు యువకులకు గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బేగంపేటకు చెందిన బసంత్, నవీన్, గోపీలు సోమవారం అర్ధరాత్రి బాగా మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై మైత్రీవనం నుంచి యూసుఫ్‌గూడ వైపువేగంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఉన్న డివైడర్ ఢీకొట్టి కిందపడిపోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

శ్రీనగర్‌కాలనీ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు తీవ్ర అన్యాయం జరిగిందని యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి, కన్జ్యూమర్ రైట్స్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఎర్రగడ్డ కళ్యాన్ నగర్ వెంచర్–3లో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ సర్కారుకు తగిన బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిని అందజేశారు. తెలంగాణా అభివృద్ధికి తోడుంటారని నమ్మించి గెలిచిన బీజేపీ ఎంపీలు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

వీధి వ్యాపారులకు బాసట!

కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు

- ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సాహం
- 16 మందితో ప్రత్యేక కమిటీ..
- ప్రతినెల మొదటివారంలో సమావేశం

కొవిడ్ తర్వాత చిరువ్యాపారుల బతుకులు చితికిపోయాయి.. నెలలతరబడి వ్యాపారాలు లేక చాలామంది వీధి వ్యాపారులు రోడ్డున పడాల్సి వచ్చింది. అయితే వీధి వ్యాపారులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రుణ సౌకర్యాన్ని కల్పించింది. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులను గుర్తించి వారు తిరిగి వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో ఒక్కో వ్యాపారికి రూ.10 వేలు రుణంగా అందజేశారు. సక్రమంగా చెల్లించిన వారికి రెండో విడతలో రూ.20 వేలు చెల్లించారు. ఈ మొత్తాన్ని కూడా సక్రమంగా చెల్లించిన వీధి వ్యాపారులకు రూ.50 వేలు రుణాలను మూడో విడతలో అందజేశారు. ఇలా వీధి వ్యాపారులను ప్రోత్సహించి వారి కుటుంబ పోషణలో ఆసరాగా నిలిచారు.





వీధి వ్యాపారుల కమిటీలో మాట్లాడుతున్న సర్కిల్–18 డీసీ ప్రశాంతి

బంజారాహిల్స్: గతంలో మాదిరిగానే మళ్లీ వీధి వ్యాపారులకు మరింతగా రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో సక్రమంగా రుణాలు చెల్లించిన వారి జాబితా రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–17, 18 పరిధిలో టౌన్ వెండింగ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో 10 మంది వీధి వ్యాపారులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు. స్వయం సహాయ సంఘాల తరహాలోనే వీధి వ్యాపారులను పదిమందితో కలిసి ఒక కామన్ ఇంట్రెస్ట్ గ్రూపు ఏర్పాటు చేసి ఆ గ్రూపునకు రుణాలు ఇవ్వనున్నారు.

- జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 పరిధి కిందికి వచ్చే సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 5,107 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. ఇందులో 2,656 మంది వీధి వ్యాపారులు ఇచ్చిన రుణాలను సక్రమంగా చెల్లించారు. ఇప్పుడు వీరందరితో కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులను రూపొందిస్తున్నారు. వీరికి రుణాలు ఇచ్చే ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.
- జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షేక్‌పేట డివిజన్ల పరిధిలో మొత్తం 4606 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. ఇందులో 2500 మంది వీధి వ్యాపారులు తీసుకున్నారు. సక్రమంగా చెల్లించిన వారితో ఈ గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రతి గ్రూపునకు రుణాలు ఇచ్చి వారు మరింత నిలదొక్కుకునేలా చేయనున్నారు.
- టౌన్ వెండింగ్ కమిటీలో వెండింగ్ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌తో పాటు స్థానిక తహశీల్దార్, ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, స్వయం సహాయక బృందాల సభ్యులు కలిసి మొత్తం 16 మందితో ఈ కమిటీ ఏర్పాటు చేశారు.
- ఎతినెలా మొదటి మంగళవారం ఈ కమిటీ సమావేశం అవుతుంది. ఈ 16 మంది కమిటీ సభ్యులు కూర్చొని వీధి వ్యాపారుల సాధక బాధకాలపై చర్చిస్తారు. వారి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా పరిష్కారానికి కృషి చేస్తారు.
- ఈ కమిటీలో ఇద్దరు వీధి వ్యాపారులు కూడా ఉండడం వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడ ఉండే ట్రాఫిక్ పోలీసులు, శానిటేషన్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువస్తారు.
- వీధి వ్యాపారులను కేటగిరిలుగా విభజించారు.
- ఈ కేటగిరిలో ఉన్న గ్రీన్‌జోన్‌లో వ్యాపారులు నిరంతరం తమ వ్యాపారాలు కొనసాగించవచ్చు.
- ఆరెంజ్ జోన్‌లో ఉండే వ్యాపారులు ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత సమయం మాత్రమే తమ వ్యాపారాలు కొనసాగించి తొలగించాల్సి ఉంటుంది.
- రెడ్ జోన్‌లో ఉండేవారు అక్కడ వ్యాపారాలు చేయడానికి వీల్లేదు.

–రెడ్ జోన్‌లో పూర్తిగా స్ట్రీట్ వెండింగ్ రహిత ప్రాంతాలుగా మార్చారు.

ఆన్‌లైన్ జాబ్ పేరుతో మోసం

వెంగళరావునగర్: ఆన్‌లైన్ జాబ్ పేరుతో మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కరీంనగర్ ప్రాంతానికి చెందిన శివ సాయి అనే యువకుడు స్థానిక మధురానగర్‌లో ఉంటూ వీడియోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. పార్ట్‌టైమ్ జాబ్ ఆసక్తి ఉందా అని వాట్సప్ మెసేజ్ రావడంతో దానిని అంగీకరించాడు. అనంతరం టాస్కుల కోసం నగదు చెల్లిస్తే తర్వాత రెట్టింపు వస్తాయని చెప్పారు. ఈ మేరకు అనేకమార్లు నగదును పంపగా తిరిగి వచ్చాయి. ఈ క్రమంలో రూ.35 వేలు పంపగా, మళ్లీ రూ.90 వేలు పంపాలని ఆన్‌లైన్‌లో కోరారు. దానిని పంపకపోవడంతో తన నగదు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో తాము మోసపోయామని గ్రహించి సైబర్ పీఎస్‌లో తెలియజేసి అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దారికాచి వ్యాపారిపై దాడి

బంజారాహిల్స్: వాహనంపై సరుకులు తీసుకుని వస్తున్న వ్యాపారిని దారికాచిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... శ్రీకృష్ణనగర్‌లో నివసించే బొల్లా రాహుల్‌రెడ్డి హోటల్ నిర్వహిస్తున్నాడు. తెల్లవారుజామున 4 గంటలకు సరుకులు తీసుకుని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–5 దుర్గాభవానీనగర్ వైపునుంచి వస్తుండగా ముగ్గురు వ్యక్తులు బైక్‌ను ఆపి దాడి చేయడమే కాకుండా ఫోన్ లాక్కున్నారు. అనంతరం ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని పరారయ్యారు. దీంతో తీవ్ర గాయాలపాలైన రాహుల్‌రెడ్డి చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు





సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు... సాంస్కృతిక కార్యక్రమాలు

- సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు

బంజారాహిల్స్: ఏడు గుర్రాలపై సూర్యప్రభ వాహనంపై శ్రీవారు తిరు వీధుల్లో తిరగాడుతుండగా... గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీ మార్మోగాయి. రథసప్తమి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయంలో వేడుకలను ఆలయ నిర్వాహకులు, భక్తులు వైభవంగా నిర్వహించారు. సృష్టిలో జీవరాశులన్నీ సుభిక్షంగా మనగలుగుతున్నారంటే అందుకు కారణం సూర్యుదేవుడేనని అర్చకులు, వేద పండితులు తెలిపారు. అంతటి సూర్య భగవానుడిని రథసప్తమి రోజు పూజిస్తే ఎంతో మంచి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మళయప్ప స్వామివారిని ఉదయం సూర్యప్రభ వాహనంలో, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో ఊరేగించారు. అనంతరం కళాకారుల విన్యాసాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో వాహన సేవల్లో పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హిమాయత్‌నగర్‌లో...

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. రథసప్తమి సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ రకాలపూలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపులో మంత్రి పాల్గొని రథాన్ని లాగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ –12లోని విశ్వసాయి మందిరంలో సాయిబాబా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం బాబాకు పట్టు తేనెతో అభిషేకం చేశారు. స్వామివారి దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యల విచ్చేశారు. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.
– బంజారాహిల్స్

అదుపుతప్పి డివైడర్ పైకెక్కిన కారు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1 నుంచి పంజగుట్ట మీదుగా కేపీహెచ్‌బీకి వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి వెంగళరావు పార్కు ముందు ఉన్న డివైడర్‌పైకి ఎక్కింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కేపీహెచ్‌బీకాలనీ వసంత్‌నగర్‌కు చెందిన పవన్‌సాయి (27) మంగళవారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1 తాజ్‌కృష్ణా వైపు నుంచి పంజగుట్ట వైపు మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నాడు. దీంతో కారు అదుపుతప్పడంతో పార్కు ముందు ఉన్న డివైడర్‌పైకి ఎక్కింది. ఈ సమయంలో కారులోని ఎయిర్‌బెలూన్స్ ఓపెన్ అయ్యాయి. దీంతో కారులోని వారు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం కారును అక్కడే వదిలేసి పారిపోయారు. కారులో ఉన్నవారంతా మద్యం సేవించినట్లుగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. కారు నడుపుతున్న వ్యక్తి కూడా పీకలదాకా మద్యం సేవించి డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలిలో కారు



జూబ్లీహిల్స్ భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం కనుల పండుగ జరిగింది. ఆటపాటలతో విద్యార్థులు అలరించారు. అనంతరం పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పరీక్షలు బాగా రాసి మంచి భవిష్యత్తుతో ముందుకు సాగాలని స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ సూచించారు.
– బంజారాహిల్స్

8,9 తేదీల్లో తెలుగు సాహిత్య సాంస్కృతిక కదంబం

లిబర్టీ: తెలుగు సాహిత్య సాంస్కృతిక కదంబం కార్యక్రమాన్ని ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తెలంగాణ సంగీత నాటక అకాడమీ సహకారంతో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలీలా ఫౌండేషన్ తెలుగు సాహిత్య కళా పీఠం తెలుగు సాహిత్య సాంస్కృతిక ఆధ్వర్యంలో రెండు రోజులపాటు పలు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు కవి సమ్మేళనం, 9వ తేదీన అష్టావధానం, మధ్యాహ్నం 3 గంటలకు అజరామరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల పాటు తెలంగాణ భవన్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని సాహిత్య సాంస్కృతిక రంగాల్లో నిష్ణాతులైన పలువురు పాల్గొంటారని వెల్లడించారు.

నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న కృష్ణకుమార్

శ్రీనగర్‌కాలనీ: సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఎర్రగడ్డకు చెందిన ఎర్ర కృష్ణకుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మంగళవారం ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ చేతులమీదుగా అందుకున్నారు. తనను నమ్మి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నేతలు మోసిన్ ఖురేషి, మహమ్మద్ సర్దార్ పాల్గొన్నారు.

గారడీల ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మరు

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్: నిరంతరం అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న గారడీల ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడంలేదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద విడుదలైన చెక్కులను (మొత్తం రూ.2,98,500) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, అంబటి రామకృష్ణ, శ్యాంరావు, వేణు, పవన్ ముదిరాజ్, సునీల్, అర్జున్, యాదగిరి, బాలు, బంటి, విజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన



చీరలను తిలకిస్తున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనలో సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో పాటు ఫ్యాన్సీ వస్తువులు మహిళలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన పోచంపల్లి, మంగళగిరి, జందాన్ని శారీస్, కోటా, ఉప్పాడ, చీరలా, బెనారస్‌తో పాటు పలు సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 40 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు వికాస్‌జైన్ తెలిపారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 10 వరకూ కొనసాగుతుందని తెలపిఆరు.

కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే వందశాతం నివారించొచ్చు

- నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ వందశాతం చేయవచ్చని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప తెలిపారు. వాస్తవానికి కేన్సర్ రోగులపై ప్రత్యేక శ్రద్ధ, అవగాహన, ప్రోత్సాహం, ధైర్యం కల్పించడం ద్వారా కేన్సర్‌ను జయించవచ్చన్నారు. ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిమ్స్‌లో ఎమర్జెన్సీ బ్లాక్ నుంచి పంజగుట్ట గేట్ వరకు జరిగిన అవగాహన ర్యాలీని డైరెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున వైద్యులు, వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, నర్సింగ్, రోగుల బంధువులతో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ నిమ్స్‌లో ప్రభుత్వ సహకారంతో కేన్సర్‌కు పూర్తిగా ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రూపొందించిన అనేక పోస్టర్లకుగాను పలువురు వైద్యులను అవార్డులతో ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఎంఎస్ డాక్టర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, అదనపు మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎస్.లక్ష్మీ భాస్కర్, కేవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో డైరెక్టర్ బీరప్ప, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది

అర్చక ఉద్యోగ సంఘాల ప్రత్యేక సమావేశం

ఏకగ్రీవంగా కమిటీ ఎన్నిక



బంజారాహిల్స్: సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ అర్చక ఉద్యోగ సంఘాలన్నీ కలిసి సంఘటితమయ్యాయి. ఒకే సంఘం ఏర్పడి సమస్యల పరిష్కారానికి అధ్యయన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వివిధ అర్చక ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మంగళవారం శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఉద్యోగ సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సమస్యలను ఏకరూప విధానంలో ప్రభుత్వానికి, దేవాలయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అన్ని సంఘాలు కలిసి ఒకే తాటిమీదికి వచ్చి పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా గంగు ఉపేంద్రశర్మ, కన్వీనర్‌గా బేతి రంగారెడ్డి, కో–కన్వీనర్లుగా మార్తి సత్యనారాయణశర్మ, పరాశరం రవీంద్రాచార్యులు, రత్నాకర్, మురళీధర్‌శర్మ, కందూరి కృష్ణమాచారి, తోటకూర వెంకటేశ్వర్లు, చక్రధరాచార్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ దేవాదాయ శాఖ పరిధిలో వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీరి పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ సంఘాలను ఏకతాటిమీదకు రావడం అభినందనీయమన్నారు. త్వరలోనే సమస్యలను ఒక నివేదికగా రూపొందించి దేవాదాయ శాఖకు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రపంచస్థాయి నైపుణ్యంతో..

- దేశంలో మొదటిసారిగా వెన్నెముక, క్రీడా ఆరోగ్య సంరక్షణకు వేదిక
- ఎన్స్యూర్ హెల్తీ స్పైన్- ఫిన్‌లాండ్‌లోని నార్డిక్ హెల్త్‌తో ఒప్పందం
- ఆతిథ్యం ఇచ్చిన కోటక్-పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, సీఎస్ఎస్‌హెచ్

గచ్చిబౌలి: కోటక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్(సీఎస్ఎస్‌హెచ్)లో రోగనివారణ, క్రీడా ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులకు మంగళవారం బీజం పడింది. దేశంలో ప్రివెంటివ్ స్పైన్, స్పోర్ట్స్ హెల్త్‌కేర్‌ను విప్లవాత్మకంగా మార్చడంలో భాగంగా ఎన్స్యూర్ హెల్తీ స్పైన్ సంస్థ ఆధ్వర్యంలో డేటా ఆధారిత మస్క్యులో స్కెలెటల్(ఎంఎస్‌కే) ఆరోగ్య సంరక్షణ సాంకేతికతను తమ సేవలతో అనుసంధానం చేయనుంది. ఈ సందర్భంగా ఎన్స్యూర్ హెల్తీస్పైన్ సీఈఓ నరేష్‌కుమార్ పగిడిమర్రి మాట్లాడుతూ నిష్ణాతులైన ఆర్నో, సిర్కా మార్గదర్శకత్వంతో తమ క్లయింట్లకు సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణ అందించే ప్రపంచస్థాయి విజ్ఞానం, నైపుణ్యంతో మా బృందం సన్నద్ధమైందన్నారు. నార్డిక్ హెల్త్ సంస్థ తాజా పురోగతులు, వినూత్న ఆవిష్కరణలను ఏకీకృతం చేయడంలో ఎన్స్యూర్ హెల్తీ స్పైన్ అంకితభావాన్ని బలోపేతం చేస్తుందన్నారు. క్రీడా ఆరోగ్య సంరక్షణకు కేంద్రంగా హైదరాబాద్ స్థానాన్ని మరింత పెంచడానికి సిద్ధంగా ఉందన్నారు. అథ్లెట్లు, క్రీడా నిపుణులు వారి జీవన నాణ్యతను మెరుగుపర్చాలనుకునే ప్రతి ఒక్కరికీ ఈ సేవలు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. కార్యక్రమంలో నార్డిక్ హెల్త్ ఫిన్‌లాండ్ సీఈఓ ఆర్నో, ఆరోగ్య నిపుణుడు సిర్కా, ఎన్స్యూర్ హెల్తీ స్పైన్ సంస్థ, నార్డిక్ హెల్త్ సంస్థ, పుల్లెల గోపీచంద్ అకాడమీ, సీఎస్ఎస్‌హెచ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలోని ఎన్స్యూర్ హెల్తీ స్పైన్‌తో నార్డిక్ హెల్త్(ఫిన్‌లాండ్)తో భాగస్వామ్యం కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు

ప్రజావాణిలో 7,142 దరఖాస్తులు


దరఖాస్తులను పరిశీలిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 7,142 దరఖాస్తులు అందాయి. అందులో ఎక్కువ శాతం ఇందిరమ్మ ఇళ్ల కోసమే ఉన్నాయి. 4,860 మంది ఇళ్ల కోసం అర్జీలు పెట్టుకున్నారు. పౌర సరఫరాల శాఖకు సంబంధించి కొత్త రేషన్ కార్డు మంజూరు కోరుతూ 1,861 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 175, విద్యుత్ శాఖకు సంబంధించి 135, రెవెన్యూ పరమైన సమస్యలపై 46, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి ఒక అర్జీ అందాయి. ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు వచ్చినట్లు ప్రజావాణి కో ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: కులాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ రెడ్డి కులస్తుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెడ్డి సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తెలంగాణ రెడ్డి సంఘం ప్రతినిధులు డీజీపీ జితేందర్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్‌లో జరిగిన ఓ సభలో తీన్మార్ మల్లన్న రెడ్డి కులాన్ని తీవ్ర పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. రెడ్డి సమాజంపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దేవిరెడ్డి విజితారెడ్డి, ప్రతినిధులు ఎస్.దేవేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సరితరెడ్డి, సుమతి, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై డీజీపీకి ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

ఆస్పత్రుల్లో లైబ్రరీ ఏర్పాటు అభినందనీయం

- నిమ్స్‌లో ఆకర్షణ సతీశ్ 19వ లైబ్రరీ ఏర్పాటు
- ప్రారంభించిన నగర సీపీ ఆనంద్

లక్డీకాపూల్: పుస్తకాలు, న్యూస్ పేపర్ చదివే వారి సంఖ్య రోజురోజుకూ గణనీయంగా తగ్గిపోతోందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ఖాళీ సమయం దొరికితే కొంతమంది స్మార్ట్ ఫోన్ల కోసమే అధిక సమయాన్ని కేటాయిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ సతీశ్ ఏర్పాటు చేసిన లైబ్రరీని డైరెక్టర్ బీరప్పతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పుస్తక పఠనాసక్తి తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆకర్షణ సతీశ్.. తాను చదువుతూనే అందర్నీ చదివించేలా కృషి చేయడం అభినందనీయం అన్నారు. ఆస్పత్రుల్లో లైబ్రరీలను ఏర్పాటు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎవరి వద్ద అయినా పుస్తకాలు ఉంటే ఈ విద్యార్థినికి అందించాలని సూచించారు.


విద్యార్థిని ఆకర్షణ సతీశ్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, సీపీ ఆనంద్

ఇప్పటికే 18 లైబ్రరీలను ఏర్పాటు చేసిన ఆకర్షణ సతీశ్ 19వ లైబ్రరీలో 550 తెలుగు కథా పుస్తకాలు, ప్రేరణాత్మక పుస్తకాలను అందుబాటులో ఉంచారన్నారు. ఈ లైబ్రరీ కేన్సర్ రోగులకు ఉపశమనం కలిగించేందుకు దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ లీజా రాజశేఖర్, రేడియేషన్ ఆంకాలజీ హెచ్‌ఓడీ డా.మోనికా, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్, కృష్ణారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

కోడింగ్ కోసం జెన్ ఏఐ సాధనాలు

- సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్‌లో కీలక పరిణామం
- టెక్, హెల్త్, స్టార్టప్ రంగాల్లో ఈ సాధనాల వినియోగం
- సాధ్యాసాధ్యాలపై ట్రిపుల్ ఐటీ శ్వేత పత్రం

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రక్రియలో జనరేటివ్ ఏఐ సాధనాలు కీలకంగా మారనున్నాయా..? అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కోడింగ్, డెవలపర్‌ల మధ్య సాంకేతిక సమస్యలకు ఈ సాధనాలు వినూత్న పరిష్కారాలను అందించనున్నాయా..? అంటే అవుననే అంటున్నారు నిపుణులు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్(ఎస్‌డీఎల్‌సీ) ప్రారంభ దశలో భాగంగా జనరేటివ్ ఏఐ సాధనాలపై ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా ప్రముఖ సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు తదితరులు పాల్గొని జనరేటివ్ ఏఐ సాధనాలపై చర్చించారు. సమావేశంలో జెన్ ఏఐ సాధనాలు ఏ రంగాల్లో ప్రభావం చూపిస్తాయో, ఎలాంటి సాంకేతిక ఫలితాలను అందిస్తాయో వెల్లడించారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రఘురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెషన్ సాంకేతిక ఉత్పత్తి, సాస్ కంపెనీలు, బ్యాంకులు, టీహబ్, స్టార్టప్‌లు, సర్వీస్ కంపెనీలు, హెల్త్‌కేర్ వంటి రంగాలకు చెందిన పరిశోధకుల దృక్పథాలను ప్రతిబింబించింది. ఇందులో భాగంగా సంప్రదాయ పరిశోధన ఇంజిన్లతో పోలిస్తే ఎల్ఎల్ఎంలు ఇతర జెన్ ఏఐ సాధనాలు అధిక సామర్థ్యాన్ని అందిస్తాయని పానెలిస్ట్ అంగీకరించారు. ప్రస్తుతం సాంకేతిక అభివృద్ధి పద్ధతులు మారాయి, సాధారణంగా ఉత్పత్తులను 5 నుంచి 6 శోధనల్లో ఎంపిక చేయగా ప్రస్తుతం డెవలపర్లు జెన్ ఏఐ సాధనాలను వినియోగిస్తూ 1–2 శోధనలలో పనులను పూర్తి చేయగలుగుతున్నారు. ఈ సాధనాలు పూర్తిగా భర్తీ చేయలేవు కానీ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఉపకరిస్తాయని చర్చలో తెలిపారు. సమావేశంలో భాగంగా ఎస్‌డీఎల్‌సీ అభివృద్ధిలో జనరేటివ్ ఏఐపై ప్రత్యేక శ్వేత పత్రాన్ని విడుదల చేశారు.

మామిడి సీజన్.. బాటసింగారంలోనే..

మళ్లీ తాత్కాలిక షెడ్ల నిర్మాణం

నాలుగు నెలల అద్దెకు మార్కెట్ చుట్టు పక్కల స్థలాలు

15 వరకు వరకు ఏర్పాట్లు చేయాలని ప్రణాళిక

సాక్షి, సిటీబ్యూరో: మామిడి సీజన్ ఈ ఏడాది కూడా బాటసింగారంలోనే నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. 15వ తేదీ నుంచి మామడి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవారం నుంచే బాటసింగారం మార్కెట్‌లో ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. మార్కెట్‌కు స్థలం సరిపోకపోవడంతో గతేడాది మామిడి సీజన్ మాదిరిగానే మార్కెట్ పక్కన ఉన్న స్థలాన్ని అద్దెకు తీసుకొని షెడ్లు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు ఇంజినీరింగ్ విభాగం పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించింది. మార్కెట్ పక్కన ఉన్న స్థలంలో మూడు షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

6 షెడ్ల నిర్మాణం

19.27 ఎకరాల్లో మామిడి సీజన్‌కు మార్కెట్ కమిటీ సిద్ధం చేస్తోంది. సీజన్‌లో 900 నుంచి 1100 వాహనాలు యార్డుకు వచ్చే అవకాశం ఉంది. యార్డు పక్కనే ఉన్న ఏడు ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు. ఈ సీజన్ కోసం మరో లక్ష ఎస్ఎఫ్‌టీలతో 6 షెడ్లను నిర్మించారు. తాగునీటి కోసం ప్రస్తుతం ఉన్న ఐదు ట్యాంకులతో పాటు మరో రెండు ట్యాంకులు ఏర్పాటు చేశారు.

ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి..

ఈ సీజన్‌లో లక్ష మెట్రిక్ టన్నులకు పైగా యార్డుకు మామిడి దిగుమతి అయ్యే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ యార్డుకు ప్రతి సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కృష్ణా జిల్లాలు, తెలంగాణలోని కొల్లాపూర్, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి మామిడి వస్తుంది. తోతాపురి రకం కర్ణాటక, ఏపీలోని చిత్తూరు ప్రాంతాల నుంచి దిగుమతి అవుతోంది. కొల్లాపూర్ మామిడికి దేశంలోనే అధిక డిమాండ్ ఉంది. బాటసింగారం మార్కెట్ నుంచి ఉత్తరాది రాష్ట్రాలైన ఢిల్లీ, పంజాబ్, హర్యానా, రాజస్తాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. అయితే ప్రస్తుతం సీజన్ ఆరంభానికి సమయం ఉన్నా బాటసింగారం మార్కెట్ యార్డుకు స్వల్ప మోతాదులో మామిడి వస్తోంది.



అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..



మామిడి సీజన్ కోసం బాటసింగారం మార్కెట్ యార్డులో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రైతన్నలు, వ్యాపారుల కోసం తాగునీటి వ్యవస్థతో పాటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయిస్తున్నాం. నీటి సదుపాయం కోసం ఏడు ట్యాంకులను అందుబాటులోకి తెస్తాం. మార్కెట్ కమిటీకి చెందిన ఒక వే బ్రిడ్జ్‌తో పాటు అదనంగా మరో వే బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అదనంగా మరో 20 మంది సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తాం. అగ్ని ప్రమాదాల నివారణకు ఒక ఫైరింజన్‌ను యార్డులో అందుబాటులో ఉంచాం.

– ఎల్.శ్రీనివాస్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి

మహిళలు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి


పురస్కారాలు అందుకున్న ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్లు

సుల్తాన్‌బజార్: కేన్సర్‌ను నిర్మూలించడమే కాకుండా వ్యాధిగ్రస్తులకు ఆత్మస్థైర్యం కల్పించాలని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ అన్నారు. కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూర్యధనుంజయ్ మాట్లాడుతూ.. వైద్యులు మనకు కనిపించే నిజమైన దేవుళ్లు అన్నారు. మహిళలు ఏ పని చేసినా ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. కేర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ ప్రొఫెసర్ గీత నాగశ్రీ మాట్లాడుతూ పొగాకు సేవిస్తుండటం వల్లే మన దేశంలో 40 శాతం మందికి కేన్సర్ బారినపడుతున్నారని అన్నారు. మహిళలు, విద్యార్థినులు బ్రెస్ట్ కేన్సర్ గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సర్జికల్ ఆంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉమాకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. కేన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ జోసెఫ్ బెంజిమెన్, ప్రముఖ విద్యావేత్త కోమటిరెడ్డి, గోపాల్‌రెడ్డి, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్, సెక్రెటరి జనరల్ హేమంత్ తదితరులు పాల్గొని డాక్టర్ గీత నాగశ్రీ, డాక్టర్ బి.ఉమాకాంత్‌గౌడ్, జోసెఫ్ బెంజిమెన్‌కు ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ చేతులమీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు.

బీజాపూర్ గంగులూర్ ఎన్‌కౌంటర్ బూటకం

- రాష్ట్ర పౌరహక్కుల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ గంగులూర్ ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిపై వెంటనే నిజనిర్ధారణ జరిపి ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చత్తీస్‌ఘర్ రాష్ట్రం బీజాపూర్ గంగులూర్‌లో ఈ నెల 1వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు చనిపోయినట్లు పోలీసులు ప్రకటించారని, అయితే అక్కడ స్థానిక ఆదివాసీలను హత్యచేసి పోలీసులే ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లుతున్నారని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) సంస్థ ప్రకటించిందని తెలిపారు. చనిపోయిన వారందరూ గ్రామస్తులే అని మావోయిస్టులు కాదని, వారంతా కోర్చోలి, తోడ్క గ్రామస్తులని చెబుతున్నారని పీయూసీఎల్ తన నివేదికలో ప్రకటించిందన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో 600 క్యాంపులు, ఏడు లక్షల బలగాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజా హక్కుల సంఘాలతో ఈ ఎన్‌కౌంటర్‌పై ఒక కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య రాజ్యాంగబద్ధ పాలనను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం కో కన్వీనర్ జ్యోతి, షేక్ షావలి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘాల నాయకులు

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని పీవీఆర్ ఆర్కే సినీప్లెక్స్‌లో సాదీ ఫిల్మ్ నైట్స్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రివైవింగ్ ది రూట్స్ పేరిట కళాకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉంటుంది.
- ఫిక్కీ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రి ఆడిటోరియంలో మైండ్ మేనేజ్‌మెంట్ ఫర్ ఏ పీస్‌ఫుల్ లైఫ్‌పై స్వామి ముకుందానంద ప్రసంగం మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు ఉంటుంది.
- గచ్చిబౌలిలోని టీ-హబ్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏఐ హెల్త్‌కేర్ సమ్మిట్ జరుగుతుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అల్కాపూర్‌లో చైన్‌స్నాచింగ్

మణికొండ: రోడ్డు పక్కన వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోనుంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసును తెంపుకుని పారిపోయిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టౌన్‌షిప్‌కే చెందిన భాగ్యలక్ష్మి అనే మహిళ సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వెళ్లింది. ఆమె మెడలో 50 గ్రాముల బంగారు గొలుసు ఉండటంతో దాన్ని తస్కరించాలని ప్లాన్ వేసుకున్న దొంగ వెనక నుంచి నడుచుకుంటూ వచ్చి ఒక్కసారిగా గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన అక్కడే ఓ ఇంటికి ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఆ ఇంటిలో ఉన్న వారు దొంగ అంటూ అరుస్తూ అతడి వెంట పడినా ప్రయోజనం లేకపోయింది. దాంతో బాధితురాలు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హోరాహోరీగా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్



సాక్షి, సిటీబ్యూరో: గోల్ఫ్ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఐదో సీజన్ హోరాహోరీగా సాగుతోంది. టీమ్ మైసా, టీమ్ ఆల్ఫా, కళింగ వారియర్స్, కాంటినెంటల్ వారియర్స్ సెమీఫైనల్లో అడుగుపెట్టాయి. ఊహించినట్లుగానే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా జరిగాయి. రసవత్తరంగా సాగిన క్వార్టర్ ఫైనల్స్‌లో టీమ్ మైసా, ట్యుటోరూట్‌ను 50–30 స్కోర్‌తో ఓడించగా.. టీమ్ ఆల్ఫా 45–35 స్కోర్‌తో మీనాక్షి మావెరిక్స్‌పై గెలిచింది. అలాగే కళింగ వారియర్స్ 65–15 స్కోర్‌తో రఫ్ రైడర్స్ పైనా, కాంటినెంటల్ వారియర్స్ టీమ్ 50–30 స్కోర్‌తో ఎంవైకే స్ట్రైకర్స్ పైనా విజయం సాధించాయి. గత సీజన్‌తో పోలిస్తే ఈసారి జట్ల మధ్య హోరాహోరీ మ్యాచ్‌లు జరుగుతుండటంతో టైటిల్ రేసు రసవత్తరంగా మారిందని హెచ్‌పీజీఎల్ పార్టనర్ కృష్ణ గూడూరు చెప్పారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హస్తినాపురం: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు అనుకూలంగా, శ్రామిక బడుగు బలహీన వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. హస్తినాపురంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.55.60 లక్షల కోట్లకు పైగా రూపొందించిన బడ్జెట్‌లో రూ.12 లక్షల కోట్లు కేవలం వడ్డీ చెల్లించడానికే పోతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, పగడాల యాదయ్య, రామచందర్‌బాస్కర్, శ్యామ్యూల్, నర్సింహ, జగదీష్, ఆలేటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్



నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన గార్డెన్ ఫెస్టివల్‌లో ల్యాండ్‌స్కేప్ గార్డెన్ కేటగిరీలో హార్టికల్చర్ విభాగం డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా చేతులమీదుగా గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్ అందుకుంటున్న హైదరాబాద్ జేటీసీ రమేశ్

ఎన్‌టీపీసీ క్విజ్ పోటీల విజేత ఓయూ జట్టు



ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్‌టీపీసీ నిర్వహించిన ఎలక్ట్రాన్ క్విజ్ పోటీల్లో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో జరిగిన క్విజ్‌లో 46 ఇంజినీరింగ్, ఎంబీఏ కాలేజీలకు చెందిన 96 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి సాధించిన ఓయూ జట్టుకు రూ.30 వేలు, రెండో బహుమతి సాధించిన జేఎన్‌టీయూ జట్టుకు రూ.20 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ.కుమార్, ఎన్‌టీపీసీ జీఎం పాణిగ్రహీ తదితరులు పాల్గొని మాట్లాడి విజేతలకు బహుమతులను అందజేశారు.

దక్షిణమధ్య రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్‌గా సిద్ధార్థ్ కటి



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్(పీసీపీఓ)గా సిద్ధార్థ్ కటి బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇండియన్ రైల్వేస్ పర్సనల్ సర్వీస్ 1996బ్యాచ్‌కి చెందిన అధికారి. ఈ నియామకానికి ముందు ఈస్ట్ కోస్ట్ రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు.

లీగల్ ఫోరం ఫర్ తెలంగాణ నూతన కార్యవర్గం



ఉస్మానియా యూనివర్సిటీ: లీగల్ ఫోరం ఫర్ తెలంగాణ(తెలంగాణ న్యాయ వేదిక) నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ వేదికగా రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా దూస గౌరీశం, ప్రధాన కార్యదర్శిగా జి.కరణ్, ఉపాధ్యక్షుడిగా నరేష్‌కుమార్, సహాయ కార్యదర్శిగా శ్రవణ్, కోశాధికారిగా జనార్దన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కాశీం, మధును ఎన్నుకున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ । బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025

ఆత్మ రక్షణ క్రీడలైన కుంగ్ ఫూ, మార్షల్ ఆర్ట్స్ పై నగర వాసులకు ఆసక్తి పెరుగుతోంది. నగరంలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్స్ వేదికగా అభ్యాసన చేస్తున్నారు పలువురు క్రీడాకారులు. దీంతో పాటు పతకాలు సాధిస్తూ కొందరు.. స్ఫూర్తిగా మరికొందరు ఈ మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆకర్షితులవుతున్నారు నగరవాసులు. అంతేకాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలువురు క్రీడాకారులు ప్రతిభను కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారు. – సనత్‌నగర్

నగరంలో ఇటీవలికాలంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణకు ఆదరణ పెరుగుతోంది. తల్లిదండ్రుల్లో ఈ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ పట్ల పెరుగుతున్న అవగాహనే ఇందుకు కారణం. పైగా చిన్నతనం నుంచి ఇటువంటి శిక్షణలో పాల్గొనడంతో ఆత్మస్థైర్యం కూడా పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్న మాట. దీంతో చిన్నారులు కూడా ఈ తరహా శిక్షణ తీసుకునేందుకు కఠోర దీక్షతో అభ్యాసన చేస్తున్నారు. అంతేకాకుండా జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో నిర్వహించే శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ రాటుదేలుతున్నారు.



ఆత్మ రక్షణ..
కుంగ్ ఫూ శిక్షణ..
జీహెచ్ఎంసీ గ్రౌండ్స్ వేదికగా అభ్యాసన

- పతకాలు సాధిస్తూ కొందరు.. స్ఫూర్తిగా మరికొందరు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చిన్నారుల ప్రతిభ
- మార్షల్ ఆర్ట్స్‌పై నగరవాసులకు ఆసక్తి
- సాధనతో రాటుదేలుతున్న పలువురు క్రీడాకారులు



ఆ'శక్తి'ని గమనించి..

కోచ్‌లు సైతం పిల్లల్లోని ఆ'శక్తి'ని గమనించి కుంగ్ ఫూలో ఉన్నత శిక్షణను అందిస్తూ వివిధ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. బేగంపేట ఓల్డ్ పాటిగడ్డలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్, బ్రాహ్మణవాడీ, మాసబ్ ట్యాంక్, విజయనగర్ కాలనీల్లో కుంగ్ ఫూ – మార్షల్ ఆర్ట్స్‌లో గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కళ్యాణ్, జీహెచ్ఎంసీ కోచ్ చందు నిరంతరం శిక్షణను అందిస్తున్నారు. 2010 జనవరి 1 నుంచి వీరు శిక్షణ కొనసాగిస్తుండగా ఇప్పటి వరకూ వందలాది మంది కుంగ్ ఫూలో శిక్షణ పొందారు.

పలు పోటీల్లో...

నగరంలో ఎల్బీ స్టేడియం, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియం, సరూర్‌నగర్, బాలయోగి స్టేడియం తదితర ప్రాంతాల్లో ఎక్కడ పోటీలు జరిగినా ఇక్కడి చిన్నారులు పాల్గొంటూ ప్రతిభను కనబరుస్తున్నారు. ఒక్క నగరానికే పరిమితం కాకుండా రాష్ట్రంలోని వరంగల్, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మందమర్రి, ఖాజీపేటతో పాటు ఒడిస్సా, మహారాష్ట్ర, గోవా తదితర రాష్ట్రాల్లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలను సాధించారు.

నాలుగేళ్ల చిన్నారుల నుంచి..

మానసిక, శారీరక దృఢత్వం, ఏకాగ్రత కోసం నాలుగేళ్ల చిన్నారి నుంచి 23 ఏళ్ల యువకుల వరకూ ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. శిక్షణ తీసుకున్న వారిలో చాలా మంది వెళ్లిపోగా, ప్రస్తుతం ఆయా కేంద్రాల వేదికగా 70 మంది వరకూ శిక్షణ పొందుతున్నారు. చిన్నతనం నుంచే కుంగ్ ఫూలో శిక్షణ పొందడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని మాస్టర్లు పేర్కొంటున్నారు.

కుంగ్ ఫూతో మేలు..



కుంగ్ ఫూ, మార్షల్ ఆర్ట్స్ ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తాయి. శారీరక, మానసిక దృఢత్వం పెరిగి, ఆత్మరక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుంది. మా చిన్నారులు ప్రతిభ కనబరుస్తూ.. పతకాలు సాధించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

– కంటేశ్వర్, కళ్యాణ్, చందు, కంగ్ ఫూ మాస్టర్లు

మాస్టర్ల ప్రోత్సాహమే..



కుంగ్ ఫూలో నేను బ్లాక్ బెల్ట్ సాధించాను. మాస్టర్లు, కోచ్‌ల ప్రోత్సాహంతో ఇప్పటి వరకూ ఎన్నో పోటీల్లో పాల్గొన్నాను. మొత్తం 30 బంగారు, 25 వెండి, 15 కాంస్య పతకాలను సాధించానంటే.. అది వారి శిక్షణ ఫలితమే.

– వాసు, కుంగ్ ఫూ క్రీడాకారుడు

కాన్ఫిడెన్స్ పెరిగింది..



కుంగ్ ఫూ, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆత్మరక్షణకే కాకుండా ఆరోగ్యపరంగా కుంగ్ ఫూ ఎంతో దోహదం చేస్తోంది. కోచ్‌ల ప్రోత్సాహంతో 25 బంగారు, 20 వెండి, 20 కాంస్య పతకాలను సాధించగలిగాను. బ్లాక్ బెల్ట్ సాధించడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

– రాజు, కుంగ్ ఫూ క్రీడాకారుడు




జూ మ్..
వివిధ దేశాల నుంచి దిగుమతికి ఏర్పాట్లు

- జాబితాలో తెల్ల సింహం, జీబ్రా, కంగారూ, చింపాంజీలు
- పలు దేశీయ జూల నుంచి పులులు, సింహాలు
- జంతు మార్పిడిలో భాగమే అంటున్న అధికారులు
- దత్తతకు ముందుకొచ్చిన కార్పొరేట్ సంస్థ
- రానున్న రోజుల్లో అలరించనున్న అరుదైన జంతువులు

జూ.. ఈ పేరు చెబితేనే పిల్లల నుంచి పెద్దల వరకూ అదో వింత అనుభూతి కలుగుతుంది. ప్రకృతిలో మమేకమై సంచరించే వన్య ప్రాణులను చూస్తే ఒళ్లు పులకరిస్తుంది.. అలాంటి అనుభూతే నగరంలోని నెహ్రూ జూ పార్కులోనూ కనిపిస్తుంది. అయితే ఎప్పటి నుంచో ఉన్నదేగా! ఇప్పుడు ఆ సోదంతా ఎందుకు అనే సందేహం కలగక మానదు.. అదేనండి.. జంతు మార్పిడిలో భాగంగా నగరానికి కొత్త రకాల జాతులు, జంతువులు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో నెహ్రూ జూపార్కు నగర వాసులకు కొత్త ఆకర్షణగా మారనుందని తెలుస్తోంది.. వీటిని దత్తత తీసుకునేందుకు ఇప్పటికే ఓ కార్పొరేట్ సంస్థ కూడా ముందుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగానే జూకు 16 దేశాల నుంచే కాకుండా దేశంలోని పలు జూల నుంచి కూడా కొత్త అతిథులు రానున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో



నగరంలోని నెహ్రూ జంతు ప్రదర్శనశాలలోకి ఈ వేసవిలో కొత్త జంతువులు రానున్నాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా.. వాటి మనుగడకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆస్ట్రేలియాలో మాత్రమే కనిపించే కంగారూలు త్వరలోనే భాగ్యనగరంలో కనువిందు చేయనున్నాయి. జంతు మార్పిడిలో భాగంగా రెండు కంగారూలు, అదే విధంగా చెక్ రిపబ్లిక్ నుంచి తెల్ల సింహం, థాయిలాండ్ జీబ్రాలు, ఆఫ్రికా చింపాంజీలు రానున్నాయి. వీటి మనుగడకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే సంబంధిత జూ అధికారులు ఏర్పాట్లకు ప్రణాళికలు చేస్తున్నారు.



దేశీయ జూల నుంచి..

దీంతో పాటు దేశీయ జూ పార్కుల నుంచి కూడా జంతు మార్పిడి ప్రక్రియలో భాగంగా పులులు, సింహాలు, మొసళ్లతో పాటు ఇతర జంతవులు కూడా సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. కంగారూల సంరక్షణకు అయ్యే నిర్మాణ ఖర్చులను భరించేందుకు దుండిగల్‌లోని ఓ ఫార్మా కంపెనీ ముందుకొచ్చిందని అధికారులు చెబుతున్నారు. జంతు మార్పిడి పథకంలో భాగంగా జపాన్‌లోని ఓక్లాహోమా జూపార్కు కంగారూ జంతువులు రెండు నెలల్లో రానున్నాయని తెలిపారు.

అనుమతి కోసం..

జపాన్‌లోని ఓక్లాహోమా గార్డెన్, హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్ మధ్య ఈ మేరకు ఇప్పటికే ఒప్పందాలు కుదిరాయని, కేంద్ర, రాష్ట్రాల అటవీ, పర్యావరణ శాఖ, సెంట్రల్ జూ అథారిటీ, విదేశీ వాణిజ్య వ్యవహారాల డైరెక్టర్ జనరల్ అనుమతి లభించిన వెంటనే తరలింపు ప్రక్రియ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే వేసవి సెలవులు ప్రారంభమయ్యే నాటికే కంగారు జంతువులు రంగప్రవేశం చేస్తాయని జూపార్క్ సంరక్షణాధికారి చెబుతున్నారు.





దాదాపు 380 ఎకరాల్లో విస్తరించిన నెహ్రూ జూపార్కులో ప్రస్తుతానికి 183 జాతులతో మొత్తం 1,860 జీవాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జంతు మార్పిడిలో భాగంగా నెహ్రూ జూపార్కుకు రెండు

183 జాతులు..
1,860 ప్రాణులు..

హిప్పోపాటమస్‌లు, సింహం లాంటి తోకలు ఉండే రెండు ముకాస్, బూడిద రంగు తోడేలు, జిరాఫీల జంట, నాలుగు కింగ్ కోబ్రాలను తీసుకొచ్చారు.

మార్పిడి ఇలా..

రాజ్‌కోట్ జంతు ప్రదర్శనశాలకు చెందిన ఆసియా జాతి సింహం గతేడాది ఆగస్టులో వచ్చింది. రెండు జతల అడవి కుక్కలు, కొండ చిలువలు 2, మంగళూరు బయోలాజికల్ పార్కు నుంచి తీసుకొచ్చి, వీటికి బదులుగా ఒకటి మగ, మూడు ఆడ మూషిక జింకలను జూ పార్కు నుంచి ఇచ్చారు. పెద్ద ఎగ్రెట్ 3 మగ, 3 ఆడ, గ్రే పెలికాన్, ఆడ మంగళూర్ పిలికుల జూకు అందజేశారు. త్రివేంద్రం జూ నుంచి సౌత్ అమెరికా వైట్ రియా 2 జతలు, బ్రౌన్ రియా 2 జతలకు ఎగరని పక్షి జాతి, జత ఎలుగుబంటి, తొండ జాతి ఇగ్వానా సెంట్రల్ అమెరికన్ జత వచ్చాయి. జపాన్‌లోని ఓక్లాహోమా జూ నుంచి జత మీర్ క్యాట్ వచ్చాయి.. బదులుగా ఒక ఆడ ఆసియా సింహాన్ని ఇచ్చారు.



కంగారూలు ఇక్కడ బతుకుతాయా?

ఆస్ట్రేలియాలో ఎక్కువగా కనిపించే కంగారూలు.. ఆఫ్రికాలోని కలహారి ఎడారిలో జీవించే మీర్కట్‌ల కోసం జూ అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఇతర విదేశీ జంతువుల కోసం కూడా అక్కడి వాతావరణ ఏర్పాట్లు కల్పిస్తున్నారు. విదేశాల నుంచి వచ్చే జంతువులు భారత ఉపఖండం వాతావరణంలో బతకగలవా? లేదా? అనే విషయంపై జీవశాస్త్రవేత్తలు పెద్ద ఎత్తున పరిశోధనలు చేశారు. మన దేశంలోనూ కంగారూలు సంచరించినట్లు పురాతత్వ శాస్త్రవేత్తలు ఓ అవగాహనకు వచ్చారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల కిందట.. ఇదే జపాన్ నుంచి రెండు కంగారూలను కోల్‌కతాలోని కనజావా జూపార్కుకు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా పెంచిన గడ్డిని, వాటికి అనువైన వాతావరణాన్ని కల్పించడంతో కంగారూలు మనుగడ సాగిస్తున్నాయి. నెహ్రూ జూపార్కులోనూ అదే తరహా ఏర్పాటు చేస్తున్నారు.



ప్రతిపాదనలు పంపించాం..

జంతు మార్పిడిలో భాగంగా ఈ ఏడాది జూకు కొత్త జంతువుల కోసం ప్రతిపాధనలు కేంద్ర కార్యాలయానికి పంపాము. ఇప్పటికే దేశీయ జూల నుంచి వివిధ రకాల జంతువులను తరలించాము. గత ప్రతిపాధనలతో పాటు కొత్త ప్రతిపాదనల్లో తెల్ల సింహాలు, జీబ్రా, చింపాంజీ, కంగారు జంతువులు తేనున్నాం. ప్రస్తుతం జూలో ఉన్న వన్యప్రాణుల ఆలనా పాలనా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు, ఆహారం అందజేస్తున్నాం.

– జె.వసంత, నెహ్రూ జూ పార్క్ క్యూరేటర్



ఉత్సాహంగా 'యంగ్ చెఫ్ ఒలింపియాడ్ -2025' పోటీలు

- 8న కోల్‌కతాలో ఫైనల్స్
- పోటీలకు వివిధ దేశాల చెఫ్‌లు హాజరు

యమ్మీ.. యమ్మీ..

గచ్చిబౌలి: రానున్న రోజుల్లో పాక శాస్త్ర పరిశ్రమలో ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) ముఖ్య భూమిక పోషించనుందని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఐఐహెచ్ఎం), ఇంటర్నేషనల్ హాస్పిటాలిటీ కౌన్సిల్ చైర్మెన్ డాక్టర్ సబోర్ బోస్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఐఐహెచ్ఎంలో 'యంగ్ చెఫ్ ఒలింపియాడ్-2025 పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ భోజన ప్రణాళిక, వ్యక్తిగతీకరణ, స్మార్ట్ కిచెన్, ఉపకరణాలను అన్వేషించడం, మెనూ ప్లానింగ్, ఫుడ్ ప్రజెంటేషన్, ప్లేటింగ్, వ్యర్థాలను తగ్గించడంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందన్నారు. తొమ్మిది దేశాలకు చెందిన యంగ్ చెఫ్‌లు హైదరాబాద్ రౌండ్ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కోల్‌కతా, గోవా, ఢిల్లీ, బెంగళూర్, గోవా తదితర పట్టణాల్లోనూ వివిధ దేశాలకు చెందిన యంగ్ చెఫ్‌లు పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. సెమీ ఫైనల్‌కు 20 మంది చెఫ్‌లను ఎంపిక చేస్తారని, కోల్‌కతాలో 8న ఫైనల్స్ నిర్వహిస్తారని చెప్పారు. ఫైనల్స్‌లో ముగ్గురిని ఎంపిక చేసి మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 లక్షలు, రెండో స్థానానికి రూ.3 లక్షలు, మూడో స్థానానికి రూ.2 లక్షలు అందజేస్తారని పేర్కొన్నారు. టెక్నికల్ న్యాయ నిర్ణేతలుగా ది రాయల్ గార్డెన్ హెడ్ చెఫ్ స్టీవ్ ముంక్లీ, సింప్లీ సౌత రెస్టారెంట్ల మేనేజింగ్ పార్ట్‌నర్, చెఫ్ చతపతి రావు, కలినరీ మాస్ట్రో చెఫ్ స్టీఫెన్ హోగన్, టెస్టింగ్ జడ్జీలుగా స్మార్ట్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ పేస్ట్రీ చెఫ్ సారా హర్ట్‌నెట్, కలినరీ డైరెక్టర్ చెఫ్ రాహుల్ అకెర్కర్ వంటలను రుచి చూశారు. కజకిస్తాన్ రిపబ్లిక్ హైదరాబాద్ కాన్సుల్ జనరల్ డాక్టర్ నవాబ్ నాసిర్ అలీ, ఐటీపీ మాజీ ఈసీఓ దుంజీ కవర్ల తదితరులు పాల్గొన్నారు.



తరుణ్ తహిల్యానీ వెడ్డింగ్ కలెక్షన్స్..

ప్రముఖ సెలిబ్రిటీ ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిల్యానీ ఆదిత్య బిర్లా ఫ్యాషన్ రిటైల్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని తస్వాతో కలిసి సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆధునిక పురుషులు ప్రత్యేకించి పెళ్లి సందర్భంగా వరుడి కోసం ప్రత్యేకంగా ఈ కలెక్షన్స్ రూపొందాయని, అపురూపమైన రీతిలో జర్దోసి, ఆరి వర్క్, మిర్రర్ వర్క్‌తో ఆకట్టుకునే ఈ దుస్తులు నగరంలోని తమ స్టోర్స్‌లో లభ్యమవుతాయని ఓ ప్రకటనలో తెలిపారు.

–సాక్షి, సిటీబ్యూరో





ఉత్సాహంగా స్టార్‌గేజింగ్ క్యాంప్


సాక్షి, సిటీబ్యూరో: టెలిస్కోప్‌తో గ్రహాలను అన్వేషించిన స్టార్ గేజింగ్ క్యాంప్ ఆకట్టుకుంది. ఫారెస్ట్ ట్రెక్ పార్క్, చిలుకూరు ఆర్ఎఫ్‌కి చెందిన మంచిరేవుల తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ అడ్వెంచర్ – ట్రెక్కర్స్ క్లబ్ (హ్యాట్స్) సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ క్యాంప్‌లో 50 మంది స్టార్ గేజింగ్ ఔత్సాహికుల బృందం పాల్గొంది. అపురూప ఖగోళ అనుభవాన్ని ఆస్వాదించింది. నగరానికి దూరంగా కొండల మధ్య నెలకొని ఉన్న ఈ ప్రదేశం కాంతి కాలుష్యం చొరబడకుండా ఆకాశంలోని అద్భుతాలను అన్వేషించడానికి అనువుగా ఉంది. ఈ సందర్భంగా టీజీఎఫ్‌డీసీ ఎకో–టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎల్ రంజీత్ నాయక్ మాట్లాడుతూ.. 'ప్రకృతి మధ్యలో రాత్రిపూట ఆకాశాన్ని గమనించడం, నక్షత్రాలను చూడటం, పర్యావరణం పట్ల శ్రద్ధను కలిగిస్తుంది. వేద గ్రంథాల నుంచి ఖగోళ వస్తువులతో అనుసంధానించిన గొప్ప దేవాలయాల వరకూ మన పూర్వీకులు నక్షత్రాలు, భూమి ప్రకృతి లయల మధ్య సన్నిహిత సంబంధాన్ని అర్థం చేసుకున్నారన్నారు.



క్లుప్తంగా...

పరిగి ఎమ్మెల్యేకి ఊరట

ఎఫ్ఐఆర్ కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో 2019లో ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. కాంగ్రెస్ పార్టీ మరో నేత ఎ.సుధాకర్‌రెడ్డిపై కేసును కూడా కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ముందు కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. కార్యక్రమంలో పార్టీ నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్‌తో పాటు రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనుమతి లేకుండా లోక్‌సభ ఎన్నికల సమయంలో కోడ్‌ను ఉల్లంఘించి ఆందోళన చేపట్టారంటూ పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని కోరుతూ రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి రెండు రోజుల క్రితం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ సీఎం పదవి బీసీకి ఇస్తారా?

లోక్‌సభలో కాంగ్రెస్‌ను ప్రశ్నించిన ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ముఖ్యమంత్రి పదవిని బీసీకి ఇస్తారా? అని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో 12 మంది మంత్రుల్లో ఏడుగురు ఓసీలు, కేవలం ఇద్దరు మాత్రమే బీసీలున్నారని, మిగిలిన మంత్రి పదవులు బీసీలకు ఇస్తారా? అంటూ నిలదీశారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రఘునందన్‌రావు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో 55 శాతం బీసీలు ఉన్నారని రాహుల్ గాంధీ చేసిన ట్వీట్‌ను ప్రస్తావించారు. బీసీలు 45 శాతం, మైనారిటీ ఓబీసీలు 10 శాతం కలిపి రేవంత్ ప్రభుత్వం చెబుతోందని గుర్తుచేశారు. బీసీల్లో ముస్లింలను కలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని బీజేపీ అడ్డుకుంటుందని, అలా జరగనివ్వబోదని రఘునందన్‌రావు స్పష్టంచేశారు. తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని వార్తాపత్రికల్లో వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఒక్క ఓఆర్ఆర్ ప్రాజెక్టుకే రూ.20 వేల కోట్లకుపైగా ఇచ్చిందన్నారు. వెయ్యి కోట్లతో సికింద్రాబాద్, వంద కోట్లతో చర్లపల్లిలో రైల్వే స్టేషన్ నిర్మించారని వెల్లడించారు.

రిటైర్డ్ పోలీసు అధికారి దుస్థితి పట్టదా?


- హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం రిటైర్డ్ ఉద్యోగులకు శాపంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగిగా 30 ఏళ్లకు పైగా పోలీసు శాఖలో సేవలు అందించిన ఠాగూర్ నారాయణ సింగ్ ఆరోగ్య పరిస్థితిపై చలించిన హరీశ్‌రావు మంగళవారం 'ఎక్స్'వేదికగా స్పందించారు. 'రిటైర్డ్ పోలీసు అధికారి ఆవేదన చూస్తే హృదయం కలిచివేస్తోంది. ఒకవైపు రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మరోవైపు రిటైర్మెంట్ సొమ్ము అందక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డుతో చికిత్స కోసం హాస్పిటల్‌కి వెళ్తే చెల్లుబాటు కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ఈ విశ్రాంత పోలీసు ఉద్యోగికి శాపంగా మారింది. ఇదే రీతిలో రాష్ట్రవ్యాప్తంగా రిటైరైన 8వేల మంది ఉద్యోగులు జీవన్మరణ సమస్య ఎదుర్కొంటున్నారు. సీఎం రేవంత్‌కు ఉద్యోగులపై ప్రేమ ఉంటే రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి' అని హరీశ్‌రావు ఎక్స్‌లో డిమాండ్ చేశారు.


విద్యలో మూడు జిల్లాల వెనుకబాటు

ఎంపీ రఘురామిరెడ్డికి కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంలో మూడు వెనుకబడిన జిల్లాలను గుర్తించామని కేంద్రం తెలిపింది. వాటిలో ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం ఉన్నాయని వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో ఎన్ని వెనుకబడిన జిల్లాలను గుర్తించారు? ఆయా జిల్లాల్లో తీసుకుంటున్న చర్యలేంటని.. మంగళవారం లోక్‌సభలో ఖమ్మం ఎంపీ ఆర్.రఘురామిరెడ్డి అడిగిన ప్రశ్నకు, కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. విద్యాపరంగా వెనుకబడిన జిల్లాలు దేశంలో మొత్తం 112 ఉన్నాయన్నారు. 2018 నుంచి నీతి ఆయోగ్ ద్వారా విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 2020 నుంచి సమగ్ర శిక్ష పథకం అమలు చేస్తున్నామని జయంత్‌చౌదరి పేర్కొన్నారు.

ఆకలి పోరు





రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యమానేరు బ్యాక్ వాటర్ కరకట్ట వద్ద మంగళవారం సూర్యోదయం వేళ వెచ్చదనం కోసం జలాశయంలోని చేపలన్నీ వందల సంఖ్యలో నీటి ఉపరితలం పైకి వచ్చాయి. అదే సమయంలో ఆహారం కోసం వందలాది కొంగలు అక్కడ వాలాయి.. చేపలదీ.. వాటి కోసం కాచుక్కూర్చున్న కొంగలదీ బతుకు పోరాటమే.. అలుపెరగని జీవన సమరమే. ఈ దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

దొడ్డిదారిలో 'డిప్యూటీ'

ఏకైక కార్పొరేటర్ గెలిచిన టీడీపీకి తిరుపతి డిప్యూటీ మేయర్ పీఠం

- సంఖ్యా బలం లేకున్నా.. దాడులు, దౌర్జన్యాలు, మందబలంతో పదవిని లాక్కున్న కూటమి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి అరాచకపర్వం
- వైఎస్సార్ సీపీ 13 సీట్లు గెలిచిన నందిగామలోనూ చైర్ పర్సన్ కుర్చీపై టీడీపీ తిష్ట



తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగుతున్న ఎస్వీ వర్సిటీ సెనేట్ హాల్‌లో తమ కార్పొరేటర్‌ను లాక్కెళ్తున్న కూటమి సభ్యుడితో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల వాగ్వాదం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఒక్క సీటు కూడా గెలవని చోట్ల.. ఏమాత్రం సంఖ్యా బలం లేని చోట్ల.. వైఎస్సార్ సీపీ గుర్తుతో ఎన్నికల్లో నెగ్గిన వారిని బెదిరించి, ప్రలోభాలకు గురి చేసి పీఠాలపై టీడీపీ కొలువుదీరింది! దాడులు, దౌర్జన్యాలు చేసినా.. అధికార దుర్వినియోగానికి పాల్పడినా... పోలీసుల నుంచి ఆర్డీవోల దాకా మొత్తం ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ మోహరించినా తమ ఎత్తుగడలు పారని చోట్ల ఎన్నికలు వాయిదా వేయించింది. తిరుపతి కార్పొరేషన్‌లో మెజారిటీ లేకపోయినా కూటమి నేతలు అధికార దుర్వినియోగంతో డిప్యూటీ మేయర్ పదవిని సొంతం చేసుకున్నారు. ఒకే ఒక్క కార్పొరేటర్ ఉన్న టీడీపీ దాడులు, దౌర్జన్యాలకు తెగబడి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ, కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి డిప్యూటీ మేయర్ పదవిని లాక్కుని ప్రజాస్వామ్యానికి పాతరేసింది. వైఎస్సార్ సీపీ 13 సీట్లు గెలిచిన నందిగామలోనూ చైర్ పర్సన్ పదవిని కేవలం ఆరు సీట్లలో నెగ్గిన టీడీపీ సంఖ్యా బలం లేకున్నా అధికారం అండతో దక్కించుకుంది.

రెండో రోజూ అదే అరాచకం..

సోమవారం నిర్వహించాల్సిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక కూటమి గూండాల బెదిరింపులు, దాడులు, కిడ్నాప్‌లు, కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా పడ్డ విషయం తెలిసిందే. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి డిప్యూటీ మేయర్ పదవిపై కన్నేసిన నేపథ్యంలో టీడీపీ గూండాలు మొదటి రోజు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో ఉప ఎన్నిక సమావేశ మందిరానికి వెళ్తున్న బస్సును అడ్డుకుని రాళ్లతో దాడి చేసి నలుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారు. దీంతో కోరం లేక ఉప ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. నడి రోడ్డులో ఖాకీల సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పచ్చ ముఠాలు రెండో రోజు మరింత బరి తెగించాయి. ఉప ఎన్నిక వాయిదా పడిన వెంటనే అదే రోజు రాత్రి కిడ్నాప్‌నకు గురైన అనీష్ రాయల్ భార్య మమతను సైతం కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి అనీష్ రాయల్ నివాసానికి చేరుకుని ఆమెను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అలాగే డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఓటు హక్కు వినియోగించుకోకుండా పథకం వేసిన కూటమి గూండాలు సోమవారం అర్ధరాత్రి దాటాక ఆయన్ను కిడ్నాప్ చేసి రహస్య ప్రాంతానికి తరలించారు. ఉప ఎన్నికలో పాల్గొనకుండా నిర్బంధించారు. ఆయనతో బలవంతంగా ఓ వీడియోను చిత్రీకరించి టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ సెల్ నుంచి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఉప ఎన్నిక ముగిసిన తరువాత సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎమ్మెల్సీ సుబ్రమణ్యంను విడిచిపెట్టడంతో ఆయన నేరుగా భూమన నివాసానికి చేరుకుని జరిగిన విషయాన్ని వివరించారు.

విప్‌ను తిరస్కరించిన ఎన్నికల అధికారి

తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక సందర్భంగా వైఎస్సార్ సీపీ జారీ చేసిన విప్‌ని ఎన్నికల అధికారి శుభం బన్సల్ తిరస్కరించారు. మంగళవారం డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక సందర్భంగా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి విప్ లిస్ట్‌ను ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్‌కి అందచేసేందుకు యత్నించగా సమయం మించిపోయినందున తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. తాను ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశ మందిరంలో ఉన్నట్లు పేర్కొన్నారు. విప్ లిస్ట్‌ని ఎన్నికల అధికారి తిరస్కరించటంతో విప్ జారీ చేయకుండానే తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికను నిర్వహించారు.

- తిరుపతి కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉంటే.. టీడీపీ గెలిచింది కేవలం ఒకే ఒక్కటి. మిగతా 48 డివిజన్లలో వైఎస్సార్ సీపీ నెగ్గగా ఒక్క డివిజన్ ఫలితం కోర్టు పరిధిలో ఉంది. ఈ లెక్కన ఎలా చూసినా.. ఎప్పుడు ఎన్నిక నిర్వహించినా.. అది మేయర్ అయినా.. డిప్యూటీ మేయర్ అయినా కచ్చితంగా వైఎస్సార్ సీపీకే దక్కి తీరాలి. కానీ పచ్చ ముఠాల కుతంత్రాల నడుమ మంగళవారం జరిగిన ఎన్నికలో ఒకే ఒక్క కార్పొరేటర్ ఉన్న టీడీపీ డిప్యూటీ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది.

క్షమించండి.. విలపించిన కార్పొరేటర్లు

కిడ్నాప్‌నకు గురైన నలుగురు కార్పొరేటర్లు అనీష్ రాయల్, అనిల్, అమరనాథ్‌రెడ్డి, మోహన్‌కృష్ణ యాదవ్ ఉప ఎన్నిక పూర్తయిన వెంటనే నేరుగా భూమన నివాసానికి చేరుకున్నారు. భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి కాళ్లమీద పడి క్షమించమంటూ అనీష్ రాయల్ కన్నీరు మున్నీరయ్యారు. తమను కిడ్నాప్ చేసిన వ్యక్తులు చిత్రహింసలకు గురి చేశారని, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తామని బెదిరించి వారికి అనుకూలంగా వీడియో చిత్రీకరించారని తెలిపారు. వారికి భయపడి ఓటు వేయాల్సి వచ్చిందని, తప్పు జరిగిపోయిందని వేడుకున్నారు. కూటమికి అనుకూలంగా ఓటు వేసేందుకు తాను నిరాకరించినట్లు అమర్నాథ్‌రెడ్డి వెల్లడించారు.

మూడు చోట్ల ఎన్నికలు వాయిదా

మూడు మున్సిపాలిటీల్లో ఎన్నికలు మంగళవారం కూడా వాయిదా పడ్డాయి. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీలో మున్సిపల్ చైర్మన్ ఎన్నికతో పాటు పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలు 'కోరం'లేని కారణంగా వాయిదా పడగా.. కాకినాడ జిల్లా తునిలో వైస్ చైర్మన్ ఎన్నికను ఉద్రిక్త పరిస్థితులు కారణంగా వాయిదా వేసినట్లు స్థానిక జిల్లాల అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయానికి సమాచారమిచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో మూడు నగర, ఏడు మున్సిపాలిటీల్లో మొత్తం 12 డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా సోమవారం కేవలం ఐదు చోట్ల ఏడు పదవులకు ఎన్నికలు పూర్తయ్యాయి. మిగిలిన ఐదు చోట్ల ఐదు పదవులకు ఎన్నిక మంగళవారానికి వాయిదా పడగా కేవలం రెండు చోట్ల మాత్రమే ఎన్నికల ప్రక్రియ పూర్తయింది.

సూపర్ సిక్స్ ఇవ్వలేమనడం మోసమే..

సీఎం చంద్రబాబుపై మండిపడిన వైఎస్ జగన్

ఈ పెద్దమనిషి మోసాలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ నేతలకు పిలుపు

ఇచ్చిన హామీలు అమలు చేయలేకే దుష్ప్రచారం



వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు చంద్రబాబు ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీలను ఇప్పుడు అమలు చేయలేమని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ ప్రకటన చంద్రబాబునాయుడి వైఖరిని మరోసారి తేటతెల్లం చేసిందని ఎత్తి చూపారు. సూపర్‌సిక్స్ హామీల అమలుపై చేతులెత్తేయడమే కాకుండా, అందుకు ఏవేవో సాకులు చెబుతూ.. వాటిని ప్రజలు నమ్మేలా దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ పెద్దమనిషి ఒక వైపు హామీలన్నింటినీ తుంగలో తొక్కి.. మరో వైపు విద్యుత్ చార్జీల మోతతో భారం మోపుతుండటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సంపద సృష్టించడం తనకు తెలుసంటూ ప్రచారం చేసుకున్న చంద్రబాబు.. కేవలం అప్పులతోనే కాలం వెళ్లదీయడం వంటి అంశాలను కూడా ప్రజల్లో ఎండగట్టాలని నిర్దేశించారు. చంద్రబాబు దారుణ మోసాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందు కోసం రోజూ ప్రజల్లో ఉండాలని, వారితో మరింతగా మమేకం కావాలని సూచించారు. రెండు వారాల లండన్ పర్యటన ముగించుకుని సోమవారం సాయంత్రం తాడేపల్లి చేరుకున్న వైఎస్ జగన్.. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్ నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలతోపాటు ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటనలు, రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల కోత, నిలిచి పోయిన పథకాలు, ఆరోగ్యశ్రీ ఆగిపోవడం తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. తొమ్మిది నెలల కూటమి పాలన ప్రజలకు వ్యతిరేకంగా సాగిందని, దీని వల్ల పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ.. క్షేత్ర స్థాయి అంశాలను నేతలు వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చారు.

అంతటా అరాచకాలే..

రాష్ట్రంలో మున్సిపల్ ఉప ఎన్నికల్లో కూటమి పార్టీల దారుణాల గురించి నేతలు వైఎస్ జగన్‌తో చర్చించారు. ఇలాంటి అరాచకాలు ఎక్కడా చూడలేదని, మెజారిటీ లేని.. అసలు సభ్యులే లేని చోట కూడా గెలవడానికి ఎన్నో దారుణాలు చేశారన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో కచ్చితంగా బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఫీజు పోరుపై ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి పెండింగ్‌లో ఉండడంతో వాయిదా వేసిన అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ, పేద విద్యార్థులను దారుణంగా దెబ్బ తీస్తున్నారని వైఎస్ జగన్ అన్నారు. వచ్చే ఐదేళ్లలో కేంద్రం 75 వేల మెడికల్ సీట్లు అదనంగా పెంచబోతోందని.. కానీ, చంద్రబాబు మాత్రం తమకు కొత్తగా మెడికల్ సీట్లు వద్దంటూ కేంద్రానికి లేఖ రాయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. పేద విద్యార్థుల పక్షాన ఈ అంశాన్ని ఫీజు పోరులో భాగం చేయాలని వైఎస్ జగన్ పార్టీ నాయకులను ఆదేశించారు.

సోదరికి కేసీఆర్ నివాళి




సోదరి సకలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేసీఆర్

కుత్బుల్లాపూర్/హైదరాబాద్: కొంపల్లి మున్సిపాలిటీ చంద్రారెడ్డి గార్డెన్‌లో మంగళవారం జరిగిన తన సోదరి చీటీ సకలమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి.. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు హాజరయ్యారు. సకలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అంతకుముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు సకలమ్మకు నివాళులర్పించారు. కేసీఆర్ సోదరి మృతిపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన సంతకంతో కూడిన లేఖను ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసింది. ఈ కష్ట సమయంలో తగిన బలం, ధైర్యంతో ఉండాలని కోరుకుంటున్నానని కేసీఆర్‌కు పంపిన సంతాప సందేశంలో ప్రధాని పేర్కొన్నారు.

పార్టీ ఫిరాయింపులను అరికట్టాలి

- అందుకోసం చట్టాన్ని మరింత బలోపేతం చేయాలి
- పార్టీ ఫిరాయింపులపై పార్లమెంటరీ కమిటీ వేయండి
- రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేశ్‌రెడ్డి
- నదీ జలాల సమర్థ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచన



సాక్షి, న్యూఢిల్లీ: పెరిగిపోతున్న పార్టీ ఫిరాయింపులను అరికట్టేందుకు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి అన్నారు. ఈ అంశంపై సమగ్ర చర్చ జరగాలని తెలిపారు. పార్టీ ఫిరాయింపులను అరికట్టడంపై పార్లమెంట్ దృష్టి సారించాలని కోరారు. దీనిపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. మంగళవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'పార్టీ ఫిరాయింపులపై సమగ్ర చర్చ జరగాలి. ఫిరాయింపులను అడ్డుకోవడంపై దృష్టి సారించాలి. కోర్టుల జోక్యం అవసరం లేకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. దీనిపై పార్లమెంటే ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో న్యాయశాఖ నేతృత్వంలోని కమిటీ బాధ్యతలు తీసుకొని ప్రస్తుత చట్టానికి అవసరమైన సవరణలు చేసి బలోపేతం చేయాలి' అని సూచించారు.

కాళేశ్వరంతో నంబర్ వన్‌గా మారాం..

నదీ జలాల సమర్థ వినియోగంపై కేంద్రం దృష్టి సారించాలని సురేశ్‌రెడ్డి సూచించారు. దేశంలో సుమారు 70 వేల టీఎంసీల వినియోగార్హమైన నదీ జలాలు ఉన్నా, అందులో 20 వేల టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నామని తెలిపారు. మరో 50 వేల టీఎంసీలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. సమర్థ నీటి వినియోగం లేకపోవటం వల్లే నదీ జలాల వివాదాలు పెరిగిపోతున్నాయని అన్నారు. నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపి, రాష్ట్రాలతో మాట్లాడాల ని సూచించారు. తెలంగాణలో ప్రపంచంలో పెద్దదైన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించామని, ఇది రాష్ట్ర స్వరూపాన్నే మార్చేసిందని చెప్పారు. కరువు ప్రాంతంగా ఉన్న తెలంగాణ.. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఆరేళ్లలోనే ధాన్యం ఉత్పత్తిలో దేశంలో నంబర్ వన్‌గా మారిందని తెలిపారు.

మినిస్టర్ క్వార్టర్స్‌ను ముట్టడించిన వీఆర్‌ఏలు

అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

బంజారాహిల్స్ (హైదరాబాద్): తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన వీఆర్‌ఏలు మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి యత్నించారు. మంగళవారం ఉదయం పెద్ద సంఖ్యలో విచ్చేసిన వీఆర్‌ఏలు ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేస్తూ మినిస్టర్ క్వార్టర్స్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు యత్నించగా పోలీసులు వీరిని అడ్డుకున్నారు. అయితే పోలీసులను దాటుకుని 30 మంది వరకు మినిస్టర్ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. జీవో 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్‌ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని వీరు పేర్కొన్నారు. 3,797 మంది వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా గత 15 నెలలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. భారీ సంఖ్యలో విచ్చేసిన వీఆర్‌ఏలు మినిస్టర్ క్వార్టర్స్ ముందు బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఏ జేఏసీ కో-కన్వీనర వంగూరి రాములు, అధ్యక్షుడు బీసం ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ ముట్టడి జరిగింది.



ప్రభుత్వం ఇచ్చిన సమగ్ర కులగణన రిపోర్టును చించేస్తున్న బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు జూలూరు గౌరీ శంకర్, వకుళాభరణం, జాజుల, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

రాష్ట్రంలో సర్వేను సరిగ్గా చేయనోళ్లు.. దేశవ్యాప్తంగా ఎలా చేస్తారు?

సమగ్ర సర్వే తప్పుల తడక: జాజుల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సరిగ్గా కులగణన సర్వే నిర్వహించలేని కాంగ్రెస్.. దేశమంతా ఎలా చేస్తుందో రాహుల్ గాంధీ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బీసీల లెక్కలు ఎందుకు తగ్గించారో చెప్పాలని డిమాండ్ చేస్తూ.. రచ్చబండల దగ్గర చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంగళవారం బేగంపేట హోటల్ టూరిజం ప్లాజాలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీసీల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వందకు పైగా బీసీ కుల సంఘాలు, 26 పైగా బీసీ సంఘాల అధ్యక్షులు, బీసీ మేధావులు, మహిళా సంఘాలతో పాటు వందలాదిమంది బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. సమావేశంలో ప్రభుత్వం ఇచ్చిన సమగ్ర కులగణన రిపోర్టును చించేసి చెత్తబుట్టలో పడేశారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్‌లు పాల్గొన్నారు. జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని హామీఇచ్చిన కాంగ్రెస్.. చివరికి బీసీలను నట్టేట ముంచిదని మండిపడ్డారు. బీసీల జనాభా 21 లక్షలు తగ్గించి వారిని సమాధి చేయడం అన్యాయం అన్నారు. బీసీల కులాల తప్పుడు లెక్కలపై ఈనెల 6న హైదరాబాద్‌లో అన్ని బీసీ సంఘాలు, మేధావులు, ఉద్యమకారులతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. అలాగే ఫిబ్రవరి చివరి వారంలో లక్షలాదిమందితో బీసీల సమర శంఖారావం మహాసభ నిర్వహిస్తామని జాజుల వెల్లడించారు.

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష: కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశంలో 'హమారా ప్రయాస్.. ఆప్ కా వికాస్'లా పరిస్థితి ఉందని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఎద్దేవా చేశారు. దేశ అభివృద్ధి కోసం తెలంగాణ సహా అన్ని దక్షిణాది రాష్ట్రాలు కష్టపడుతుంటే నిధుల కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందన్నారు. తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడులో బీజేపీని అధికారంలోకి రానివ్వని కారణంగా ఈ రాష్ట్రాలకు ఎలాంటి నిధులు కేటాయించరా? అని ఆమె ప్రశ్నించారు. మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో రేణుకాచౌదరి మాట్లాడారు. తెలంగాణ కేంద్ర ప్రభుత్వానికి చెల్లించిన పన్నుల్లో కేవలం నాలుగు పైసలు మాత్రమే తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. దేశ జీడీపీలో 4.5 శాతం తెలంగాణ రాష్ట్ర వాటా ఉందని గుర్తుచేశారు. 2014లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చకుండా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాలకు ద్రోహం చేసిందని రేణుకాచౌదరి ఆరోపించారు.



పెళ్లి మంటపాల్లో 'డబ్బు' వాద్యాలు

- పెరుగుతున్న పెళ్లి ఖర్చును అదుపు చేయాల్సిందిగా 2017లో రంజిత్ రంజన్ అనే కాంగ్రెస్ ఎంపీ పార్లమెంట్‌లో 'ప్రివెన్షన్ ఆఫ్ వేస్ట్‌ఫుల్ ఎక్స్‌పెండిచర్ ఆన్ స్పెషల్ అకేషన్స్' అనే ప్రైవేట్ బిల్‌ను ప్రవేశపెట్టాడు. దీనిప్రకారం పెళ్లికి అతిథుల సంఖ్య వందకు, పది రకాల వంటకాలు, కానుకల విలువ రూ. 2,500కు మించరాదు. ఎవరైనా పెళ్లి మీద రూ. 5 లక్షలకు మించి ఖర్చు పెడితే పది శాతం డబ్బును ప్రభుత్వ సంక్షేమ నిధికి ఇవ్వాలి. అలా జమ అయిన మొత్తాన్ని ప్రభుత్వం ఏటా పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఖర్చుపెట్టాలి. కానీ ఈ బిల్లు ఆమోదం పొందలేదు.
- 1993లో నాటి ఒడిశా ముఖ్యమంత్రి బిజు పట్నాయక్.. పెళ్లికి ముందు పెళ్లిలో రూ. 25 వేలకు మించి ఖర్చు చేయకూడదంటూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాడు. కానీ అదీ పాస్ అవలేదు.

'మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్' అన్నమాట ఎంతవరకు నిజమో కానీ పెళ్లి వేడుకకు ఆకాశమే హద్దుగా మారిందన్నది మాత్రం వంద శాతం నిజం!

కిందటేడు అంటే 2024లో ఒక్క నవంబర్, డిసెంబర్ నెలల్లోనే 4.8 లక్షల పెళ్లిళ్లయ్యాయి. అవి ఆరు లక్షల కోట్ల వ్యాపారం చేశాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ నివేదిక! దీని ప్రకారం ఈ మొత్తం 4.8 లక్షల్లో రూ. 3 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చు పెట్టిన వివాహాలున్నాయి.

ఈ లెక్క చూశాక తెలిసింది కదా.. పెళ్లి ఖర్చుకు ఆకాశమే హద్దు అని!

ఆచార సంప్రదాయాలు, వ్యవహారాలు, పెట్టుపోతలు ఇవన్నీ ఆడంబరాలుగా మారి పెళ్లిఖర్చును పెంచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెళ్లి అనేది ఒక పెద్ద పరిశ్రమగా మారిపోయింది.

జనవరి 30 నుంచి పెళ్లి ముహూర్తాలు మొదలయ్యాయి. మార్చి 10 వరకు సందడే సందడి! ఆ సందర్భంగా మ్యారేజ్ ఇండస్ట్రీ, మధ్యతరగతి మీద ప్రభావం వంటివి స్పృశిస్తూ ఒక కథనం..

మన దేశంలో సగటు వివాహ ఖర్చు.. ఒక ఇంటి ఏడాది ఆదాయం కంటే మూడు రెట్లు ఎక్కువ! అది మన దేశ వెడ్డింగ్ ఇండస్ట్రీని దాదాపు రూ. లక్షాపదమూడు కోట్లతో ప్రపంచంలోని అతిపెద్ద పరిశ్రమల్లో ఒకటిగా చేర్చింది. ఇది అమెరికా వెడ్డింగ్ మార్కెట్ కన్నా రెండింతలు పెద్దది. కోవిడ్ తర్వాత పెళ్లి వ్యయం మరింత ప్రియం అయింది. అతిథుల సంఖ్య తగ్గింది. కానీ ఖర్చు నయా పైసా కూడా తగ్గలేదు. ఇదివరకు ఆడపిల్ల పెళ్లంటే బంధువులు, స్నేహితులు అన్నిరకాలుగా అండగా నిలిచి ఉన్నదాంట్లో ఆ వేడుకను సంప్రదాయబద్ధంగా జరిపించి తల్లిదండ్రులు తేలికపడేలా చేసేవారు. మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారైతే ఇల్లు వాకిలి, పొలమూ పుట్రా అమ్మడమో, తాకట్టు పెట్టడమో చేసి పెళ్లి జరిపించేవారు. అప్పుడు వరకట్నాలు లాంఛనాలు, బంగారం కిందే జమయ్యేవి. ఇప్పుడా సీన్ మారిపోయింది. అమ్మాయిలూ ఉద్యోగాలు చేస్తున్నారు. పర్‌ఫెక్ట్ ప్లాన్‌తో ఉంటున్నారు. ఆ ప్రణాళికలో పెళ్లికీ ప్రయారిటీ ఇస్తున్నారు. హల్దీ, మెహందీ, సంగీత్, పెళ్లి కూతురు–పెళ్లికొడుకు సహా పెళ్లిని అయిదు రోజుల ఈవెంట్స్‌తో ఘనంగా జరిపించుకోవాలనుకుంటున్నారు. ఫొటోలు, వీడియోలే కాదు సోషల్ మీడియా షార్ట్స్, రీల్స్‌గానూ ప్రెజెంట్ చేయాలనుకుంటున్నారు. వీటన్నిటి ఖర్చు కోసం కొలువు తొలిరోజు నుంచే ఆదా చేయడం మొదలు పెడ్తున్నారు. అలా పెళ్లి ఖర్చును అమ్మాయిలు తమ ఖాతాలో వేసుకుంటున్నారు. కట్నకానుకలను మాత్రం తల్లిదండ్రులు తమ బాధ్యతగా భావిస్తున్నారు. అవి స్థిర, చరాస్తులుగా రూపాంతరం చెందాయి. అమ్మాయి పేరు మీదే ఉంటున్నాయి. అవీ పెళ్లి ఖర్చులో భాగమయ్యి, తల్లిదండ్రులు పెట్టే ఖర్చుల జాబితాలో చేరుతున్నాయి. అయితే ఇవి మ్యారేజ్ ఇండస్ట్రీలో కలవని అదనపు ఖర్చన్న మాట.

బ్యాచిలర్.. బ్యాచిలరేట్ పార్టీలు కూడా..

దేశంలో సగటు మధ్యతరగతి కుటుంబం కూడా పెళ్లి మీద భారీగా ఖర్చుపెడుతోందంటోంది సీఏఐటీ సర్వే! తెలుగు రాష్ట్రాల్లో అయితే అది కనిష్ఠంగా రూ. 30 లక్షలు. పెళ్లి వేదిక, వచ్చే అతిథుల సంఖ్య, వంటకాల సంఖ్య, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సోషల్ మీడియా రీల్స్, షార్ట్స్ వగైరాలను బట్టి ఈ బడ్జెట్ పెరుగుతుంది. డెస్టినేషన్ వెడ్డింగ్ అయితే అది రూ. కోటి దాటుతోంది. ఈ ప్యాకేజ్‌లో బ్యాచ్‌లర్, బ్యాచ్‌లరెట్ ట్రిప్స్ కూడా ఉన్నాయి. ఇప్పుడు పెళ్లి ఖర్చును వధూవరులిద్దరూ సమంగా పెట్టుకునే ఆనవాయితీ మొదలైంది. ఇది ఒకందుకు మంచి పరిణామంగానే భావించినా.. అసలు పెళ్లనేది వ్యక్తిగత లేదా రెండు కుటుంబాలకు చెందిన వ్యవహారం. దానికి అంతంత ఖర్చుపెట్టాల్సిన అవసరం ఏముందని అభిప్రాయపడుతున్నారు సోషల్ ఇంజినీర్స్. ఫలానా వాళ్ల పిల్లల పెళ్లి కన్నా గొప్పగా తమ పిల్లల పెళ్లి చేయాలని తల్లిదండ్రులు, తమ స్నేహితులు.. కొలీగ్స్ కన్నా ఘనమనిపించుకోవాలని వధూవరులు.. పోటీలకు పోతూ, ఉన్న సేవింగ్స్ అన్నీ ఊడ్చేసుకుని.. అప్పులు కూడా తెచ్చుకుని మరీ పెళ్లి చేస్తున్నారు.. చేసుకుంటున్నారు. ఎస్‌బీఐ సహా పేరున్న ప్రైవేట్ బ్యాంకులన్నీ పెళ్లిళ్లకు లోన్స్ ఇస్తున్నాయి. పర్సనల్ లోన్ ఖాతాను పెంచడంలో వీటి పాత్ర గణనీయం. కస్టమ్ వెడ్డింగ్ లోన్ ప్రోడక్ట్స్ బ్యాంకుల డిమాండ్‌నూ పెంచుతున్నాయి. ఈ అప్పులను తీర్చడానికి ఉన్న ఆస్తులను అమ్ముకుంటున్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వోద్యోగులైతే ఆ అప్పులు తీర్చడానికి అవినీతికి పాల్పడిన దాఖలాలూ ఉన్నాయంటున్నారు సోషల్ ఇంజినీర్స్. ఈ అప్పులతో కొత్త పెళ్లిజంట మధ్యలో కూడా స్పర్థలు వచ్చి విడాకుల దాకా వెళ్లిన సంఘటనలూ ఉన్నాయని చెబుతున్నారు.

> మెహందీ, హల్దీ, సంగీత్, డిజైనర్ వేర్ వంటివన్నీ సినిమాల పుణ్యమే! వెడ్డింగ్ ప్లానర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్, థీమ్ థింగ్స్, ప్రీ వెడ్డింగ్ షూట్, రీల్స్, షార్ట్స్ లాంటి వాటన్నిటికీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, ఓటీటీ సిరీస్‌ల ప్రభావం కారణమంటున్నారు ట్రెండ్ ఎనలిస్ట్‌లు.

కన్‌స్ట్రక్టివ్‌గా ఇన్వెస్ట్ చేసుకోవాలి

సంపాదించుకుంటున్నాం కదాని ఉన్న సేవింగ్స్ అన్నిటినీ పెళ్లి అట్టహాసాలకే ఖర్చు చేయడం కరెక్ట్ కాదు. ఉన్న వాళ్లు ఎంత ఖర్చుపెట్టుకున్నా పర్లేదు. కాని వాళ్లను మిడిల్ క్లాస్ పీపుల్ ఫాలో అయితేనే తర్వాత ఆర్థికంగా, ఎమోషనల్‌గా చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పులు చేసి మరీ మన చుట్టూ ఉన్నవాళ్లను మెప్పించడం వల్ల మన ఇల్లు గుల్లవడం తప్ప పైసా ప్రయోజనం ఉండదు. పెళ్లి తర్వాత ఇల్లు, పిల్లలు .. వాళ్ల చదువులు లాంటి ఎన్నో బాధ్యతలుంటాయి. వాటి కోసం సేవింగ్స్‌ని ప్లాన్ చేసుకోవాలి. కష్టపడి సంపాదించుకున్న డబ్బును ఆచితూచి మదుపు చేసుకోవాలి. దాని వల్ల మనం సంతోషంగా ఉండటమే కాదు ప్రకృతి వనరులను, శ్రమను గౌరవించిన వాళ్లమవుతాం!

– డాక్టర్ కస్తూరి అలివేలు,
అసోసియేట్ ప్రొఫెసర్, డీన్, డీజీఎస్ సెస్,
హైదరాబాద్.



కాంప్రమైజ్ అవ్వట్లేదు

వెడ్డింగ్ సెలబ్రేషన్స్ విషయంలో ఎవరూ కాంప్రమైజ్ అవట్లేదు. కోవిడ్ తర్వాత ఈ ట్రెండ్ మరీ ఎక్కువైంది. పెళ్లికి వచ్చే అతిథులు తగ్గారు కానీ.. వేడుకల విషయంలో మాత్రం ఎవరూ వెనకడుగు వేయట్లేదు. మధ్యతరగతి వాళ్లు కూడా వెడ్డింగ్ ప్లానర్‌ని పెట్టుకుంటున్నారు. ఎంత తక్కువనుకున్నా 30 లక్షల నుంచి మొదలవుతోంది వెడ్డింగ్ బడ్జెట్. డెస్టినేషన్ వెడ్డింగ్స్ అయితే 50.. 60 లక్షలు ఇంకా ఆపై కూడా ఉంటోంది. ఇదివరకు ఈవెంట్స్ అన్నీ ఫొటోలు, వీడియోలకే పరిమితమై ఉండేవి. ఇప్పుడు రీల్స్, షార్ట్స్‌లో సోషల్ మీడియాలోనూ ప్రెజెంట్ చేయాలనుకుంటున్నారు. బ్రైడ్ అండ్ గ్రూమ్ కొత్త కొత్త ఐడియాలతో వచ్చి వాటిని అమలు చేయడానికి ప్లాన్లు అడుగుతున్నారు. పీర్స్ కన్నా డిఫరెంట్‌గా ఉండాలనీ, తామే ఒక కొత్త ట్రెండ్ సెట్ చేయాలనే ఆలోచనతో వస్తున్నారు. ఎంతైనా ఖర్చు పెట్టడానికి రెడీ అవుతున్నారు. దీంతో వెడ్డింగ్ ప్లానర్స్‌కి డిమాండ్ పెరుగుతోంది. వాళ్లమధ్య పోటీ కూడా ఎక్కువే ఉంటోంది. కొంచెం క్రియేటివిటీ ఉంటే చాలు వెడ్డింగ్ ప్లానర్ అనే బోర్డ్ పెట్టేసుకుంటున్నారు.

– వర్ధమాన్ జైన్,
వెడ్డింగ్ ప్లానర్



డిమాండ్ పెరిగింది

పెళ్లి ఫొటో, వీడియోగ్రఫీలు తక్కువలో తక్కువ రెండు లక్షల నుంచి మొదలు ఈవెంట్స్ కవరేజ్‌ను బట్టి బడ్జెట్ పెరుగుతుంది. ప్రీ వెడ్డింగ్ షూట్స్ కోసం స్టూడియోస్ కూడా ఉన్నాయి. డబ్బుండి, టైమ్ లేని వాళ్లు ఆ స్టూడియోస్‌లో షూట్స్‌ని ప్రిఫర్ చేస్తుంటే.. డబ్బు, టైమ్ రెండూ ఉన్నవాళ్లు విదేశాలకూ వెళ్లి షూట్ చేయించుకుంటున్నారు. మొత్తం మీద ఫొటో, వీడియోగ్రాఫర్స్‌తో పాటు ఈ స్టూడియోస్‌కీ డిమాండ్ బాగా పెరిగింది.

– వీఎన్ రాజు,
వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్

ఇవీ ఉన్నాయి..

ఈ ఘనమైన మాయకు ఇరుగు పొరుగు, బంధుగణం, తోటివాళ్లే కాదు సినిమాలు, సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లూ బాధ్యులు. 'మురారి' సినిమా వచ్చిన కొత్తలో మాట.. ఒక ప్రోగ్రెసివ్ కుటుంబంలోని అమ్మాయి 'మురారి' సినిమాలో పెళ్లి సీన్స్‌కి ఇన్‌ఫ్లుయెన్స్ అయ్యి.. తన పెళ్లి ఆ సినిమాలో చూపించినట్టే జరగాలని పట్టుబట్టి మరీ ఆ తరహాలోనే పెళ్లి చేసుకుంది. తల్లిదండ్రులు తమ అమ్మాయి పెళ్లికోసం అప్పట్లోనే అయిదు లక్షల రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. ఇందులో బాలీవుడ్ పాత్రా ఉంది. ఈ మెహందీ, హల్దీ, సంగీత్, డిజైనర్ వేర్ వంటివన్నీ దాని పుణ్యమే! వెడ్డింగ్ ప్లానర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్, థీమ్ థింగ్స్, ప్రీ వెడ్డింగ్ షూట్, రీల్స్, షార్ట్స్ లాంటి వాటన్నిటికీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, ఓటీటీ సిరీస్‌ల ప్రభావం కారణమంటున్నారు ట్రెండ్ ఎనలిస్ట్‌లు.

వృథా కూడా అదే స్థాయిలో!

ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఏటా 1.7 బిలియన్ టన్నులు అంటే మనిషి పండించే పంటలో మూడొంతులు వృథా అవుతోందట. ఈ వృథాలో అధిక వాటా పెళ్లిళ్ల లాంటి వేడుకలదే! అందులో మనమేం తక్కువలేం! ఈ వృథా వల్ల ఇంకొకరి ఆహారపు హక్కును మనం హరించినట్టే! అంతేకాదు.. ఈ ట్రెండ్ ధరలనూ ప్రభావితం చేసి నిత్యావసరాలను అందుకోలేనంత ఎత్తులో పెట్టేస్తోంది.

ఇకో ఫ్రెండ్లీ

యువత అంతా లగ్జరీ వైపే చూస్తోందని ఆందోళన చెందక్కర్లేదు. పెళ్లనేది పూర్తి వ్యక్తిగత వ్యవహారంగా భావించి రిజిస్టర్ మ్యారేజ్‌తో ఒక్కటవుతున్న జంటలూ ఉన్నాయి. తమ పెళ్లికి ఆత్మీయులు, సన్నిహితుల ఆశీస్సులు అవసరమనుకునేవారు దాన్ని కుటుంబ వేడుకకే పరిమితం చేసుకుంటున్నారు. అనవసర ఖర్చు లేకుండా, స్థానికంగా దొరికే వస్తువులతోనే పర్యావరణహితంగా మలచుకుంటున్నారు. ఈ జంటలే భవిష్యత్ జంటలకు మార్గదర్శకంగా నిలవాలని ఆశిద్దాం!

– సరస్వతి రమ

పెంపకం



సుధామూర్తి, అక్షత

పుస్తకాలు మా ఇంటి సభ్యులు

తల్లీ కుమార్తె కూచుంటే ఏం మాట్లాడుకుంటారు? మెట్టినింటి విషయాలో.. నగలో, చీరలో... అనుకోవచ్చు కొందరు. కానీ వారు పుస్తకాల గురించి మాట్లాడుకుంటారని తెలుసా? సుధామూర్తి, ఆమె కుమార్తె అక్షతా మూర్తి 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో తల్లి కుమార్తె చేత ఎందుకు పుస్తకాలు చదివించాలో, తామెలాంటి పుస్తకాలు చదివారో మాట్లాడుకున్నారు. ప్రేక్షకుల్లో నారాయణమూర్తి, బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునక్ కూచుని విన్నారు. 'పవర్ ఆఫ్ బుక్'... తమిద్దరి దగ్గరా ఉన్నదని సుధా, అక్షత అన్నారు. వివరాలు..

'అమ్మా... నువ్వు పుస్తకాలు మా చేత ఎందుకు చదివించాలని పట్టుబట్టావ్? పుస్తకాలు నీ జీవితంలోకి ఎలా ప్రవేశించాయి?' అని ప్రశ్నించారు అక్షతా మూర్తి.

'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ 2025'లో రెండు రోజుల క్రితం జరిగిన 'మై మదర్ మైసెల్ఫ్' అనే సెషన్‌లో అక్షతా మూర్తి తన తల్లి సుధామూర్తిని పుస్తకాలు, పెంపకం, వ్యక్తిత్వం వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతూ తల్లీకూతుళ్లుగా తాము నడిచి వచ్చిన జీవితాన్ని మననం చేసుకున్నారు. కిక్కిరిసిన వేలాది ప్రేక్షకులతో పాటు అక్షత తండ్రి ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, భర్త బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్‌లు ముందు వరుసలో కూచుని ఈ సెషన్ విన్నారు. సెషన్‌కు ముందు రిషి సునాక్ లేచి నిలబడి ప్రేక్షకుల వైపు చూస్తూ 'నమస్తే' అని అభివాదం చేయడం అందరినీ ఆకట్టుకుంది.

ఇక కూతురి ప్రశ్నకు సుధామూర్తి సమాధానం చెప్తూ–

సుధామూర్తి: మాది టీచర్ల ఫ్యామిలీ. మా తాత టీచర్. మా నాన్న మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్. అమ్మ టీచర్. నేనూ ఆ తర్వాత టీచర్‌నయ్యాను. మామగారు కూడా టీచరే. మా ఇంట్లో టీచరు కానిది నా భర్తగా వచ్చిన నారాయణమూర్తి ఒక్కడే. కాబట్టి అనివార్యంగా నేను చిన్నప్పటి నుంచి డబ్బుతో కాకుండా పుస్తకాలతో పెరిగాను. మా ఇంట్లో ఎవరి బర్త్‌డేకైనా ఇచ్చే గిఫ్ట్ పుస్తకమే. అలా పుస్తకాలు అలవాటు చేశారు. పుస్తకాలంటే అజ్ఞానంతో పడిన తలుపులను తెరిచే తాళం చెవులు. అవి మనకు ఎన్నో నేర్పిస్తాయి. పుస్తకాలు చదవడం లేదా నేర్చుకోవడం ఎప్పుడైతే మానేస్తామో ఆ రోజు నుంచి జీవించడం మానేసినట్టు. అందుకే నా పిల్లలు కూడా పుస్తకాలు చదవాలని నేను పట్టుబట్టాను....

అక్షత: నువ్వు పట్టుబట్టడం వల్ల నేను, రోహన్ (సోదరుడు) నేటికీ లాభపడుతున్నాం. నీకు గుర్తుందా అమ్మా... మనింట్లో నీదో లైబ్రరీ ఉండేది. అందులో సాహిత్యం, చరిత్ర పుస్తకాలుండేవి. నాన్నదో లైబ్రరీ ఉండేది. అందులో సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలుండేవి. మీ ఇద్దరి లైబ్రరీలు– ఆ రోజుల్లో ఇంటర్నెట్ లేదు కనుక నా చదువులో పెద్ద రిఫరెన్సుగా ఉండేవి. స్కూల్లో ఏ ప్రాజెక్టు చేయాల్సి వచ్చినా ఉద్వేగంగా ఇంటికి వచ్చి పుస్తకాలు తిరగేస్తూ కూరుకుపోయేదాన్ని. అన్నట్టు నీకు సేవాభావం పుస్తకాల నుంచే వచ్చిందా?

సుధామూర్తి: మా నానమ్మ ఊళ్లో మంత్రసానిగా ఉండేది. డబ్బుకు కాదు. సేవకోసం. కులం, మతం, జాతి.. పట్టింపు ఉండేది కాదు. వెళ్లి పురుడుబోసి వచ్చి తలస్నానం చేసి ఇంట్లోకి వచ్చేది. తగిన వైద్యం లేక స్త్రీలు పడే వేదన ఆమె చెప్తుంటే విని విని నాన్న గైనకాలజిస్ట్ అయ్యారు. మా చెల్లెలు (నంద) కూడా గైనకాలజిస్ట్ అయ్యింది. సేవ చేస్తే ఎంత తృప్తి ఉంటుందో నాకు తెలిసింది. మా నానమ్మకు 62 ఏళ్లు ఉన్నప్పుడు నాకు 12 ఏళ్లు. కన్నడ నేర్చుకోవాలని అంటే మూడు నెలలు స్ట్రిక్ట్ టీచర్‌గా పాఠాలు చెప్పాను. ఏ రోజైతే ఆమె తనకు తానుగా కన్నడం చదవడం నేర్చుకుందో వచ్చి నా కాళ్లకు ప్రణామం చేసింది గురువుగా. నేను షాక్ అయ్యాను. జ్ఞానం పంచిన వారు గురువే చిన్నైనా పెద్దయినా. చాలా సంతోషం అనిపించింది. జ్ఞానం పంచడం కూడా సేవే అని తెలుసుకున్నాను.



సుధామూర్తిని అక్షత ఇంటర్వ్యూ చేస్తుండగా బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునక్, నారాయణమూర్తి ప్రేక్షకుల్లో కూర్చుని వింటున్న దృశ్యం

అక్షత: మీ నానమ్మ పేరు ఏమిటి?

సుధామూర్తి: కృష్ణ

అక్షత: నా చిన్న కూతురి పేరు అదేగా. కృష్ణ. (పెద్ద కూతురు అనుష్క). అమ్మా... నువ్వు మమ్మల్ని ఆదర్శంగా ఉండమని కూడా చెప్పేదానివి.

సుధామూర్తి: ఒక మాటుంది.. ఇరవై ఏళ్ల వయసులో ఆదర్శంగా లేకపోతే హృదయం లేనట్టు. నలభై ఏళ్ల వయసులో ఆదర్శంగా ఉంటే బుర్ర లేనట్టు. కాని నేను ఈ వయసులో కూడా ఆదర్శంగానే ఉన్నాను. జీవితంలో ఆదర్శాలు ముఖ్యం. మీకు చిన్నప్పటి నుంచి ఒకటే చెప్పేదాన్ని– జీవితంలో ఏదైనా కాకపోయినా ఆదర్శవంతంగా మాత్రం ఉండండి అని. ఆదర్శంగా ఉండటం అంటే. పార్శీ వారు చెబుతారు... ఏది ఆలోచిస్తామో అదే మాట్లాడటం... ఏది మాట్లాడతామో అదే చేయడం. బుద్ధికీ, వాక్కుకీ, చేతకీ సారూప్యతే ఆదర్శం. ఒకటి చెప్పి ఒకటి చేయడం కపటం.

అక్షత: నీకు ఇష్టమైన పుస్తకం ఏది?

సుధామూర్తి: ముందు నువ్వు చెప్పు.

అక్షత: నాకు సుఖాంతాలున్న పుస్తకాలు ఇష్టమే కాని పాత్రలు ఎన్ని విషమ పరీక్షలు ఎదురైనా తట్టుకుని నిలబడేట్టుగా ఉంటే ఇంకా ఇష్టం. చారిత్రక ఘట్టాలు, వ్యక్తులను తీసుకుని రాసే పుస్తకాలు ఇష్టం. నీకు?

సుధామూర్తి: నా పుస్తకమే చెబుతాను– 'మహాశ్వేత'. అది రాసినప్పుడు నేను ప్రొఫెసర్‌గా చేస్తున్నాను. ఒకరోజు ఎవరిదో పెళ్లికి నన్ను తప్పనిసరిగా ఆహ్వానించారు. ఆశ్చర్యంతో వెళ్లాను. భోజనం చేయాలని పట్టుబట్టారు. కారణం అడిగితే పెళ్లికొడుకు నా మహాశ్వేత నవలను చదివాడట. పెళ్లికూతురుగా తెల్లమచ్చలు ఉన్న అమ్మాయిని ఎంపిక చేసుకున్నాడట. మీ నవల వల్లే తెల్ల మచ్చలు ఉన్న అమ్మాయిల వ్యథ అర్థం చేసుకుని ఈ పెళ్లి చేసుకున్నానని చెప్పాడు. ఒక సింపుల్ పెన్ ఎంత మార్పు తేగలదో చూడటం. పవర్ ఆఫ్ బుక్ అంటే అది.

అక్షత: పవర్ ఆఫ్ బుక్ ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి. జీవితంలో ఉపయోగించడానికి పనికి వచ్చే ఆయుధం పుస్తకమే.

సుధామూర్తి: కచ్చితంగా.

అక్షత: థ్యాంక్యూ అమ్మా... ఇలా కూచుని మనం మాట్లాడుకున్నందుకు.

సుధామూర్తి: అందరికీ థ్యాంక్స్.

– జైపూర్ నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి

లీగల్

ఒరిజినల్ ప్రామిసరీ నోటు ఉంటే మంచిది

నా భర్త ఆరేళ్ల క్రితం తన కజిన్‌కి 7 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చారు. నెలవారీ వడ్డీ చెల్లించేలా ప్రామిసరీ నోటు కూడా రాయించుకున్నాము. ఆయన కొంతకాలం వడ్డీ ఇచ్చారు కానీ తర్వాత కట్టడం ఆపేశారు. దాంతో మేము కోర్టును ఆశ్రయించాం. కోర్టులో కేసు నడుస్తుండగానే నా భర్త చనిపోయారు. మా వద్ద అప్పు తీసుకున్న వారి తండ్రికి భూములు ఉన్నాయి. మావారు కాలం చేసిన తర్వాత మాకు రావలసిన బాకీ గురించి అడిగాను. అందుకు వారు అంగీకరించకపోగా ''కోర్టులో తేల్చుకుంటాము'' అంటున్నారు. ప్రామిసరీ నోటు నా పేరు మీదే ఉంది కానీ ప్రస్తుతం నా వద్ద ఒరిజినల్ లేదు. నేను ఒక ప్రభుత్వ ఉద్యోగిని. ప్రామిసరీ నోటు ఒరిజినల్ ఎక్కడ ఉందో నాకు తెలియదు. ప్రామిసరీ నోటుపై ఉన్న సాక్షులు కూడా ఇప్పుడు డబ్బులు తీసుకున్న వారి వైపే ఉన్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు సలహా ఇవ్వగలరు.

– లత, సత్యసాయి జిల్లా


ప్రామిసరీ నోటు మీ పేరు మీదే ఉంది అంటున్నారు కాబట్టి కోర్టులో కేసు మీరు నడిపించవచ్చు. మీకు మీ డబ్బులు తిరిగి పొందే హక్కు – వీలూ రెండూ ఉన్నాయి. ఒరిజినల్ ప్రామిసరీ నోటు చాలా ముఖ్యమైన ఆధారం. అయితే అది లేనంత మాత్రాన మీ కేసు తేలకుండా పోదు. వేరే ఆధారాల మీద మీరు కేసు నడిపించాలి. ప్రామిసరీ నోటును ద్వితీయ సాక్ష్యం (సెకండరీ ఎవిడెన్స్)గా తీసుకునే వీలు ఉందా లేదా అనే అంశాన్ని మీ కేసు పూర్వాపరాలు సమీక్షించిన మీ లాయర్ మాత్రమే చెప్పగలరు. మీరు డబ్బులు ఇచ్చారనడానికి ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ వంటి ఏదో ఒక సాక్ష్యం ఉన్నా సరిపోతుంది. మీరు ప్రభుత్వ ఉద్యోగి అని చెప్తున్నారు. అంతమొత్తంగా డబ్బులు మీకు చెందినవే అనే అంశాన్ని రుజువు చేయాల్సి ఉంటుంది. మీరు ఇన్‌కమ్ టాక్స్ డిక్లరేషన్ చేశారా లేదా ప్రభుత్వానికి మీ వద్ద ఉన్న నగదు గురించి డిక్లేర్ చేశారా లేదా అనే అంశాలపై అవతలవారు కేసు నడిచే క్రమంలో అడగవచ్చు. దానికి సమాధానాలు ఇచ్చేందుకు మీరు సిద్ధపడి ఉండాలి. మీరు ఒకవేళ ప్రభుత్వానికి సదరు లావాదేవీ గురించి డిక్లేర్ చేసి ఉన్నట్లయితే ఎలాంటి భయం అవసరం లేదు. ఇదంతా ఎందుకనుకుంటే మధ్యవర్తి ద్వారా మరోసారి ప్రయత్నం చేయండి.

ప్రభుత్వ ఉద్యోగిగా మీకు తెలిసే ఉంటుంది. మీరు ఎటువంటి అమ్మకాలు/ కొనుగోలు చేసినా ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి డిక్లేర్ చేయవలసి ఉంటుంది. అధికమొత్తంలో నగదు సేవింగ్స్ రూపంలో ఉన్నప్పటికీ కూడా చెప్పాల్సి ఉంటుంది. మీకు వేరే ఆదాయం ఉంటే అది కూడా డిక్లేర్ చేయడం మంచిది. ప్రభుత్వ ఉద్యోగిగా ఆర్థిక లావాదేవీలు అధిక మొత్తంలో చేసినప్పుడు జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది



మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



భారతదేశంలోని అనేక మెట్రోపాలిటన్ నగరాల్లో నివసించే ప్రజలు సరైన నిద్ర పోవడం లేదని ఓ సర్వేలో తేలింది. అంటే ప్రతి నలుగురు భారతీయుల్లో ఒకరు నిద్రలేమి వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దేశంలోని 59 శాతం మంది ప్రజలు రాత్రి 11 గంటల తర్వాత నిద్రపోతున్నారు. మొబైల్ వాడకమే అందుకు కారణం.

నిమ్మరసం రోజూ తాగటం వలన మ్యూకస్ ఉత్పత్తి అదుపులో ఉండి గురకలను తగ్గిస్తుంది. ఒక చెంచా తాజా నిమ్మరసాన్ని రోజు ఉదయాన తాగటం వల్ల ఈ గురకల నుంచి ఉపశమనం పొందుతారు. అంతేకాకుండా, చక్కెర కలపని నిమ్మరసం మీ శ్వాస గొట్టాలను శుభ్రంగా ఉంచి దగ్గు, జలుబులకు దూరంగా ఉంచుతుంది.





స్నానం చేసేటప్పుడు శరీరానికి సోప్ అప్లై చేశాక లూఫాతో రుద్దుతుంటాం. అయితే చాలాసార్లు స్నానం తర్వాత లూఫాను శుభ్రం చేయకుండా వదిలేస్తాం. మరుసటి రోజు మళ్లీ అదే లూఫాతో ఒంటిని రుద్దుతాం. ఇలా చేయడం వల్ల ఆ లూఫాలో పేరుకు పోయిన బాక్టీరియా శరీరాన్ని చేరి అలర్జీ సంబంధిత సమస్యలు వస్తాయి. కాబట్టి లూఫాను శుభ్రం చేశాకే వాడాలి.



స్విమ్మర్లు ధినిధి, శ్రీహరి నటరాజ్‌లకు చెరో తొమ్మిది పసిడి పతకాలు

జాతీయ క్రీడల్లో కర్ణాటక స్విమ్మర్లు ధినిధి డెసింగు, శ్రీహరి నటరాజ్ పతకాల పంట పండించారు. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల స్విమ్మింగ్ ఈవెంట్‌లో ఈ ఇద్దరూ చెరో 9 పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన 14 ఏళ్ల ధినిధి మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో జాతీయ రికార్డు తిరగరాస్తూ స్వర్ణం చేజిక్కించుకోవడంతో పాటు... 400 మీటర్ల ఫ్రీస్టయిల్, మిక్స్‌డ్ 4x400 ఫ్రీస్టయిల్, 200 మీటర్ల ఫ్రీస్టయిల్, 100 మీటర్ల బటర్‌ఫ్లయ్, 4x100 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే, 50 మీటర్ల ఫ్రీస్టయిల్, 4x200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే, మిక్స్‌డ్ 4x100 మీటర్ల మెడ్లేలో పసిడి పతకాలతో మెరిసింది. దీంతో పాటు 50 మీటర్ల బటర్‌ఫ్లయ్‌లో రజతం, 4x100 మీటర్ల రిలే మెడ్లేలో కాంస్యంతో మొత్తం 11 పతకాలు ఖాతాలో వేసుకుంది. పురుషుల విభాగంలో శ్రీహరి మొత్తం 10 పతకాలు (9 స్వర్ణాలు, 1 రజతం) సాధించాడు. మంగళవారంతో జాతీయ క్రీడల్లో స్విమ్మింగ్ పోటీలు ముగియగా... ఓవరాల్‌గా పట్టికలో కర్ణాటక 37 పతకాలతో (22 స్వర్ణాలు, 10 రజతాలు, 5 కాంస్యాలు)తో అగ్రస్థానంలో ఉంది.



నిమిషాల్లోనే టికెట్లన్నీ...

- దాయాదుల 'చాంపియన్స్' మ్యాచ్ టికెట్లు హాట్‌కేకుల్లా 'సోల్డ్ అవుట్'
- ఈ నెల 23న దుబాయ్‌లో భారత్, పాకిస్తాన్ పోరు

దుబాయ్: మ్యాచ్ కంటే ముందే దాయాదుల దమ్మెంటో తెలిపే వార్త ఇది! కేవలం ఐసీసీ టోర్నీల మ్యాచ్‌లకే పరిమితమైన భారత్, పాకిస్తాన్‌ల మ్యాచ్ అంటే ఆ క్రేజే వేరు. ఆతిథ్య దేశం పాక్ అయినా... భారత్ మ్యాచ్ హైబ్రిడ్ మోడల్‌లో దుబాయ్‌లో జరుగుతున్నా... పొంగుకొచ్చే అభిమానం, కట్టలు తెగే భావోద్వేగం అంతా ఇంతా ఉండదని మరోసారి నిరూపితమైంది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఇంకో రెండు వారాల్లో మొదలవుతోంది. అయితే ఏ మ్యాచ్‌కు లేని విశేషాదరణ... పాక్‌లో జరుగుతున్నా... పాక్ ఆడే మ్యాచ్‌కు సైతం లేని 'సోల్డ్ అవుట్' బోర్డు ఒక్క భారత్, పాక్ లీగ్ మ్యాచ్‌కు అది కూడా నిమిషాల్లో...



నిజం! నిమిషాల వ్యవధిలోనే టికెట్లన్నీ అమ్ముడుపోయాయి. ఆన్‌లైన్ వేదికగా జరిగిన విక్రయం ఇలా మొదలవగానే అలా ముగిసిపోయింది. ఓ సర్క్‌కు సంబంధించిన ప్రకటన 'అవాక్కయ్యారా' అనే ఫీలింగ్ వచ్చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఫిబ్రవరి 23న జరిగే ఈ మ్యాచ్ టికెట్లు దక్కించుకునేందుకు వేల మంది ఆన్‌లైన్ విక్రయంపై దండెత్తడంతో నిమిషాల్లోనే ఆన్‌లైన్ విండోలో 'సోల్డ్ అవుట్' బోర్డు పెట్టేశారు. కేవలం ప్రారంభ స్థాయి 125 దిర్హమ్ (రూ.2965) టికెట్లే కాదు... ప్రీమియం రేంజ్ 2000 దిర్హమ్ (రూ.47,418), 5000 దిర్హమ్ (రూ. లక్షా 18 వేలు) టికెట్లు సైతం అయిపోయాయంటే ఈ మ్యాచ్‌కున్న క్రేజ్‌కు ఎంతయినా వెచ్చించేందుకు ఫ్యాన్స్ 'తగ్గేదేలే' అని చాటారు. గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్... ఆతిథ్య పాక్‌తో పాటు బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌లతో లీగ్ మ్యాచ్‌లను ఇదే వేదికపై ఆడుతుంది. పాక్ కంటే ముందుగా 20న బంగ్లాదేశ్‌తో భారత్ ఆడుతుంది. మళ్లీ మార్చి 2న న్యూజిలాండ్‌తో ఆఖరి లీగ్ దశ పోరులో తలపడుతుంది. టీమిండియా ఒకవేళ సెమీఫైనల్, ఫైనల్ చేరినా... ఆ మ్యాచ్‌లు ఇక్కడే నిర్వహిస్తారు. ఈ వన్డే ఫార్మాట్ మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతాయి. గ్రూప్ 'బి'లో ఆ్రస్టేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్‌లు తలపడతాయి.



ట్రెయినర్ షాలిని, హెడ్ కోచ్ నూషీన్, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, త్రిష, ధృతి (ఎడమ నుంచి)

త్రిషకు ఘన స్వాగతం

స్వదేశం చేరిన భారత అండర్–19 టీమ్

సాక్షి, హైదరాబాద్: మహిళల అండర్–19 వరల్డ్ కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించిన యువ తార, హైదరాబాద్‌కు చెందిన గొంగడి త్రిష మంగళవారం స్వస్థలం చేరుకుంది. శంషాబాద్ విమానాశ్రయంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అరశనపల్లి జగన్ మోహన్ రావు ఘన స్వాగతం పలికారు. త్రిషతో పాటు భారత జట్టులో సభ్యురాలైన కేసరి ధృతి, టీమ్ హెడ్ కోచ్ నూషీన్ అల్ ఖదీర్, ట్రెయినర్ షాలిని కూడా నగరానికి చేరుకున్నారు. ఈ నలుగురినీ జగన్‌మోహన్ రావు సన్మానించారు. 19 ఏళ్ల త్రిష తన అద్భుత ఆటతీరుతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేసిందని ఆయన ప్రశంసించారు. త్రిష, ధృతిలను ఆదర్శంగా తీసుకొని మరింత మంది అమ్మాయిలు అంతర్జాతీయస్థాయికి ఎదగాలని జగన్‌మోహన్ రావు ఆకాంక్షించారు. హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి వీరికి నగదు బహుమతిని ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. హెడ్ కోచ్‌గా నూషీన్ అల్ ఖదీర్‌కు, ప్లేయర్‌గా త్రిషకు ఇది వరుసగా రెండో వరల్డ్‌కప్ టైటిల్ కావడం విశేషం. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి అండర్–19 టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుకు భారత మాజీ స్పిన్నర్ నూషీన్ హెడ్ కోచ్‌గా వ్యవహరించగా... త్రిష సభ్యురాలిగా ఉంది. 2025లోనూ నూషీన్ హెడ్ కోచ్‌గా కొనసాగగా... నిలకడగా రాణించిన త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డును సాధించింది. కేసరి ధృతి కూడా విజేత జట్టులో సభ్యురాలిగా ఉన్నా ఆమెకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు.

రష్మిక సంచలనం



ముంబై: ఎల్ అండ్ టి ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ–125 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత మూడో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనంతో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 325వ ర్యాంకర్ రష్మిక 6–1, 6–0తో ప్రపంచ 182వ ర్యాంకర్ ఎలీనా ప్రిడాన్కినా (రష్యా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక కేవలం ఒక్క గేమ్ మాత్రమే కోల్పోవడం విశేషం. రెండు ఏస్‌లు సంధించిన రష్మిక మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఒక్కసారి చేజార్చుకున్న రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. ఓవరాల్‌గా మ్యాచ్ మొత్తంలో ప్రిడాన్కినా తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా నిలబెట్టుకోకపోవడం గమనార్హం. భారత్‌కే చెందిన అంకిత రైనా, మాయ రేవతి రాజేశ్వరన్ కూడా తొలి రౌండ్‌లో నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. 15 ఏళ్ల క్వాలిఫయర్ మాయ 6–4, 6–1తో ఇరీనా షైమనోవిచ్ (బెలారస్)పై, అంకిత రైనా 6–2, 6–2తో భారత్‌కే చెందిన వైష్ణవి అడ్కర్‌పై విజయం సాధించారు.

వరుణ్‌కు 'వన్డే' అవకాశం

- ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక
- టి20 సిరీస్‌లో రాణించినందుకు గుర్తింపు
- చాంపియన్స్ ట్రోఫీకి కూడా రేసులో
- నెట్స్‌లో కోహ్లి, రోహిత్, పంత్‌కు బౌలింగ్ చేసిన వరుణ్



వరుణ్

నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో టి20 సిరీస్‌లో చక్కటి ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి... ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే అవకాశాలు లేకపోలేదు. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 14 వికెట్లతో సత్తా చాటిన వరుణ్ ఫామ్‌ను వినియోగించుకోవాలని టీమిండియా భావిస్తోంది. చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు ఇంగ్లండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో వరుణ్‌ను బరిలోకి దింపి... అందులో ప్రదర్శన ఆధారంగా చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయొచ్చని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వర్గాలు వెల్లడించాయి. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ కోసం గతంలోనే ప్రకటించిన జట్టులో వరుణ్‌కు చోటు దక్కకపోగా... తాజా ఫామ్ ఆధారంగా అతడిని ఈ సిరీస్‌కు ఎంపిక చేసినట్లు బోర్డు వెల్లడించింది. మంగళవారం వరుణ్ వన్డే జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేశాడు. రోహిత్ శర్మ, కోహ్లి, రిషభ్ పంత్‌లకు నెట్స్‌లో సుదీర్ఘంగా బౌలింగ్ చేశాడు. ఈ సందర్భంగా గిల్ మాట్లాడుతూ... 'వరుణ్ జట్టులో భాగం' అని అన్నాడు. 'ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు వరుణ్... భారత బ్యాటర్లకు నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నాడు. ఎలాగో ఐపీఎల్ వరకు అతడికి ఎలాంటి మ్యాచ్‌లు లేవు. వరుణ్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. దాన్ని వినియోగించుకోవాలని అనుకోవడంలో తప్పులేదు. దీనికి సెలెక్షన్ కమిటీ చైర్మన్ అంగీకారం ఉండాలి' అని బోర్డు అధికారి తెలిపారు. చాంపియన్స్ ట్రోఫీ కోసం బీసీసీఐ ఇప్పటికే 16 మందితో కూడిన జట్టును ప్రకటించగా... అందులో మార్పులు చేసుకునేందుకు ఈ నెల 12 వరకు గడువు ఉంది. కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లో ఒకరి స్థానంలో వరుణ్‌ను తీసుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ యోచిస్తోంది.

తెలంగాణకు తొలి స్వర్ణం

మహిళల 3x3 బాస్కెట్‌బాల్ ఈవెంట్‌లో అగ్రస్థానం

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో మొదటి స్వర్ణం చేరింది. మహిళల బాస్కెట్‌బాల్ 3x3 ఈవెంట్‌లో తెలంగాణ జట్టు తొలి స్థానంలో నిలిచింది. ఫైనల్లో తెలంగాణ 21–11 పాయింట్ల తేడాతో కేరళపై విజయం సాధించింది. పసిడి పతకం సాధించిన మహిళల జట్టులో గులాబ్ షా అలీ, ఎస్.పుష్ప, కేబీ హర్షిత, పి.ప్రియాంక సభ్యులుగా ఉన్నారు. రెండేళ్ల క్రితం గోవా జాతీయ క్రీడల్లోనూ ఇదే ఈవెంట్‌లో విజేతగా నిలిచిన తెలంగాణ తమ స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో 14–12 తేడాతో తమిళనాడును ఓడించి మధ్యప్రదేశ్ కాంస్యం సొంతం చేసుకుంది. అంతకుముందు సెమీస్‌లో తెలంగాణ 18–11తో తమిళనాడును... కేరళ 13–10తో మధ్యప్రదేశ్‌ను ఓడించాయి. మరో వైపు పురుషుల బాస్కెట్‌బాల్ 3–3 ఈవెంట్‌లో మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు స్వర్ణ, రజత, కాంస్యాలు గెలుచుకున్నాయి. ఫైనల్లో మధ్యప్రదేశ్ 22–20 తేడాతో కేరళను ఓడించింది. కాంస్యం కోసం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు చేతిలో 16–21తో ఓడిన తెలంగాణ నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.



ఆంధ్రప్రదేశ్‌కు మూడు కాంస్యాలు

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు మంగళవారం మూడు కాంస్య పతకాలు లభించాయి. పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో కర్రి సాయిపవన్–షేక్ గౌస్ జోడీ... కనోయింగ్-కయాకింగ్ క్రీడాంశంలోని పురుషుల స్లాలోమ్–కే1 ఈవెంట్‌లో కొల్లకాని విష్ణు... మహిళల స్లాలోమ్–సీ1 ఈవెంట్‌లో దొడ్డి చేతన భగవతి కాంస్య పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ డబుల్స్ సెమీఫైనల్లో సాయిపవన్–షేక్ గౌస్ ద్వయం 13–21, 12–21తో నితిన్–ప్రకాశ్ రాజ్ (కర్ణాటక) జంట చేతిలో ఓడి కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. మంగళవారం పోటీలు ముగిశాక ఆంధ్రప్రదేశ్ ఆరు పతకాలతో 21వ స్థానంలో, మూడు పతకాలతో తెలంగాణ 24వ స్థానంలో ఉన్నాయి.




సాయిపవన్, షేక్ గౌస్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

లక్కీగా ఎస్కేప్ అయ్యాను

- సాయిరామ్ శంకర్



''కథ, అందులోని నా క్యారెక్టరైజేషన్ నచ్చితే ఏ రోల్ అయినా చేస్తాను. నా కెరీర్‌లో మధ్యలో ఫెయిల్యూర్స్ వచ్చినప్పటికీ నాతో సినిమాలు చేసేందుకు నిర్మాతలు వస్తున్నారు. 'ఒక పథకం ప్రకారం' సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాను'' అని సాయిరామ్ శంకర్ అన్నారు. సాయిరామ్ శంకర్ హీరోగా, సముద్ర ఖని, శ్రుతీ సోది, ఆషిమా నర్వాల్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్‌కుమార్ విజయన్ దర్శకత్వంలో గార్లపాటి రమేశ్, వినోద్‌కుమార్ విజయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సాయిరామ్ శంకర్ చెప్పిన విశేషాలు.

● ఈ సినిమాలో లాయర్ పాత్ర చేశాను. నేను క్రిమినలా? క్రిమినల్ లాయరా? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. లాయర్‌గా చేయడానికి యాక్టింగ్‌లో కొంత ట్రెయినింగ్ తీసుకున్నాను. గతంలో నేనిలాంటి సస్పెన్స్ డ్రామా చేయలేదు. కథ ప్రకారం ప్రతి క్యారెక్టర్‌కు ఎవరి ప్లాన్ వారికి ఉంటుంది. అందుకే 'ఒక పథకం ప్రకారం' అని టైటిల్ పెట్టాం. ● నా ఫస్ట్ మూవీ నుంచే విజయన్, నేనూ మిత్రులం. 2005 నుంచే మేం ఓ సినిమా చేయాలనుకున్నాం. కానీ కుదర్లేదు. ఫాహద్ ఫాజిల్‌తో రెండు సినిమాలు చేశాడు విజయన్. తెలుగు ప్రేక్షకుల అభిరుచిపై ఆయనకు అవగాహన ఉంది.

ఈ సినిమాలో లవ్‌స్టోరీయే కాదు యాక్షన్ సీక్వెన్స్‌లూ ఉన్నాయి. 25 డాగ్స్‌తో క్లైమాక్స్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ ఓ హైలైట్‌గా ఉంటుంది. ఓ రోజు డాగ్స్ దగ్గరకెళ్లాను. అప్పుడో డాగ్ బయటకు వచ్చింది. డాగ్స్ టేకర్ బయట ఉన్నాడు. వెంటనే గ్రిల్ ఎక్కేశాను. లక్కీగా ఎస్కేప్ అయ్యా. ● అన్నయ్య (పూరి జగన్నాథ్) ట్రైలర్ చూసి, కొత్తగా ఉందన్నారు. నా 'రీ సౌండ్' సినిమా పూర్తయింది. ఓ మైథలాజికల్ ఫిలిం కమిటయ్యాను. ఓ వెబ్ సిరీస్ కోసం చర్చలు జరుగుతున్నాయి. ఇందులో 60 ఏళ్ల వ్యక్తిగా కనిపిస్తాను.

అవే నాకు వెయ్యి ఏనుగుల బలం ఇస్తాయి

- దేవిశ్రీ ప్రసాద్



''చాలా రోజుల తర్వాత వస్తున్న అందమైన ప్రేమకథా చిత్రం 'తండేల్'. ఈ సినిమాలోని 'బుజ్జి తల్లి...' పాట విన్న సుకుమార్‌గారు.. 'నీ ఆల్ టైమ్ టాప్ ఫైవ్‌లో ఉంటుంది' అన్నారు. ఆ సాంగ్ రిలీజైన వెంటనే ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే శివుని పాట, హైలెస్సో... పాటలు గొప్పగా జనాల్లోకి వెళ్లాయి. ఈ సినిమాలోని పాటలన్నీ పెద్ద హిట్ అవడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వం వహించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● నా కెరీర్ ఆరంభంలో నేను చేసిన 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా, వర్షం, ఆర్య, 100% లవ్' వంటి ప్రేమకథలతో పాటు 'శంకర్‌దాదా ఎంబీబీఎస్, మాస్' లాంటి కమర్షియల్ సినిమాలకు కూడా మ్యూజిక్ పరంగా ప్రేక్షకుల నుంచి అంతే అద్భుతమైన స్పందన వచ్చింది. ఎలాంటి సినిమా అయినా చేయగలననే పేరు రావడం, అందులోనూ ప్రేమకథలకి మంచి సంగీతం ఇస్తానని అందరూ అనుకోవడం దేవుడి ఆశీస్సులుగా భావిస్తాను ● 'తండేల్' స్వచ్ఛమైన ప్రేమకథ. వాస్తవ ఘటనల ఆధారంగా రాసుకున్న కథ. చందు మొండేటి గ్రేట్ విజన్‌తో ఈ సినిమా తీశాడు. చైతన్యగారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. కొత్త నాగచైతన్యని చూడబోతున్నారు. సాయిపల్లవి నటన కూడా ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది ● యంగ్ ఏజ్‌లో మ్యూజిక్ డైరెక్టర్‌గా కెరీర్ స్టార్ట్ చేశా. నేనే నా మ్యూజిక్ వింటూ పెరిగాను (నవ్వుతూ). అన్ని జానర్ సినిమాలు చేసే అవకాశం రావడం, అన్ని వయసుల వారికి నచ్చే మ్యూజిక్ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను. లైవ్ షోస్ చేయడం నాకు వెయ్యి ఏనుగుల బలం ఇస్తుంది. ప్రేక్షకులు అభిమానం, ఆదరణ నాకు గొప్ప ఎనర్జీతో పాటు ఇంకా గొప్ప మ్యూజిక్ చేయాలనే స్ఫూర్తినిస్తాయి. ప్రస్తుతం 'కుబేర' సినిమాకి సంగీతం అందిస్తున్నాను.

ఆరు పాటలూ లవ్ సాంగ్స్ ఉండే ఓ ప్రేమకథ చేయాలనే కోరిక బన్నీకి (అల్లు అర్జున్) ఎప్పట్నుంచో ఉంది. 'గుర్తుపెట్టుకో.. మనం అలాంటి సినిమా చేద్దాం' అంటూ మొన్న ఓ పేపర్ మీద రాసిచ్చారు (నవ్వుతూ). 'తండేల్' మూవీ మ్యూజిక్‌కి దేవిని ఫిక్స్ అయిపోమని అరవింద్ అంకుల్‌తో బన్నీ ముందే చెప్పారు.

నాకోసం పాదయాత్ర చేయొద్దు

- అభిమానులకు ఎన్టీఆర్ విజ్ఞప్తి



హీరో ఎన్టీఆర్‌కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ముఖ్యంగా ఆయన అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో తెలిసిందే. తమ అభిమాన హీరోని కలిసేందుకు వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ కి వస్తుంటారు ఎన్టీఆర్ ఫ్యాన్స్. కొందరైతే పాదయాత్రగా వస్తుంటారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఓ ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. ఆ సారాంశం ఏంటంటే... ''నాపై అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకుని త్వరలో ఒక సజావుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యక్తిగతంగా వారిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఈ కార్యక్రమానికి అన్ని అనుమతులు పొంది, పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని శాంతి భద్రతల సమస్యలు రాకుండా జాగ్రత్త తీసుకుంటాం. ఇంత పెద్ద సమావేశం నిర్వహించటానికి కొంత సమయం అవసరం అవుతుంది కాబట్టి అభిమానులు ఓర్పుగా ఉండాలని కోరుతున్నాను. నన్ను కలుసుకోవడానికి అభిమానులు పాదయాత్ర వంటివి చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. నా ఫ్యాన్స్ ఆనందమే కాదు... వారి సంక్షేమం కూడా నాకు అత్యంత ప్రాధాన్యం'' అని పేర్కొన్నారు ఎన్టీఆర్.

అంచనాలకు ఏమాత్రం తగ్గదు

- ఏఎం రత్నం



''హరి హర వీరమల్లు' సినిమా అద్భుతంగా వస్తోంది. పవన్ కల్యాణ్ అభిమాన్నం అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్–1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న విడుదల కానుంది. కాగా ఫిబ్రవరి 4న ఏఎం రత్నం పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''పవన్ కల్యాణ్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'ఖుషి, బంగారం' సినిమాలు హిట్‌గా నిలిచాయి. మూడో సినిమాగా 'హరి హర వీరమల్లు' రూపొందుతోంది. పవన్ నటిస్తున్న మొదటి పాన్ ఇండియా సినిమా మాదే. 2023లో విడుదలైన 'బ్రో' తర్వాత దాదాపు రెండేళ్లకు 'హరి హర వీరమల్లు'తో పవన్ వెండితెరపై అలరించడానికి సిద్ధమవుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలకు తగ్గకుండా ఉంటుంది'' అని తెలిపారు.

సీనియర్ నటి పుష్పలత కన్నుమూత



సీనియర్ నటి పుష్పలత(87) చెన్నైలో కన్నుమూశారు. టి. నగర్‌లోని తిరుమల పిళ్లై రోడ్డులో నివాసం ఉంటున్న ఆమె వృద్ధాప్యం కారణంగా మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కన్నుమూశారు. తమిళనాడు కోయంబత్తూర్‌లోని మేటుపాలయానికి చెందిన ఈమె, తొమ్మిదవ ఏటనే భరతనాట్యంలో శిక్షణ పొందారు. నటుడు ఎస్సే నటరాజ్ దర్శకత్వం వహించి, నిర్మించిన 'నల్ల తంగై'(1955) అనే తమిళ చిత్రం ద్వారా నటిగా ఆరంగేట్రం చేసిన పుష్పలత.. 'కొంగు నాట్టు తంగం' (1962) సినిమాతో కథానాయకగా పరిచయమయ్యారు. ఆ తర్వాత హీరోయిన్‌గా, ఆర్టిస్టుగా తమిళ, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 100కు పైగా చిత్రాల్లో నటించారు. తమిళంలో శారద, పార్ మగళే పార్, నానుమ్ ఒరు పెన్ సంతానం, కర్పూరం, జీవనాంశం, దర్శనం, కళ్యాణ రామన్, సకల కళావల్లభన్, సిమ్లా స్పెషల్' వంటి పలు విజయవంతమైన చిత్రాలు చేశారు. ఎంజీఆర్, శివాజీ గణేషన్, ఏఎం రాజా వంటి ప్రముఖ నటులతో కలిసి నటించారు. ఎన్టీఆర్ హీరోగా కోవెలమూడి భాస్కర్ రావ్ దర్శకత్వంలో రూపొందిన 'చెరపకురా.. చెడేవు!' అనే సినిమా ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయం అయ్యారు పుష్పలత. ఆ తర్వాత 'ఆడబిడ్డ, మా ఊరిలో మహాశివుడు, వేటగాడు, ఆటగాడు, ఘరానా దొంగ, రక్త బంధం, శూలం, కొండవీటి సింహం, ఇద్దరు కొడుకులు, ప్రతిజ్ఞ, మూగవాని పగ, ఉక్కుమనిషి, రంగూన్ రౌడీ, విక్రమ్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులనూ అలరించారామె. అదే విధంగా కన్నడలో 'జీవనజ్యోతి, ఉలవే బాదుడు, ఎరడు కనసు', మలయాళంలో 'నర్స్', హిందీలో 'మై భీ లడకీ హూ' వంటి చిత్రాల్లో నటించారు. అలాగే కొన్ని వాణిజ్య ప్రకటనలు కూడా చేశారు పుష్పలత. కాగా తమిళంలో ఏవీఎం రాజన్‌కు జంటగా 'నానుమ్ ఒరు పెన్' అనే చిత్రంలో నటించారామె. ఆ సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ పుట్టడంతో 1964లో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారిలో ఒకరు నటి మహాలక్ష్మి. ఆమె తమిళ, తెలుగు చిత్రాల్లో నటించారు.

– సాక్షి సినిమా, చెన్నై

చిన్న చిత్రాలు పెద్ద సౌండ్ చేస్తున్నాయి

- రాజ్ కందుకూరి

గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే, సాయి సతీష్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'భవానీ వార్డ్ 1997'. జీడీ నరసింహా దర్శకత్వంలో జీడీఆర్ మోషన్ పిక్చర్, విభూ మీడియా సమర్పణలో చంద్రకాంత సోలంకి, జీడీ నరసింహా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ– ''ఇప్పుడు కంటెంట్ ఉన్న సినిమాలే ఆడుతున్నాయి. చిన్న చిత్రాలే పెద్ద సౌండ్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో కంటెంట్ ఉందని నమ్ముతున్నాను. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''హారర్ చిత్రాలను ఇష్టపడేవారికి ఈ మూవీ నచ్చుతుంది'' అని పేర్కొన్నారు జీడీ నరసింహా. ''ఈ మూవీలో ప్రతి సీన్‌కి ప్రాధాన్యం ఉంటుంది'' అని తెలిపారు పూజా కేంద్రే. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ నిస్సీ జస్టిన్, కెమెరామేన్ అరవింద్, గణేశ్ రెడ్డి, పర్వతనేని రాంబాబు, సాయి సతీష్ మాట్లాడారు.



● రాజ్ కందుకూరి, పూజా కేంద్రు, గణేశ్ రెడ్డి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,397	78,584
నిఫ్టీ ▲	378	23,739

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,554	▲	160
డోజోన్స్	44,406	▼	16
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,571	▼	13
డాక్స్	21,506	▲	77
షాంఘై	3,251	▼	2
నికాయ్	38,798	▲	278

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	83,010
బంగారం (99.5 స్వచ్ఛత)	82,678
వెండి (కిలో)	93,793

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.60	87.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.80	109.64
€	యూరో	ఎస్‌బీఐ	88.58	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.98	55.19
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.09	23.66
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.15	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.79

ఆగని పసిడి పరుగు

రూ. 86,000 దగ్గరకు చేరిక



న్యూఢిల్లీ: జ్యుయలర్లు, రిటైలర్ల నుంచి డిమాండ్ పెరగడంతో పసిడి పరుగు కొనసాగుతోంది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో వరుసగా అయిదో సెషన్‌లో లాభపడి రూ. 86,000కు మరింత చేరువైంది. 99.9 శాతం స్వచ్ఛత గల పది గ్రాముల బంగారం ధర మరో రూ. 500 పెరిగి రూ. 85,800కి చేరిందని ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. జనవరి 1 నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు పసిడి ధర ఏకంగా 8 శాతం పైగా ఎగిసిందని, రూ. 6,410 మేర పెరిగిందని వివరించింది. అటు వెండి ధరల విషయానికొస్తే అయిదు రోజుల ర్యాలీకి బ్రేక్ వేస్తూ మంగళవారం కేజీకి రూ. 500 తగ్గి రూ. 95,500కి పరిమితమైంది. మరోవైపు, టారిఫ్‌లపై అమెరికా, కెనడా, మెక్సికో మధ్య చర్చలు జరుగుతుండటంతో పసిడి ర్యాలీ కాస్త నెమ్మదించవచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ జతిన్ త్రివేది తెలిపారు. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఏప్రిల్ డెలివరీ కాంట్రాక్టు ఒక దశలో రూ. 208 తగ్గి రూ. 83,075 వద్ద ట్రేడయిందని వివరించారు. అటు అంతర్జాతీయంగాను పసిడి రికార్డు పరుగు కొనసాగుతోంది. ఫ్యూచర్స్ మార్కెట్లో ఔన్సు (31.1 గ్రాముల) ధర ఒక దశలో 2,876 డాలర్లకు ఎగిసింది.

నూతన ఐటీ చట్టంలో కొత్త పన్నులుండవ్

- బడ్జెట్ ద్రవ్యోల్బణాన్ని పెంచేది కాదు
- ద్రవ్యలోటు తగ్గించే చర్యలకు చోటు
- ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే



న్యూఢిల్లీ: కొత్త ప్రత్యక్ష పన్నుల కోడ్(ఐటీ చట్టం)లో ఎలాంటి కొత్త పన్నులు ఉండబోవని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. అలాగే బడ్జెట్ 2025 ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోసేది కాదన్నారు. ద్రవ్యలోటు తగ్గింపు తో, ద్రవ్యోల్బణాన్ని పెంచని బడ్జెట్‌ను అందించినట్టు చెప్పారు. వృద్ధికి మద్దతునిచ్చే ద్రవ్య విధానానికి అనుగుణంగా ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కూడా ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా వడ్డీ రేట్లలో మార్పు ఉండొచ్చన్న సంకేతాన్నిచ్చినట్టయింది. మీడియాతో మాట్లాడిన సందర్భంగా పలు అంశాలపై గందరగోళం, అయోమయాన్ని తొలగించే ప్రయత్నం చేశారు పాండే. మూలధన లాభాల పన్ను లేదా సెక్యూరిటీల లావాదేవీల పన్ను పెంపు రూపంలో ఊహించనిది ఏదైనా ఉంటుందా? అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని తోసిపుచ్చారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే వారం వ్యవధిలో కొత్త ఆదాయపన్ను చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. ఇది పూర్తిగా కొత్త బిల్లు, తిరగ రాసిందంటూ దీన్ని పార్లమెంట్ ఆమోదించాల్సి ఉందన్నారు పాండే. ''ఇది పన్ను రేట్లను మార్చదు. నిర్మాణాత్మకంగా పూర్తి మార్పునకు గురికానుంది. హేతుబద్ధీకరణతోపాటు ప్రక్రియలను సులభంగా మార్చడం ఇందులో కనిపిస్తుంది. ఇందులో ఎన్నో సంస్కరణలు ఉంటాయి. వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది''అని పాండే వివరించారు. ప్రస్తుత పన్ను చట్టంతో పోల్చితే సగమే ఉంటుందన్న ఆర్థిక మంత్రి ప్రకటనను గుర్తు చేశారు.

వృద్ధి నిలకడగా కొనసాగాలంటే ద్రవ్యోల్బణంపై మంచి నియంత్రణ అవసరమని, రెండింటి మధ్య సమతుల్యం అవసరమన్నారు. ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశం ఈ నెల 5న ప్రారంభం కానుంది. 7వ తేదీన నిర్ణయాలు వెలువడనున్నాయి. ఈ సమావేశంలో రేట్ల కోత నిర్ణయం ఉంటుందా? అన్న ప్రశ్నకు.. పరిస్థితిని వారు తెలుసుకున్నారని, దీనిపై వారే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పాండే బదులిచ్చారు.

జీఎస్‌టీ రేట్లు, శ్లాబుల తగ్గింపుపై త్వరలో నిర్ణయం

కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

జీఎస్‌టీలో కేవలం కొన్ని శ్లాబులు, తక్కువ రేట్లు ఉండాలన్న ప్రతిపాదనలపై కౌన్సిల్ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనిపై సమీక్ష దాదాపుగా పూర్తికావచ్చినట్టు చెప్పారు. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం రేట్లు అమల్లో ఉన్నాయి. ఇన్నేసి శ్లాబులు కాకుండా, వీటిని తగ్గించాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో శ్లాబులు, రేట్ల తగ్గింపుపై మార్పులను సూచించేందుకు లోగడ జీఎస్‌టీ కౌన్సిల్ ఒక మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం.

మార్కెట్లకు 'టారిఫ్' రిలీఫ్

- పన్నుల యుద్ధానికి ట్రంప్ తాత్కాలిక విరామం
- మెక్సికో, కెనడాలపై సుంకాలు నెలరోజుల పాటు నిలిపివేత
- ఈక్విటీ మార్కెట్ల భారీ ర్యాలీ
- నెలరోజుల గరిష్టం వద్ద సూచీల ముగింపు
- ఒక్కరోజులో రూ.5.96 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: మెక్సికో, కెనడాపై సుంకాల విధింపును నెల రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో ఈక్విటీ మార్కెట్లు మంగళవారం బలంగా పుంజుకున్నాయి. ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆశలూ, అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీ అంశాలూ కలిసొచ్చాయి. సెన్సెక్స్ 1,397 పాయింట్లు పెరిగి 78,584 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 378 పాయింట్లు బలపడి 23,739 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది నెలరోజుల గరిష్టం కావడం విశేషం. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే భారీ లాభాలతో మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,472 పాయింట్లు పెరిగి 78,659 వద్ద, నిఫ్టీ 402 పాయింట్లు ఎగసి 23,763 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. అమెరికా సుంకాల విషయంలో మెక్సికో, కెనడాకు తాత్కాలిక ఊరట లభించడంతో అంతర్జాతీయ మార్కెట్లలోనూ సానుకూల సంకేతాలు నెలకొన్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో ట్రేడవుతున్నాయి.

- ఇటీవల మార్కెట్ పతనంలో భాగంగా పలు రంగాలకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లకు పెద్ద ఎత్తున డిమాండ్ లభించింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.35%, 1.25 శాతం పెరిగాయి. ఒక్క ఎఫ్‌ఎంసీజీ షేర్లలో మాత్రం లాభాల స్వీకరణ జరిగింది.
- రంగాల వారీగా అత్యధికంగా క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్ 3.50% పెరిగింది. ఇండస్ట్రియల్స్ 2.50%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 2.40%, విద్యుత్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు రెండు శాతం లాభపడ్డాయి.
- స్టాక్ మార్కెట్ దాదాపు రెండు శాతం ర్యాలీతో మంగళవారం రూ.5.96 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.425 లక్షల కోట్ల(4.88 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకుంది.
- రూపాయి విలువ జీవితకాల కనిష్టం(87.11) నుంచి స్వల్పంగా రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో నాలుగు పైసలు బలపడి 87.07 వద్ద స్థిరపడింది. ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తాత్కాలిక తెరవేయడంతో అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ 108 స్థాయికి దిగివచ్చింది. ఈ అంశం దేశీయ కరెన్సీకి కలిసొచ్చిందని నిపుణులు తెలిపారు.

డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ లిస్టింగ్ అంతంతే



డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్ షేరు లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ. 402)తో పోలిస్తే డిస్కౌంటు ధరతో రూ.397 వద్ద లిస్టయ్యింది. ఒక దశ లో ఇంట్రాడేలో 8% క్షీణించి రూ. 370 వద్ద కనిష్టాన్ని తాకింది. అయితే మార్కెట్ ర్యాలీలో భాగంగా ఇంట్రాడే నష్టాలు భర్తీ చేసుకోగలిగింది. చివరికి 0.11% స్వల్ప నష్టంతో రూ. 401.55 వద్ద స్థిరపడింది. మార్కెట్ విలువ రూ. 12,684 కోట్లుగా నమోదైంది.

బెదిరింపులకు భయపడి మూసేయలేదు

అదానీపై రిపోర్ట్‌కు కట్టుబడి ఉన్నా
హిండెన్‌బర్గ్ ఫౌండర్ నేట్ ఆండర్సన్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: దిగ్గజ కార్పొరేట్ సంస్థలపై సంచలన ఆరోపణలతో ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోయిన అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ మూసివేతపై ఆ సంస్థ వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్ మరోసారి పెదవి విప్పారు. ఎవరి బెదిరింపులకో లేదంటే కేసులకో భయపడి సంస్థను మూసేయలేదని, పని భారం కారణంగానే ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు. అదానీ గ్రూప్‌తో సహా పలు సంస్థలపై తాము ఇచ్చిన రిపోర్టులన్నింటికీ కట్టుబడి ఉన్నామని కూడా పేర్కొన్నారు. అదానీపై పలు మీడియా రిపోర్టుల్లో లేవనెత్తిన ఆరోపణల ఫలితంగానే తాము ఆ గ్రూప్‌నకు సంబంధించి 'కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని' వెలికితీశామని ఆయన చెప్పారు. కాగా, రిపోర్ట్‌లో పేర్కొన్న ఆరోపణలన్నింటినీ అదానీ గ్రూప్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే.

కొత్త బ్రాండ్ ఏర్పాటు చేస్తే సపోర్ట్ చేస్తా...

భారత్ వ్యతిరేక శక్తులైన ఓసీసీఆర్‌పీ, జార్జ్ సోరోస్ వంటి గ్రూపులతో హిండెన్‌బర్గ్‌కు లింకులు అంటగట్టేందుకు కొంతమంది చేసిన ప్రయత్నాలపై స్పందిస్తూ.. అదో 'పనికిమాలిక కుట్ర'గా అభివర్ణించారు. అలాంటి తెలివితక్కువ కుట్ర సిద్ధాంతాలకు మరింత ఆజ్యం పోయకూడదనే.. తమ సంస్థ వారిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఫైనాన్షియల్ ఫోరెన్సిక్ రీసెర్చ్ సేవల సంస్థగా ఎనిమిదేళ్ల క్రితం ఆవిర్భవించిన హిండెన్‌బర్గ్... ప్రపంచవ్యాప్తంగా పలు దిగ్గజ సంస్థల్లోని లొసుగులపై అధ్యయనం చేసి విడుదల చేసిన నివేదికలు రాజకీయంగా, కార్పొరేట్ ప్రపంచంలో దుమారం సృష్టించడం తెలిసిందే. కాగా, ట్రంప్ పగ్గాలు చేపట్టనున్న తరుణంలో సంస్థను మూసేస్తున్నట్లు ప్రకటించి ఆండర్సన్ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ట్రంప్ సర్కారుకు భయపడే ఆయన మూసివేత నిర్ణయం తీసుకున్నారన్న గుసగుసలు వినిపించాయి. కంపెనీ పగ్గాలు వేరెవరికైనా అప్పగించకుండా ఎందుకు మూసేయాల్సి వచ్చిందన్న ప్రశ్న కు 'ఆ బ్రాండ్ నుండి నన్ను ఎవరూ వేరు చేయలేరు. హిండెన్‌బర్గ్ అనే పేరు నాతో పెనవేసుకుపోయింది. ఎవరికైనా అమ్మేయడానికి అది సాఫ్ట్‌వేర్ అప్లికేషన్, సైకిళ్ల ఫ్యాక్టరీ కాదు. నా టీమ్ కొత్త బ్రాండ్‌ను ఏర్పాటు చేస్తానంటే తప్పకుండా మద్దతిస్తా. వారు ఆ పని చేస్తారనే అనుకుంటున్నా' అని ఆండర్సన్ వ్యాఖ్యానించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఐపీవోకు 7 కంపెనీలు రెడీ | మెప్పించని పవర్‌గ్రిడ్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



ఐఐసీటీ, హైదరాబాద్‌లో 23 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్‌కి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ).. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.

- » **విభాగాలు:** కెమికల్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, బయాలజీ, కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్ సర్వీసెస్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, డిగ్రీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** నెలకు రూ.70,290.
- » **ఎంపిక విధానం:** ట్రేడ్ టెస్ట్/స్కిల్ టెస్ట్, సర్టిఫికేట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.02.2025
- » **వెబ్‌సైట్:** https://www.iict.res.in

నైపర్, హైదరాబాద్‌లో 14 ఫ్యాకల్టీ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఎన్ఐపీఈఆర్).. రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
- » **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-04, అసోసియేట్ ప్రొఫెసర్-05,అసిస్టెంట్ ప్రొఫెసర్-05
- » **విభాగాలు:** ఫార్మాస్యూటిక్స్, నేచురల్ ప్రొడక్ట్స్, మెడికల్ డివైజెస్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి. » **వయసు:** 40నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, ఎన్ఐపీఈఆర్ హైదరాబాద్, బాలానగర్, హైదరాబాద్-500037, తెలంగాణ చిరునామాకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 23.02.2025.
- » **వెబ్‌సైట్:** www.niperhyd.ac.in

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో 300 ఇంజనీరింగ్ ప్రొఫెషనల్స్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్).. ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీరింగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 300.
- » **పోస్టుల వివరాలు:** ఇంజనీర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్.
- » **విభాగాల వారీగా ఖాళీలు:** సివిల్ ఇంజనీరింగ్-75,జియో టెక్నికల్-05, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్-20, అర్బన్ ఇంజనీరింగ్(ఎన్విరాన్‌మెంట్)-05,ట్రాఫిక్ టీ అండ్ టీ-05, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్-05, జియాలజీ-05, ఆర్కిటెక్చర్-10,జియోఫిజిక్స్-05,సీ ఎక్స్‌పర్ట్-10,సోషల్ సైన్స్-05, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-35, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్-15, మెకానికల్ ఇంజనీరింగ్-90, కెమికల్ ఇంజనీరింగ్-10.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఆర్క్ /బీప్లానింగ్, బీఏ/బీఎస్సీ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **బేసిక్ పే:**నెలకు ఇంజనీర్ పోస్టులకు₹22,660, అసిస్టెంట్ మేనేజర్‌కు ₹23,340, మేనేజర్‌కు ₹25,504,సీనియర్ మేనేజర్‌కు ₹27,869
- » **వయసు:** ఇంజనీర్ పోస్టులకు 31 ఏళ్లు,అసిస్టెంట్ మేనేజర్‌కు 32 ఏళ్లు, మేనేజర్‌కు 35 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 38 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టెక్నికల్ అండ్ ప్రొఫిషియన్సీ, కమ్యూనికేషన్ టెస్ట్,ఇంటర్వ్యూ, షార్ట్‌లిస్ట్, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.02.2025
- » **వెబ్‌సైట్:** https://www.rites.com

డాక్టర్ కల నెరవేరేలా!

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-యూజీ.. సంక్షిప్తంగా నీట్-యూజీ! ఇది ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పరీక్ష!! ఇందులో టాప్ స్కోర్ సొంతం చేసుకుంటేనే మెడికల్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా లక్షల మంది నీట్ యూజీలో బెస్ట్ ర్యాంక్ కోసం ఇంటర్మీడియెట్ బైపీసీలో చేరిన తొలి రోజు నుంచే ప్రిపరేషన్ సాగిస్తుంటారు. వీరంతా తమ కసరత్తును మరింత ముమ్మరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. నీట్-యూజీ 2025 తేదీ ఖరారు కావడమే! ఈ నేపథ్యంలో.. నీట్ యూజీ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » మే 4న నీట్ యూజీ-2025 పరీక్ష
- » మరికొద్ది రోజుల్లోనే నోటిఫికేషన్
- » నీట్ స్కోర్‌తో వైద్య కోర్సుల్లో ప్రవేశాలు
- » పరీక్ష విధానంలో పలు మార్పులు



నీట్ యూజీ-2025కు సంబంధించి పలు మార్పులు ప్రకటించారు. ముఖ్యంగా పరీక్ష నాలుగు విభాగాల్లో పార్ట్-బిలో అమలు చేసిన ఛాయిస్ విధానాన్ని తొలగించారు. పరీక్షను ఒకే రోజు పెన్-పేపర్ విధానంలో నిర్వహించనున్నారు.

పరీక్ష విధానాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ మోడల్‌లో నిర్వహించాలని పలు ప్రతిపాదనలు, సిఫార్సులు వచ్చినా.. చివరకు ఆఫ్‌లైన్ విధానంలో, ఒకే రోజు పరీక్ష ఉంటుందని ప్రకటించారు. అదే విధంగా అభ్యర్థులకు అపార్ ఐడీ తప్పనిసరి అని కూడా పేర్కొన్నారు. ఈ అపార్ ఐడీని పొందేందుకు అవసరమైన విధానాలను ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

అన్నింటికీ నీట్ స్కోర్

మెడికల్ కోర్సులను లక్ష్యంగా చేసుకొని నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ ఏడాది జాతీయ స్థాయిలో దాదాపు 20 లక్షల మంది పోటీ పడే అవకాశం ఉంది. నీట్-యూజీకి ఏటేటా పోటీ పెరుగుతోంది. దేశంలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నీట్-యూజీ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకోవడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఆల్ ఇండియా కోటా పేరిట దేశంలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 15 శాతం సీట్లను; రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని సీట్లను; డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ వర్సిటీలు..ఇలా అన్ని కేటగిరీల యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లో నీట్ స్కోర్ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తారు. అదే విధంగా ఆయుష్ కోర్సులుగా పేర్కొనే బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ తదితర కోర్సులకు కూడా నీట్ స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకుంటారు.

720 మార్కులకు పరీక్ష

నీట్-యూజీ పరీక్ష నాలుగు సబ్జెక్ట్‌లలో మొత్తం720 మార్కులకు జరుగుతుంది. ఇందులో ఫిజిక్స్ 45 ప్రశ్నలు-180 మార్కులకు, కెమిస్ట్రీ 45 ప్రశ్నలు-180 మార్కులకు, బోటనీ 45 ప్రశ్నలు-180 మార్కులకు, జువాలజీ 45 ప్రశ్నలు-180 మార్కులకు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు.

పరీక్షను పెన్ పేపర్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

సమయం సద్వినియోగం

నీట్ యూజీ-2025 పరీక్షను మే 4న నిర్వహించనున్నారు. అంటే.. విద్యార్థులకు దాదాపు మూడు నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని సబ్జెక్ట్‌ల వారీగా నిర్దేశిత వ్యూహాలతో ప్రిపరేషన్ సాగిస్తే..మంచి స్కోర్ సాధించే అవకాశం ఉంది. మార్చి చివరి నాటికి ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత నీట్ పరీక్ష తేదీకి దాదాపు నెల రోజుల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో పూర్తిగా ప్రాక్టీస్, రివిజన్, మాక్ టెస్ట్‌లకు హాజరవడం ద్వారా ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలి.

బెస్ట్ స్కోర్‌కు మార్గం

ప్రాక్టీస్‌తో ఫిజిక్స్‌లో మంచి మార్కులు

ఫిజిక్స్‌లో స్కోర్ కోసం విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి. అవకలనం, సమాకలనం అనువర్తనాలపై పట్టు సాధించాలి. ఇంటర్ రెండేళ్ల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. రొటేషనల్ డైనమిక్స్, సిగ్మా పార్టికల్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. అదేవిధంగా ఎలక్ట్రోమ్యాగ్నటిజం, ఇండక్షన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ వంటి చాప్టర్లను చదవడంతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని గుర్తించాలి.

కెమిస్ట్రీ.. బేసిక్స్‌పై ఫోకస్

విద్యార్థులు కెమిస్ట్రీలో కాన్సెప్ట్‌లపై ఎక్కువగా ఫోకస్ చేయాలి. అదే విధంగా రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు కొంత వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. కాబట్టి నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. కెమిస్ట్రీలో ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను వాటి వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఫార్ములాలతో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. పీరియాడిక్ టేబుల్‌పై పట్టు సాధిస్తే.. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో మంచి స్కోర్‌కు ఆస్కారం ఉంటుంది.

బోటనీలో కాన్సెప్టులపై స్పష్టత

నీట్‌లో కీలకంగా భావించే బోటనీకి సంబంధించి విద్యార్థులు ప్రత్యేక దృష్టితో ప్రిపరేషన్ సాగించాలి. ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. అన్ని అంశాలకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాపులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి.

వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలపై ఫోకస్ చేయడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్‌లో కణవిభజన (సమవిభజన, క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణచక్రం తదితరాలను అధ్యయనం చేయాలి. బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో రెప్లికేషన్,ట్రాన్స్‌క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్,రెగ్యులేషన్‌లపై దృష్టిపెట్టాలి.

జువాలజీ

జువాలజీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనెటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీతోపాటు ఇంటర్ పుస్తకాల నుంచీ ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి గత ప్రశ్న పత్రాలను, ఇంటర్‌లో ఆయా చాప్టర్స్ చివరలో ఉండే ప్రశ్నలను సాధన చేయాలి. దీంతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పుస్తకాలను క్షుణ్నంగా చదివితే ఉపయుక్తంగా ఉంటుంది.

బోర్డ్ పరీక్షలతో సమన్వయం

బోర్డ్ పరీక్షలతో నీట్-యూజీ ప్రిపరేషన్‌ను సమన్వయం చేసుకోవడం ముఖ్యం. బోర్డ్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు ఇంటర్, నీట్ సిలబస్‌లను సమన్వయం చేసుకుంటూ చదవాలి. బోర్డ్ పరీక్షలు పూర్తయిన తర్వాత.. నీట్ సిలబస్‌కు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లకు సమయం కేటాయించుకోవాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. ప్రతి రోజు మాక్ టెస్టులకు హాజరవ్వాలి. మోడల్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ కొశ్చన్స్‌నే ఎక్కువ అడుగుతున్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనుగుణంగా మోడల్ టెస్ట్‌లను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ఇది వేగంగా రివిజన్ పూర్తిచేయడంలో దోహదపడుతుంది.

450కు పైగా మార్కులతో సీటు!

నీట్‌లో ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 130 మార్కులు సాధించేలా కృషి చేయాలి. అప్పుడే ఉత్తమ ర్యాంకు లభించే అవకాశాలు మెరుగవుతాయి. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు సాధించేలా ప్రయత్నం చేస్తే డాక్టర్ కల నెరవేర్చుకోవచ్చు.


కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

కడుపు 'కోతే'

రాష్ట్రంలో లెక్కకు మించి సిజేరియన్లు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ తగ్గిన సాధారణ ప్రసవాలు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో 80 శాతం వరకు అవే...
- తగ్గిన మిడ్‌వైవ్స్ సేవలు...
- అవగాహన కల్పించని వైద్యారోగ్యశాఖ



సాధారణ ప్రసవాల సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా తగ్గుతోంది. కాసుల కోసం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉండగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సిజేరియన్లే ఎక్కువగా నమోదవుతున్నాయి. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్లు పెరిగాయి. సాధారణ ప్రసవాలపై వైద్యారోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు లేవు. గత ప్రభుత్వ హయాంలో సాధారణ ప్రసవాల పెంపునకు మొదలుపెట్టిన మిడ్‌వైవ్స్ సేవలు ఇప్పుడు నామమాత్రమయ్యాయి.

సాక్షిప్రతినిధి, ఖమ్మం

అమ్మో సాధారణ ప్రసవమా?

సాధారణ ప్రసవాల విషయంలో నొప్పులు అనుభవించాల్సి వస్తుందనే ఉద్దేశంతో కొందరు గర్భిణులు విముఖత చూపుతున్నారు. కొందరు వైద్యులు సిజేరియన్లతో భవిష్యత్‌లో సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నా పట్టించుకోవడం లేదు. శిశువు తలకిందులుగా ఉన్నప్పుడు, పెద్దగా ఉన్నప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుంది. అయితే, సాధారణ ప్రసవంతో త్వరగా దినచర్యలో భాగం కావొచ్చని, సిజేరియన్లతో దీర్ఘకాలంలో ఇబ్బందులు తలెత్తుతాయని చెబుతున్నా, గర్భిణులు, వారి కుటుంబసభ్యులు ఆపరేషన్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు.

మిడ్‌వైవ్స్ అంతంతే

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచేందుకు గత ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే 2019లో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మిడ్‌వైవ్స్ సేవలను ప్రారంభించి 30 మందికి శిక్షణ ఇవ్వగా, వీరు గర్భిణులకు సాధారణ ప్రసవంతో లాభాలను వివరించి వ్యాయామాల ద్వారా ప్రసవాలకు సిద్ధం చేసేవారు. ప్రస్తుతం పలు ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతతో ఇప్పుడా సేవలు అందుబాటులో లేవు.



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో గర్భిణితో వ్యాయామం చేయిస్తున్న మిడ్‌వైవ్స్

అవగాహన కల్పించక..

గర్భిణిగా నమోదైనప్పటి నుంచి కాన్పు అయ్యే వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందితే వారి ఆరోగ్యంపై డాక్టర్లకు అవగాహన ఉంటుంది. అలా కాకుండా డెలివరీ సమయంలోనే వస్తుండడంతో ఏదో ఒక సమస్య తలెత్తగానే ఆపరేషన్ చేస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు కూడా సాధారణ ప్రసవాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందని తెలిసినా, ఆ దిశగా ప్రయత్నించడం లేదు.

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తే షిఫ్ట్‌కు ఎనిమిది మంది చొప్పున మూడు షిఫ్ట్‌ల్లో 24 మంది సిబ్బంది ఉండాలి. కానీ ఐదుగురే ఉన్నారు.
- ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలోనూ 8 నెలలుగా మిడ్‌వైవ్స్ సేవలు నామమాత్రమయ్యాయి. ఇక్కడ నలుగురు సిబ్బంది చేయాల్సిన మిడ్‌వైవ్స్ సేవలు ఇద్దరే చేస్తున్నారు.



డాక్టర్ రామకృష్ణ, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, భద్రాచలం.

కుటుంబ సభ్యుల సహకారం ఉండటం లేదు..


ప్రసవం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేరిన గర్భిణులకు సాధారణ ప్రసవం చేసేందుకే ప్రయత్నిస్తున్నాం, కానీ వారి కుటుంబసభ్యుల నుంచి సహకారం ఉండటం లేదు. గర్భిణీ కొద్దిసేపు నొప్పులు తట్టుకోలేకపోవడంతో కుటుంబ సభ్యులు మాపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గుతోంది.

బిడ్డకు హార్ట్‌బీట్ ఎక్కువగా ఉందని..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన సత్యవతికి గతనెల 31న పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకొస్తే పరీక్షలు చేసిన వైద్యులు బిడ్డ హార్ట్‌బీట్ ఎక్కువగా ఉందని చెప్పారు. ఆ వెంటనే ఆపరేషన్‌కు నిర్ణయించి సత్యవతికి సిజేరియన్ చేయగా మగ బిడ్డకు జన్మనిచ్చింది.



సత్యవతి, మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



ఉమ్మడి జిల్లా	ప్రభుత్వ నార్మల్	ప్రభుత్వ సిజేరియన్లు	ప్రైవేట్ నార్మల్	ప్రైవేట్ సిజేరియన్లు
కరీంనగర్	8,140	16,670	1,681	14,957
నిజామాబాద్	10,103	10,763	2,211	15,746
వరంగల్	10,564	14,695	2,387	12,520
నల్లగొండ	11,069	11,214	3,330	15,454
మెదక్	15,747	13,713	1,791	10,647
మహబూబ్‌నగర్	24,531	19,704	5,551	12,906
ఖమ్మం	16,279	14,394	2,833	10,336
ఆదిలాబాద్	12,765	8,440		

క్లుప్తంగా...

నేడు భీష్మాష్టమి

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ మహా కుంభమేళా త్రివేణి సంగమంలో బుధవారం పవిత్ర స్నానాన్ని ఆచరించాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో భీష్మాష్టమి పర్వంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భీష్మాష్టమి మొదలుకొని భీష్మ ద్వాదశి వరకూ ఉన్న ఐదు రోజులనూ భీష్మ పంచకం అని పిలుస్తారు. పవిత్రంగా భావించే ఈ ఐదు రోజుల్లో మొదటి రోజైన భీష్మాష్టమి పర్వం బుధవారమే. గంగ, శంతనుల ఎనిమిదవ సంతానమైన దేవవ్రతుడు.. తండ్రి సంతోషం కోసం ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటానని భీషణ ప్రతిజ్ఞ చేసిన నేపథ్యంలో భీష్ముడిగా ప్రఖ్యాతి చెందాడు. 'స్వచ్ఛంద మరణం'అనే వరాన్ని పొందిన ఆయన మాఘ శుద్ధ అష్టమి తిథిన విష్ణు సాయుజ్యాన్ని పొందాడని అంటారు. అందుకే ఈ రోజును పర్వదినంగా భావిస్తూ ఆయనకు తర్పణలు వదులుతారు. ఈ పర్వం విశిష్టత దృష్ట్యానే ప్రధాని మోదీ నేడు కుంభమేళాలో పవిత్రస్నానమాచరించేందుకు రానున్నారని అంటున్నారు. మహాభారతంలోని భీష్ముడి పాత్ర విలక్షణ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. ఆయన జీవితాన్ని వ్యక్తిత్వ వికాస తరగతుల్లో పాఠంగా బోధిస్తుంటారు.

టీ-హబ్ పేరిట నకిలీ వెబ్‌సైట్

- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన టీ-హబ్

సాక్షి, హైదరాబాద్: తమ సంస్థ పేరిట ఉన్న నకిలీ వెబ్‌సైట్‌తో పాటు నకిలీ మొబైల్ యాప్ పట్ల అప్రమత్తంగా ఉండాలని టీ-హబ్ హెచ్చరించింది. టీ-హబ్ పేరు, బ్రాండ్‌ను తలపించేలా రూపొందించిన వెబ్‌సైట్, యాప్‌తో కొందరు మోసగాళ్లు చట్టవిరుద్ధ కార్యకలాపాలు, వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో ఏర్పాటైన టీ-హబ్ డిజిటల్‌ల ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలాంటి నిధుల వసూలు లేదా చెల్లింపులు చేయదని, ఎలాంటి పెట్టుబడులు లేదా ఉద్యోగులకు సంబంధించిన లావాదేవీలు నిర్వహించదని స్పష్టంచేసింది. టీ-హబ్ పేరును దుర్వినియోగం చేస్తున్న వారిపై ఇప్పటికే చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపింది. (https://thubeco logical.com/login) వెబ్‌సైట్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వంకా రోమాపై వేటు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మరో అపెక్స్ కౌన్సిల్ మెంబర్‌పై వేటు పడింది. ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) తరఫునుంచి మహిళా క్రికెటర్ కోటాలో నామినేట్ అయిన వంకా రోమా సింగ్‌ను అపెక్స్ కౌన్సిల్‌నుంచి తప్పిస్తున్నట్లు హెచ్‌సీఏ ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ వి.ఈశ్వరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది హెచ్‌సీఏ ఎన్నికల సమయంలో నిషేధం విధించిన 57 క్లబ్‌లలో గస్‌రాక్ క్లబ్ కూడా ఒకటి. 'కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్'ఆరోపణల నేపథ్యంలో ఈ క్లబ్‌పై వేటు పడగా... ఈ క్లబ్ ఆఫీస్ బేరర్లలో ఒకరిగా వంకా రోమ పేరు కూడా ఉంది. దాంతో నిబంధన ప్రకారం నిషేధించబడిన క్లబ్‌లకు చెందినవారు ఏ రకమైన పదవుల్లోనూ ఉండరాదు. రోమాపై కొందరు హెచ్‌సీఏ సభ్యులు ఆరోపణలు చేయగా... విచారణ అనంతరం ఆమెను తప్పిస్తున్నట్లు ఎథిక్స్ ఆఫీసర్ ప్రకటించారు. ఐసీఏ తరఫున మరో మహిళా క్రికెటర్‌ను అపెక్స్ కౌన్సిల్‌లోకి నామినేట్ చేయాలని సూచించారు. ఐసీఏ తరఫున పురుష క్రికెటర్లకు ప్రాతినిధ్యం వహించిన ఆర్‌పీ స్వరూప్‌ను కూడా ఇటీవల ఇదే వివాదం కారణంగా తప్పించారు.

సప్త వాహనాలపై శ్రీనివాసుని వైభవం



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న మలయప్పస్వామి



చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

- తిరుమలలో ఘనంగా రథసప్తమి.. 1.50 లక్షల మందికి పైగా హాజరు

తిరుమల: రథసప్తమిని పురస్కరించుకుని తిరుమలలో సప్త వాహనాలపై కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. లక్షా 50 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తకోటి..వాహన సేవలను దర్శించుకుని పునీతులయ్యారు. రథసప్తమి పర్వదినం..ఒకరోజు బ్రహ్మోత్సవాలను తలపించింది. సూర్యోదయాన సూర్య ప్రభ వాహనంతో ప్రారంభమైన సప్త వాహన సేవోత్సవం.. రాత్రి చంద్రప్రభ వాహనంతో పరిసమాప్తమైంది. శ్రీమలయప్పస్వామివారు సూర్య ప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం 2 గంటలకు శ్రీసుదర్శన చక్రత్తాళ్వారులకు అభ్యంగనం ఆచరించారు. చక్రస్నానాన్ని శ్రీవారి పుష్కరిణిలో అర్చకులు నిర్వహించారు. వాహన సేవల ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఏఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చిన్న శేష వాహనంలో అపశ్రుతి

రథసప్తమి వేడుకల్లో శ్రీవారి గొడుగు గాలికి ఒరిగింది. సూర్యప్రభ వాహనం అనంతరం చిన్నశేష వాహనాన్ని స్వామివారు అధిరోహించారు. ఈ ఊరేగింపు సమయంలో వాహనంపై స్వామివారికి ఇరువైపులా ఛత్రాలు ఉంచుతారు. అర్చకులు వీటిని పట్టుకొని వస్తారు. వాహనం ముందుకు కదులుతుండగా..ఒక్కసారిగా వాహనం ఎక్కువగా అదిరిపోవడంతో గొడుగు కిందకు వాలిపోయింది.

వాహన సేవలో జస్టిస్ కృపాసాగర్, జస్టిస్ కేఆర్ శ్రీరామ్, జస్టిస్ ఈవీ వేణుగోపాల్



వాహన సేవల్లో న్యాయమూర్తులు

తిరుమల: మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కల్పతి రాజేంద్రన్ శ్రీరామ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ శ్రీవారి దర్శనం అనంతరం మాడ వీధుల్లో నిర్వహించిన వాహన సేవల్లో పాల్గొన్నారు.

ఐటీ అధికారుల ముందు హాజరైన దిల్ రాజు

2 గంటలపాటు ప్రశ్నించిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ నిర్మాత, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు మంగళవారం ఆదాయపన్ను శాఖ అధికారుల ముందు హాజరయ్యారు. గతనెల 21, 22, 23 తేదీల్లో ఆయన ఇల్లు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లలో నాలుగు రోజులు సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, సీజ్ చేసిన దస్త్రాలను పరిశీలించిన తర్వాత వాటిపై పూర్తిస్థాయి సమాచారం తెలుసుకోవడానికి ఆయన్ను అధికారులు రమ్మని ఆదేశించినట్లు సమాచారం. దాదాపు రెండు గంటలపాటు దిల్ రాజు ఐటీ కార్యాలయంలో అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు ఆధారాలను సమర్పించినట్లు తెలిసింది. సంక్రాంతి సందర్భంగా దిల్ రాజు గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలను నిర్మించిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల ఐటీ చెల్లింపులు సహా తన ప్రొడక్షన్స్‌కు సంబంధించిన ఆదాయవ్యయాలపై దిల్ రాజు వివరణ ఇచ్చినట్లు సమాచారం. గతనెలలో నిర్వహించిన సోదాల్లో ఐటీ చెల్లింపులు, బ్యాంకు లావాదేవీల వివరాలు, చిత్ర నిర్మాణంలో వివిధ రకాల ట్యాక్సుల చెల్లింపులు, సినిమాల ద్వారా వచ్చిన ఆదాయం.. ఇలా అనేక అంశాలపై ఐటీ అధికారులు ఆరా తీశారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్స్ హార్డ్‌డిస్క్‌లు, ఆడిట్ రిపోర్టుల ఆధారంగా దిల్ రాజును విచారించారు. ఐటీ చెల్లింపుల వ్యత్యాసాలకు సంబంధించి స్టేట్‌మెంట్స్ రికార్డ్ చేశారు.

హైడ్రాపై రాజీ ప్రసక్తే లేదు

- జైలుకైనా పోతాగానీ.. కూల్చివేతలు సాగనివ్వను
- నా ఇంట్లోకి ఇంకా రేవంత్ ఫొటో రాలేదు: దానం



బంజారాహిల్స్: హైడ్రా అధికారులు తన ప్రాంతానికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హెచ్చరించారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 'పోలీసులు, హైడ్రా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. మా ఏరియాకు వస్తే ఊరుకునేది లేదని హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు చెప్పిన. పేదల ఇళ్లను కూలుస్తామంటే ఊరుకోను. అవసరమైతే జైలుకు పోతాగానీ కాంప్రమైజ్ కాను. నా ఇంట్లో వైఎస్ఆర్, కేసీఆర్ ఫొటోలు ఉన్నాయి. రేవంత్‌రెడ్డి ఫొటో ఇంకా రాలేదు'అని తెలిపారు. ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఇటీవల చింతల్ బస్తీలో అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. దానం అక్కడికి చేరుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని మండిపడ్డారు. దానం నాగేందర్ హెచ్చరికతో అధికారులు కూల్చివేతలు నిలిపేశారు. దానం వ్యవహారాన్ని పరిశీలిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటించటం అప్పట్లో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

ఏసీలతో పవర్ గ్రిడ్లకు ముప్పు!

అంతర్జాతీయ ఇంధన సంస్థ నివేదికలో వెల్లడి

- 2050 నాటికి దేశంలో 40 కోట్లకు చేరనున్న పట్టణ జనాభా
- 9 రెట్లు గృహాల్లో పెరగనున్న ఏసీల వినియోగం
- నాలుగు రెట్లు పెరగనున్న విద్యుత్ డిమాండ్
- ఒత్తిడి పెరిగి పవర్ గ్రిడ్లపై పడనున్న పెను భారం



సాక్షి, అమరావతి: ఒకప్పుడు విలాస వస్తువుగా కనిపించిన ఎయిర్ కండిషన్లు(ఏసీలు).. ఇప్పుడు విపరీత ఎండలతో తప్పనిసరి అవసరంగా మారిపోతున్నాయి. గతంలో సంపన్నులకే పరిమితమైన ఏసీలు.. ఇప్పుడు సామాన్యులకు చేరువవుతున్నాయి. ఈ క్రమంలో అవగాహన లేమి, అనవసర వృథా అనర్థాలకు దారితీస్తోంది. ఏసీల అతి వినియోగం వల్ల పవర్ గ్రిడ్లకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఇంధన సంస్థ(ఐఈఏ) హెచ్చరించింది. రానున్న రోజుల్లో వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడంతో పాటు పట్టణ జనాభా కూడా భారీగా వృద్ధి చెంది.. ఏసీల వాడకాన్ని తారాస్థాయికి తీసుకెళ్తాయని పేర్కొంది. దీంతో పవర్ గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుందని ఐఈఏ తన తాజా నివేదికలో వెల్లడించింది.

ప్రతి వందలో 24 ఇళ్లకు ఏసీ..

దేశవ్యాప్తంగా ప్రతి 100 ఇళ్లల్లో 24 ఇళ్లకు ఏసీలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) ఇటీవల వెల్లడించింది. ఈ సంస్థ అధ్యయనం ప్రకారం గత 50 ఏళ్లలో 17 వేల మంది ఎండ దెబ్బకు మరణించారు. విపరీత ఎండలతో భవనాల నుంచి రేకుల షెడ్ల వరకూ ఏసీలను వినియోగిస్తున్నారని పేర్కొంది. ఫలితంగా ఏసీలకు వాడే విద్యుత్ వినియోగం.. మొత్తం విద్యుత్ డిమాండ్‌లో దాదాపు 20 శాతానికి చేరింది. 2050 నాటికి దేశంలో పట్టణ జనాభా సంఖ్య 40 కోట్లకు చేరనుందని అంచనా. దీంతో అప్పటికల్లా పట్టణాల్లో విద్యుత్ డిమాండ్ నాలుగు రెట్లు పెరగనుందని.. గృహాల్లో ఏసీల వాడకం తొమ్మిది రెట్లు పెరుగుతుందని అంచనా. ఇది మొత్తం ఆఫ్రికా ఖండంలో విద్యుత్ వినియోగం కంటే ఎక్కువ. ఏసీలకు ఇలా డిమాండ్ పెరగడం వల్ల విద్యుత్ లోటు ఏర్పడి.. కోతలు విధించాల్సిన అవసరం వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ఏపీలో ఏసీలకు 3 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్..

ఏసీలను నిర్దిష్ట ఉష్ణోగ్రతలో వినియోగించడం ద్వారా విద్యుత్‌ను భారీగా ఆదా చేయవచ్చని కేంద్ర విద్యుత్ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ తాజా అధ్యయనంలో వెల్లడించింది. దీని ప్రకారం .. దేశంలో ప్రస్తుతం 80 మిలియన్ టన్నుల రిఫ్రిజిరేషన్(టీఆర్) ఎయిర్ కండీషనర్ సామర్థ్యం ఉంది. ఇది 10 ఏళ్లలో దాదాపు 250 మిలియన్ టీఆర్‌కు చేరుకునే ప్రమాదం ఉంది. దీని వల్ల 2030 నాటికి దేశంలో విద్యుత్ లోడ్ సుమారు 200 గిగావాట్లకు పెరుగుతుందని అంచనా. రాష్ట్రంలో ఏసీల ఏటా విద్యుత్ డిమాండ్ దాదాపు 3 వేల మిలియన్ యూనిట్లు. ఇది రాష్ట్రం మొత్తం విద్యుత్ వినియోగంలో 5 శాతం. వినియోగదారులు ఏసీ ఉష్ణోగ్రతను 24 డిగ్రీల సెల్సియస్‌గా పెట్టుకుంటే.. దేశంలో ఏటా రూ.10 వేల కోట్ల విలువైన దాదాపు 20 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చని బీఈఈ నివేదికలో పేర్కొంది.

ఏసీ ఎక్కువైనా అనర్థమే..

ఒక మనిషి 1.5 టన్నుల ఏసీని ఉపయోగిస్తే.. అది గంటకు సుమారుగా ఒక యూనిట్ విద్యుత్‌ను వినియోగించి.. దాదాపు 0.98 కిలోల కర్బన ఉద్గారాలను విడుదల చేస్తుంది. సాధారణంగా మానవ శరీర ఉష్ణోగ్రత సుమారు 36–37 డిగ్రీల సెల్సియస్. కానీ 18–21 డిగ్రీల సెల్సియస్‌కు ఏసీ ఉష్ణోగ్రతను తగ్గిస్తుంటారు. దీనివల్ల శ్వాసకోశ సమస్యలు, తలనొప్పి, కళ్లు, చర్మం పొడిబారడం, రక్తపోటు వంటి రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పర్యాటకాభివృద్ధిలో ఒడిశా టాప్

- ఒడిశా టూరిజం రోడ్‌షోలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా
- తెలంగాణ–ఒడిశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం



సాక్షి, హైదరాబాద్: భారత పర్యాటకాభివృద్ధిలో ఒడిశా ముందంజలో ఉందని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యాటక, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ప్రవతి పరిడా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఒడిశా పర్యాటక శాఖ, భారత వాణిజ్య, పరిశ్రమల మండలి (ఫిక్కీ) సంయుక్తంగా ఒడిశా టూరిజం రోడ్‌షో నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అపూర్వమైన పర్యాటక ప్రాంతాలు, ప్రశాంతమైన ప్రకృతి ప్రదేశాలు, టెంపుల్ టూరిజం, వివిధ రంగాల్లో ఒడిశా పెట్టుబడిదారులకు అత్యుత్తమ అవకాశాలను అందిస్తుందని వెల్లడించారు. ఒడిశా, తెలంగాణ మధ్య పర్యాటక, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడానికి, పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి, వ్యూహాత్మక భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ రోడ్ షో ఉపయోగకరంగా ఉంటుందని ప్రవతి ఆశాభావం వ్యక్తంచేశారు. ఆధ్యాత్మికంగా పూరీ జగన్నాథ్ ఆలయం, భువనేశ్వర్, 1,300 ఏళ్ల నాటి కోణార్క్ సూర్యనారాయణ స్వామి దేవాలయం, అడ్వెంచర్ టూరిజం, హస్తకళలు అంతర్జాతీయంగా పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయని వెల్లడించారు. 'ఒడిశాను ఒకసారి సందర్శించండి.. మీకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టండి' అని ఆమె కోరారు. వాణిజ్యపరంగా సత్వర అనుమతులతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.

నేడు గుడిమెలిగె పండుగ



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ మినీజాతర ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనుంది. జాతర అంకురార్పణలో భాగంగా మేడారం (సమ్మక్క), కన్నెపల్లి (సారలమ్మ) ఆలయాల్లో బుధవారం గుడిమెలిగె పండుగను నిర్వహించనున్నారు. పూజారులు ఉదయాన్నే స్నానాలు ఆచరించి వారి వారి ఆలయాలకు చేరుకొని ముందుగా శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సమ్మక్క పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటి నుంచి పసుపు, కుంకుమలతో డోలు వాయిద్యాల మధ్య సమ్మక్క గుడికి చేరుకుంటారు. స్లాబ్‌పై సంప్రదాయంగా అడవినుంచి కొత్తగా ఎట్టి గడ్డిని తీసుకువచ్చి ఈశాన్య మూలన పూజారులు పెడతారు. కన్నెపల్లి సారలమ్మ గుడిలోనూ ప్రధాన పూజారి కాక సారయ్య, కాక కిరణ్‌లు, మిగతా పూజారులు గుడి శుద్ధి చేసి అనంతరం ఆడపడుచులు పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. సారలమ్మ వడేరాల కుండలను పసుపు, కుంకుమలతో అలంకరించి ధూపదీపాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈనెల 12న (బుధవారం) మండమెలిగె పండుగను వైభవంగా నిర్వహించనున్నారు. గుడిమెలిగె పండుగ పూజా కార్యక్రమాలతో మండమెలిగె (జాతర) ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. దేవాదాయ శాఖ పూజారులకు కావాల్సిన పూజా సామగ్రి అందించనుంది.

సచివాలయాన్ని పేల్చేస్తామని బెదిరింపులు

3 రోజుల నుంచి ఫోన్..లంగర్‌హౌస్‌కు చెందిన వ్యక్తి అరెస్ట్

లక్డీకాపూల్(హైదరాబాద్): రాష్ట్ర సచివాలయాన్ని పేల్చేస్తామని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరింపులకు దిగడం తీవ్ర కలకలం రేపుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో అర్జీలు, ఫిర్యాదుల విభాగానికి ఓ ఆగంతకుడు ఫోన్ చేశాడు. ఉద్యోగులు, సిబ్బందిపై బెదిరింపులకు దిగాడు. మూడు రోజులుగా ఇదేవిధంగా కాల్స్ చేస్తూ ఉద్యోగులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సీఎంవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత సహాయంతో నిందితుడి నంబర్‌ని గుర్తించారు. అనంతరం అతడున్న లంగర్‌హౌస్‌కు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని సయ్యద్ మీర్ మహ్మద్ అలీగా గుర్తించారు. దర్గాకు సంబంధించి ఓ సమస్యపై ప్రభుత్వానికి తాను అర్జీ పెట్టుకున్నానని, ఆ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో అధికారులకు బెదిరింపు కాల్స్ చేసినట్టుగా విచారణలో చెప్పినట్టు తెలిసింది. అయితే ఈ ఘటనపై పోలీసులు మరింతగా ఆరా తీస్తున్నారు. నిందితుడే ఫోన్ చేశాడా? అతని వెనుక మరెవరైనా ఉన్నారా? ఫోన్ చేయడానికి గల కారణాలు ఏంటి అనే కోణాల్లో సైఫాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సచివాలయంలో భద్రతా వైఫల్యం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. ఇటీవల నకిలీ ఐడీకార్డుతో ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్‌రావు సచివాలయంలో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. నిందితుడికి నకిలీ ఐడీ కార్డు తయారు చేసింది మైనార్టీ డిపార్ట్‌మెంట్ సెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్ డ్రైవర్ రవిగా తేల్చారు. అనంతరం అతడిని సైతం అదుపులోకి తీసుకున్నారు. తాజా ఘటనలు సచివాలయ భద్రతపై ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.

తెలంగాణకు అన్యాయ దినం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, వివేకానంద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశం శాసన వ్యవస్థకు విరుద్ధంగా జరిగిందని, సభ జరిగిన తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని బీఆర్ఎస్ విమర్శించింది. అసెంబ్లీ వాయిదా అనంతరం మంగళవారం రాత్రి మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు ఇది అన్యాయ దినమని వివేకానంద్ ఆరోపించారు. ఈ సమావేశం ద్వారా సీఎం తన మూర్ఖత్వం, అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ మొదటినుంచి అనుకూలంగా ఉందన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
బుధవారం । 5-2-2025

అధీనమా?.. పరాధీనమా?

అటవీ భూముల అన్యాక్రాంతంపై మీనమేషాలు

- సర్వేల పేరిట అటవీ, రెవెన్యూ శాఖల కాలయాపన
- ఇనుపరాతి గుట్టల చుట్టూ 3,952 ఎకరాలు... పలుచోట్ల ఆక్రమణలు
- ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఇదే తీరు...
- ఇప్పటికే తగ్గిన అటవీ విస్తీర్ణం.. దేశంలో మూడో స్థానంలో తెలంగాణ


దేవునూరు, ముప్పారం శివారు గుట్టలు, అటవీభూములు

సాక్షి ప్రతినిధి, వరంగల్: భూములను గుర్తించడంలో అధికారుల కాలయాపన వల్ల అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. పర్యావరణం, జీవవైవిధ్యానికి దోహదపడాల్సిన సామాజిక అడవుల పెంపకం ఆగిపోగా.. ఆ భూములు సైతం ఆక్రమణలకు గురయ్యాయి. రెవెన్యూ, అటవీశాఖల్లోని కొందరు అధికారుల ఉదాసీనత వల్ల అడవులు పెరిగిన భూములు సైతం ఆక్రమణదారుల పేరిట రిజిస్ట్రేషన్ కాగా.. వారు 'రైతుబంధు'ను సైతం పొందుతున్నారు. ఉమ్మడి వరంగల్‌లో పలుచోట్ల ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోగా, తెలంగాణ వ్యాప్తంగా అటవీ భూముల ఆక్రమణల వివాదాలున్నాయి. చాలాచోట్ల కోర్టుల ద్వారా పరిష్కారమయ్యాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని కొంపెల్లి గ్రామ పరిధిలో 106.34 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తులది కాదని.. అది అటవీ భూమేనని సుప్రీంకోర్టు సుమారు ఆరు నెలల కిందట తీర్పు ఇచ్చింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో ఇనుపరాతి గుట్టల చుట్టూ ఆక్రమణలకు గురైన అటవీ భూములపై రెవెన్యూ, అటవీశాఖలు ఎటూ తేల్చడం లేదు. సర్వేల పేరిట సాగదీత నేపథ్యంలో రూ.కోట్ల విలువైన అటవీ భూములు స్వాధీనం చేసుకుంటారా? పరాధీనమవుతాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల సాయంతోనే యథేచ్ఛగా ఆక్రమణలు..

హనుమకొండ జిల్లా ధర్మసాగర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు మండలాల శివార్లలోని ఇనుపరాతి గుట్టల చుట్టూ అటవీశాఖ లెక్కల ప్రకారం 3,952 ఎకరాలు ఉంది. నిజాంకాలంలో మొత్తం 4 వేల ఎకరాలకు పైగా భూమిని అటవీశాఖకు అప్పగించినట్టు రికార్డుల్లో ఉంది. కొత్తపల్లి బ్లాక్‌లో 594 ఎకరాలు, దామెరలో 560, ఎర్రబెల్లిలో 820, దేవనూరులో 1,095, ముప్పారం బ్లాక్‌లో 906 ఎకరాలుగా ఉంది. కాలక్రమంలో రెవెన్యూ అధికారుల తీరు వల్ల అటవీ భూమికి చుట్టుపక్కల పట్టాలు పుట్టుకొచ్చాయి. ఈ వ్యవహారంపై కొన్నేళ్లుగా రెవెన్యూ, అటవీశాఖలు కలిసి సర్వే పేరుతో కాలయాపన చేస్తుండటంతో ఇంకా ప్రైవేటు వ్యక్తులు యథేచ్ఛగా ఆక్రమిస్తూ పట్టాలు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు కొందరు సర్వేనంబర్లకు బై నంబర్లు వేసి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా అందజేస్తున్నారు. గతంలో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి ఏకంగా 40 ఎకరాలకు పట్టాలు ఇచ్చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. 30 ఎకరాల వరకు ధర్మారం మండలంలోని అటవీ శివారుల్లోని భూములు కూడా కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. పల్లగుట్ట, చాకలిగుట్ట, ఎదురుగుట్ట, పందిఅడుగుగుట్ట పరిధిలోని భూములు కొందరి కబ్జాలో ఉన్నాయి. ఏడాది క్రితం 102 ఎకరాలు కొందరికి పట్టా చేసేందుకు ప్రయత్నాలు జరగ్గా.. ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో ఉన్నతాధికారులు చెక్ పెట్టారు. అయినా 40 ఎకరాల వరకు పట్టా అయ్యిందని చెబుతున్నారు. కాగా కొన్నేళ్లుగా ఈ భూములను పట్టాలు చేసుకుంటున్నవారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఎక్కువగా ఉండగా.. కొందరు ఫారెస్టు, రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే వారి రంగప్రవేశం జరిగిందన్న చర్చ సాగుతోంది. ఇదిలా వుండగా ఈ స్థలాల్లోని కొన్ని సర్వే నంబర్లలో దశాబ్దాల కిందట కొందరు చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వం భూములను అసైన్డ్ చేయగా, వారికి సైతం రెవెన్యూ అధికారులు సాగు చేసుకునేందుకు హద్దులు నిర్ణయించి ఇవ్వడం లేదు. కబ్జాదారులకు మాత్రం ముడుపులు తీసుకుని చకచకా పట్టాలు చేసేయడం వల్ల పట్టాదారులు ఇబ్బంది పడాల్సి వస్తుందంటున్నారు.

తెలంగాణలో తగ్గిన అటవీ విస్తీర్ణం..

'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు- 2023'ప్రకారం తెలంగాణలో 2021–23 మధ్యకాలంలో 100.42 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం తగ్గింది. 2021లో 21,279.46 చ.కి.మీ.లు ఉన్న రాష్ట్ర అటవీ విస్తీర్ణం.. 2023 నాటికి 21,179.04కు తగ్గింది. ఈ తరుగుదలలో మధ్యప్రదేశ్ (371.54 చ.కి.మీ.లు), ఆంధ్రప్రదేశ్ (138.66 చ.కి.మీ.లు) తర్వాత స్థానంలో తెలంగాణ ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను 13 జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గగా 20 జిల్లాల్లో పెరిగినట్లు నివేదిక పేర్కొంది. తగ్గిన 13 జిల్లాలలో మహబూబాబాద్‌లో 26.98 చ.కి.మీ.లు, ములుగులో 25.91 చ.కి.మీ.లు, జయశంకర్ భూపాలపల్లిలో 15.43 చ.కి.మీ.లు, వరంగల్‌లో 2.51 చ.కి.మీ.లు, జనగామలో 2.13 చ.కి.మీ.లు తగ్గింది.

ఉన్నతాధికారుల ఆదేశానుసారం నిర్ణయం



ధర్మసాగర్ మండలం దేవునూర్ శివారులోని ప్రభుత్వ నోటిఫికేషన్‌లో ఉన్న భూములు, నోటిఫికేషన్‌లో లేని భూములు గుర్తించాం. ఆ భూముల్లో సాగు చేస్తున్న రైతుల వివరాలు సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశానుసారం నిర్ణయం తీసుకుంటాం. దేవునూర్, ముప్పారం గ్రామాల శివారులోని ఇనుపరాతి గుట్టల్లో ఫారెస్ట్ అధికారులకు- రైతులకు మధ్య జరుగుతున్న వివాదం పరిష్కారమయ్యేలా ఫారెస్ట్ భూములు, రైతుల పట్టా భూములు సర్వే చేశాం.

– బి.సదానందం, తహసీల్దార్, ధర్మసాగర్, హనుమకొండ జిల్లా

సర్వే వివరాలు అందాల్సి ఉంది..



ఇనుపరాతి గుట్టలు, నాలుగు మండలాల పరిధిలో ఉన్న సర్వే ఇంకా కొంతమేర మిగిలి ఉంది. ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, దేవనూరు, వేలేరు మండలంలోని ఎర్రబెల్లి, భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామాల శివారులో ఇనుపరాతి గుట్టలు ఉన్నాయి. మొత్తం ఫారెస్ట్ భూమి 3,750 ఎకరాలకుపైన ఉండాలి. ఈ భూమికి రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేసి ఇస్తే ఫారెస్ట్ అధికారులు ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ చేస్తారు. జిల్లా ఉన్నతాధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– భిక్షపతి, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ధర్మసాగర్, హనుమకొండ జిల్లా


భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని కొంపెల్లి గ్రామ పరిధిలో 106.34 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తులది కాదని.. అటవీ భూమేనని సుప్రీంకోర్టు తీర్పుతో బోర్డు ఏర్పాటు చేసిన అటవీశాఖ.



అటవీశాఖ ఇనుపరాతి గుట్టల సమీపంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


ఇనుపరాతి గుట్టల శివారు.. అటవీభూములు

బీసీలకు అన్యాయం చేయం

కుల గణనలో మాకు వ్యక్తిగత ప్రయోజనాలు లేవు

- బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- తీన్మార్ మల్లన్న గెలుపుకోసం పనిచేశా: మంత్రి కోమటిరెడ్డి
- అసెంబ్లీలో మీడియాతో మంత్రుల చిట్‌చాట్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లోనూ కుల గణన సర్వే వందశాతం పూర్తయిందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్వేను నిష్పాక్షికంగా నిర్వహించినట్లు చెప్పారు. అసెంబ్లీ లాబీల్లో మంగళవారం పొన్నంతోపాటు మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. హైదరాబాద్‌లో ఉద్దేశపూర్వకంగానే కొంతమంది సర్వేలో పాల్గొనలేదని పొన్నం తెలిపారు. సర్వేకు వెళ్లిన ఎన్యూమరేటర్లపై కొందరు కుక్కలను వదిలారని ఆరోపించారు. కులగణనపై అపోహలు వద్దని, ఇందులో తమకు ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేవని ప్రభుత్వంలోని వ్యక్తిగా చెబుతున్నా అని పేర్కొన్నారు. బీసీలకు అన్యాయం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ఏదీ చేసినా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తుందని అన్నారు.

మల్లన్న విమర్శలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్న: కోమటిరెడ్డి



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన విమర్శలు, ఆరోపణలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మల్లన్న బీఫాం తనకే ఇచ్చారని, పెద్ద ర్యాలీ తీసి మంత్రిగా ఆయన గెలుపుకోసం కృషి చేశానని తెలిపారు. పార్టీ బీఫాంపై గెలిచి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్న తనను వ్యక్తిగతంగా తిడితే స్వాగతిస్తానని, కానీ కులాన్ని తిట్టడం సరికాదని హితవు పలికారు. బీసీల కోసం కాంగ్రెస్ గొప్ప నిర్ణయం తీసుకుందని తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తనతోపాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కకు కూడా సన్నిహితుడేనని చెప్పారు. త్వరలో ఉప్పల్ ఫ్లైఓవర్ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. కొద్ది రోజుల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు మొదలవుతాయని, ఈ ఏడాది చివరికల్లా పనులను ఓ కొలిక్కి తెస్తామని పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు ఆస్తుల గురించి రాయాలంటే ఒక బుక్‌లెట్ కావాలని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం ఓకే అంటే అమలు చేస్తామని, లేదంటే పార్టీ పరంగా 42 శాతం ఇస్తామని చెప్పారు.

మా పార్టీ ఎమ్మెల్యేలం కలిస్తే నొప్పి ఎందుకు: రాజేందర్‌రెడ్డి

సొంతపార్టీ ఎమ్మెల్యేలం కలిసి డిన్నర్ చేసి చర్చించుకుంటే తప్పేంటని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తనను కూడా డిన్నర్‌కు ఆహ్వానించారని, కానీ తాను వెళ్లలేకపోయానని తెలిపారు. 'మా ఎమ్మెల్యేలు సమావేశమైతే మా పార్టీకి లేని బాధ ఇతర పార్టీలకు ఎందుకు? మేము వేరే పార్టీ నేతలతో కలిసి డిన్నర్‌లు చేస్తే తప్పవుతుంది'అని అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఇతర కులాలను తిట్టే హక్కు లేదని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయనకు ఇష్టం లేకపోతే పార్టీ నుంచి వెళ్లిపోవచ్చని సూచించారు. తీన్మార్ మల్లన్న గెలుపుకోసం తాము కష్టపడ్డప్పుడు రెడ్లమని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు.

నేడు గాంధీభవన్‌లో మంత్రి సీతక్కతో ముఖాముఖి

సాక్షి, హైదరాబాద్: ప్రతి బుధవారం మంత్రులతో జరిగే ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా.. మంత్రి సీతక్క గాంధీభవన్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల ఈ కార్యక్రమం ఉంటుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందజేయాలని కోరారు.

కులగణన సర్వే తప్పులతడక

రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన కులగణన సర్వే తప్పుల తడకగా, కాకి లెక్కలతో అశాస్త్రీయంగా ఉందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. పదేళ్లలో తెలంగాణ జనాభా కేవలం 2 లక్షలు మాత్రమే పెరిగిందని పేర్కొనడం విడ్డూరమని మంగళవారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం 2011లో జరిపించిన లెక్కల ప్రకారం.. తెలంగాణ జనాభా 3 కోట్ల 50 లక్షలు కాగా, 2014 సమగ్ర కుటుంబ సర్వే (ఓ) ప్రకారం 3 కోట్ల 68 లక్షలని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన సర్వేలో జనాభా 3 కోట్ల 70 లక్షలుగా నమోదైందని వివరించారు.

ప్రకృతి పంట.. ఆదాయం ఇంట

- వేసవిలో ఆదివాసీలకు ఉపాధి నందిస్తున్న తునికాకు సేకరణ
- ఏజెన్సీలో ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా తోడ్పాటు
- రెండు నెలలపాటు ఆర్థికభరోసా


ఊట్లలో ఒకే చోట కూర్చొని కట్టలు కడుతున్న గిరిజనులు

గూడూరు: రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలు అటవీ ప్రాంతాల్లో లభించే తునికాకును ప్రకృతి సంపద (పంట)గా భావిస్తారు. ప్రతీ వేసవిలో రెండు నెలల పాటు తునికాకే వారికి ప్రత్యామ్నాయ ఆదాయ వనరు. ఏటా ఆదివాసీలు ఏప్రిల్‌లో తునికాకు సేకరణ ప్రారంభిస్తారు. అయితే ఎక్కువగా మే నెలలో సేకరించడం పూర్తి చేస్తారు. తద్వారా రెండు నెలల పాటు ఆదాయం సమకూరుతుంది.

విరివిగా లభ్యం..

మహబూబాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో తునికాకు విరివిగా లభిస్తుంది. ఏజెన్సీ ప్రాంతాల గిరిజన కుటుంబాలు ఎండాకాలం రాగానే తునికాకు సేకరణలో నిమగ్నమవుతాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు మహబూబాబాద్, గూడూరు అటవీశాఖ డివిజన్‌తో పాటు ములుగు, ఏటూరునాగారం, భద్రాద్రి కొత్తగూడెం, గుండాల, బయ్యారం మండలాల్లో ఏప్రిల్, మేలలో తునికాకు సేకరణ జోరందుకుంటుంది. ఒక్కో సంవత్సరం తునికాకు సేకరణ ఎక్కువగా జరిగి ప్రభుత్వ సూచన ప్రకారం ఫారెస్టు అధికారులు ప్రతీ డివిజన్‌లో టార్గెట్ ఎక్కువగా పెట్టుకుంటున్నారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు వేసవిలో తునికాకు సేకరణను ఉపాధి మార్గంగా ఎంచుకొని డబ్బులు సంపాదించుకుంటున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏటా కూలీల ద్వారా ఆకు సేకరించి కట్టలను కొనుగోలు చేస్తోంది. గతేడాది 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 చెల్లించారు. ఈ సంవత్సరం కట్ట ధర పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

తొలి కోడి కూతతో అడవికి పయనం..

తునికాకు సేకరణకు గిరిజనులు తొలికోడి కూతతో మేల్కొని వంటలు చేసుకుంటారు. అంబలి, గంజి తీసుకొని అడవులకు పయనమవుతారు. అడవిలో చెట్టు చెట్టుకు తిరిగి తునికాకు కోసి బస్తాల్లో నింపుకుని ఎత్తుకొస్తారు. కొందరు బస్తాల్లో తీసుకొచ్చిన ఆకులను ఇంటి వద్ద కట్టలు కట్టగా, మరికొందరు అడవిలోనే చెట్ల కింద కూర్చొని 50 ఆకుల చొప్పున కట్ట కడతారు. సాయంత్రం ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన కల్లాల వద్ద వాటిని విక్రయిస్తారు. ప్రతీరోజు ఒక్కో కూలీ రూ.450 నుంచి రూ.500 వరకు సంపాదిస్తారు.

గూడూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో..

మహబూబాబాద్ జిల్లా గూడూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో మట్టెవాడ, కొంగరగిద్ద, గోపాలపురం గ్రామాలతో పాటు మరికొన్ని చోట్ల దాదాపు 10 కల్లాలను ఏర్పాటు చేస్తారు. గతేడాది గూడూరు రేంజ్ పరిధిలో 2 వేల స్టాండర్డ్ బ్యాగులు (20 లక్షల) తునికాకు కట్టల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లింపులు..

జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తునికాకు సేకరణపై నిఘా పెడతాం. ఆకుల కట్టలు విక్రయించిన కూలీలకు ఆన్‌లైన్‌లో వారి వివరాలు నమోదు చేసి డబ్బులు చెల్లిస్తాం. ఆకులు సేకరించే వారి నుంచి ఆధార్ కార్డు, ఫొటో, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను సేకరిస్తాం. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం గతేడాది కంటే ఎక్కువ మొత్తంలో ఆకు సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– బత్తుల విశాల్, డీఎఫ్‌ఓ, మహబూబాబాద్

రెండు నెలలు ఉపాధి



వేసవిలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న మాకు తునికాకు సేకరణ ఉపాధినిస్తుంది. రెండు నెలల పాటు పని దొరుకుతుంది. ప్రతీరోజు తెల్లవారు జామునే అడవికి వెళ్తాం. బస్తాల నిండా ఆకు సేకరించి, ఎండ ముదరకముందే ఇంటికి చేరుకుంటాం. మధ్యాహ్నం కుటుంబం అంతా కలిసి కూర్చొని 50 ఆకులతో కట్టలు కడుతాం. సాయంత్రం కల్లం వద్దకు తీసుకెళ్లి విక్రయిస్తాం.

– మేద సమ్మయ్య, మట్టెవాడ, గూడూరు

తునికాకు ఉపాధి కల్పిస్తుంది



మండుటెండా కాలంలో కూలీ పనులు దొరకవు. దీంతో ప్రతీ సంవత్సరం తునికాకు సేకరణ ఉపాధినిస్తుంది. రోజు పొద్దున్నే అడవికి వెళ్లి ఆకు కోసుకొస్తాం. మధ్యాహ్నం కట్టలు కట్టి కల్లంలో అమ్ముతాం. రోజు రూ.450 నుంచి రూ.500 వరకు డబ్బులు వస్తాయి.

– ప్రవళిక, మర్రిమిట్ట, గూడూరు

వృద్ధులకు సైతం ఆదాయం



తునికాకు సేకరణతో విద్యార్థులు, వృద్ధులకు డబ్బులు వస్తాయి. విద్యార్థులు బడులు మొదలయ్యే ముందు కొత్త దుస్తులు, పుస్తకాలు, బ్యాగులు కొనేందుకు వాడుకుంటారు. వృద్ధులు తమ అవసరాలకు ఉపయోగించుకుంటారు.

– రమ్య, మర్రిమిట్ట, గూడూరు


తునికాకు కల్లం పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారి

బండి కాదు.. మొండి


ఎడ్లబండిపై ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లడం సహజమే. మరి ద్విచక్రవాహనంతో ఎడ్లబండిని లాక్కెళ్తే?.. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రం నుస్తులాపూర్ గ్రామంలో ఒక రైతు తన స్కూటీకి.. ఎడ్లబండిని కట్టి తీసుకెళ్తుండటాన్ని, రైతులు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కండ కరిగితే తిండికలదోయ్



చెమట చిందితేనే ఈ వలస జీవులకు కడుపు నిండేది.
మహారాష్ట్ర నుంచి వచ్చిన వీరు నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులో రోడ్డు పక్కన కొలిమి ఏర్పాటుచేసుకుని ఇలా వ్యవసాయ పనిముట్లు, ఇంటికి అవసరమైన వస్తువులు తయారు చేస్తూ కడుపునింపుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బతుకు 'బండి'



నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లాలంటే నాలుగు రాళ్లు సంపాదించక తప్పదు.
తూరుపు తెల్లారగానే ఈ చిరు వ్యాపారులు తమ బండిపై సామాన్లు కట్టుకుని ఊరూరా తిరిగి అమ్ముకోవడానికి బయల్దేరారు. అనంతపురం చెరువు కట్టపై మంగళవారం ఉదయం ఈ దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

తెలిమంచు తెరల్లో కృష్ణమ్మ



ఇంకా మంచుతెరలు పూర్తిగా తొలగిపోలేదు. ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణమ్మ నిశ్చలంగా ఉంది. ఒడ్డునే నిలువెత్తునున్న సీతానగరం కొండ నీడ కృష్ణమ్మలో ప్రతిబింబిస్తోంది. బతుకు వేటలో ఓ జాలరి తెప్పపై నీటిని చీల్చుకుంటూ చేపల కోసం అన్వేషిస్తున్నాడు. ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

'కేఎల్‌యూ'పై నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలి
ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మలవరపు పవన్ కుమార్

సాక్షి, అమరావతి: కేఎల్ యూనివర్సిటీ న్యాక్ ర్యాంకింగ్‌లో అవినీతిపై సీబీఐ వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మలవరపు పవన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిష్పాక్షికంగా విచారణ చేసి వాస్తవాలను బయటపెట్టాలని కోరారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారించాలన్నారు.

మిర్చి ఎగుమతులను పునరుద్ధరించాలి
ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పతనమైన ధరలతో మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. మిరప రైతులను ఆదుకోకపోతే భవిష్యత్‌లో మిరప సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించింది. మంగళవారం రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు పంపిన వినతిపత్రాన్ని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి మీడియాకు విడుదల చేశారు. చైనా, బంగ్లాదేశ్ వంటి దేశాలతో భారత్‌కు సత్సంబంధాలు తగ్గిపోవడంతో మిరప ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. మిరప పంటకు క్వింటాకు కనీసం రూ.25,000 చొప్పున మద్దతు ధర కల్పించాలన్నారు. విదేశాలకు ఎగుమతులు పునరుద్ధరించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఐఐటీని సందర్శించిన భారత ఏకాత్మతా యాత్ర బృందం



రేణిగుంట: భారత ఏకాత్మతా యాత్రలో భాగంగా మంగళవారం ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల బృందం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీని సందర్శించారు. విభిన్న ప్రాంతాలలో వివిధ జాతులు అవలంబించే సంస్కృతీ, సాంప్రదాయాలను గురించి తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా 25మంది విద్యార్థులతో కూడిన బృందం ఐఐటీకి వచ్చారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, ఐఐటీ కాంపిటెన్సీ డెవలప్‌మెంట్ అండ్ అవుట్‌రీచ్ యాక్టివిటీస్ డీన్ ప్రొఫెసర్ అరుణ్ తంగిరాల వారిని సాదరంగా ఆహ్వానించారు. జాతీయ సమగ్రత, సాంస్కృతిక సమ్మేళనాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఐఐటీ క్యాంపస్‌లో ల్యాబ్‌లు, ఆధునిక భవనాలు, సాంకేతికత మేళవించిన సౌకర్యాలను చూసి విద్యార్థులు ముగ్ధులయ్యారు. ఈ పర్యటన విద్యార్థులకు భారత జాతి ఔన్నత్యాన్ని, సమైక్యతను తెలియజేస్తుందని ఐఐటీ డైరెక్టర్ స్పష్టం చేశారు.

మిర్చి యార్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి

కొరిటిపాడు (గుంటూరు వెస్ట్): గుంటూరు మార్కెట్ (మిర్చి)యార్డులో సీజన్ ప్రారంభమైందని, రోజుకు లక్షకు పైగా మిర్చి బస్తాలు వస్తున్నందున యార్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) కాకుమాను శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో యార్డు అధికారులు, సిబ్బంది, అందుబాటులో ఉన్న మిర్చి ఎగుమతి వ్యాపారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ముందుగా యార్డులోని ఉచిత భోజనం, అల్పాహారశాల, రైతు విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌జేడీ కాకుమాను శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎగుమతి వ్యాపారులు ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చిని ఆ రోజే బయటకు తరలించేలా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు సూచనలు చేశారు. ఉచిత భోజనం, అల్పాహారం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని పేర్కొన్నారు.

తాపం తీర్చే అమృతభాండం



- సమీపిస్తున్నవేసవి
- కొబ్బరి బొండాల అమ్మకాలపై రైతులు, వ్యాపారుల భారీ ఆశలు
- ప్రస్తుతం రైతు ధర రూ.12
- కొబ్బరికాయ ధర రూ.15

సాక్షి, అమలాపురం: మండు వేసవిలో దాహం తీర్చాలన్నా, వేడెక్కిన శరీరాన్ని చల్లబరచాలన్నా, అనారోగ్యం బారిన పడితే త్వరగా కోలుకోవాలన్నా వెంటనే గుర్తుకు వచ్చేది కొబ్బరి బొండాం. కొనుగోలుచేసేవారికే కాదు.. ఉత్పత్తి చేసే రైతులకు కూడా ఇది అమృత బాండమే. మార్కెట్ ఒడిదొడుకులతో సంబంధం లేకుండా ధరలు నిలకడగా ఉండటం, కాయ సేకరణ భారం లేకపోవడంతో కొబ్బరి రైతులు ఇదే తమకు మేలని భావిస్తుంటారు. వేసవి సమీపిస్తుండటంతో బొండాల ధరలపైన, ఎగుమతులపైన రైతులు భారీగా ఆశలు పెట్టుకుంటున్నారు.

కొబ్బరి నీళ్లలో పోషకాలు, ఎలక్ట్రోలైట్‌లు అధికంగా ఉంటాయి. ఒక కొబ్బరి బొండాం ఒక సెలైన్‌తో సమానం. బొండాంలో దాదాపు 300 మిల్లీ గ్రాముల సోడియం ఉంటుంది. శరీరానికి రోజుకు సరిపడా సోడియంను ఇది అందిస్తుంది. దీనిలో పొటాషియం, కాల్షియం, పాస్పరస్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇది తక్షణం శక్తిని ఇస్తుంది. ఇటీవలి కాలంలో బొండాం తాగేవారి సంఖ్య పెరిగింది. దీంతో ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి బొండాల ఎగుమతులు పెరిగాయి. మన రాష్ట్రంతో పాటు పొరుగునే ఉన్న తెలంగాణలోని ప్రధాన పట్టణాలకు ఇక్కడి నుంచి కొబ్బరి బొండాలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. కొబ్బరి బొండాలకు ఒకప్పుడు వేసవి మాత్రమే సీజన్‌గా ఉండేది. ఇప్పుడు ఏడాది పొడవునా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏలూరు జిల్లాలో దెందులూరు, చింతలపూడి, జంగారెడ్డి గూడెం, తూర్పు గోదావరి జిల్లా పరిధిలో చాగల్లు, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం, తుని పరిసర ప్రాంతాల నుంచి బొండాల ఎగుమతి ఎక్కువగా జరుగుతుంది. ప్రస్తుతం రోజుకు 50 లారీలకు పైగా ఎగుమతి అవుతుండగా, వేసవి సీజన్‌లో రోజుకు 100 లారీల వరకు కొబ్బరి బొండాల ఎగుమతి జరుగుతుంది. ప్రస్తుతం రైతుల వద్ద ఒక్కో కొబ్బరి బొండాం ధర రూ. 12 పలుకుతోంది. కొబ్బరి కాయ ధర రూ. 14 నుంచి రూ. 15 పలుకుతోంది. దీని వల్ల బొండాం అమ్మకాలకన్నా రైతులు కాయపై దృష్టి పెట్టారు. సాధారణంగా కొబ్బరి కాయ కన్నా బొండాం ధర రూ.4 నుంచి రూ. 5 ఎక్కువ ఉంటుంది.


- మార్చి నుంచి కొబ్బరి బొండాలకు వేసవి సీజన్ మొదలవుతుంది. కొబ్బరి కాయకు ఇప్పుడున్న ధర మరికొద్ది రోజులు ఉంటే బొండాం ధర రూ.18 నుంచి రూ.20 వరకు చేరుతుంది. కాని దిగుబడి అధికంగా ఉండటం వల్ల బొండానికి ధర తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- కాయతో పోల్చుకుంటే బొండాం అమ్మకాలే రైతులకు లాభసాటిగా ఉంటాయి. బొండాం ఆరు నుంచి ఎనిమిది నెలలకు తయారవుతుంది. అదే కొబ్బరికాయ పక్వానికి రావడానికి సుమారు 12 నెలలు పడుతుంది. కాయతో పోల్చితే బొండాల వల్ల రైతులు త్వరితగతిన ఉత్పత్తి అందుకుంటారు.
- కొబ్బరి కాయ రైతులే సేకరించాలి. దింపు, పోగువేత, రాశులు పోయడం ఇలా కాయకు రెండు రూపాయల వరకు ఖర్చవుతుంది. అదే బొండాలను వ్యాపారులే సొంత ఖర్చులు పెట్టుకుని దింపించుకుంటారు. దీంతో రైతులకు సేకరణ ఖర్చు తగ్గుతుంది.





డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నుంచి కొబ్బరి బొండాల ఎగుమతి

ఊరు.. తేనెలూరు



ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఇది కూడా అలాంటి ఊరే. ఈ ఊరు పేరు చెబితే చాలు నోరూరుతుంది. తియ్యని పిలుపు రారమ్మంటుంది. అదే తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయంతో నష్టపోయిన రైతులు.. ఉపాధి కోసం అడవి బాట పట్టారు. కొండ, గుట్టలెక్కుతూ తేనె సేకరించి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

- రారమ్మంటున్న 'హనీ విలేజ్'
- స్వచ్ఛమైన తేనెకు చిరునామా చిల్లకొండయ్యపల్లి
- కొండ, గుట్టల్లో తేనె సేకరిస్తున్న గ్రామస్తులు
- 25 కుటుంబాలకు ఉపాధి



తాడిమర్రి: ఉదయమే సద్ది మూట కట్టుకుని అందరూ పొలం బాట పడితే సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి యువకులు మాత్రం అడవిబాట పడతారు. కొండ, గుట్ట, చెట్టు, చేమ చుట్టేస్తూ సేకరించిన స్వచ్ఛమైన తేనెను విక్రయించి కుటుంబాలను పోషించుకుంటున్నారు. గ్రామంలోని 25 కుటుంబాలు తేనె సేకరణను ఉపాధిగా మలచుకున్నాయి.

15 ఏళ్లుగా... తేనె సేకరణే వృత్తిగా

దాదాపు 15 సంవత్సరాలుగా తేనె సేకరణనే వృత్తిగా పెట్టుకుని చిల్లకొండయ్యపల్లి యువత జీవనం సాగిస్తోంది. అప్పట్లో వ్యవసాయ పనులు లేక పోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు కాటమయ్య అనే వ్యక్తి తొలిసారిగా తేనె సేకరణను ఉపాధిగా మార్చుకున్నాడు. అనంతరం అదే బాటలో కొందరు యువకులు పయనించారు. అయితే వీరు సేకరించిన తేనెకు సరైన మార్కెటింగ్ లేక ఇబ్బంది పడుతుండడంతో అప్పట్లో మహాత్మాగాంధీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా ఉన్న రామలింగప్ప స్పందించి, గిట్టుబాటు ధరతో తేనె కొనుగోలు చేసేలా చెన్నకొత్తపల్లిలోని ధరణి స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదిర్చాడు. ప్రస్తుతం సంస్థ కిలో తేనెను రూ.400 చొప్పున కొనుగోలు చేస్తుండగా... స్థానికంగానే ఇతరులకు రూ.500తో విక్రయిస్తూ ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతున్నారు. ఉమ్మడి జిల్లాలో చిల్లకొండయ్యపల్లి తేనెకు మంచి గిరాకీ ఉంది.

అన్నం పెడుతున్న అడవి..

మండలంలోని దాడితోట బీట్ పరిధిలో కునుకుంట్ల, చిల్లవారిపల్లి, దాడితోట గ్రామాలతో పాటు పుట్లూరు మండలం ఎల్లుట్ల పరిధిలో సుమారు 3,534 హెక్టార్లలో రిజర్వు ఫారెస్టు విస్తరించి ఉంది. రిజర్వు ఫారెస్టులో అటవీ అధికారులు నారేపి, ఎర్రచందనం, తవసీ తదితర మొక్కలు భారీగా నాటారు. ఇప్పుడా మొక్కలు పెద్ద వృక్షాలై తేనెపట్టులకు ఆవాసాలుగా మారాయి. ఫలితంగా రిజర్వు ఫారెస్టు ఎందరికో ఉపాధి వనరుగా మారి అన్నం పెడుతోంది.

ముంగార్ల కాలం అనువైనది..

తేనె సేకరణకు ముంగార్ల కాలం అనువైనది. జూన్ ప్రారంభంతో వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో అడవులు, తోటలు పచ్చదనం సంతరించుని పుష్పాలు వికసిస్తాయి. ఆ పుష్పాల్లోని మకరందం కోసం వచ్చే తేనెటీగలు సమీపంలోనే తేనెపట్టులను ఏర్పాటు చేసుకుంటాయి. ఏడాదిలో 9 నెలల పాటు తేనె సేకరణలో ఇక్కడి యువకులు నిమగ్నమవుతారు. నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని చెబుతున్నారు.

తేనె సేకరణలో కష్టాలు ఎన్నో..

తేనె ఎంత రుచిగా ఉంటుందో దానిని సేకరించడమంటే అంతకు రెట్టింపు కష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. అయినా చిల్లకొండయ్యపల్లి యువకులు కష్టాలను లెక్కచేయడం లేదు. కళ్లముందు తేనె పట్టు కనిపిస్తే చాలు వెంటనే సేకరణలో నిమగ్నమవుతారు. ఈ క్రమంలో ముళ్ల కంపలు గుచ్చుకున్నా, తేనెటీగలు కుట్టినా తమ పట్టు మాత్రం వదలరు. ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నా... తేనెటీగలు కుట్టి తీవ్ర అస్వస్థతకు లోనైన సందర్భాలు ఎన్నో ఉన్నాయని యువత తెలుపుతోంది.



చిల్లకొండయ్యపల్లి సమీపంలో విస్తరించిన అటవీ ప్రాంతం



తేనె తెట్టె నుంచి తేనెటీగలను లేపిన దృశ్యం



తేనెను శుద్ధి చేస్తున్న యువకుడు సూరి



పౌల్ట్రీ రైతులను ఆదుకోండి

సీఎం చంద్రబాబుకు పౌల్ట్రీ ఫెడరేషన్ వినతి

సాక్షి, అమరావతి/భీమవరం: సంక్షోభంలో చిక్కుకున్న పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ ప్రతినిధుల బృందం మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది. రాష్ట్రంలో పౌల్ట్రీ రైతుల పరిస్థితి నానాటికీ దిగజారిపోతోందని వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. పౌల్ట్రీ రైతులకు వడ్డీ మినహాయింపు (ఇంట్రస్ట్ సబ్‌వెన్షన్) ఇవ్వాలని, రుణాలను రీషెడ్యూల్ చేయాలని, ప్రభుత్వ వెటర్నరీ ల్యాబ్స్‌తో పాటు ప్రభుత్వ పశువైద్యాస్పత్రుల్లో పౌల్ట్రీకి ఉచితంగా సేవలందించాలని, మొక్కజొన్న దిగుమతులపై ఎక్సైజ్ డ్యూటీని మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ పౌల్ట్రీ రంగం నిలదొక్కుకునేందుకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సీఎం కలిసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్షుడు కె.సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు టి.కుటుంబరావు, కమిటీ సభ్యులు జి.గంగాధరరావు, జి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

క్యాన్సర్‌ను గుర్తించడానికి ముందస్తు పరీక్షలు

- 1,500 వైద్య బృందాల ఏర్పాటు
- మంత్రి సత్యకుమార్ వెల్లడి



తిరుపతి అర్బన్: క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించడానికి వీలుగా పరీక్షలను చేపడుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ..బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్‌కు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన ముందస్తు ఉచిత పరీక్షల వివరాలను చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 155 మంది సూపర్ స్పెషలిస్టులు, 238 మంది స్పెషలిస్టులు, 4వేల మంది ఎఎస్ఎంలు, 4వేల మంది వైద్యాధికారులు, 18,000 మంది పీహెచ్‌సీ సిబ్బందితో క్యాన్సర్ వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల్లో ఉచితంగా క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 71 లక్షల మందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించగా 66 వేల మంది అనుమానితుల్ని గుర్తించామని చెప్పారు. అనుమానితుల్ని బోధనా సుపత్రుల్లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్లకు రిఫర్ చేసినట్లు వివరించారు.

పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలి

సాక్షి, అమరావతి: నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ, నివారణకు చర్యలను బలోపేతం చేయడంలో వైద్య, మున్సిపల్, పంచాయతీరాజ్, గిరిజన శాఖల ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలని వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఆయా శాఖల సమన్వయ సమావేశం మంగళవారం సచివాలయంలో నిర్వహించారు. ఇందులో కృష్ణబాబు మాట్లాడుతూ..పైప్ లైన్ లీకేజీలను అరికట్టడంతో పాటు, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యాధి పర్యవేక్షణ, ప్రతిస్పందన కోసం ఆయా విభాగాల మొబైల్ అప్లికేషన్‌లను అనుసంధానం చేయాలన్నారు.

శ్మశానంలో పోలీసుల గస్తీ

చాగలమర్రి: రాత్రి వేళ శ్మశానాకి వెళ్లాలంటేనే హడలిపోతారు. కానీ నంద్యాల జిల్లా చాగలమర్రి పోలీసులు మాత్రం గత పది రోజులుగా శ్మశానంలో గస్తీ నిర్వహిస్తున్నారు. స్థానిక న్యూ బిల్డింగ్స్ సమీపంలోని ఓ సామాజిక వర్గానికి చెందిన శ్మశానంలో సమాధులను గుర్తు తెలియని దండుగులు ధ్వంసం చేస్తున్నారని మత పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం పోలీసుల ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు రాత్రి వేళ పోలీసు సిబ్బంది శ్మశానాన్ని తనిఖీ చేయాల్సి వస్తోంది.

పోలవరం ఎత్తు తగ్గిస్తే చరిత్ర హీనులవుతారు

కూటమి నాయకులపై సీపీఐ నేత విమర్శ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వనజ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): కేంద్రానికి తలొగ్గి పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే కూటమి ప్రభుత్వంలోని నాయకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ డ్యామ్ ముందు ఆమోదించిన డిజైన్ ప్రకారం 45.72 మీటర్ల ఎత్తున నిర్మిస్తేనే దాని ప్రయోజనాలు రాష్ట్రానికి అందుతాయన్నారు. అంతే కానీ ఎత్తును 41.15 మీటర్లకు తగ్గిస్తే ఉపయోగం ఉండదని చెప్పారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించిందంటూ నానా రాద్ధాంతం చేసిన చంద్రబాబు ఇప్పుడు ఏధంగా ఎత్తు తగ్గిస్తారని ప్రశ్నించారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్



రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ధ్వజమెత్తారు. నెరవేర్చిన హామీలను కూడా అరకొరగా నెరవేర్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా హామీల అమలుకు చర్యలు చేపట్టలేదన్నారు. అధికారంలోకి వచ్చేందుకు అనేక వాగ్దానాలు ఇచ్చి, ఇప్పుడు సంపద సృష్టించలేదని, అప్పులు పెరిగిపోయాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనినిబట్టి చూస్తుంటే ఎన్నికల్లో గెలిచేందుకు తప్పుడు హామీలు ఇచ్చారనే అనుమానం కలుగుతోందన్నారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకు వస్తానన్న సీఎం చంద్రబాబు ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తలేదన్నారు.

గోకృపామృత సేద్యం!

- 8.5 ఎకరాల్లో పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పాపారావు
- గోకృపామృతం, జీవామృతం, కషాయాలతో సేద్యం
- ఏడాది మాగిన ధాన్యంతో ఆడించిన బియ్యం, పచ్చి కొమ్ముల పసుపు తదితర ఉత్పత్తుల విక్రయం





పసుపు తోటలో రత్నగిరి దుంప మొక్క చూపిస్తున్న పాపారావు

ఇరవై ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతు కరుటూరి పాపారావు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్ ఆయన స్వగ్రామం. 8 ఎకరాల్లో పదేళ్లుగా పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. అరెకరంలో వివిధ రకాల పసుపు, పండ్ల మొక్కలు, కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. 2012లో బాసరలో సుభాష్ పాలేకర్ శిక్షణా శిబిరంలో పాల్గొని స్ఫూర్తి పొందిన పాపారావు 2015 నుంచి 8.5 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు.

పంట వ్యర్థాలను కాలబెట్టకుండా జనుము, జీలుగతో కలిపి కుళ్లబెట్టి భూమిని సారవంతం చేస్తున్నారు పాపారావు. తన వ్యవసాయ క్షేత్రంలో 5వేల లీటర్ల ట్యాంకును ఏర్పాటు చేసి బెల్లం, మజ్జిగ, మదర్ కల్చర్ కలిపి గోకృపామృతం.. దేశీ ఆవు పేడ, ఆవు మూత్రం, బెల్లం, శనగపిండి, పుట్టమట్టి కలిపి జీవామృతం తయారు చేస్తున్నారు. ఈ రెండింటినీ కలిపి పైప్‌లైన్ల ద్వారా పంటలకు అందిస్తున్నారు. పురుగుల నియంత్రణ కోసం వేప కషాయం, పుల్లటి మజ్జిగ, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, దశపర్ణి కషాయం అవసరాన్ని బట్టి పిచికారీ చేస్తున్నారు.

ఏడాది పాత బియ్యం..

పంట నూర్పిడి అనంతరం నిల్వ, ప్రాసెసింగ్ అంతా సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ పోషక సంపన్న ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెస్తుండటం రైతు పాపారావు మరో ప్రత్యేకత. వరి పొలం గట్ల మీద కందిని కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే సాగు చేస్తున్నారు. కందులను ఇసుర్రాయితో ఆడించి సహజ విధానంలో పప్పుగా మార్చుతున్నారు. ధాన్యం దిగుబడి రసాయన సాగుతో పోలిస్తే సగమే వస్తోంది. కూలీల అవసరమూ ఎక్కువే. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి గన్నీ బ్యాగుల్లో నింపి ఏడాది పాటు నిల్వ చేస్తున్నారు. నిల్వ సమయంలో పురుగు పట్టకుండా ఉండేందుకు వావిలాకు, గానుగ ఆకు, సీతాఫలం ఆకు ధాన్యం బస్తాల వద్ద ఉంచుతున్నారు. ఏడాది దాటిన తరువాత ధాన్యాన్ని ముడి బియ్యం ఆడించి 10 కిలోల సంచుల ద్వారా ప్రజలకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపుతున్నారు.

ప్రకృతి సాగుకు మరింత తోడ్పాటునివ్వాలి

అన్ని రకాల పంటలను రైతు పండించి, సంప్రదాయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి వినియోగదారుడికి నాణ్యమైన సేంద్రియ ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో నా వంతు కృషి చేస్తున్నాను. రైతులు అన్ని రకాల పంటలు పండించాలి. అన్ని పనులూ వ్యక్తిగత శ్రద్ధతో చేసుకోవాలి. ప్రతి రైతూ ఈ లక్ష్యంతోనే ముందుకెళ్లాలి. ప్రకృతి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం మరింత తోడ్పాటు ఇవ్వాలి.

– కరుటూరి పాపారావు (96188 11894), జైతాపూర్, ఎడపల్లి మండలం, నిజామాబాద్ జిల్లా

పచ్చి పసుపు ముక్కలు..

పసుపు తవ్విన తరువాత ఉడకబెట్టి, పాలిష్ చేసి అమ్మటం సాధారణ పద్ధతి. అలాకాకుండా, పచ్చిగా ఉన్నప్పుడే శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలు చేసి, నీడలో ఎండబెట్టి పసుపు పొడిని తయారు చేయిస్తున్నారు. ఉడకబెడితే పోషకాలు తగ్గిపోతాయని ఇలా చేస్తున్నానని అంటున్నారు పాపారావు. నల్ల పసుపు, సేలం, కృష్ణ సేలం రకాల పసుపును సాగు చేస్తున్నారు. మునగాకును నీడలో ఆరబెట్టి, ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు.



నిల్వ చేసిన ధాన్యంతో పాపారావు

ఆయన 50 రకాలకు పైగా కూరగాయలు, సుగంధ, ఔషధ, పండ్ల రకాలను సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. తాను పండించే పంటలతో పాటు పప్పులు, బెల్లం, పల్లీలు ఇతర జిల్లాలు, రాష్ట్రాల సేంద్రియ రైతుల నుంచి సేకరించి వాట్సప్ ద్వారా విక్రయిస్తున్నారు. పలువురు ప్రకృతి వ్యవసాయదారులను కలుపుకొని వాట్సప్‌లో 'నేచురల్ ప్రొడక్ట్స్ కన్స్యూమర్స్ గ్రూపు' ఏర్పాటు చేసుకొని ఆరోగ్యదాయక ఉత్పత్తులను నేరుగా ప్రజలకు అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న పాపారావును ప్రభుత్వం నుంచి ఉత్తమ రైతు పురస్కారంతో అనేక ఇతర పురస్కారాలు కూడా అందుకున్నారు.

– తుమాటి భద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఒక్క బ్యారెల్ = 60 కుండీలు!



ఇంటి పంట

వర్టికల్ టవర్ గార్డెన్‌ను మీరే తయారు చేసుకోవచ్చు

వర్టికల్ టవర్ గార్డెన్ ఇంటిపంటల సాగుదారులకు చాలా ఉపయోగకరం. మేడ మీద లేదా బాల్కనీలో, ఇంటి పెరట్లో అతి తక్కువ స్థలంలో (కనీసం 4 గంటలు ఎండ తగిలే చోట) ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక్కో బారెల్‌లో 60 రకాల ఆకుకూరలు, కూరగాయలు, కషాయాల కోసం ఔషధ మొక్కలను పెంచుకోవచ్చు. బారెల్ మధ్యలో ఉండే పీవీసీ పైపులో వంటింటి వ్యర్థాలు వేస్తూ.. వర్మీ కంపోస్టును కూడా తయారు చేసుకోవచ్చు. ఈ టవర్ గార్డెన్లను సేంద్రియ ఇంటిపంటలపై ఆసక్తి, ఓపిక ఉన్న వారు తమంతట తాము తయారు చేసుకోవచ్చు. అదెలాగో హైదరాబాద్‌కు చెందిన వర్టికల్ టవర్ గార్డెన్ నిపుణులు రవి చంద్ర కుమార్ వివరిస్తున్నారు.

1 మార్కెట్‌లో దొరికే 300 లీటర్ల లేదా 250 లీటర్ల హెచ్.డి.పి.ఇ. బారెల్ తీసుకోవాలి. బారెల్ పొడవు 36 అంగుళాలు. బారెల్‌కు చుట్టూతా 5 అంగుళాలకు ఒక చోట కత్తిరిస్తే (దీన్నే పాకెట్ అని పిలుస్తున్నాం).. 7 వరుసల్లో పాకెట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. అడ్డంగా ఒక్కొక్క పాకెట్ వెడల్పు 5 అంగుళాలు ఉండేలా కొలత స్కేల్‌తో మార్క్ చేసుకోవాలి. రెండు పాకెట్ల మధ్య 4 అంగుళాల దూరం ఉండేలా చూసుకోవాలి. ఒక వరుసలో 8 పాకెట్లు వస్తాయి. 7 వరుసల్లో మొత్తం 56 పాకెట్లు వస్తాయి. బారెల్ పై భాగాన 4 మొక్కలు పెట్టవచ్చు. అన్నీ కలిపి 60 మొక్కలు పెట్టుకోవచ్చు. అంటే ఒక బారెల్ 60 కుండీలతో సమానం అన్నమాట!

2 పాకెట్లు ఎక్కడ పెట్టుకోవాలో మార్క్ చేసుకున్న తర్వాత మార్క్ చేసిన చోట బారెల్‌ను డ్రిల్ మెషిన్‌తో కత్తిరించి చిల్లు పెట్టాలి, జిగ్‌సా రంపం పట్టడం కోసం.

3 జిగ్‌సా తో వరుసలల్లో మార్క్ చేసిన చోట్ల 5 అంగుళాల వెడల్పున కట్ చేయాలి.

4 పాకెట్ మౌల్డింగ్ చేసే విధానం.. హీట్ గన్‌తో కట్ చేసిన ప్రదేశంలో హీట్ చేయాలి. తగిన హీట్ అయిన తరువాత ఆ ప్రదేశంలో చిత్రంలో చూపిన విధంగా సిమెంటు దిమ్మె అమర్చాలి. అలా అన్ని పాకెట్లను తయారు చేయాలి.

5 బారెల్ అడుగు భాగంలో మధ్యన 4 అంగుళాల రంధ్రం చేయాలి. పక్కన అర అంగుళం రంధ్రం చేయాలి. అధిక నీరు బయటకు వెళ్లడానికి అక్కడ గ్రోమేట్ పెటి టీకాహ అమర్చాలి. మధ్యలో 4 అంగుళాల పీవీసీ గొట్టం అమర్చాలి. గొట్టం చుట్టూ చిల్లులు పెట్టాలి.

6 గొట్టం అమర్చే విధానం.. ఆ గొట్టాన్ని క్రింది భాగాన 6 అంగుళాలు బయటకు ఉండేలా అమర్చి.. అక్కడ ఎంసీల్‌తో అతకాలి. పై భాగాన జీయే వైరుతో కట్టాలి. 4 అంగుళాల గొట్టానికి పైన, కింద మూతలు అమర్చాలి.

7 ఈ బారెల్‌ను నిలబెట్టడానికి ఇనుప స్టాండ్‌ను తయారు చేసుకోవాలి. స్టాండ్ 18 అంగుళాల పొడవు, 18 అంగుళాల వెడల్పు, 10 అంగుళాల ఎత్తు ఉండాలి.

8 వర్టికల్ గార్డెన్‌లో కంపోస్టు తయారు చేసే విధానం– వర్మీ కంపోస్టు 30%, రంపపు పొట్టు 30%, పశువుల ఎరువు 30%, వేప గింజల చెక్క 10%.. ఇవన్నీ కలిపి బారెల్‌లో సరిపడినంత నింపుకోవాలి. బారెల్ మధ్యలో అమర్చిన గొట్టంలో వంటింటి వ్యర్థాలు వేయాలి. అందులో చక్కటి వర్మీ కంపోస్టు తయారవుతుంది. స్టాండ్ మీద వర్టికల్ గార్డెన్‌ను అమర్చుకున్న తర్వాత.. అందులో కంపోస్టు మిశ్రమాన్ని నింపుకోవాలి. బారెల్ చుట్టూ ఉన్న అరలలో విత్తనాలు నాటుకోవాలి. ఒక్కో వర్టికల్ గార్డెన్ టవర్‌ను తయారు చేసుకోవడానికి (బారెల్, స్టాండ్, టవర్, కంపోస్టు, విత్తనాలు.. అన్నీ కలిపి) రూ. 5 వేలు ఖర్చవుతుంది.

వర్టికల్ టవర్‌కు రోజుకు కనీసం 4 గంటలు ఎండ తగిలే చోట పెట్టుకోవాలి. ఇందులో అన్ని రకాల ఆకుకూరలు, ఔషధ మొక్కలు చక్కగా పండించవచ్చని రవిచంద్ర కుమార్ తెలిపారు.



వర్టికల్ టవర్ నిపుణుడు రవిచంద్ర కుమార్

రొయ్యల సాగు విజయానికి అదే కీలకం









రొయ్యల పెంపకం విజయవంతానికి సీడ్ (పిల్లల) నాణ్యతే కీలకమైన అంశం. టైగర్, వెనామీ వంటి సాగుకు అనువైన రొయ్యల జాతుల వలన ప్రపంచ వ్యాప్తంగా ఆక్వా ఒక ముఖ్య పరిశ్రమగా మారింది. చెరువుల్లో రొయ్యల పెరుగుదల, ఆరోగ్యం, బతుకుదల అనేవి నీటి నాణ్యత, చెరువు నిర్వహణ పద్ధతులు, సీడ్ సాంద్రత, మేత నాణ్యత వంటి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయి. చెరువులో రొయ్య పిల్లలు ఎలా పెరుగుతున్నాయనేది అర్థం చేసుకోవడం దిగుబడిని పెంచడానికి, నష్టాలను తగ్గించడానికి, సుస్థిరత్వానికి ముఖ్యమైన అంశం. చెరువులోని నీటి వాతావరణ పరిస్థితులకు రొయ్యల సీడ్ అలవాటు పడే ప్రక్రియపై శ్రద్ధచూపటం చాలా అవసరం. ఈ ప్రక్రియనే ఎక్లిమటైజేషన్ అంటారు. హేచరీలు, చెరువుల మధ్య ఉష్ణోగ్రత, లవణీయత వంటి నీటి నాణ్యత గుణాలలో ఆకస్మిక మార్పులు గణనీయమైన ఒత్తిడిని కలిగిస్తాయి. ఇది రొయ్యలలో శారీరక, ప్రవర్తనా సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల చెరువుకు అలవాటుచేయడం, ఈ మార్పులకు రొయ్యలు క్రమంగా సర్దుబాటు అవడానికి తోడ్పడుతుంది. ఒత్తిడి అధికమైతే మరణాలకు దారితీస్తుంది లేదా పెరుగుదల కుంటుపడుతుంది.

రొయ్యల సీడ్‌ను చెరువుకు అలవాటు చేయటం ఒక క్లిష్టమైన అంశం. హేచరీలలో రొయ్య పిల్లలు స్థిరమైన, నియంత్రిత ఉష్ణోగ్రతలో పెరుగుతాయి. అయితే చెరువుల్లో వాతావరణ మార్పులు, నీటి ప్రవాహం కారణంగా క్లిష్ట పరిస్థితులు ఉంటాయి. అక్కడి నుంచి తెచ్చి ఇక్కడ వదిలినప్పుడు ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పు రొయ్యల సీడ్‌ను ఒకవిధమైన 'షాక్' కు గురి చేస్తుంది. వాటి జీవక్రియ, రోగనిరోధక వ్యవస్థ ప్రభావితమై వ్యాధులకు గురి చేస్తుంది.

అదేవిధంగా, హేచరీ, చెరువు మధ్య లవణీయత (సెలినిటి) హెచ్చుతగ్గులు కూడా ఒత్తిడిని కలిగిస్తాయి. క్రమంగా అలవాటు చేస్తే రొయ్య పిల్లలు చెరువు నీటి లవణీయతకు సర్దుకోగలుగుతాయి.

మరో ముఖ్యమైన అంశం నీటిలోని ఆక్సిజన్ స్థాయి. రొయ్యల ఆరోగ్యం, పెరుగుదలను ప్రోత్సహించడానికి హేచరీలు ఎయిరేషన్ ద్వారా అధిక స్థాయిలో ఆక్సిజన్‌ను అందిస్తాయి. అయితే, చెరువుల్లో ఆక్సిజన్ స్థాయి నీటి ఉష్ణోగ్రత, సంఖ్య వంటి అంశాలపై ఆధారపడి మారవచ్చు. రొయ్యల సీడ్‌ను చెరువులో సరిగ్గా అలవాటు చేయకపోతే అకస్మాత్తుగా తక్కువ ఆక్సిజన్ స్థాయిలున్నపుడు అవి ఒత్తిడికి గురవుతాయి.

అలాగే, పిహెచ్ హెచ్చుతగ్గులు స్టాకింగ్ సమయంలో పోస్ట్–లార్వాల బ్రతుకుదలపై ప్రభావం చూపెడతాయి. కాబట్టి వాటిని సర్దుబాటు చేయాలి. చెరువు నీటిని విత్తన సంచులకు క్రమంగా కలపడం, తరువాత నెమ్మదిగా చెరువులోకి రొయ్య పిల్లలను విడుదల చేయడం మేలు.

చెరువు నీటికి సరిగ్గా అలవాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు:

1. మెరుగైన బతుకుదల
2. మంచి పెరుగుదల
3. వ్యాధి నియంత్రణ లేదా తక్కువ వ్యాధి ప్రమాదాలు
4. పర్యావరణ ఒత్తిడి ప్రభావం తగ్గుదల
5. ఖర్చు తగ్గటం
6. మెరుగైన ఉత్పాదకత

చెరువులో రొయ్యల విత్తనాలను ప్రవేశపెట్టే ముందు, ఉష్ణోగ్రత, పిహెచ్, లవణీయత, నీట కరిగిన ఆక్సిజన్ స్థాయి వంటి కీలక నీటి గుణాలు రొయ్యలకు సరైన స్థాయిలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి. వెనామీ రొయ్యలకు అనువైన పరిస్థితులు:

ఉష్ణోగ్రత: 28–32 డిగ్రీల సెల్షియస్
పిహెచ్: 7.5–8.5
లవణీయత: 15–35 పిపిటి (స్థానిక పరిస్థితులను బట్టి)
నీటిలో కరిగిన ఆక్సిజన్: 5 పిపిఎం కన్నా తక్కువ

చెరువు పరిస్థితులు, హేచరీ నీటి మధ్య ముఖ్యమైన వ్యత్యాసాలు ఉన్నట్లయితే, సీడ్ వేయడానికి ముందు సర్దుబాట్లు చేయవలసి ఉంటుంది (ఉదా.. మంచినీరు, ఎయిరేషన్ మొదలైనవి).

రవాణా సమయంలో ఒత్తిడిని తగ్గించడానికి రొయ్యల సీడ్ ను (పోస్ట్–లార్వాలు) శుభ్రమైన, ఆక్సిజన్ ఉన్న బ్యాగ్‌లు లేదా ఫైబర్ కంటైనర్లలో రవాణా చేయండి. బ్యాగ్‌లు/కంటెయినర్ల రవాణా సమయంలో ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పులు రొయ్యలకు హాని కలిగిస్తాయి. పర్యావరణ ఒత్తిడికి ఎక్కువ కాలం గురికావడం సీడ్ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. కాబట్టి రొయ్యల విత్తనాల రవాణా వేగంగా జరిగేలా చూడండి.

రొయ్యల సీడ్‌ను చెరువుకు అలవాటుచేసే ప్రక్రియ

సాగు చేసే ప్రదేశానికి రొయ్య పిల్లలను చేర్చిన తర్వాత, బ్యాగులను తాడు/కర్రల సహాయంతో చెరువు ఉపరితలంపై కట్టి ఉంచండి. ఉష్ణోగ్రతల సర్దుబాటుకు ఇది సహాయపడుతుంది.

తర్వాత సీడ్ బ్యాగ్‌లను తెరిచి క్రమంగా చెరువు నీటిని సీడ్ బ్యాగ్‌లలోకి ప్రవేశపెట్టండి. ప్రతి 10–20 నిమిషాలకు 10–20% చొప్పున కంటైనర్/బ్యాగ్‌లో చెరువు నీటిని కలపండి. ఇది రొయ్యలు క్రమంగా పిహెచ్, ఉష్ణోగ్రత, లవణీయతలో తేడాలకు అనుగుణంగా మారడానికి సహకరిస్తుంది.

కొనుగోలు చేసిన పి.ఎల్. సంఖ్య నీటి గుణాల వ్యత్యాసాల పరిధిని బట్టి కొన్ని గంటల పాటు ప్రక్రియను కొనసాగించండి. ఈ సమయంలో నీటి నాణ్యత గుణాలను నిరంతరం గమనించండి. థర్మామీటర్, రిఫ్రాక్టోమీటర్, పిహెచ్ మీటర్లను ఉపయోగించండి.

చెరువు నీటిలోకి చేరిన రొయ్య పిల్లలు ఆహారం తీసుకోకపోవడం, అనారోగ్యం పాలవటం, మరణాలు పెరగడం వంటి ఒత్తిడికి సంబంధించిన ఏవైనా సంకేతాలు గమనిస్తే.. చెరువు నీటికి వాటిని అలవాటు ప్రక్రియను మరింత నెమ్మదిగా చేయండి లేదా నీటి గుణాలను తగిన రీతిలో మార్చండి. చెరువులోకి రొయ్యలను నెమ్మదిగా వదలండి. రొయ్య పిల్లలను ఒకేసారి చెరువు నీటిలోకి వేసెయ్యకుండా చిన్న బ్యాచ్‌లుగా విడుదల చేయండి.

రొయ్య పిల్లలను చెరువు అంతటా సమానంగా పంపిణీ చేయండి. వాటికి షెల్టర్, ఆక్సిజన్, తగిన ఫీడింగ్ జోన్‌లు అందుబాటులో ఉంచండి.

విడుదల చేసిన తర్వాత, మొదటి కొన్ని రోజులు చెరువు నీటి నాణ్యతను జాగ్రత్తగా పర్యవేక్షించాలి. ఉష్ణోగ్రత, లవణీయత లేదా ఆక్సిజన్ స్థాయి స్థిరంగా ఉండేలా చూసుకోండి.

రొయ్యల పరిమాణం, వయసుకు తగిన మేత షెడ్యూళ్లను అమలుచేయండి. నీటి నాణ్యత క్షీణత ప్రమాదాన్ని తగ్గించడానికి అతిగా మేత ఇవ్వడం మానుకోండి. ఫీడ్ కంపెనీల ద్వారా సరఫరా చేయబడిన ఫీడ్ చార్ట్‌లను అనుసరించండి. మేత తినే తీరు, కదలికలను గమనించడం ద్వారా రొయ్యల ఆరోగ్యాన్ని గమనించండి. ఆరోగ్యకరమైన రొయ్యలు చురుకుగా తింటాయి. ప్రశాంతంగా ఈత కొడతాయి. ఒత్తిడికి సంబంధించిన ఏవైనా సంకేతాలు ఉంటే తక్షణమే పరిష్కరించాలి. ప్రారంభ రోజుల్లో రొయ్య పిల్లలు చిన్నగా ఉంటాయి. స్పష్టంగా కనిపించవు కాబట్టి ఇది చాలా కష్టమైన ప్రక్రియ.

చెరువు నీటికి అలవాటు చేసే ప్రక్రియలో రొయ్య పిల్లలు వ్యాధికారక క్రిములకు గురికాకుండా చూసుకోండి. వ్యాధుల ప్రవేశాన్ని నివారించడానికి రవాణాలో, చెరువు నిర్వహణ పద్ధతుల్లో సరైన పరిశుభ్రతను పాటించండి.

చెరువు నీటి నాణ్యత గుణాలు, రొయ్యల ఆరోగ్య వివరాలను 'రికార్డ్' చేయండి. ఈ సమాచారం సమస్యలను పరిష్కరించడంలో, భవిష్యత్తులో రొయ్యల సాగులో తగిన మెళకువలు తీసుకోవడానికి సహాయపడుతుంది.

మరికొన్ని సూచనలు:

- **నీటి గుణాలను సర్దుబాటు చేస్తే రొయ్య పిల్లలు క్రమంగా, సాఫీగా చెరువుకు అలవాటు పడతాయి.**
- **ఆక్సిజన్ తగినంత అందేలా చూడండి.**
- **ఒత్తిడిని తగ్గించడానికి తక్కువ సంఖ్యలో రొయ్య పిల్లలను బ్యాచ్‌ల వారీగా రవాణా చేసి, నెమ్మదిగా చెరువు నీటిలోకి విడుదల చేయండి.**
- **రొయ్యలు, చెరువు వాతావరణానికి బాగా సర్దుబాటు అవుతున్నాయని నిర్ధారించుకోవడానికి విడుదల చేసిన తర్వాత కొన్ని రోజుల పాటు వాటి ఆరోగ్యాన్ని, ప్రవర్తనను నిశితంగా గమనించండి.**

చాలా మంది రైతులు రొయ్య విత్తనాన్ని కొనుగోలు చేసి, త్వరగా చెరువులో వేసుకోవాలని ఆత్రంగా వ్యవహరిస్తుంటారు. నెమ్మదిగా చేపట్టాల్సిన ఈ కీలక ప్రక్రియను పట్టించుకోరు. కాబట్టి, రొయ్యల పంట విజయానికి ఉత్తమమైన ప్రారంభాన్ని ఇవ్వటం ముఖ్యం. ఈ ప్రక్రియలో సీడ్‌ను చెరువుకు అలవాటు చేయడమే కీలకఘట్టం. రొయ్యల సీడ్ ఆరోగ్యాన్ని అంచనా వేయడంలో హేచరీ/ల్యాబ్‌లోని ఒత్తిడి పరీక్షలు సహాయపడతాయి.

– డా. పి. రామమోహన్‌రావు (98851 44557), కాకినాడ

ఐపీవోకు 7 కంపెనీలు రెడీ



సెబీ నుంచి తాజాగా అనుమతులు

- జాబితాలో ఎస్ఎంపీపీ, బ్రిగేడ్ హోటల్
- ఆదిత్య ఇన్ఫోటెక్, కుమార్ ఆర్క్ టెక్..

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా 7 కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ జాబితాలో డిఫెన్స్ తయారీ కంపెనీ ఏఎంపీపీసహా.. ఆదిత్య ఇన్ఫోటెక్, బ్రిగేడ్ హోటల్, కుమార్ ఆర్క్ టెక్, సోలార్ వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్, ఇండోగల్ఫ్ క్రాప్ సైన్సెస్, గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్, ప్రోస్టార్ ఇన్ఫోసిస్టమ్స్ చేరాయి. అయితే ఆటో విడిభాగాల సంస్థ వినే కార్పొరేషన్ ముసాయిదా పేపర్స్‌ను ఇటీవలే వెనక్కి తీసుకుంది. మర్చంట్ బ్యాంకర్ల వివరాల ప్రకారం ఇవన్నీ ఉమ్మడిగా రూ. 7,800 కోట్లు సమీకరించనున్నాయి.

రూ. 4,000 కోట్లపై కన్ను

ఐపీవో ద్వారా ఎస్ఎంపీపీ లిమిటెడ్ రూ. 4,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. దీనిలో భాగంగా రూ. 580 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుండగా.. మరో రూ. 3,420 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ శివ్ చంద్ కన్సల్ విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం ప్రమోటర్‌గా కన్సల్ 50 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 437 కోట్లు అనుబంధ కంపెనీ ద్వారా పెట్టుబడి వ్యయాలపై వెచ్చించనుంది.

రూ. 1,300 కోట్ల సమీకరణ

ఆదిత్య ఇన్ఫోటెక్ ఐపీవో ద్వారా రూ. 1,300 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుండగా.. మరో రూ. 800 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ నిధుల్లో రూ. 375 కోట్లు రుణాల చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

రూ. 900 కోట్లకు సై

ఆతిథ్య రంగ కంపెనీ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఐపీవోలో భాగంగా రూ. 900 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా పెట్టుబడులను సమీకరించాలని ఆశిస్తోంది. వీటిలో రూ. 481 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 59 కోట్లు మెటీరియల్ అనుబంధ సంస్థ ఎస్ఆర్‌పీ ప్రోస్పరిటా హోటల్ వెంచర్స్‌కు కేటాయించనుంది. మరో రూ. 108 కోట్లు భూమి కొనుగోలుకి వెచ్చించనుంది.

రూ. 740 కోట్లపై దృష్టి

పీవీసీ బ్లెండ్ ఆధారిత బిల్డింగ్ మెటీరియల్ తయారీ కంపెనీ కుమార్ ఆర్క్ టెక్ ఐపీవో ద్వారా రూ. 740 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. రూ. 500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనుండగా.. మరో రూ. 240 కోట్ల విలువైన ఈక్విటీని కంపెనీ తాజాగా జారీ చేయనుంది. ఈ నిధుల్లో రూ. 182 కోట్లు అనుబంధ సంస్థ టేలియస్ ఇండస్ట్రీలో పెట్టుబడికి వెచ్చించనుంది.

రూ. 600 కోట్లకు రెడీ

సోలార్‌వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ ఐపీవోలో భాగంగా రూ. 600 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. దీనిలో రూ. 550 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. మరో రూ. 50 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

సెబీకి ఉయ్‌వర్క్ ఇండియా ప్రాస్పెక్టస్

వర్క్‌స్పేస్ సేవల సంస్థ ఉయ్‌వర్క్ తమ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూకి (ఐపీవో) సంబంధించి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ని (డీఆర్‌హెచ్‌పీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఈ ఇష్యూలో భాగంగా కంపెనీ 4,37,53,952 షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనుంది. ఐపీవో పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉంటుంది కాబట్టి ఇష్యూ ద్వారా వచ్చే నిధులు కంపెనీకి లభించవు. వ్యక్తులు, చిన్నా .. పెద్ద వ్యాపార సంస్థలు, అంకురాలు మొదలైన కస్టమర్లకు నాణ్యమైన వర్క్‌స్పేస్‌లను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

రూ. 200 కోట్లతోపాటు..

ఐపీవోలో భాగంగా ఇండోగల్ఫ్ క్రాప్‌సైన్సెస్ రూ. 200 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 38.55 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

1.9 కోట్ల షేర్ల జారీ

గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ ఐపీవోలో భాగంగా 1.9 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. నిధులను పరికరాల కొనుగోలు, వర్కింగ్ క్యాపిటల్, సాధరణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

పబ్లిక్ ఇష్యూకు ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్

ఐపీవోలో భాగంగా పవర్ సొల్యూషన్లు, ప్రొడక్టుల తయారీ కంపెనీ ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ 1.6 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. నిధులను రుణ చెల్లింపులు, అనుబంధ సంస్థలో వాటా కొనుగోలు, వర్కింగ్ క్యాపిటల్, సాధరణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

క్యూ3 ఫలితాలు

టైటన్ లాభం ఫ్లాట్

రూ. 1,047 కోట్లు



న్యూఢిల్లీ: జ్యువెలరీ, వాచీల తయారీ టాటా గ్రూప్ దిగ్గజం టైటన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం ఫ్లాట్‌గా రూ. 1,047 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 1,053 కోట్లు ఆర్జించింది. అయితే అమ్మకాలు 26 శాతం ఎగసి రూ. 17,550 కోట్లకు చేరాయి. మొత్తం వ్యయాలు సైతం 27 శాతంపైగా పెరిగి రూ. 16,472 కోట్లకు పెరిగాయి. మొత్తం ఆదాయం 25 శాతం జంప్‌చేసి రూ. 17,868 కోట్లను తాకింది. ఆదాయంలో జ్యువెలరీ విభాగం నుంచి 27 శాతం వృద్ధితో రూ. 16,314 కోట్లు లభించగా.. తనిష్క్ 11 స్టోర్లు, తనిష్క్ జ్యువెలరీ(మియా) 13 స్టోర్లు చొప్పున కొత్తగా తెరిచాయి. కాగా.. వాచీలు, తదితర ప్రొడక్టుల బిజినెస్ 15 శాతం బలపడి రూ. 1,137 కోట్ల అమ్మకాలు సాధించింది. ఐకేర్ విభాగం 17 శాతం పుంజుకుని రూ. 196 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఇతర అనుబంధ ప్రొడక్టులు, పరిమళాలు, తనేరియా వస్త్రాల బిజినెస్ ఫ్లాట్‌గా రూ. 312 కోట్ల ఆదాయం నమోదు చేసింది.

ఫలితాల నేపథ్యంలో టైటన్ షేరు బీఎస్ఈలో 0.26% లాభంతో రూ. 3,590 వద్ద ముగిసింది.

ఏషియన్ పెయింట్స్ లాభం డౌన్

క్యూ3లో రూ. 1,128 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం క్షీణించి రూ. 1,128 కోట్లకు పరిమితమైంది. డిమాండ్ మందగమనం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,475 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 6 శాతం నీరసించి రూ. 8,549 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు నామమాత్రంగా 1 శాతం తగ్గి రూ. 7,224 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంసహా మొత్తం టర్నోవర్ 6 శాతం తక్కువగా రూ. 8,692 కోట్లయ్యింది. అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు 5 శాతం బలపడి రూ. 818 కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 2.7% లాభంతో రూ. 2,355 వద్ద ముగిసింది.

బజాజ్ ఎలక్ట్రికల్స్ లాభం డీలా

రూ. 33 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం బజాజ్ ఎలక్ట్రికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 11 శాతం క్షీణించి రూ. 33 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 37 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 5 శాతం పుంజుకుని రూ. 1,290 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 3 శాతం పెరిగి రూ. 1,257 కోట్లను తాకాయి. ఆదాయంలో కన్జూమర్ ప్రొడక్ట్స్ టర్నోవర్ 8 శాతంపైగా ఎగసి రూ. 1,038 కోట్లను దాటింది. లైటింగ్ సొల్యూషన్ల నుంచి 7 శాతం తక్కువగా రూ. 251 కోట్ల ఆదాయం లభించింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఎలక్ట్రికల్స్ షేరు బీఎస్ఈలో 1.4% లాభంతో రూ. 731 వద్ద ముగిసింది.

థెర్మాక్స్ లాభం క్షీణత

రూ. 114 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం థెర్మాక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 52 శాతం క్షీణించి రూ. 114 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 237 కోట్లు ఆర్జించింది. అయితే దీనిలో భూవిక్రయం ద్వారా లభించిన రూ. 126 కోట్లు కలసి ఉంది. అంతేకాకుండా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా, కెమికల్స్ విభాగాల్లో మార్జిన్లు క్షీణించడం ప్రస్తుత లాభాలపై ప్రభావం చూపింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతం పుంజుకుని రూ. 2,508 కోట్లకు చేరింది. సొంత అనుబంధ సంస్థ ఫస్ట్ ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన రూ. 400 రుణాలకుగాను కార్పొరేట్ గ్యారంటీకి బోర్డు అనుమతించినట్లు థెర్మాక్స్ పేర్కొంది. ప్రస్తుత సమీక్షా కాంలో 8 శాతం తక్కువగా రూ. 2,296 కోట్ల ఆర్డర్లు అందుకుంది. దీంతో 2024 డిసెంబర్‌కల్లా ఆర్డర్ బుక్(బ్యాలన్స్) విలువ 6 శాతం పెరిగి రూ. 11,383 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో థెర్మాక్స్ షేరు బీఎస్ఈలో 1% నష్టంతో రూ. 3,546 వద్ద ముగిసింది.

గోద్రెజ్ ప్రాపర్టీస్ లాభం జూమ్

రూ. 163 కోట్లు




న్యూఢిల్లీ: రియల్టీ రంగ కంపెనీ గోద్రెజ్ ప్రాపర్టీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెండు రెట్లుపైగా జంప్‌చేసి రూ. 163 కోట్లకు చేరింది. హౌసింగ్‌కు పెరిగిన భారీ డిమాండ్, ఆదాయంలో వృద్ధి ఇందుకు దోహదపడ్డాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 62 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రెట్టింపై రూ. 1,240 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 548 కోట్ల టర్నోవర్ మాత్రమే సాధించింది. ఈ కాలంలో అమ్మకాల బుకింగ్స్ 5 శాతం క్షీణించి రూ. 5,446 కోట్లకు పరిమితమయ్యాయి. అయితే వరుసగా ఆరో క్వార్టర్‌లోనూ బుకింగ్స్ రూ. 5,000 కోట్ల మార్క్‌ను అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. పూర్తి ఏడాదికి రూ. 25,000 కోట్ల బుకింగ్స్ లక్ష్యాన్ని అధిగమించనున్నట్లు కంపెనీ తెలియజేసింది.

గోద్రెజ్ ప్రాపర్టీస్ షేరు బీఎస్ఈలో 3% జంప్‌చేసి రూ. 2,391 వద్ద ముగిసింది.

మెప్పించని పవర్‌గ్రిడ్

- 4 శాతం క్షీణించిన లాభం
- ఒక్కో షేరుపై 3.25 డివిడెండ్




న్యూఢిల్లీ: పవర్ ట్రాన్స్‌మిషన్ వ్యాపారంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో తటస్థ పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 4 శాతం తగ్గి రూ.3,862 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.4,028 కోట్లుగా ఉంది. ఇదే కాలంలో ఆదాయం సైతం రూ.11,820 కోట్ల నుంచి రూ.11,743 కోట్లకు పరిమితమైంది. స్వల్ప వ్యత్యాసంతో క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో మాదిరిగా పనితీరు ప్రదర్శించింది. వ్యయాలు రూ.7,076 కోట్ల నుంచి రూ.6,828 కోట్లకు తగ్గాయి. ఎబిట్డా మార్జిన్ 89 శాతం నుంచి 86 శాతానికి క్షీణించింది. వాటాదారుల వద్దనున్న ప్రతి ఒక్క షేరుకు రూ.3.25 చొప్పున ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రెండో మధ్యంతర డివిడెండ్ పంపిణీ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. డివిడెండ్‌ను ఫిబ్రవరి 28 నాటికి వాటాదారులకు పంపిణీ చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎస్ఈలో ఈ షేరు 0.5% లాభంతో మంగళవారం రూ.286 వద్ద ముగిసింది.

టాటా పవర్ లాభం ప్లస్

రూ. 1,188 కోట్లు



న్యూఢిల్లీ: విద్యుత్ రంగ కంపెనీ టాటా పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 1,188 కోట్లను తాకింది. ఆదాయంలో వృద్ధి ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,076 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్పంగా 3 శాతం బలపడి రూ. 15,793 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 15,294 కోట్ల టర్నోవర్ సాధించింది. 2024 డిసెంబర్‌కల్లా 6.7 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. మరో 10 గిగావాట్ల ప్రాజెక్టులు ఎగ్జిక్యూషన్‌లో ఉన్నాయి.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 2% వృద్ధితో రూ. 362 వద్ద ముగిసింది.

అక్రమ జామర్స్‌తోనే కాల్ డ్రాప్స్

చర్యలు తీసుకోవాలన్న టెల్కోలు



న్యూఢిల్లీ: 'విద్యా సంస్థలు, గృహాలు, కంపెనీల్లో ఏర్పాటు చేసిన అక్రమ జామర్స్, రిపీటర్స్‌తో మొబైల్ నెట్‌వర్క్స్ సేవల నాణ్యత క్షీణిస్తోంది. ఫలితంగా వినియోగదారులకు కాల్ డ్రాప్స్, డేటా వేగం తగ్గుతోంది. అక్రమంగా జామర్స్, రిపీటర్స్‌ను వినియోగిస్తున్నవారిపై చర్యలు తీసుకోండి' అని టెలికం కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) ప్రభుత్వానికి నివేదించింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తదితర సంస్థలు సీవోఏఐలో సభ్యులుగా ఉన్నాయి. అటువంటి పరికరాలను ఉపయోగించడం టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023 ప్రకారం నేరమని, వాటి వినియోగాన్ని నిలిపివేయాల్సిందిగా కోరింది. ఈ మేరకు రాష్ట్రాలకు లేఖలు రాయాల్సిందిగా టెలికం శాఖను అభ్యర్థించింది. పరికరాలను అమెజాన్ ఇండియా విక్రయిస్తోందని తెలిపింది. టెలికమ్యూనికేషన్‌ను నిరోధించే ఏదైనా పరికరాలను అక్రమంగా కలిగి ఉంటే మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.50 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధిస్తారని సీవోఏఐ వివరించింది.

అయిదేళ్లలో మన సొంత జీపీయూ

- నాలుగు రోజుల్లో 18 వేల ఏఐ సర్వర్లు అందుబాటులోకి
- కేంద్ర మంత్రి వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ: వచ్చే 3–5 ఏళ్లలో హై–ఎండ్ కంప్యూటింగ్ చిప్‌సెట్లయిన జీపీయూలను భారత్ సొంతంగా తయారు చేసుకోగలదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ధీమా వ్యక్తం చేశారు. అలాగే దేశీయ ఫౌండేషనల్ ఏఐ (కృత్రిమ మేధ) ప్లాట్‌ఫాం పది నెలల్లో సిద్ధం కావచ్చని వివరించారు. దేశీయంగా మరో 3–4 రోజుల్లో మొత్తం 18,000 అధునాతన గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లను (జీపీయూ) అందుబాటులోకి తేనున్నట్లు బడ్జెట్ రౌండ్‌టేబుల్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. ఇప్పటికే 10,000 జీపీయూలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఖరీదైన, అధునాతన కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు అవసరమయ్యే ఏఐ మోడల్స్ సాధారణంగా బడా సంస్థలకే పరిమితమయ్యే అవకాశం ఉందని, కానీ చిన్న స్థాయి అంకురాలు, పరిశోధకులు కూడా చౌకగా కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాను ఉపయోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుందని మంత్రి చెప్పారు. ఏఐ ఫౌండేషనల్ మోడల్‌ను రూపొందించేందుకు స్టార్టప్‌లు, పరిశోధకులు కీలకమైన మాథమెటికల్ అల్గోరిథంలకు సంబంధించిన పలు పరిశోధన పత్రాలను అధ్యయనం చేస్తున్నట్లు వివరించారు. చాట్‌జీపీటీతో పోలిస్తే చిన్నవే అయినప్పటికీ పలు అంకుర సంస్థలు కొన్ని ఏఐ మోడల్స్‌ను ఇప్పటికే రూపొందించాయని, కృత్రిమ మేధ సహాయంతో రైల్వే శాఖ టికెట్ల కన్ఫర్మేషన్ రేటును 27 శాతం మెరుగుపర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. మరోవైపు, దేశీ ఎలక్ట్రానిక్ కంపెనీలు అత్యంత నాణ్యత, కచ్చితత్వంతో ఉత్పత్తులను తయారు చేసే సామర్థ్యాలను సాధించాయని ఆయన చెప్పారు.

క్యాన్సర్ సంస్థలతో యాక్సిస్ బ్యాంక్ జట్టు



న్యూఢిల్లీ: క్యాన్సర్‌పై పరిశోధనలు, పేషంట్ల సంరక్షణ కార్యక్రమాలకు తోడ్పాటు అందించే దిశగా దేశీయంగా మూడు ప్రతిష్ఠాత్మక సంస్థలతో చేతులు కలిపినట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. టాటా మెమోరియల్ సెంటర్‌కి చెందిన నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ , ఇండియన్ క్యాన్సర్ సొసైటీ, సెయింట్ జూడ్ ఇండియా చైల్డ్‌కేర్ సెంటర్స్ వీటిలో ఉన్నట్లు వివరించింది. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కింద ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ విజయ్ మూల్‌బగల్ తెలిపారు. ప్రధానంగా పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, క్యాన్సర్ నివారణ .. చికిత్సపై అవగాహన కల్పించే సంస్థలు, అలాగే పేషంట్ల సంరక్షణ మొదలైన వాటికి సహాయసహకారాలు అందించేందుకు ఇవి ఉపయోగపడగలవని పేర్కొన్నారు. సెయింట్ జూడ్ ఇండియా చైల్డ్‌కేర్ సెంటర్స్ సంస్థ హైదరాబాద్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సహాయం అందించినట్లు వివరించారు.

యూకేలో ఓయో పెట్టుబడులు



న్యూఢిల్లీ: ఆతిథ్య రంగంలో ఉన్న ఓయో తాజాగా యూకేలో సుమారు రూ.540 కోట్లు వెచ్చించనున్నట్టు మంగళవారం తెలిపింది. ప్రీమియం హోటల్ పోర్ట్‌ఫోలియో విస్తరణకు వచ్చే మూడేళ్లలో ఈ మొత్తాన్ని ఖర్చు చేయనుంది. తద్వారా యూకే ఆతిథ్య రంగంలో 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించింది. విస్తరణలో భాగంగా దీర్ఘకాలిక లీజు, నిర్వహణ ఒప్పందాలను కుదుర్చుకుంటున్నట్టు తెలిపింది. 2018లో యూకే మార్కెట్లో అడుగుపెట్టినట్టు కంపెనీ వివరించింది. 200లకుపైగా హోటళ్లు ఓయో జాబితాలో ఉన్నాయి. యూకేలో 65 నగరాల్లో ఇవి విస్తరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40 ప్రీమియం హోటళ్లను అందుబాటులోకి తేనున్నట్టు కంపెనీ గతంలో ప్రకటించింది. ఇందులో ఇప్పటికే 18 తెరుచుకున్నాయి.

యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ కాంపాక్ట్‌లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్



న్యూఢిల్లీ: కార్పొరేట్ల సుస్థిర అభివృద్ధి ప్రణాళికల అమలుకు సంబంధించిన యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ కాంపాక్ట్‌లో (యూఎన్‌జీసీ) చేరినట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ (జీఏఎల్) వెల్లడించింది. మానవ హక్కులు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల పరంగా యూఎన్‌జీసీ నిర్దేశించుకున్న పది సూత్రాలకు, అలాగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు (ఎస్‌డీజీ) అనుగుణంగా తమ వ్యూహాలు, కార్యకలాపాలను నిర్వహించనున్నట్లు వివరించింది. తమ విమానాశ్రయాలన్నింటికీ యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ లేదా ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ సర్టిఫికేషన్ ఉన్నట్లు పేర్కొంది. పర్యావరణహిత ఏవియేషన్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఎదిగే దిశగా ఇదొక కీలక అడుగని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ సీఈవో కిరణ్ కుమార్ గ్రంధి తెలిపారు. హైదరాబాద్, ఢిల్లీ, గోవా, మెడాన్ (ఇండొనేషియా) విమానాశ్రయాలను జీఏఎల్ నిర్వహిస్తోంది. అలాగే, విశాఖలోని భోగాపురం, గ్రీస్‌లోని క్రెటెలో విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తోంది. ఫిలిప్పీన్స్‌లోని మక్టాన్ సెబు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి సాంకేతిక సేవలు అందిస్తోంది.

బిజినెస్ రీల్


బ్యాంకుల్లోకి రూ.45 వేల కోట్ల డిపాజిట్లు

ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు



న్యూఢిల్లీ: బడ్జెట్‌లో ఆదాయపన్ను తగ్గింపు, ఇతర పన్ను ప్రతిపాదనలతో బ్యాంకుల్లోకి వచ్చే డిపాజిట్లు పెరగనున్నాయి. సుమారు రూ.40,000 నుంచి 45,000 కోట్ల వరకు బ్యాంకుల్లోకి డిపాజిట్లుగా రావొచ్చని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు పేర్కొన్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లపై ఆదాయం రూ.40,000 మించినప్పుడు (60 ఏళ్లలోపు వారికి) బ్యాంక్‌లు 10 శాతం మేర టీడీఎస్ వసూలు చేస్తుండగా, ఈ పరిమితిని రూ.50,000కు పెంచడం గమనార్హం. అదే 60 ఏళ్లు నిండిన వారికి రూ.50,000గా ఉన్న పరిమితిని రూ.లక్షకు పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించడం తెలిసిందే. ''పన్ను రాయితీని పెంచడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.20,000 కోట్లు డిపాజిట్ల రూపంలో రావొచ్చు. సేవింగ్స్ డిపాజిట్లపై వృద్ధులు ఆర్జించే వడ్డీపై టీడీఎస్ పరిమితిని పెంచడం వల్ల మరో రూ.15,000 కోట్లు రావొచ్చు''అని నాగరాజు వివరించారు. సీనియర్లు కాని ఇతర వ్యక్తులకు పన్ను ఆదా రూపంలోనూ మరో రూ.7,000 కోట్ల మేర డిపాజిట్లుగా వచ్చే అవకాశం ఉన్నట్టు చెప్పారు.

తయారీ స్టార్టప్‌లపై ఫండ్ ఆఫ్ ఫండ్స్ దృష్టి



న్యూఢిల్లీ: అంకుర సంస్థల కోసం కొత్తగా ప్రకటించిన రూ. 10,000 కోట్ల ఫండ్ ఆఫ్ ఫండ్స్ స్కీమ్ (ఎఫ్ఎఫ్ఎస్) ప్రధానంగా తయారీ, హై–టెక్నాలజీ రంగాలకు చెందిన స్టార్టప్‌లపై దృష్టి పెట్టనున్నట్లు పరిశ్రమలు, అంతర్గాత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా తెలిపారు. రెండో విడత ఎఫ్ఎఫ్ఎస్ కోసం ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్‌లు (ఏఐఎఫ్), సిడ్బీ మొదలైన వాటితో సంప్రదింపులు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. 2016లో రూ. 10,000 కోట్లతో ప్రకటించిన తొలి విడత ఎఫ్ఎఫ్ఎస్, అంకురాల పెట్టుబడుల అవసరాలను తీర్చే ఏఐఎఫ్ వ్యవస్థ రూపుదిద్దుకోవడానికి ఉపయోగపడినట్లు వివరించారు. దీని కింద 1,180 స్టార్టప్‌లకు ఏఐఎఫ్‌ల ద్వారా రూ. 21,700 కోట్ల మేర పెట్టుబడులు సమకూరినట్లు పేర్కొన్నారు. తొలి విడత ఎఫ్ఎఫ్ఎస్ కాలపరిమితి 10 ఏళ్లుగా ఉండగా, హై–టెక్నాలజీ అంకురాల దీర్ఘకాలిక నిధుల అవసరాలను తీర్చే విధంగా కొత్త స్కీము కాల పరిమితిని 14–15 సంవత్సరాలుగా నిర్ణయించవచ్చని భాటియా వివరించారు. డెట్ ఫండ్స్‌ను ప్రవేశపెట్టే అంశంపై కూడా చర్చలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

5-2-2025	
విశాఖ	470–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	452–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.20

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	577	5.65
LT	3,427.10	4.19
BEL	284.25	3.68
INDUSINDBK	1,050.00	3.68
ADANIPORTS	1,123.20	3.54

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,740.00	-6.44
ITCHOTELS	164.14	-4.24
BRITANNIA	5,040.30	-1.28
HEROMOTOCO	4,240.00	-1.09
NESTLEIND	2,299.95	-0.74

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,429
ఎన్ఎస్ఈ	1,04,199
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,06,162
ఎఫ్ఐఐ	+ 809
డీఐఐ	- 431

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.79 (రాత్రి 11.30కు)	$ 73.16 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.24 (రాత్రి 11.30కు)	$ 75.96 (క్రితం ముగింపు)

బిజినెస్ @ పార్లమెంట్

17,600 సంస్థల మూసివేత..



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 26 వరకు 17,654 కంపెనీలు మూతబడ్డాయని, ఇదే వ్యవధిలో 1,38,027 సంస్థలు రిజిస్టర్ అయ్యాయని కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, రాజ్యసభకు రాతపూర్వకంగా తెలిపారు. 2023–24లో మూతబడిన సంస్థల సంఖ్య 22,044గాను, 2022–23లో 84,801గాను ఉంది. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు పరిమళ్ నథ్వానీ అడిగిన ప్రశ్నకు గాను మంత్రి ఈ సమాధానం ఇచ్చారు.

5 ఏళ్లలో 339 విదేశీ కంపెనీలు..

2020 నుంచి విదేశీ కంపెనీల రిజిస్ట్రేషన్ తగ్గుతున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా రాజ్యసభకు తెలిపారు. గత అయిదేళ్లలో 339 విదేశీ కంపెనీలు భారత్‌లో నమోదు చేయించుకున్నట్లు వివరించారు. 2020లో 90 విదేశీ కంపెనీలు రిజిస్టర్ చేసుకోగా ఆ తర్వాత నుంచి ఇది తగ్గుతూ వస్తోంది. 2021లో 75, 2022లో 64, 2023లో 57, 2024లో 53 సంస్థలు నమోదు చేసుకున్నాయి.

ఉద్దేశపూర్వక డిఫాల్టర్లు 2,664



గతేడాది మార్చి ఆఖరు నాటికి వ్యక్తులు, విదేశీ రుణగ్రహీతల మినహా ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసిన డిఫాల్టర్ల సంఖ్య 2,664గా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు తెలిపారు. విల్‌ఫుల్ డిఫాల్టర్లు క్రమంగా తగ్గుతున్నారని వివరించారు. 2021–22లో 160 డిఫాల్టర్లు పెరగ్గా 2023–24లో ఇది 42కి తగ్గినట్లు వివరించారు. ఉద్దేశపూర్వక ఎగవేతలను నిరోధించేందుకు, మొండిబాకీలను తగ్గించేందుకు ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

సాక్షి ప్లస్
బుధవారం । 5-2-2025



ముకుంద్ తొలి రౌండ్‌లోనే...

చెన్నై: చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత కథ ముగిసింది. బరిలోకి దిగిన ముగ్గురు భారత క్రీడాకారులు శశికుమార్ ముకుంద్, రామ్‌కుమార్ రామనాథన్, కరణ్ సింగ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. శశికుమార్ 3-6, 7-6 (7/3), 1-6తో అలెక్సీ జఖరోవ్ (రష్యా) చేతిలో, రామ్‌కుమార్ 3-6, 5-7తో జే క్లార్క్ (బ్రిటన్) చేతిలో, కరణ్ సింగ్ 3-6, 3-6తో కిరియాన్ జాకెట్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన గంటా సాయికార్తీక్ రెడ్డి-విష్ణువర్ధన్ ద్వయం తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. సాయికార్తీక్ రెడ్డి-విష్ణువర్ధన్ జోడీ 3-6, 6-3, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో సిద్ధార్థ్ బంటియా-పరీక్షిత్ (భారత్) జంట చేతిలో ఓడిపోయింది.

'మా జట్టు ఆసీస్‌లా మారాలి'

భారత అండర్-19 మహిళల హెడ్ కోచ్ నూషీన్ ఆకాంక్ష

వరుసగా రెండోసారి టి20 ప్రపంచకప్ టైటిల్ గెలవడంపై సంతోషం

హైదరాబాద్: అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరహాలో ఎదురులేని జట్టులా భారత బృందం మారాలన్నదే తమ ఆకాంక్ష అని, అందుకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుంటామని భారత మహిళల అండర్-19 టీమ్ హెడ్ కోచ్ నూషీన్ అల్ ఖదీర్ వ్యాఖ్యానించింది. మలేసియాలో విశ్వవిజేతలుగా నిలిచిన అనంతరం జట్టు సభ్యులు గొంగడి త్రిష, కేసరి ధృతి, ట్రెయినర్ షాలినిలతో కలిసి నూషీన్ మంగళవారం నగరానికి చేరుకుంది. రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై భారత మహిళలు అండర్-19 వరల్డ్ కప్ గెలిచినప్పుడు కూడా ఆమెనే హెడ్ కోచ్‌గా ఉంది. ఆఫ్ స్పిన్నర్‌గా భారత్ తరఫున 85 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 115 వికెట్లు తీసిన నూషీన్ ఖాతాలో ఇప్పుడు కోచ్ హోదాలో వరుసగా రెండు వరల్డ్ కప్ టైటిల్స్ చేరాయి. 'మా అమ్మాయిల నుంచి అత్యుత్తమ ప్రదర్శన వచ్చింది. ఇదంతా సమష్టిగా సాధించిన విజయం. దాదాపు ఎనిమిది నెలల క్రితమే ఈ టోర్నీ కోసం ప్రణాళికలు రూపొందించి ఎంతో కష్టపడ్డాం. దాని ఫలితమే ఇప్పుడు కనిపించింది. మా విజయంలో టీమ్ సహాయక సిబ్బంది పాత్ర కూడా ఎంతో ఉంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు మాత్రమే కాకుండా ట్రెయినర్, ఫిజియో కూడా ఎంతో శ్రమించారు' అని నూషీన్ పేర్కొంది. తమకు అందించిన బాధ్యతలకు అనుగుణంగా అమ్మాయిలు స్పందించిన తీరును హెడ్ కోచ్ ప్రశంసించింది. 'పరిస్థితులను బట్టి తమను తాము మార్చుకునే విషయంలో మా అమ్మాయిలు సరైన రీతిలో స్పందించారు. డిమాండ్ ప్రకారం తమ ఆటను మార్చుకున్నారు. చాలా కాలంగా కలిసి ఆడుతుండటం వల్ల ప్లేయర్లందరి మధ్య మంచి బంధం ఏర్పడింది. పైగా తమకు అందించిన బాధ్యతలపై ప్రతీ ప్లేయర్‌కు స్పష్టత ఉండటం కూడా ఎంతో మేలు చేసింది. అందుకే వరల్డ్ కప్‌లో కీలక క్షణాల్లో ఒత్తిడిని అధిగమించి అంత గొప్పగా ఆడగలిగాం' అని కోచ్ వెల్లడించింది. రెండేళ్ల క్రితం సాధించిన విజయం కూడా ఎంతో ఆనందాన్నిచ్చిందని... అయితే దాంతో పోలిస్తే ఈ టైటిల్ మరింత ప్రత్యేకమని నూషీన్ పేర్కొంది. '2023లో సాధించిన విజయంతో పోలిస్తే ఈసారి మేం మరింత నిలకడగా, దూకుడుగా, సంపూర్ణ ఆధిపత్యంతో ఆడాం. మానసికంగా కూడా అమ్మాయిలు ఈసారి దృఢంగా ఉన్నారు. అందుకే ఈ గెలుపుపై మాకు ముందునుంచే అంచనాలు ఉన్నాయి. సెమీస్‌లో ఇంగ్లండ్ రూపంలో మాకు పెద్ద సవాల్ ఎదురైంది. ఇతర జట్లతో పోలిస్తే ఇంగ్లండ్ గట్టి ప్రత్యర్థి. కానీ అక్కడా మనోళ్లు జోరు కొనసాగించడం జట్టు బలాన్ని చూపించింది. మహిళల క్రికెట్‌లో వన్డేలు, టి20లు కలిపి ఆస్ట్రేలియా 13 వరల్డ్ కప్‌లు గెలిచింది. మా జట్టు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని, అంతే బలంగా మారాలని కోరుకుంటున్నాం. మా తర్వాతి లక్ష్యం కూడా అదే' అని ఈ మాజీ స్పిన్నర్ సగర్వంగా చెప్పింది. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన తెలంగాణ అమ్మాయి త్రిషను కోచ్ ప్రత్యేకంగా అభినందించింది. 'త్రిష అనుభవాన్ని బట్టి ఆమెను ఓపెనర్‌గా పంపాలని వరల్డ్ కప్‌నకు ముందే నిర్ణయించాం. నిజాయితీగా చెప్పాలంటే ఆమె దూకుడైన బ్యాటింగ్ శైలి మమ్మల్నీ ఆశ్చర్యపర్చింది. త్రిష తన షాట్లను మెరుగుపర్చుకోవడంలో ఎంతో కష్టపడింది' అని నూషీన్ అభిప్రాయపడింది. వరుసగా రెండు అండర్-19 వరల్డ్ కప్ టైటిల్స్ భారత్‌లో మహిళల క్రికెట్‌కు మరింత ఊతం ఇస్తాయని... ఈ స్థాయిలో అమ్మాయిలకు సాధ్యమైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించి భవిష్యత్తులో వారిని మరింత బలమైన ప్లేయర్లుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత బోర్డుదేననే నూషీన్ తన అభిప్రాయం వ్యక్తం చేసింది. తాజా వరల్డ్ కప్‌తో కోచ్‌గా నూషీన్ కాంట్రాక్ట్ కూడా ముగిసింది.



2023 టి20 ప్రపంచకప్ ట్రోఫీతో...



2025 టి20 ప్రపంచకప్ ట్రోఫీతో...

ప్రజ్ఞానందకు ఘనస్వాగతం



చెన్నై: టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీ చాంపియన్ ప్రజ్ఞానంద సొంతూరు చేరగానే ఘనస్వాగతం పలికారు. 19 ఏళ్ల చెన్నై గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద తన సహచరుడు, తాజా ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌ను కంగుతినిపించి టాటా స్టీల్ చెస్ టోర్నీలో విజేతగా ఆవిర్భవించాడు. గతంలో ఈ టోర్నీని కోరస్ చెస్ టోర్నమెంట్‌గా నిర్వహించగా, అప్పుడు తమిళనాడుకే చెందిన భారత సూపర్ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ మూడు సార్లు విజేతగా నిలిచాడు. తదనంతరం టాటా స్టీల్ టోర్నీగా మార్చాక భారత్ నుంచి ఎవరూ గెలవలేకపోయారు. ఈ ఏడాది మొట్టమొదటి సారిగా ఓ భారత గ్రాండ్‌మాస్టర్ టాటా స్టీల్ చెస్ టోర్నీ టైటిల్ చేజిక్కించుకున్నాడు. ట్రోఫీతో తిరిగొచ్చిన ప్రజ్ఞానందకు మంగళవారం విమానాశ్రయంలో తమిళనాడు ప్రభుత్వం, భారత చెస్ సమాఖ్య ప్రతినిధులు వందల సంఖ్యలో వచ్చిన అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ 'ప్రతిష్టాత్మక టోర్నీ గెలవడం చాలా ఆనందాన్నిచ్చింది. అంతేకాదు... ఇద్దరు భారతీయుల మధ్యే ఫైనల్ జరగడం, అది కూడా టైబ్రేక్‌కు దారి తీయడం అద్భుతం. గుకేశ్ కూడా చాలా బాగా ఆడాడు. గట్టిపోటీ ఇచ్చిన అతనికీ నా ఆత్మీయ అభినందనలు' అని అన్నాడు. గుకేశ్, ప్రజ్ఞానందలు 13 రౌండ్లు ముగిసేసరికి 8.5 పాయింట్లతో సమఉజ్జీలుగా నిలిచారు. దీంతో విజేతను ఖరారు చేసేందుకు వాళ్లిద్దరి మధ్య మూడు గేమ్‌ల టైబ్రేక్ నిర్వహించగా ప్రజ్ఞానంద 2-1తో గెలిచి టైటిల్ అందుకున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో మనుష్-దియా జోడీ



న్యూఢిల్లీ: సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మనుష్ షా-దియా చిటాలె (భారత్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మంగళవారం సింగపూర్‌లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మనుష్-దియా జోడీ 11-4, 11-5, 5-11, 11-7తో మార్కోస్ మాడ్రిడ్-అరంటా కొసియో (మెక్సికో) జంటపై విజయం సాధించింది. ఎనిమిదో సీడింగ్‌తో బరిలోకి దిగిన మనుష్-దియా ద్వయానికి తొలి రౌండ్‌లో 'బై' లభించింది. మహిళల డబుల్స్‌లో ఐహిక ముఖర్జీ-సుతీర్థ ముఖర్జీ (భారత్) జంట పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ఐహిక-సుతీర్థ ద్వయం 11-7, 6-11, 9-11, 7-11తో సుతాసిని-ఒరావన్ (థాయ్‌లాండ్) జంట చేతిలో ఓడిపోయింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో యశస్విని (భారత్)-మిన్‌హ్యూంగ్ జి (ఆస్ట్రేలియా) జోడీ 13-11, 9-11, 7-11, 11-6, 11-8తో లిండా బెర్గ్‌స్ట్రోమ్-క్రిస్టినా కాల్‌బెర్గ్ (స్వీడన్) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

ముంబై రంజీ జట్టులో సూర్యకుమార్, శివమ్ దూబే

8 నుంచి హరియాణాతో క్వార్టర్ ఫైనల్ ఆడనున్న భారత స్టార్స్





ముంబై: భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే... రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ముంబై జట్టు తరఫున బరిలోకి దిగనున్నారు. ఇంగ్లండ్‌పై టి20 సిరీస్ గెలిచిన జట్టులో భాగమైన ఈ ఇద్దరు శనివారం ప్రారంభం కానున్న క్వార్టర్ ఫైనల్లో ఆడనున్నారు. ఈ మేరకు ముంబై క్రికెట్ సంఘం మంగళవారం 18 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఎలైట్ గ్రూప్ 'ఎ' చివరి మ్యాచ్‌లో మేఘాలయపై భారీ విజయంతో నాకౌట్‌కు అర్హత సాధించిన డిఫెండింగ్ చాంపియన్ ముంబై... ఈనెల 8 నుంచి హరియాణాతో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. తాజా సీజన్‌లో ముంబై తరఫున భారత టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్, శివమ్ దూబే ఇప్పటి వరకు ఒక్కో మ్యాచ్ ఆడారు. సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే ముంబై జట్టుకు సారథ్యం వహిస్తుండగా... ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న శార్దుల్ ఠాకూర్‌పై భారీ అంచనాలున్నాయి.

ముంబై జట్టు: అజింక్య రహానే (కెప్టెన్), ఆయుశ్ మాత్రే, అంగ్‌క్రిష్ రఘువంశీ, అమోఘ్ భత్కల్, సూర్యకుమార్ యాదవ్, సిద్ధేశ్ లాడ్, శివమ్ దూబే, ఆకాశ్ ఆనంద్, హార్దిక్ తమోర్, సూర్యాంశ్, శార్దుల్ ఠాకూర్, షమ్స్ ములానీ, తనుశ్, మోహిత్ అవస్థి, సిల్వెస్టర్ డిసౌజా, రొస్టన్ డియాస్, అథర్వ అంకోలేకర్, హర్ష్ తన్నా.

సుమిత్ నగాల్ బోణీ



న్యూఢిల్లీ: రొసారియో ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. అర్జెంటీనాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 105వ ర్యాంకర్ సుమిత్ నగాల్ 5-7, 6-1, 6-0తో ప్రపంచ 236వ ర్యాంకర్ రెంజో ఒలివో (అర్జెంటీనా)పై గెలుపొందాడు. 2 గంటల 5 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ ఒక ఏస్ కొట్టి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. ఈ ఏడాది నాలుగో టోర్నీ ఆడుతున్న నగాల్ మెయిన్ 'డ్రా'లో నెగ్గిన తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం.

'ఒక్క సిరీస్‌తో తక్కువ చేయవద్దు'

భారత జట్టు ఫామ్‌లోనే ఉంది

వన్డే టీమ్ వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్

నాగ్‌పూర్: ఆస్ట్రేలియాతో ఇటీవల జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్‌లో భారత్ 1-3 తేడాతో పరాజయం పాలైంది. దాంతో జట్టులో ప్రధాన ఆటగాళ్ల ప్రదర్శనపై పలు రకాల విశ్లేషణలు సాగాయి. సీనియర్ల ఆటపై పలు విమర్శలు కూడా వచ్చాయి. అయితే ఈ తరహా విమర్శలను వన్డే టీమ్ వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తప్పు పట్టాడు. నిజానికి తాము ఆసీస్ గడ్డపై కూడా మెరుగ్గానే ఆడామని, కొద్దిలో ఓటమి పాలయ్యామని అతను వివరించాడు. 'ఒక్క సిరీస్ ఫలితం మా జట్టు ఫామ్‌ను చూపించదు. జట్టులోని కీలక ఆటగాళ్లంతా గతంలో ఎన్నో టోర్నీల్లో నిలకడగా రాణించారు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మేం అంచనాలకు తగినట్లుగా ఆడలేదనేది వాస్తవం. అయితే మరీ ఘోరంగా విఫలమేమీ కాలేదు. చివరి రోజు బుమ్రా లేకపోవడం దురదృష్టకరం. అతను ఆడితే మేం మ్యాచ్ గెలిచి సిరీస్ సమం చేసేవాళ్లం. ఒక మ్యాచ్ లేదా ఒక రోజు మా ఆటేంటో చెప్పదు. గతంలో అక్కడ రెండు సార్లు సిరీస్ సాధించాం. వన్డే వరల్డ్ కప్‌లో ఫైనల్ వెళ్లడంతో పాటు టి20 వరల్డ్ కప్ కూడా గెలిచామని మరచిపోవద్దు' అని గిల్ సమాధానమిచ్చాడు. కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడన్న గిల్... టీమ్‌లో వరుసగా మార్పులు చేర్పులు సరైంది కాదన్నాడు. 'విజయ్ హజారే వన్డే ట్రోఫీలో కరుణ్ నాయర్ చాలా గొప్పగా ఆడాడు. అందరూ ఇది అంగీకరించాలి. కానీ ఎవరి స్థానంలో తీసుకుంటారు. మేమంతా కూడా ఇక్కడికి రావడానికి ఎంతో కష్టపడ్డాం. ఇప్పుడు జట్టులో ఉన్నవాళ్లంతా చాలా బాగా ఆడుతున్నారు. మేం వరల్డ్ కప్‌లో ఒక్కటే మ్యాచ్ ఓడాం. కాబట్టి టీమ్‌లో అనవసరపు మార్పులు చేయవద్దు. కొంతకాలం ఒకే టీమ్‌ను కొనసాగించకపోతే జట్టు బలహీనంగా మారుతుంది' అని గిల్ విశ్లేషించాడు. వైస్ కెప్టెన్‌గా తనపై అదనపు బాధ్యత ఉందని... జట్టుకు అవసరమైనప్పుడల్లా రోహిత్‌కు తన సూచనలు అందిస్తానని గిల్ చెప్పాడు. టి20ల్లో చిత్తుగా ఓడినా... వన్డేల్లో ఇంగ్లండ్ బలమైన జట్టు కాబట్టి గట్టి పోటీ తప్పదని అతను అభిప్రాయపడ్డాడు.



శుబ్‌మన్ గిల్

షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో కొన్‌స్టాస్



గాలె: ఆస్ట్రేలియా యువ ఓపెనర్ స్యామ్ కొన్‌స్టాస్ దేశవాళీ టోర్నీ షెఫీల్డ్ షీల్డ్‌లో పాల్గొననున్నాడు. ఇటీవల 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో టీమిండియాపై చక్కటి ప్రదర్శనతో సత్తా చాటిన కొన్‌స్టాస్‌ను శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ఎంపిక చేశారు. అయితే ట్రావిస్ హెడ్‌ను ఓపెనర్‌గా బరిలోకి దింపడంతో 19 ఏళ్ల కొన్‌స్టాస్‌కు లంకతో తొలి టెస్టులో చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో రెండో టెస్టులోనూ కొన్‌స్టాస్‌కు చోటు దక్కడం కష్టమే అయిన నేపథ్యంలో అతడు లంక నుంచి తిరిగి ఆసీస్ చేరుకోనున్నాడు. ఆస్ట్రేలియా దేశవాళీ టోర్నీ షెఫీల్డ్ షీల్డ్‌లో న్యూ సౌత్ వేల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కొన్‌స్టాస్... శనివారం నుంచి క్వీన్స్‌ల్యాండ్‌తో జరగనున్న మ్యాచ్‌లో ఆడనున్నాడు. శ్రీలంకతో తొలి టెస్టులో ఇన్నింగ్స్ 242 పరుగుల తేడాతో విజయం సాధించిన ఆస్ట్రేలియా జట్టు... గురువారం నుంచి రెండో టెస్టు ఆడనుంది. ఇప్పటికే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించిన ఆస్ట్రేలియా జట్టు... చివరి మ్యాచ్‌లోనూ లంకపై ఘనవిజయం సాధించాలని భావిస్తోంది.



కరుణరత్నే

కరుణరత్నే వీడ్కోలు

ఆస్ట్రేలియాతో రెండో టెస్టు తర్వాత గుడ్‌బై చెప్పనున్న శ్రీలంక మాజీ కెప్టెన్

గాలె: శ్రీలంక మాజీ కెప్టెన్ దిముత్ కరుణరత్నే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నాడు. గురువారం నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న రెండో టెస్టు తనకు చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని అతను వెల్లడించాడు. 100వ టెస్టు అనంతరం ఆట నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించాడు. కెరీర్‌లో ఇప్పటి వరకు 99 టెస్టు మ్యాచ్‌లు ఆడిన 36 ఏళ్ల కరుణరత్నే 7,172 పరుగులు చేశాడు. అందులో 16 సెంచరీలు, 39 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 50 వన్డేల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కరుణరత్నే 1,316 పరుగులు చేశాడు. చాన్నాళ్లుగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న కరుణరత్నే... వీడ్కోలుకు ఇదే సరైన సమయం అని మంగళవారం పేర్కొన్నాడు. 'కెరీర్‌లో సాధించిన వాటితో సంతృప్తిగా ఉన్నా. 10 వేల పరుగుల మైలురాయి దాటాలని అనుకున్నాను. కానీ ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌లు బాగా తగ్గిపోయిన నేపథ్యంలో అది సాధ్యం కాదని అర్థమైంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ప్రవేశ పెట్టిన తర్వాత టెస్టుల సంఖ్య తగ్గింది. ఇలాంటి సమయంలో ఏడాదికి కేవలం మూడు, నాలుగు మ్యాచ్‌లు ఆడేందుకు వేచి ఉండటం కష్టం. అందుకే తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. ఏంజెలో మాథ్యూస్, దినేశ్ చండీమల్‌తో రిటైర్మెంట్ అంశంపై చర్చించా. 100వ టెస్టుతో కెరీర్ ముగించడం సంతోషం. ఆటకు విశ్రాంతినిచ్చిన తర్వాత రెండో ఇన్నింగ్స్ గురించి ఆలోచిస్తా' అని కరుణరత్నే అన్నాడు. ఆస్ట్రేలియాతో రెండో టెస్టు ద్వారా శ్రీలంక తరఫున 100 టెస్టులు ఆడిన ఏడో ప్లేయర్‌గా కరుణరత్నే నిలవనున్నాడు.



మంగళవారం భూటాన్ రాజు జిగ్మే కేసర్ నమ్‌గ్యాల్ వాంగ్‌చుక్‌తో కలిసి ప్రయాగ్‌రాజ్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ మేళా ప్రాంతంలో మంగళవారం యజ్ఞాలు చేస్తున్న పలువురు భక్తులు

బీజేపీ, ఆప్ పరస్పర ఆరోపణలు

ఢిల్లీ సీఎం ఆతిశీతో పాటు పలువురిపై కేసులు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది గంటల్లో మొదలవనుండగా ఆప్, బీజేపీ నిబంధనావళి ఉల్లంఘిస్తున్నారంటూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించి ఢిల్లీ పోలీసుల మూడు కేసులు నమోదు చేశారు. ఇందులో ఒకటి సీఎం ఆతిశీపై, మరొకటి ఆప్ కార్యకర్తలపై కాగా, మూడోది ఇద్దరు బీజేపీ నేతలపై నమోదైంది. ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల విధులకు అంతరాయం కలిగించారనే ఆరోపణలపై కల్కాజీ అభ్యర్థి, ఢిల్లీ సీఎం ఆతిశీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఫతే సింగ్ మార్గ్‌ను దిగ్బంధించిన సుమారు 70 మంది ఆప్ కార్యకర్తలు 10 వాహనాలతో ఉండగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు వారిని హెచ్చరించారు. అయితే, వారు పట్టించుకోలేదు. వీడియో తీస్తున్న కానిస్టేబుల్ కౌశల్ పాల్‌పై ఆప్ కార్యకర్తలిద్దరు చేయి చేసుకున్నారు. ఇందుకు గాను గోవింద్‌పురి పోలీస్‌స్టేషన్‌లో వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. కల్కాజీలో బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరి బంధువు మనీశ్ బిధూరీతోపాటు ఆ పార్టీకే చెందిన రవి దయామాపై కేసు నమోదు చేశారు. సోమవారం అర్ధరాత్రి రాత్రి మనీశ్ కల్కాలో తిరుగుతున్నాడని, అతడికి ఇక్కడ ఓటు కూడా లేదంటూ సీఎం ఆతిశీ 'ఎక్స్'లో చేసిన ఆరోపణల మేరకు వారిపై గోవింద్‌పురి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే, రమేశ్ బిధూరీ, అతడి కుటుంబం బహిరంగంగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోని పోలీసులు, తనపై మాత్రం కేసు నమోదు చేశారని ఆతిశీ ఆరోపణలు చేశారు. 'సీఈసీ రాజీవ్ కుమార్ జీ.. నిద్రపోతున్న మీ ఆత్మను మేల్కొలపండి, ప్రజాస్వామ్యం మీ చేతుల్లో ఉంది'అంటూ మీడియా ఎదుట వ్యాఖ్యానించారు.

బాధ్యతరహితంగా మాట్లాడొద్దు

- చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ వ్యాఖ్యలపై తప్పుడు ప్రచారం చేయొద్దు
- రాహుల్ గాంధీపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధ్వజం

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో భారతదేశ భూభాగంలోకి చైనా సైనికులు చొచ్చుకువచ్చారని, అక్కడే తిష్టవేశారని, ఆ విషయం సాక్షాత్తూ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ చెప్పారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. బాధ్యతారహితంగా మాట్లాడొద్దని అన్నారు. చైనా జవాన్లు మనదేశంలోకి అక్రమంగా చొరబడినట్లు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ ఎప్పుడూ చెప్పలేదని స్పష్టంచేశారు. అనని మాటలు అన్నట్లుగా తప్పుడు ప్రచారం చేయొద్దని రాహుల్‌కు హితవు పలికారు. ఈ మేరకు రాజ్‌నాథ్ మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. సోమవారం లోక్‌సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. దేశ భద్రతకు సంబంధించిన కీలక అంశంపై ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడం ఏమిటని రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ ధోరణి చాలా విచారకరమని పేర్కొన్నారు. భారత్, చైనా సరిహద్దులో పెట్రోలింగ్ గురించి మాత్రమే చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ మాట్లాడారని, చైనా సైనికులు మనదేశంలోకి వచ్చినట్లు ఎక్కడా చెప్పలేదని ఉద్ఘాటించారు. 1962లో కాంగ్రెస్ పాలనలో అక్సాయ్‌చిన్‌లో 38 వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని, 1963లో పాకిస్తాన్ 5,180 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని స్వాధీనం చేసుకొని చైనాకు అప్పగించిందని, ఈ విషయం రాహుల్ గాంధీ తెలుసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. మరోవైపు రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ఇవ్వబోతున్నట్లు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే పేర్కొన్నారు. ఈ తీర్మానానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ఇండియా భూభాగాన్ని చైనా ఆక్రమించుకుంటోందని రాహుల్ చేసిన ఆరోపణలను నిషికాంత్ దూబే కొట్టిపారేశారు.

అనుమతి లేకుండా మస్క్ ఏం చేయలేరు

ప్రభుత్వ చెల్లింపుల వ్యవస్థలో డోజ్‌కు అనుమతిపై ట్రంప్ వివరణ

వాషింగ్టన్: ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాన్ మస్క్ ఏమీ చేయలేరని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ప్రభుత్వ చెల్లింపుల వ్యవస్థలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)కు యాక్సెస్ ఇవ్వడంపై ఆందోళనలు వ్యక్తం కావడంతో ట్రంప్ ఈ ప్రకటన చేశారు. వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. వివాదాస్పద విషయాల్లోకి మస్క్‌కు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అమెరికా ప్రభుత్వ వ్యయాలను తగ్గించే పనిలో ఉన్న టెక్ దిగ్గజం తనకు నివేదికలు ఇచ్చారని తెలిపారు. వృథా ఖర్చులను వారు గుర్తిస్తున్నారని, దుర్వినియోగాన్ని నిలిపేసేందుకు ప్రయత్నిస్తున్నారని ట్రంప్ వెల్లడించారు. యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ ఏఐడీ)కు స్వస్తి పలుకుతానన్న ట్రంప్.. ప్రధాన కార్యాలయాన్ని మూసేసి సిబ్బంది ఇళ్లలోనే ఉండాలని సోమవారం ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా మానవతా, భద్రతా సహాయాన్ని అందించే ఈ సంస్థను తొలగిస్తున్నట్లు మస్క్ ప్రకటించారు. రాజకీయ పక్షపాతంతో కూడుకున్న ఈ వ్యవస్థను వదిలించుకోవాల్సిన అవసరం ఉందన్న మస్క్.. ఈ చర్యకు ట్రంప్ మద్దతిచ్చారని తెలిపారు. ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకున్న తరువాతే మూసేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని డెమొక్రటిక్ సెనేటర్లు వ్యతిరేకించారు. ఈ మేరకు విదేశాంగ మంత్రి మార్కో రుబియోకు లేఖ రాశారు. కాంగ్రెస్‌లో సమీక్షించి, చర్చించి, ఆమోదించిన తరువాతే యూఎస్ ఏఐడీలో మార్పులు చేయాలని పేర్కొన్నారు. కాగా, యూఎస్ ఏఐడీని రాడికల్ ఉన్మాదుల గుంపు నడుపుతోందని ట్రంప్ గతంలో విమర్శించారు.

యూజీసీ ముసాయిదాను పునఃపరిశీలించాలి

లోక్‌సభలో కాంగ్రెస్ వాయిదా తీర్మానం

సాక్షి, న్యూఢిల్లీ: విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల నియామకాలు, పదోన్నతులు, వైస్ ఛాన్సెలర్ల ఎంపికపై యూజీసీ జారీ చేసిన ముసాయిదాపై పునఃపరిశీలన చేయాలని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను ప్రభావితం చేసే ఈ అంశంపై తక్షణమే చర్చించాలని కోరారు. ఆయన మంగళవారం లోక్‌సభలో 267 నిబంధన కింద వాయిదా తీర్మానం ఇచ్చారు. యూజీసీ జారీ చేసిన కొత్త నిబంధనలు కాంట్రాక్టు పద్ధతిలో ఆచార్యుల నియామకంపై పరిమితిని తొలగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగానికి చెందని వ్యక్తులను వీసీలుగా నియమించుకునేందుకు కొత్త నిబంధనలు అనుమతిస్తున్నాయని తెలిపారు. తాజా నిబంధనలు వీసీల ఎంపికలో గవర్నర్ల ప్రమేయాన్ని పెంచడంతోపాటు, విశ్వవిద్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ నిబంధనలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రాల అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం యూజీసీ ముసాయిదాపై పునఃపరిశీలన చేయాలని, రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలని కోరారు. అయితే, దీనిపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతివ్వలేదు.

14న రైతు సంఘాలతో చర్చలు: కేంద్రం

న్యూఢిల్లీ: పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత వంటి డిమాండ్లతో ఆందోళనలు సాగిస్తున్న పంజాబ్, హరియాణా రైతులతో ఈ నెల 14వ తేదీన చర్చలు జరపనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రాంనాథ్ ఠాకూర్ మంగళవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఇవి ఆరో విడత చర్చలని తెలిపారు. గత నెలలో జరిగిన చర్చల సందర్భంగా కేంద్రం కొన్ని పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించిందన్నారు. అయితే, ఎంఎస్‌పీకి చట్టబద్ధత వంటి విస్తృత డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరలేదని వివరించారు. డిమాండ్ల అంశం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉందని, న్యాయస్థానం ఒక కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి గుర్తు చేశారు.

ఆయుష్మాన్ భారత్ కింద 8.5 కోట్ల చికిత్సలు

న్యూఢిల్లీ: ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన(ఏబీ-పీఎంజేఏవై) ద్వారా ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 8.5 కోట్లకు పైగా చికిత్సలు లబ్ధిదారులు అందుకున్నారని కేంద్రం తెలిపింది. రాజ్యసభలో మంగళవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈ విషయం తెలిపారు. ఇందులో 4.2 కోట్ల చికిత్సలు ప్రభుత్వ వైద్యశాలల్లో, మిగతా 4.3 కోట్ల చికిత్సలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగాయన్నారు. పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని దేశ రాజధాని ప్రాంతం మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పథకం అమలవుతోందని వెల్లడించారు.

పీఎం ఇంటర్న్‌షిప్ కింద 82 వేల ఆఫర్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీం(పీఎంఐఎస్) పైలట్ ప్రాజెక్టు రెండో విడత జనవరి 9వ తేదీ నుంచి మొదలైందని కేంద్రం వెల్లడించింది. మొదటి విడతలో భాగస్వామ్య కంపెనీలు 60,866 మంది అభ్యర్థులకు 82,077 ఆఫర్లు ఇచ్చాయని తెలిపింది. ఇందులో 28,141 మంది అభ్యర్థులు ఇంటర్న్‌షిప్ ఆఫర్‌ను అంగీకరించి జాయినయ్యారని తెలిపింది. కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా మంగళవారం రాజ్యసభలో ఈ వివరాలు వెల్లడించారు.

మోదీ, నితీశ్‌లకు భారతరత్న ప్రకటించాలి

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నను ప్రధాని మోదీ, బిహార్ సీఎం నితీశ్‌లకు ప్రకటించాలని జేడీయూ ఎంపీ లవ్లీ ఆనంద్ డిమాండ్ చేశారు. వీరిద్దరూ సుపరిపాలన, అభివృద్ధికి సంబంధించి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ఫలితంగా దేశంతోపాటు బిహార్ రాష్ట్రం ఎంతగానో మార్పు సాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో ఎంపీ మాట్లాడారు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్‌కు భారత రత్న ప్రకటించారు. అంత కంటే ఎక్కువగా కృషి చేస్తున్న మోదీకి కూడా భారత రత్న ఇవ్వాలని ఆమె కోరారు.

1.55 కోట్లకు పైగా ఉపాధి కూలీల పేర్లు తొలగింపు

న్యూఢిల్లీ: 2022-24 సంవత్సరాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్‌జీఈజీఎస్)కింద నమోదైన 1.55 కోట్లకు పైగా కూలీల పేర్లు తొలగింపునకు గురైనట్లు కేంద్రం తెలిపింది. గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాశ్వాన్ మంగళవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. తొలగింపునకు గురైన వారిలో నకిలీవి, వివరాలు సరిగ్గా లేనివి, వేరే చోటకు శాశ్వతంగా మకాం మార్చిన కుటుంబాలకు చెందిన వారు ఉన్నారన్నారు.

రబీలో పెరిగిన పంటల సాగు

సాక్షి, న్యూఢిల్లీ: గత ఏడాదితో పోలిస్తే ఈసారి రబీ పంటల సాగు విస్తీర్ణం పెరిగిందని కేంద్రం తెలిపింది. ఈ ఏడాది 6.61 కోట్ల హెక్టార్లలో పంటలు సాగైనట్లు వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 2023-24లో 1.37 కోట్ల హెక్టార్లలో పప్పు ధాన్యాలు సాగవగా.. 2024-25లో 1.40 కోట్ల హెక్టార్లకు పెరిగినట్లు తెలిపింది. అదే విధంగా, వరి 40.59 లక్షల హెక్టార్ల నుంచి 42.54 లక్షల హెక్టార్లకు చేరిందని వివరించింది. గోధుమలు 2023-24లో 3.18 కోట్ల హెక్టార్లలో సాగు కాగా, 2024-25లో 3.24 కోట్ల హెక్టార్లకు చేరింది. పప్పు ధాన్యాల సాగు సైతం 40.59 లక్షల హెక్టార్ల నుంచి 42.54 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు తెలిపింది. గత ఏడాది ఇదే సమయానికి మొత్తం 6.51 కోట్ల హెక్టార్లలో పంటలు సాగవగా, ఇప్పుడది 6.61 కోట్ల హెక్టార్లకు చేరిందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ వివరించింది.

యూఎన్‌కు రూ. 327 కోట్లు చెల్లించిన భారత్

యూఎస్: ఐక్యరాజ్యసమితి రెగ్యులర్ బడ్జెట్-2025 కోసం భారత్ రూ. 327 కోట్లు చెల్లించింది. యూఎన్ రెగ్యులర్ బడ్జెట్‌ను పూర్తిగా, సకాలంలో చెల్లించిన 35 సభ్య దేశాల 'గౌరవ జాబితాలో' భారత్ చేరింది. 2025 జనవరి 31 నాటికి, 35 సభ్య దేశాలు ఐక్యరాజ్యసమితి ఆర్థిక నిబంధనలలో పేర్కొన్న 30 రోజుల గడువు వ్యవధిలో తమ సాధారణ బడ్జెట్ మదింపులను పూర్తిగా చెల్లించాయని ఐరాస విరాళాల కమిటీ తెలిపింది. భారత్ జనవరి 31న 37.64 మిలియన్ డాలర్లను చెల్లించిందని యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ సోమవారం సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యరాజ్యసమితి బడ్జెట్‌కు సకాలంలో, పూర్తిస్థాయిలో విరాళాలు చెల్లిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు ఫిలెమోన్ యాంగ్ భారత్‌లో పర్యటిస్తున్నారు.

గ్రహీత నుంచి ముందస్తు సమ్మతి అవసరం

అకాడెమీ అవార్డులపై పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ: జాతీయ అకాడెమీ అవార్డులను రాజకీయ కారణాలు చూపుతూ వెనక్కి తిరిగి ఇచ్చేయడం దేశానికే అవమానకరమని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. అవార్డులను వాపసు ఇవ్వడం వంటి అనుచిత ఘటనలు ఇతర అవార్డు గ్రహీతలు సాధించిన విజయాలను తక్కువ చేసినట్లవుతుందని, అవార్డుల ప్రతిష్టను దెబ్బతీస్తాయని అభిప్రాయపడింది. ఇటువంటి చర్యలను నివారించేందుకు గాను అవార్డులకు ఎంపికైన వారి నుంచి ముందస్తు సమ్మతి తీసుకోవడం మేలని తెలిపింది. అవార్డు బహూకరించక మునుపే తిరిగి ఇవ్వబోమంటూ వారి నుంచి అంగీకారం తీసుకోవాలని తెలిపింది. అదే సమయంలో, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన గోప్యతను ఉల్లంఘించకుండా తగు నిబంధనలను ఏర్పాటు చేయాలని కూడా సిఫారసు చేసింది. ఈ మేరకు 'ఫంక్షనింగ్ ఆఫ్ నేషనల్ అకాడెమీస్ అండ్ అదర్ కల్చరల్ ఇన్‌స్టిట్యూషన్స్' అంశంపై తన నివేదికను కమిటీ సోమవారం పార్లమెంట్‌కు సమర్పించింది. సాహిత్య అకాడెమీకి గానీ ఇతర అకాడెమీలకు గానీ రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టీకరించింది. అందుకే, రాజకీయ కారణాలతో వీటిని గ్రహీతలు తిరిగి ఇవ్వకుండా ముందస్తు అంగీకారం తీసుకోవడం తప్పనిసరని కుండబద్దలు కొట్టింది.

కెనడా, మెక్సికో సుంకాలపై తగ్గిన ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికోలపై సుంకాలను ఒక నెలపాటు వాయిదా వేశారు. సరిహద్దు రక్షణను కఠినతరం చేయడానికి ఇరు దేశాలతో ఒప్పందాల అనంతరం చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో పదివేల మంది సైనికులను మోహరించేందుకు అధ్యక్షురాలు షీన్‌బామ్ అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు అమెరికా అధికారులు తెలిపారు. మరోవైపు సుంకాలు కొన్ని గంటల్లో అమల్లోకి రానుండటంతో అమెరికా, కెనడాల మధ్య సోమవారం ఉద్రిక్తతలు కనిపించాయి. కానీ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మాట్లాడిన తరువాత ట్రంప్ సంతోషంగా ఉన్నారని అధికారులు తెలిపారు. అమెరికా దక్షిణ బోర్డర్ సురక్షితంగా ఉంచడానికి, ఫెంటానిల్ వంటి ప్రాణాంతక మాదకద్రవ్యాలను అంతమొందించేందుకు ప్రధాని ట్రూడో అంగీకరించారని అధికారులు వెల్లడించారు. సరిహద్దు భద్రతకు సహాయపడేందుకు కెనడా దాదాపు 10,000 మంది ఫ్రంట్‌లైన్ అధికారులను మోహరించడం, మాదకద్రవ్యాల కార్టెల్స్‌ను ఉగ్రవాదులుగా గుర్తించడం, ఫెంటానిల్ జార్‌ను నియమించి మనీలాండరింగ్‌ను అరికట్టడానికి ట్రూడో చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అయితే తుది ఒప్పందాలపై ఇరు దేశాలతో చర్చలు కొనసాగుతాయి.

ఓటర్లను భయపెడుతున్నారు ఈసీకి కేజ్రీవాల్ ఫిర్యాదు



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల వేళ ఢిల్లీ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం వంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఆరోపించారు. మంగళవారం ఆయన సీఎం ఆతిశీతో కలిసి ఎన్నికల కమిషన్(సీఈసీ)ని కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఓటర్లలో భయం కలిగించేందుకు బీజేపీ, ఢిల్లీ పోలీసులు కుమ్మక్కై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. హింసను, భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు పోలీసులను ఎలా ఉపయోగించుకుంటున్నదీ ఈసీకి వివరించామన్నారు. ప్రజలు భయపడుతున్నారని, బహుశా వారు బుధవారం ఓటేసేందుకు బయటకు రాకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్లు, ముఖ్యంగా మురికివాడల వాసులను ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే కొందరు ఓటర్లకు డబ్బులు పంచి, వారి వేళ్లకు సిరా పూసి ఓటేయకుండా చేశారని, మరికొందరిని బెదిరిస్తున్నారని అన్నారు.

ఒక్కరిది కాదు.. ఈసీ త్రిసభ్య వ్యవస్థ



సాక్షి, న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ చేస్తున్న ఆరోపణలపై సీఈసీ రాజీవ్ కుమార్ స్పందించారు. ఎన్నికల కమిషన్ ఒక్కరితో నడిచేది కాదు, ఇది ముగ్గురు సభ్యుల కమిటీ అని వివరిస్తూ కమిషన్‌ను ఒత్తిడికి గురి చేయడం ద్వారా అప్రతిష్టపాలు చేసేందుకు పదేపదే జరుగుతున్న ప్రయత్నాలను తాము సమష్టిగా పరిశీలిస్తున్నామన్నారు. ఈసీ అంటే ఏకసభ్య కమిషన్ అనే అభిప్రాయం కలిగించారన్నారు. తమపై తీసుకువస్తున్న ఒత్తిళ్లు ఎలాంటి ప్రభావం చూపబోవని స్పష్టం చేశారు. 'ఇది ఒక ఏకసభ్య సంస్థ కాదు కాబట్టి రాజ్యాంగ పరమైన సంయమనంతో ప్రభావితం కాకుండా ఆరోపణలను ఓపికగా ధైర్యంగా భరించాం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లేవనెత్తిన వివిధ అంశాలపై అధికాకారులు చట్టం పరిధిలో ఇప్పటికే చర్యలు చేపట్టారు'అని పేర్కొంది. ఎన్నికల నియమావళిని బీజేపీ ఉల్లంఘిస్తున్నా ఈసీ పట్టించుకోవడం లేదంటూ ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సహా ఆ పార్టీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. రిటైరయ్యాక మరో పోస్టును పొందేందుకే సీఈసీ రాజీవ్ కుమార్ బీజేపీకి వ్యతిరేకంగా స్పందించడం లేదంటూ తీవ్రంగా ఆరోపించారు. కుమార్ 65 ఏళ్లు నిండటంతో ఈ నెల 18వ తేదీన రిటైరవనున్నారు. ఈ కమిషన్‌లో జ్ఞానేశ్ కుమార్, సుఖబీర్ సింగ్ సంధులు సభ్యులుగా ఉన్నారు.

కుంభమేళాకు వ్యతిరేకంగా కుట్రలు

భారీ విషాదం జరగాలని కోరుకున్నారు

- ఖర్గే, అఖిలేష్ యాదవ్‌పై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మండిపాటు



ప్రయాగ్‌రాజ్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తోపాటు సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే కొందరు వ్యక్తులు మహా కుంభమేళాలో భారీ విషాదం జరగాలని కోరుకున్నారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ధ్వజమెత్తారు. ఆయన బుధవారం ప్రయాగ్‌రాజ్‌లో మీడియాతో మాట్లాడారు. ఇక్కడ జరుగుతున్న సనాతన ధర్మ వేడుకను చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారని చెప్పారు. కొందరు దుష్టులు మాత్రం ఈ కార్యక్రమానికి వ్యతిరేకంగా కుట్రలు సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. కుంభమేళా గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజల్లో అనుమానాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఖర్గే, అఖిలేష్ యాదవ్‌లు పార్లమెంట్‌లో మాట్లాడిన మాటలు చూస్తే వారి అసలు అజెండా ఏమిటో తెలిసిపోయిందని అన్నారు. కుంభమేళాపై వారు మొదటి నుంచే దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమాన్ని అప్రతిష్టపాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై అధికారులు ఇచ్చిన గణాంకాలనే తాను విడుదల చేశానని తెలిపారు. ఇందులో ఎలాంటి దాపరికం లేదన్నారు. తొక్కిసలాటపై సమాచారం అందిన వెంటనే తమ ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందని చెప్పారు.

విశ్వాసానికి, సనాతన ధర్మానికి కుంభమేళా ఒక ప్రతీక

అయోధ్యలో రామమందిర నిర్మాణం, ప్రజలకు కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం పట్ల అసంతృప్తితో ఉన్న కొన్ని గ్రూప్‌లు మహా కుంభమేళాను వ్యతిరేకిస్తున్నాయని సీఎం యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. ఆయన మంగళవారం సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌లోని జగద్గురు రమణానందాచార్య స్వామి రామ్‌భద్రాచార్య క్యాంప్‌ను సందర్శించారు. 151 కుండ్లీ అఖండ్ భారత్ సంకల్ప్ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మన విశ్వాసానికి, సనాతన ధర్మానికి మహా కుంభమేళా ఒక ప్రతీక అని ఈ సందర్భంగా స్పష్టంచేశారు. మన ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి చాటుతున్న గొప్ప వేడుక అని అన్నారు. లక్షలాది మంది సాధువులు, యోగులు సనాతన ధర్మాన్ని చక్కగా కాపాడుతున్నారని చెప్పారు. మారీచులు, సుబాహులు మన సనాతన ధర్మాన్ని ఏమీ చేయలేరని తేల్చిచెప్పారు. కుంభమేళాలో ఇప్పటిదాకా 38 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు.

కశ్మీర్‌లో భద్రతపై అమిత్ షా సమీక్ష

న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై హోం మంత్రి అమిత్ షా మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల జరిగిన కొన్ని ఉగ్ర ఘటనలు ముఖ్యంగా సోమవారం కుల్గామ్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మాజీ సైనికుడు మజ్దూర్ అహ్మద్ వాగే ప్రాణాలు కోల్పోగా ఆయన కుటుంబసభ్యులు గాయపడిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఆర్మీ, నిఘా విభాగాలు, పోలీసు ఉన్నతాధి కారులు ఆయనకు పరిస్థితిని వివరించారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కొనసాగుతున్న గాలింపు చర్యలపైనా ఆయనకు నివేదించారని సమాచారం. బుధవారం ఆయన పారా మిలటరీ బలగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. గత డిసెంబర్ 14న చివరిసారిగా ఇటువంటి సమీక్షా సమావేశం జరిగింది.

భూమి లేని రైతుల వివరాలు లేవు: కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో భూమి లేని రైతులు, భూ యజమానుల ద్వారా కౌలు చేస్తున్న రైతుల వివరాలేవీ తమ వద్ద లేవని కేంద్రం తెలిపింది. 2015 నుంచి ఇప్పటి వరకు ఎటువంటి రైతు జనాభా గణన సర్వే నిర్వహించలేదని కేంద్ర రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 2015-16 వ్యవసాయ జనాభా లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 5,31,285 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు తెలిపారు.

హెచ్ఈసీఐతో ప్రైవేటుకు లాభం

ఆందోళన వ్యక్తం చేసిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ: యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ వంటి వేర్వేరు విభాగాల స్థానంలో తలపెట్టిన హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(హెచ్ఈసీఐ)తో ప్రతికూల ప్రభావాలుంటాయని పార్లమెంటరీ కమిటీ హెచ్చరించింది. బోధన సిబ్బంది కొరతతో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యా సంస్థలు మూతబడతాయని, పరోక్షంగా ఇది ప్రైవేటీకరణకు ఊతమిచ్చినట్లవుతుందని రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ సారథ్యంలోని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. బదులుగా ప్రస్తుతమున్న విభాగాలను సరళీకృతం చేయడం ద్వారా మరింతగా మెరుగైన ఫలితాలను పొందవచ్చని సూచించింది. ఏకీకృత నియంత్రణ విభాగాన్ని ఏర్పాటు చేయాలని విద్యాశాఖ భావించినట్లయితే అందులో అన్ని రాష్ట్రాలకు తగు ప్రాతినిధ్యం ఉండాలని, మితిమీరిన కేంద్రీకరణ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండరాదని కూడా స్పష్టం చేసింది. ఈ మేరకు నివేదికను మంగళవారం రాజ్యసభకు సమర్పించింది.

నూతన విద్యావిధానంలో ఇదో భాగం

2020 జాతీయ విద్యా విధానం హెచ్ఈసీఐ ఏర్పాటుకు ప్రతిపాదించింది. దేశంలో ఉన్నత విద్యకు అత్యున్నత నియంత్రణ వ్యవస్థగా ఇది ఉండాలని పేర్కొంది. నియంత్రణ, విద్యా ప్రమాణాలు, నిధులు, అక్రెడిటేషన్‌లకు ఇదే కేంద్రంగా ఉండాలని ప్రతిపాదించింది. పలు విభాగాలు ఉంటే రకరకాల ప్రమాణాలు, పర్యవేక్షణలో స్థిరత్వం లోపించడం, సంస్థలు సమర్థవంతంగా పనిచేయడం కష్టతరమవుతుందని అభిప్రాయపడింది. అంతే కాదు, 90 శాతం మందికి పైగా విద్యార్థులకు బోధనను అందించే రాష్ట్ర వర్సిటీలు, జాతీయ, రాష్ట్ర స్థాయి నియంత్రణల మధ్య చిక్కుబడిపోతాయని విద్యావిధానం-2020 తెలిపింది.

అడ్డంకులు ఏమిటి?

ప్రతిపాదిత హెచ్ఈసీఐలో రాష్ట్రాల ప్రాతినిధ్యం తగు మాత్రంగా లేని కారణంగా ఇవే సమస్యలు కొనసాగుతాయని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. అదే సమయంలో డిగ్రీలను ప్రదానం చేసే అధికారం, ప్రమాణాలను అందుకోలేని సంస్థలను మూసివేయడం వంటి తిరుగులేని అధికారాలు హెచ్ఈసీఐకి సొంతమవుతాయని పేర్కొంది. దీనివల్ల రాష్ట్రాల నియంత్రణ కొరవడి, మౌలిక సదుపాయాలు లేదా బోధన సిబ్బంది కొరత వంటి కారణాల తో గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థలు మూతబడే ప్రమాదముందని తెలిపింది. పరోక్షంగా ఇది గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటీకరణకు పరోక్షంగా ఊతమిచ్చినట్లవుతుందని కమిటీ పేర్కొంది. యూజీసీ నాన్ టెక్నికల్ ఉన్నత విద్యను, ఏఐసీటీఈ సాంకేతిక విద్యను, ఎన్‌సీటీఈ ఉపాధ్యాయ విద్యపైన పర్యవేక్షణ చేస్తున్నాయి. హెచ్ఈసీఐ ముసాయిదా బిల్లుపై ఇప్పటికే చర్చ మొదలైంది. 2018లోనే దీనిపై అభిప్రాయ సేకరణ కోసం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఉంచింది. 2021లో అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన సారథ్యంలో హెచ్ఈసీఐ ఏర్పాటుపై మళ్లీ చర్చలు మొదలయ్యాయి.

సాక్షి ప్లస్
బుధవారం । 5-2-2025

అశోకుడికి బౌద్ధమత దీక్ష ఇచ్చిన గురువు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



మౌర్య యుగం

1. భారతదేశంలో అత్యధిక ప్రాంతాన్ని ఒకే పాలన కిందికి తీసుకొచ్చిన మొదటి పాలకులు ఎవరు?
ఎ) మౌర్యులు బి) నంద
సి) హర్యాంక డి) గుప్త
2. మౌర్య వంశ స్థాపకుడైన చంద్రగుప్త మౌర్యుడి కులాన్ని గురించి ప్రస్తావించిన గ్రంథం ఏది?
ఎ) పరిశిష్ట పర్వన్
బి) బృహత్కథా మంజరి
సి) ముద్రా రాక్షసం డి) కథాసరిత్సాగర
3. కౌటిల్యుడు 1000 కార్షాపణాలకు చంద్రగుప్త మౌర్యుడిని కొని, తక్షశిలలో విద్యాభ్యాసం చేయించినట్లు తెలుపుతున్న సాహిత్యం ఏది?
ఎ) జైన సాహిత్యం బి) బౌద్ధ సాహిత్యం
సి) వైదిక సాహిత్యం డి) పైవేవీ కావు
4. కిందివాటిలో సరైంది ఏది?
ఎ) చంద్రగుప్తుడు చివరి నందరాజు ధననందుడిని ఓడించి, మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు
బి) చంద్రగుప్తుడికి పర్వతకుడు అనే రాజు సహాయం చేసినట్లు పరిశిష్ట పర్వన్ అనే జైనగ్రంథం తెలుపుతోంది
సి) వాయవ్య భారత ఆధిపత్యం కోసం చంద్రగుప్తుడికి, మాసిడోనియా రాజు సెల్యుకస్ నికేటర్‌కు మధ్య యుద్ధం జరిగింది
డి) పైవన్నీ
5. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానానికి సెల్యుకస్ నికేటర్ రాయబారిగా పంపిన మెగస్తనీస్ రచించిన గ్రంథం?
ఎ) ఇండికా బి) నేచురల్ హిస్టరీ
సి) పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ
డి) ది అనబేసిస్ ఆఫ్ అలెగ్జాండర్
6. పశ్చిమ ప్రాంతంలో సౌరాష్ట్ర వరకు చంద్రగుప్త మౌర్యుడి రాజ్యం విస్తరించినట్లు తెలుపుతున్న శాసనం ఏది?
ఎ) హాథిగుంఫా బి) జునాగఢ్
సి) అలహాబాద్ డి) విలస
7. జునాగఢ్ శాసనం ప్రకారం ఏ సౌరాష్ట్ర గవర్నర్ 'సుదర్శన తటాకం'ను నిర్మించారు?
ఎ) పుష్య గుప్తుడు బి) బుధ గుప్తుడు
సి) తిష్య డి) ఇంద్ర కరణుడు
8. చంద్రగుప్త మౌర్యుడు సల్లేఖన వ్రతాన్ని ఏ ప్రాంతంలో ఆచరించాడు?
ఎ) సువర్ణగిరి బి) శ్రావణ బెళగొళ
సి) పాటలీపుత్రం డి) వైశాలి
9. గ్రీకులు బిందుసారుడిని 'అమిత్ర ఘేట్స్' అని పేర్కొన్నారు. అంటే?
ఎ) అమిత ప్రేమ ఉన్నవాడు
బి) ఎన్నో విజయాలు సాధించినవాడు
సి) శత్రువులను భయంకరంగా నాశనం చేసినవాడు
డి) శత్రువులను క్షమించినవాడు
10. తక్షశిలలో తిరుగుబాటును అణచివేయడానికి అశోకుడిని బిందుసారుడు పంపినట్లు తెలుపుతున్న ఆధారాలు ఏవి?
ఎ) దివ్య వదన గ్రంథం
బి) షిర్‌కాఫ్ శాసనం సి) ఎ, బి
డి) పైవేవీ కావు
11. ప్రఖ్యాత అజీవక పండితుడు పింగళి వత్స ఏ మౌర్యపాలకుడి ఆస్థానంలో ఉండేవాడు?
ఎ) బిందుసారుడు బి) అశోకుడు
సి) కునాల డి) సంప్రతి
12. బిందుసారుడి వారసుల మధ్య వారసత్వ యుద్ధం జరిగిన కాలం?
ఎ) క్రీ.పూ. 270 – 260
బి) క్రీ.పూ. 273 – 269
సి) క్రీ.పూ. 267 – 265
డి) క్రీ.పూ. 265 – 260
13. అశోకుడి శాసనాలను జేమ్స్ ప్రిన్సెస్ చదివిన సంవత్సరం ఏది?
ఎ) 1837 బి) 1860 సి) 1875 డి) 1825
14. 'అశోక' పేరుతో కనుగొన్న మొదటి శాసనం ఏది?
ఎ) జౌళి శాసనం బి) దౌగడ
సి) మస్కి డి) ఉడెగొళం
15. మౌర్యుల కాలంలో గూఢచారులుగా ఎవరిని నియమించేవారు?
ఎ) వేశ్యలు బి) వితంతువులు
సి) అనాథ బాలలు డి) పైవారందరినీ
16. పురాణాలు అశోకుడిని ఏమని పేర్కొన్నాయి?
ఎ) ప్రియదర్శి బి) దేవానాంప్రియ
సి) అశోకవర్ధన డి) పైవేవీ కావు
17. అశోకుడు రాజు కాక ముందు ఏ ప్రాంతానికి రాజ ప్రతినిధిగా పనిచేశాడు?
ఎ) ఉజ్జయినీ బి) తక్షశిల
సి) గాంధార డి) కళింగ
18. అశోకుడు తన సోదరుల్లో తిష్యను తప్ప మిగిలిన 99 మందిని హతమార్చి రాజ్యాన్ని ఆక్రమించినట్లు తెలుపుతున్న గ్రంథం?
ఎ) దీప వంశ బి) మహా వంశ
సి) ఛుఖ వంశ డి) టిబెట్ చరిత్ర
19. శాసనాల్లో (అలహాబాద్ స్తంభ శాసనం) అశోకుడి భార్యగా ఎవరిని పేర్కొన్నారు?
ఎ) కారువాకి బి) అసంధి మిత్ర
సి) తిష్యరక్షిత డి) విదిశ మహాదేవి
20. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) అశోకుని జీవితం మలుపుతిప్పిన సంఘటన కళింగయుద్ధం (క్రీ.పూ. 262 – 261)
బి) అశోకుడు రాజ్యానికి వచ్చిన 8 ఏళ్ల తర్వాత కళింగయుద్ధం చేసినట్లు 13వ శిలా శాసనం తెలుపుతోంది
సి) కళింగయుద్ధ పరిణామాలకు చలించి అశోకుడు బౌద్ధ మతం స్వీకరించినట్లు బబ్రూ శాసనం తెలుపుతోంది
డి) పైవన్నీ
21. అశోకుడికి బౌద్ధమత దీక్ష ఇచ్చిన గురువు?
ఎ) ఉప గుప్తుడు
బి) సింహళ గ్రంథాల ప్రకారం నిగ్రధ
సి) ఎ, బి డి) ఎవరూ కాదు
22. ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాంతంలో అశోకుడి పెద్ద శిలాశాసనం లభించింది?
ఎ) ఎర్రగుడి బి) రేణిగుంట
సి) బేతంచర్ల డి) మందపల్లి
23. అశోకుడు ప్రజల్ని తన కన్నబిడ్డలుగా భావించినట్లు తెలుపుతున్న శాసనం?
ఎ) ధౌళి బి) జౌగడ
సి) ఎ, బి డి) పైవేవీకావు
24. ద్వి భాషల్లో ఉన్న అశోకుడి శాసనం ఏది?
ఎ) కాందహార్ బి) బైరట్
సి) కల్సి డి) అలహాబాద్
25. అశోకుడు బుద్ధుడి జన్మస్థలం సందర్శించి ఆ గ్రామ ప్రజలకు పన్ను మినహాయింపు ఇచ్చినట్లు తెలుపుతున్న శాసనం ఏది?
ఎ) రాంపూర్వ బి) రుమ్మిందై
సి) కౌశాంబి డి) మన్‌షేరా
26. అశోకుడి శాసనాలను తరలించిన వ్యక్తులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. అలహాబాద్ శాసనం
2. తోప్రా, మీరట్ శాసనాలు
3. బైరట్ శాసనం
గ్రూప్ – బి
a. అక్బర్
b. ఫిరోజ్ షా తుగ్లక్
c. కన్నింగ్ హామ్
ఎ) 1-a, 2-b, 3-c
బి) 1-c, 2-b, 3-a
సి) 1-b, 2-a, 3-c
డి) 1-a, 2-c, 3-b
27. అశోకుడి శాసనాలు ఎక్కువగా బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. అయితే ఖరోష్టి లిపిలో ఉన్న శాసనం ఏది?
ఎ) మన్‌షేరా బి) షాబాజ్ గిరి
సి) ఎ, బి డి) ఏదీకాదు
28. అశోకుడు 250 రాత్రులు బౌద్ధ సంఘంలో గడిపినట్లు తెలుపుతున్న శాసనం?
ఎ) ఎర్రగుడి బి) మస్కి
సి) ఎ, బి డి) ఏదీకాదు
29. జతపరచండి.
గ్రూప్ – ఎ
1. యజ్ఞాలు, జంతుబలుల నిషేధం
2. ధర్మ మహామాత్యల నియామకం
3. బోధివృక్షం సందర్శన
4. పరమత సహనం
5. కళింగయుద్ధం, సమకాలీన రాజులు
గ్రూప్ – బి
a. మొదటి శిలాశాసనం
b. అయిదో శిలాశాసనం
c. ఎనిమిదో శిలా శాసనం
d. 7, 12వ శిలాశాసనాలు
e. 13వ శిలాశాసనం
ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-c, 2-e, 3-b, 4-d, 5-a
డి) 1-b, 2-e, 3-a, 4-d, 5-c
30. కింది వాటిలో అశోకుడు నిర్వహించిన బౌద్ధ సంగీతి ఏది?
ఎ) మొదటి సంగీతి బి) రెండో సంగీతి
సి) మూడో సంగీతి డి) నాలుగో సంగీతి
31. అశోకుడు వివిధ ప్రాంతాలకు పంపిన ప్రచారకులు, ప్రాంతాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. శ్రీలంక
2. హిమాలయప్రాంతం
3. సువర్ణభూమి (బర్మా)
4. కశ్మీర్, గాంధార
5. మహిష మండలం
గ్రూప్ – బి
a. మహేంద్ర, సంఘమిత్ర
b. మజ్జిహిమ
c. సోనా, ఉత్తర
d. మజ్ హంతిక
e. మహాదేవుడు
ఎ) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
బి) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
సి) 1-c, 2-e, 3-b, 4-d, 5-a
డి) 1-b, 2-e, 3-a, 4-d, 5-c
32. అశోకుడి తర్వాతి పాలకులు ఎవరు?
ఎ) తూర్పు ప్రాంతం – దశరథుడు
బి) పశ్చిమ ప్రాంతం– కునాల
సి) ఎ, బి డి) పైవేవీ కావు
33. కింది వారిలో కశ్మీరీ చరిత్రలో ప్రముఖ స్థానం కలిగిన అశోకుడి కుమారుడు ఎవరు?
ఎ) కునాల బి) సంప్రతి
సి) మహేంద్ర డి) జలుక
34. మౌర్య వంశ చివరి పాలకుడు ఎవరు?
ఎ) బృహద్రథుడు బి) దశరథుడు
సి) సంప్రతి డి) కునాల
35. మౌర్యుల పాలనను అంతం చేసి శుంగ వంశాన్ని స్థాపించింది ఎవరు?
ఎ) అగ్నిమిత్ర శుంగ
బి) పుష్యమిత్ర శుంగ
సి) దేవభూతి డి) వసుమిత్ర
36. మౌర్యవంశ పతనం గురించి తెలుపుతున్న లిఖిత ఆధారాలు ఏవి?
ఎ) హర్ష చరిత్ర బి) విష్ణు పురాణం
సి) ఎ, బి డి) పైవేవీ కావు
37. మౌర్యుల పాలన ఎన్నేళ్లు కొనసాగింది?
ఎ) 150 బి) 137 సి) 100 డి) 400
38. మౌర్యుల పాలనను తెలుపుతున్న ముఖ్య ఆధారం?
ఎ) కౌటిల్యుడు – అర్థశాస్త్రం
బి) మెగస్తనీస్ – ఇండికా
సి) ఎ, బి డి) పైవేవీ కావు
39. కింది వాటిలో కౌటిల్యుడు పేర్కొన్న సప్తాంగాలకు చెందినవి?
ఎ) రాజు, రాజ్యం బి) మంత్రి, దుర్గం
సి) దండం, మిత్రరాజ్యం, కోశం
డి) పైవన్నీ
40. కింది వాటిలో అశోకుడి ఏ శాసనం మంత్రి పరిషత్ గురించి వివరిస్తోంది?
ఎ) మూడో శిలాశాసనం
బి) ఆరో శిలాశాసనం
సి) ఎ, బి డి) పైవన్నీ
41. మౌర్యుల కాలంలో ముఖ్య విభాగాలు, అధిపతులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. సీతాధ్యక్షుడు
2. అకరాధ్యక్షుడు
3. లక్షణాధ్యక్షుడు
4. పోతువాధ్యక్షుడు
5. గణికాధ్యక్షుడు
గ్రూప్ – బి
a. రాజు భూముల నిర్వహణ
b. గనులు
c. టంకశాల
d. తూనికలు, కొలతలు
e. వేశ్యలు
ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-b, 2-e, 3-d, 4-c, 5-a
డి) 1-c, 2-a, 3-d, 4-e, 5-b
42. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) సమాహర్త – పన్నులు వసూలు చేసే అధికారి
బి) సన్నిదాత – ప్రభుత్వ ఆదాయాన్ని భద్రపరచే అధికారి
సి) తీర్థులు – మంత్రి పరిషత్ ఉపాధ్యక్షుడు
డి) పైవన్నీ
43. మౌర్యుల కాలంలో ఇతీజ్ఞ మహామాత్రులు ఏ శాఖను పర్యవేక్షించేవారు?
ఎ) రహదారుల పర్యవేక్షణ
బి) స్త్రీల సంక్షేమం
సి) వృద్ధుల సంక్షేమం
డి) దమ్మ ప్రచారం
44. మౌర్యుల నగరపాలనను విపులంగా వివరించి గ్రంథం?
ఎ) ఇండికా బి) అర్థశాస్త్రం
సి) కథావత్తు డి) విష్ణుపురాణం
45. మౌర్యుల సామ్రాజ్యంలో ప్రధాన భాగాలు, రాజధానులను జతపరచండి.
గ్రూప్ – ఎ
1. మౌర్య సామ్రాజ్యం
2. ఉత్తరాపథం
3. పశ్చిమ పథం (అవంతి)
4. ప్రాచ్య పథం (కళింగ)
5. దక్షిణా పథం
గ్రూప్ – బి
a. పాటలీపుత్రం
b. తక్షశిల
c. ఉజ్జయినీ
d. తొసలి
e. సువర్ణగిరి
ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-c, 2-e, 3-b, 4-a, 5-d
డి) 1-b, 2-e, 3-d, 4-c, 5-a
46. పాటలీపుత్రం ఏ నదుల సంగమ ప్రాంతంలో ఉంది?
ఎ) సోన్, గండక్ బి) గంగా, సోన్
సి) ఘాగ్రా, గండక్
డి) గంగా, ఘాగ్రా
47. మౌర్యుల పాలనా విభాగాలు, అధికారులకు సంబంధించి కింది వాటిలో సరైంది?
ఎ) జనపథం– యువరాజు
బి) ఆహారం – ప్రాదేశకుడు, రజ్జుక
సి) విషయం– స్థానిక, గోప
డి) పైవన్నీ

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) బి; 4) డి; 5) ఎ;
6) బి; 7) ఎ; 8) బి; 9) సి; 10) సి;
11) ఎ; 12) బి; 13) ఎ; 14) సి; 15) డి;
16) సి; 17) ఎ; 18) బి; 19) ఎ; 20) డి;
21) సి; 22) ఎ; 23) సి; 24) ఎ; 25) బి;
26) ఎ; 27) సి; 28) సి; 29) ఎ; 30) సి;
31) బి; 32) సి; 33) డి; 34) ఎ; 35) బి;
36) సి; 37) బి; 38) సి; 39) డి; 40) సి;
41) ఎ; 42) డి; 43) బి; 44) ఎ; 45) ఎ;
46) బి; 47) డి.

సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?

మానవ శరీరానికి 13 విటమిన్లు అవసరం. వీటిని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి నీటిలో కరిగేవి, కొవ్వుల్లో కరిగేవి. ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వుల్లో కరుగుతాయి. ఇవి కొవ్వు కణాల్లో నిల్వ ఉంటాయి. విటమిన్ బి, సిలు నీటిలో కరుగుతాయి. వీటిని శరీరం ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుకోలేదు. కాబట్టి ఇవి లభించే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

విటమిన్లు

- మనిషి ఆహారంలో స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలు విటమిన్లు.
- విటమిన్లు శక్తి వనరులు కాదు.
- ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని ఒక భాగం లేదా విటమిన్ నుంచి ఏర్పడిన ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యలో పాల్గొనే ఎంజైమ్‌లకు సహాయపడతాయి.
- విటమిన్ అనే పదాన్ని కాసిమర్ ఫంక్ ప్రతిపాదించాడు. విటమిన్లను ఆంగ్ల అక్షరాల క్రమంలో నామకరణం చేసే పద్ధతిని ప్రతిపాదించింది జె.సి. డ్రుమాన్డ్.
- విటమిన్లు ప్రధానంగా 2 రకాలు
  - **కొవ్వులో కరిగేవి:** ఎ, డి, ఇ, కె.
  - **నీటిలో కరిగేవి:** బి–కాంప్లెక్స్, సి

విటమిన్ - ఎ

విటమిన్–ఎ రసాయన నామం రెటినాల్. సాధారణ నామం జీరాఫ్తాల్మియా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన దృష్టికి, సాధారణ ఆరోగ్యానికి ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే కంటిలోని కార్నియా దెబ్బతిని జీరాఫ్తాల్మియా సంభవిస్తుంది.

లభ్యత: క్యారెట్, పసుపు రంగులోని ఫలాలు, నారింజ, సొరచేప కాలేయం నూనె, ఆకుకూరలు, జంతువుల కాలేయంలో ఎక్కువగా లభిస్తుంది. శాకాహారంలో ఇది బీటా కెరోటిన్ రూపంలో లభిస్తుంది. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని రెటినాల్‌గా మారుస్తాయి.

విటమిన్ - డి

దీని రసాయన నామం కాల్సిఫెరాల్. దీన్నే రికెట్స్ నిరోధక విటమిన్, సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. బలమైన ఎముకలు, దంతాలకు ఇది అవసరం. శరీరంలోని కాల్షియం, ఫాస్ఫరస్, జీవక్రియలను నియంత్రిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే చిన్నారుల్లో రికెట్స్ వ్యాధి సంభవిస్తుంది. ఎముకలు బలహీనపడి, వంకరలు తిరగడం ఈ వ్యాధి లక్షణం. పెద్దల్లో ఈ విటమిన్ లోపం వల్ల ఎముకలు బలహీనపడి ఆస్టియోమలేసియా వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: శాకాహారంలో ఇది లభించదు. పాలు, గుడ్లు, కాడ్ చేప కాలేయం నూనె, జంతువుల కాలేయం, పుట్టగొడుగుల్లో సమృద్ధిగా లభిస్తుంది.

విటమిన్ - ఇ

దీని రసాయన నామం టోకోఫెరాల్. దీన్ని బ్యూటీ విటమిన్ లేదా వంధ్యత్వ నిరోధక విటమిన్ అంటారు. స్త్రీ, పురుషుల్లో ప్రత్యుత్పత్తి వ్యవస్థకు ఇది అవసరం. కాంతివంతమైన చర్మాన్ని ఇస్తుంది. దీని లోపం అరుదుగా సంభవిస్తుంది. ఇది లోపిస్తే పురుషుల్లో వంధ్యత్వం వస్తుంది, మహిళల్లో గర్భస్రావం జరుగుతుంది.

లభ్యత: ఫలాలు,కూరగాయలు, విత్తనాలు (బాదం, పిస్తా), చేపలు, మాంసం, చేప నూనె, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ - కె

దీని రసాయన నామం ఫిలోక్వినోన్ లేదా మెనాక్వినోన్. దీన్ని రక్తస్రావ నిరోధక విటమిన్ అని కూడా అంటారు. రక్త స్కంధన ప్రక్రియలో అనుబంధ రక్తస్కంధన కారకంగా ఇది వ్యవహరిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే గాయాలైనప్పుడు రక్తం ఆలస్యంగా గడ్డ కడుతుంది.

లభ్యత: పేగులోని సూక్ష్మజీవులు దీన్ని తయారుచేస్తాయి. కాలిఫ్లవర్, క్యాబేజి, ఆకుకూరలు, కాలేయం, మూత్రపిండాల్లో లభిస్తుంది.

విటమిన్ - సి (ఆస్కార్బిక్ ఆమ్లం)

ఇది స్కర్వీ నిరోధక విటమిన్. బలమైన చిగుళ్లకు, నోటి ఆరోగ్యానికి ఇది అవసరం. ఇది లోపిస్తే స్కర్వీ వ్యాధి సంభవిస్తుంది.

లక్షణాలు: చిగుళ్ల నుంచి రక్తం కారడం, దంతాలు ఊడిపోవడం, నాలుకపై పుండ్లు ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: నారింజ, బత్తాయి, నిమ్మ లాంటి సిట్రస్ ఫలాలు, ఉసిరి, మాంసం, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ - బి1

దీని రసాయన నామం థయమిన్. బెరిబెరి నిరోధక విటమిన్ అని అంటారు. శక్తి విడుదల, నాడీవ్యవస్థ, రక్తప్రసరణ అభివృద్ధి వ్యవస్థకు అవసరం. దీనిలోపం ద్వారా బెరిబెరి వ్యాధి వస్తుంది. చిన్నారుల్లో తడి బెరి బెరి (ఛాతీలో నీరు నిండటం), పెద్దల్లో పొడి బెరిబెరి(చర్మం పొడిబారటం) సంభవిస్తుంది. పాలీన్యూరిటిస్ అనే నాడీ క్షీణత వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: పొట్టు తీయని అన్ని రకాల ధాన్యాలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ - బి2

దీన్నే విటమిన్–జి లేదా ఎల్లో ఎంజైమ్ అని కూడా అంటారు. కొవ్వులు, పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఈ విటమిన్ లోపిస్తే అరిబోఫ్లెవినోసిస్ అనే వ్యాధి వస్తుంది. నోటి అంచున పగుళ్లు ఏర్పడటం(ఖీలోసిస్/ యాంగ్యులర్ స్టొమాటిస్), నాలుక వాపు (గ్లోసైటిస్) ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: పాలు, పాల ఉత్పత్తుల్లో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దీన్ని లాక్టోఫ్లెవిన్ అని, గుడ్ల పచ్చసొనలోనూ అధికంగా లభించడం వల్ల ఓవోఫ్లెవిన్ అని అంటారు. కాలేయంలోనూ ఉంటుంది కాబట్టి హెపటోఫ్లెవిన్ అని కూడా అంటారు. ఎండు ఫలాలు, కూరగాయలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ - బి3

దీని రసాయన నామం నియాసిన్. నికోటినిక్ యాసిడ్ లేదా నికోటినమైడ్‌గానూ పిలుస్తారు. ఇది పెల్లగ్రా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన నాడీవ్యవస్థ, చర్మం, జీర్ణక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెల్లగ్రా వ్యాధి సంభవిస్తుంది. చర్మం ఎర్రగా కందడం(డెర్మటైటిస్), నీళ్ల విరేచనాలు (డయేరియా), మతిమరుపు (డెమెన్షియా) ఈ వ్యాధి లక్షణాలు. తీవ్రలోపం తలెత్తితే మరణించే ప్రమాదం ఉంది. అందుకే దీన్ని 4డి/3డి సిండ్రోమ్ అంటారు.

లభ్యత: మాంసం, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాల్లో ఎక్కువగా లభిస్తుంది.

విటమిన్ - బి5

దీన్నే పాంటోథెనిక్ యాసిడ్ అని పిలుస్తారు. కో ఎంజైమ్–ఎ గానూ వ్యవహరిస్తారు. కొలెస్ట్రాల్, న్యూరోట్రాన్స్‌మీటర్ల ఉత్పాదన, శక్తి విడుదలకు విటమిన్–బి5 అవసరం. దీనిలోపం వల్ల అరికాళ్లలో మంటలు కలిగే బర్నింగ్ ఫీట్ సిండ్రోమ్ వస్తుంది.

లభ్యత: మాంసం, గుడ్లు, బ్రెడ్‌లో లభిస్తుంది.

విటమిన్ - బి6

దీన్నే పైరిడాక్సిన్ లేదా పైర్డాక్సల్ ఫాస్ఫేట్ అంటారు. ప్రొటీన్ల జీవక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే చర్మం పొడిబారుతుంది. విపరీతమైన బలహీనత వస్తుంది. మార్నింగ్ డిసీజ్ అనే వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: మాంసం, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశనగ, బాదంలో ఎక్కువ మోతాదులో లభిస్తుంది.

విటమిన్ - బి7

దీన్నే విటమిన్ –హెచ్, బయోటిన్ అని కూడా పిలుస్తారు. శక్తి విడుదల, అమైనో ఆమ్లాలు, గ్లైకోజన్ ఉత్పత్తికి అవసరం. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని అందిస్తాయి. ఈ విటమిన్ చాలా అరుదుగా లోపిస్తుంది. ఉడికించని గుడ్డు తెల్లసొనలో ఎవిడిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది బయోటిన్ వినియోగాన్ని అడ్డుకుంటుంది.

విటమిన్ - బి9

దీన్నే ఫోలిక్ యాసిడ్ అంటారు. ఎర్రరక్తకణాల పరిపక్వత, హిమోగ్లోబిన్ తయారీకి ఇది అవసరం. పిండం అభివృద్ధి, మానసిక వికాసానికి తోడ్పడుతుంది. ఈ విటమిన్ లోపిస్తే మెగాలోబ్లాస్టిక్ లేదా మ్యాక్రోస్టిక్ అనీమియా వ్యాధి వస్తుంది. గర్భిణుల్లో ఇది తీవ్రంగా లోపిస్తే పుట్టబోయే పిల్లల్లో స్పైనా బిఫిడా అనే మానసిక వైకల్యం సంభవిస్తుంది

లభ్యత: స్ట్రాబెర్రీ, టమాట, కాలిఫ్లవర్, అరటి, క్యాబేజి, పాలకూర, నారింజల్లో లభిస్తుంది.

విటమిన్ - బి12

దీన్నే సైనోకోబాలమిన్ అంటారు. ఎర్ర రక్తకణాల పరిపక్వత, హిమోగ్లోబిన్ తయారీకి అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెర్నిసియస్ అనీమియా సంభవిస్తుంది.

లభ్యత: మాంసాహారం, గుడ్లు, పాల లాంటి జంతు ఉత్పత్తుల్లో మాత్రమే లభిస్తుంది. మొక్కల్లో లభించదు.

విటమిన్ - బి17

దీన్నే యాంటి కేన్సర్ విటమిన్ అని అంటారు. వాస్తవానికి ఇది విటమిన్ కాదు. మొక్కల్లో కేన్సర్ నిరోధక లక్షణాలున్న రసాయనాలన్నింటినీ కలిపి బి17 అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో $బి_{15}$ అని పిలిచే విటమిన్?
ఎ) పాంటోథెనిక్ ఆమ్లం
బి) పంగామిక్ ఆమ్లం
సి) నియాసిన్ డి) ఫోలిక్ ఆమ్లం
2. ఒక గ్రాము కొవ్వు నుంచి ఎన్ని కేలరీల శక్తి విడుదలవుతుంది?
ఎ) 4.1 బి) 4.3 సి) 9.3 డి) 8.0
3. కింది వాటిలో ఆవశ్యక అమైనోఆమ్లం?
ఎ) అలనిన్ బి) ప్రోలిన్
సి) సిస్టీన్ డి) ఆర్జినిన్
4. చర్మం, రోమాలు, గోళ్లు తదితరాల్లో ఉండే ప్రత్యేకమైన ప్రొటీను?
ఎ) కెరోటిన్ బి) కెరాటిన్
సి) అల్బుమిన్ డి) కాండ్రిన్
5. తల్లిపాలలో ఉండే ప్రొటీన్ల శాతం?
ఎ) 2.4 బి) 3.1 సి) 6.2 డి) 0.3
6. మేక పాలలో ఉండే లాక్టోజ్ శాతం?
ఎ) 3.6 బి) 4.6 సి) 4.2 డి) 0.7
7. అధిక నీటి శాతం ఉన్న పాలు?
ఎ) ఆవు పాలు బి) గేదె పాలు
సి) మేక పాలు డి) గాడిద పాలు
8. విటమిన్ బి12 లోపం ద్వారా వచ్చే రక్తహీనతను ఏమంటారు?
ఎ) పెర్నిసియస్ రక్తహీనత
బి) న్యూట్రిషినల్ రక్తహీనత
సి) మెగలోబ్లాస్టిక్ రక్తహీనత
డి) మ్యాక్రోస్టిక్ రక్తహీనత
9. మానవుడి సాధారణ జీవక్రియ రేటు(బీఎంఆర్)కు ఎన్ని కేలరీ శక్తి అవసరం?
ఎ) 1200–1500 బి) 1500–1700
సి) 500–700 డి) 2000–3000
10. విటమిన్–ఎ లోపం ద్వారా కంటి కార్నియా పొడిబారడాన్ని ఏమంటారు?
ఎ) నిక్టలోపియా బి) జీరాఫ్తాల్మియా
సి) కెరటోమలేసియా డి) ఏదీకాదు
11. పెద్దల్లో విటమిన్ డి లోపం ద్వారా ఎముకలు క్షీణించి బలహీన పడటాన్ని ఏమంటారు?
ఎ) ఆస్టియో పోరోసిస్
బి) ఆస్టియో మలేషియా
సి) ఆస్టియో ఆర్థ్రైటిస్ డి) ఆస్టీటిస్ ఫైబ్రోజా
12. సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?
ఎ) ఆస్కార్బిక్ ఆమ్లం బి) థయమిన్
సి) నియాసిన్ డి) పెరిడాక్సిన్
13. ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
ఎ) బి2 బి) బి5 సి) బి6 డి) బి7
14. కండరాల్లో అధిక మోతాదులో ఉండే ప్రొటీన్?
ఎ) గ్లుటెన్ బి) కొల్లాజెన్
సి) కెసిన్ డి) మయోసిన్
15. కిందివాటిలో ఏ విటమిన్ లోపం వల్ల ఖీలోసిస్ సంభవిస్తుంది?
ఎ) పాంటోథెనిక్ ఆమ్లం బి) నియాసిన్
సి) పెరిడాక్సిన్ డి) రిబోఫ్లెవిన్
16. పాల చక్కెర(లాక్టోజ్)లో ఉండే మోనోశాకరైడ్లు?
ఎ) గ్లూకోజ్, ఫ్రక్టోజ్ బి) గ్లూకోజ్, గాలక్టోజ్
సి) గ్లూకోజ్, గ్లూకోజ్ డి) ఏవీ కాదు
17. సగటున మనిషికి రోజుకు ఎంత మోతాదులో విటమిన్ సి అవసరం?
ఎ) 2 మి.గ్రా. బి) 50 మి.గ్రా.
సి) 75 మి.గ్రా. డి) 30 మి.గ్రా.
18. కింద ఇచ్చిన ఏ అమైనో ఆమ్లంలో సల్ఫర్ ఉంటుంది?
ఎ) మిథియోనిన్ బి) హిస్టిడీన్
సి) గ్లైసిన్ డి) ప్రోలిన్

సమాధానాలు

1) బి	2) సి	3) డి	4) బి
5) ఎ	6) సి	7) ఎ	8) ఎ
9) బి	10) బి	11) బి	12) ఎ
13) ఎ	14) డి	15) డి	16) బి
17) బి	18) ఎ		

గోల్కొండ ఏ పరిశ్రమకు ప్రసిద్ధిగాంచింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. అద్దంకి గంగాధర కవి ఎవరి కొలువులో ఉండేవాడు?
   1) సింగ భూపాలుడు
   2) ఇబ్రహీం కుతుబ్‌షా
   3) అబుల్ హసన్ తానీషా
   4) కాకతి ప్రతాపరుద్రుడు
2. తెలుగుభాషకు తొలి వ్యాకరణం?
   1) ఆంధ్రశబ్ద చింతామణి
   2) ఆంధ్రభాషా భూషణం
   3) కావ్యాలంకార సంగ్రహం
   4) కవిజనాశ్రయం
3. 'శ్రీ పర్వత స్వామి' ఏ రాజు వంశీయుల కులదైవం?
   1) శాలంకాయనులు
   2) ఆనందగోత్రీకులు
   3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
4. బుద్ధుణ్ని దేవుడిగా ఆరాధించడం ప్రారంభించిన ప్రాథమిక శాఖ ఏది?
   1) దిగంబరులు 2) హీనాయానం
   3) మహాయానం 4) శ్వేతాంబరులు
5. తెలంగాణలో సామాజిక సాంస్కృతిక చైతన్యం తీసుకొచ్చింది ఎవరు?
   1) అఘోరనాథ ఛటోపాధ్యాయ
   2) దస్తూల్ హోషాంగ్
   3) ముల్లా అబ్దులఖియా
   4) పైవారంతా
6. తల్లి పేరుతో శాసనాలు వేయించిన ఇక్ష్వాక రాజు?
   1) రెండో ఏహబల శాంతమూలుడు
   2) రెండో వీరుపురుషదత్తుడు
   3) మొదటి వీరపురుషదత్తుడు
   4) మొదటి శాంతమూలుడు
7. పేష్కస్ అంటే?
   1) ప్రభుత్వానికి రైతు చెల్లించాల్సిన శిస్తు
   2) జమీందారుకు రైతు చెల్లించాల్సిన శిస్తు
   3) ప్రభుత్వానికి జమీందారు చెల్లించాల్సిన శిస్తు
   4) గ్రామాధికారికి రైతు చెల్లించాల్సిన శిస్తు
8. నిజాం ఉల్‌ముల్క్ మరాఠాలతో కుదుర్చుకున్న సంధి?
   1) మునిషిప్ గాంప్ 2) వార్నా సంధి
   3) దురారీ సరాయి 4) పైవన్నీ
9. ఏ నిజాం పరిపాలనా కాలంలో వహాబీ ఉద్యమం ప్రారంభమైంది?
   1) అఫ్జల్ ఉద్దౌలా
   2) మహబూబ్ అలీఖాన్
   3) నాసిరుద్దౌలా 4) సలాబత్ సింగ్
10. మీరట్‌లో తిరుగుబాటు ఏ రోజున ప్రారంభమైంది?
   1) 1857 మే 10
   2) 1858 నవంబర్ 1
   3) 1856 డిసెంబర్ 10
   4) 1858 జనవరి 1
11. 'నిజాం రాజ్యం కల్తీలేని మధ్యయుగపు రాచరికం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
   1) రావి నారాయణ రెడ్డి
   2) బద్దం ఎల్లారెడ్డి
   3) పుచ్చలపల్లి సుందరయ్య
   4) చంద్ర రాజేశ్వరరావు
12. ఇక్ష్వాకు అంటే అర్థం?
   1) చెరకు 2) పక్షి
   3) పర్వతం 4) నది
13. గౌతమీ బాలశ్రీ వేయించిన శాసనం?
   1) నాసిక్ శాసనం
   2) చినగంజాం శాసనం
   3) మ్యాకదోని శాసనం
   4) నానాఘాట్ శాసనం
14. శర్మవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థాన కవులు?
   1) యజ్ఞశ్రీ శాతకర్ణి 2) పులోమావి
   3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) హాలుడు
15. మొగల్ రాజపురం గుహలను ఎవరు నిర్మించారు?
   1) ఇక్ష్వాకులు 2) ఆనంద గోత్రీకులు
   3) శాలంకాయనులు 4) విష్ణుకుండినులు
16. 1915లో సంఘ సంస్కార నాటక మండలి స్థాపించి, హరిజనులతో నాటకాలు వేయించింది ఎవరు?
   1) నరాలశెట్టి దేవేంద్రుడు
   2) శేషాద్రి
   3) కృష్ణస్వామి 4) భాగ్యరెడ్డి వర్మ
17. కాకతీయుల కాలంలో మంత్రులు, సేనాధిపతులు, రాజోద్యోగులందరూ ఏ వర్గానికి చెందినవారు?
   1) బ్రాహ్మణ 2) క్షత్రియ
   3) వైశ్యులు 4) శూద్రులు
18. శాతవాహన కాలంనాటి వర్తకులు?
   1) సార్థవాహులు 2) తిలపిష్టకులు
   3) సుగధికులు 4) సేధి
19. ఇక్ష్వాకుల కాలంలో తలవర అంటే?
   1) ఒక వృత్తి
   2) రాజు సమకూర్చుకున్న సైన్యం
   3) సేనాధిపతి, సామంతరాజు
   4) నాణెం
20. 'విజ్ఞాన చంద్రికా మండలి' స్థాపన?
   1) 1906 2) 1907
   3) 1908 4) 1908
21. జస్టిస్ పార్టీ మౌలికంగా?
   1) హరిజనుల పార్టీ
   2) బ్రాహ్మణ పక్షపాత పార్టీ
   3) బ్రాహ్మణ వ్యతిరేక పార్టీ
   4) ఉన్నత వర్గాల పార్టీ
22. హిందూ ధర్మ పరిషత్తు పేరిట 1925 ఏప్రిల్ 1న మత విషయక కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షత వహించింది ఎవరు?
   1) కర్తుకోటి శంకరాచార్యులు
   2) రాజా ప్రతాపగిర్జీ
   3) పండిట్ శేషాద్రి 4) భాగ్యరెడ్డి వర్మ
23. 'సూత్తనిపాతం' ఏ మతగ్రంథం?
   1) జైన 2) హిందూ
   3) బౌద్ధ 4) ఏదీకాదు
24. భట్టిప్రోలులో నివసించే ఏ జాతి బౌద్ధమతాన్ని స్వీకరించింది?
   1) నాగులు 2) పుళిందులు
   3) యక్షులు 4) ద్రావిడులు
25. భట్టిప్రోలు ప్రాచీన నామం ఏది?
   1) ప్రతిపాలపురం 2) బేతవోలు
   3) ఘంటశాల 4) శ్రీ పర్వతం
26. హేతువాది ప్రాధాన్యత ఇచ్చే వాదం?
   1) ప్రతీత్య సముత్పవాదం
   2) గతి తార్కిక భౌతికవాదం
   3) కార్యకరణ వాదం 4) కర్మసిద్ధాంతం
27. శుద్ధి ఉద్యమాన్ని చేపట్టింది?
   1) బ్రహ్మసమాజం 2) ఆర్యసమాజం
   3) దివ్యజ్ఞాన సమాజం
   4) పైవన్నీ
28. 1975లో విధించిన ఎమర్జెన్సీ వల్ల ఏ పార్టీ ఆవిర్భవించింది?
   1) భారతీయ లోక్‌దళ్
   2) జనతాపార్టీ
   3) భారతీయ జనతాపార్టీ 4) ఏదీకాదు
29. శాతవాహన కాలం నాటి నిగమాలంటే ?
   1) గ్రామాలు 2) నగరాలు
   3) పట్టణాలు 4) రెవెన్యూ మండలాలు



30. బైబిల్‌ను తెలుగులోకి అనువదించిన తొలి విదేశీయుడు?
   1) బ్రేక్ 2) జెవెక్ బాక్
   3) కెప్టెన్ ఓర్ 4) ఎడిసన్
31. చౌరీ- చౌరా సంఘటనతో ఆగిపోయిన ఉద్యమం?
   1) సహాయనిరాకరణ
   2) శాసనోల్లంఘన
   3) వందేమాతర ఉద్యమం
   4) క్విట్ ఇండియా ఉద్యమం
32. ఈ కింద పేర్కొన్న ఏ గ్రంథాల్లో వరంగల్ నగరాన్ని వర్ణించారు?
   1) రాజశేఖర చరిత్ర
   2) కళాపూర్ణోదయం
   3) క్రీడాభిరామం 4) నీలాంబరి
33. శాతవాహనానంతర యుగంలో భూములను పగ్గాలతో కొలిచి ఆయకట్టును నిర్ణయించే వారిని ఏమనేవారు?
   1) హస్తికోశ 2) సెట్టి
   3) అక్షపటలాధికృతుడు
   4) రజ్జుకుడు
34. 'గుడిసెలు కాలిపోతున్నాయి' రచన ద్వారా జాతీయ పురస్కారం పొందినవారు?
   1) బోయి భీమన్న
   2) సి. నారాయణ రెడ్డి
   3) కంభంపాటి రామశాస్త్రి
   4) గుడిపాటి వెంకటాచలం
35. హరిజన్ సేవక్ సంఘ్ ద్వారా రాజకీయ చైతన్యం తీసుకొచ్చినవారు?
   1) భాగ్యరెడ్డి వర్మ
   2) కోదాటి నారాయణరావు
   3) జమలాపురం కేశవరావు
   4) మందముల నరసింగరావు
36. శాతవాహనుల కాలంనాటి పన్నెండు బృంద నాట్య శిల్పాలు ఎక్కడ లభించాయి?
   1) అమరావతి 2) జగ్గయ్యపేట
   3) గుడిమల్లం 4) కార్లే గుహలు
37. నిజాం ఉల్‌ముల్క్ అసలు పేరు?
   1) ముబారిజ్ ఖాన్
   2) చిన్‌ఖిలిచ్ ఖాన్
   3) మీర్ ఖమీరుద్దీన్ ఖాన్
   4) బహదూర్ షా
38. పర్ణిక శ్రేణి, పూసిన శ్రేణులు ఎవరి కాలం నాటివి?
   1) శాతవాహనులు 2) విష్ణుకుండినులు
   3) ఇక్ష్వాకులు 4) తూర్పు చాళుక్యులు
39. బౌద్ధ శిల్పకళలో అంగాలెన్ని?
   1) 2 2) 3 3) 4 4) 5
40. కుతుబ్‌షాహీలు ఏ సాంఘిక దురాచారం రూపుమాపటానికి ప్రయత్నించారు?
   1) వేశ్యాలోలత 2) సతీసహగమనం
   3) బాల్యవివాహాలు
   4) అంటరానితనం
41. బౌద్ధుల ప్రార్థన మందిరం?
   1) స్తూపం 2) ఛత్రం
   3) చైత్యం 4) విహారం
42. రాజనీతిని గురించి వివరించిన గ్రంథం?
   1) రాయవాచకం
   2) ఆముక్తమాల్యద
   3) సుమతీ శతకం 4) రామాభ్యుదయం
43. ఎవరికాలంలో నాగార్జున కొండ సుప్రసిద్ధ విద్యాకేంద్రంగా వర్థిల్లింది?
   1) శాలంకాయనులు
   2) ఆనంద గోత్రీకులు
   3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
44. శాతవాహనుల కాలంలో ఇత్తడి పనిచేసే వారి శ్రేణి?
   1) కమర 2) వధికి
   3) సెలవధికి 4) కాసకార
45. చాందా రైల్వే ఆందోళన ఎవరి పరిపాలనా కాలంలో జరిగింది?
   1) ఉస్మాన్ అలీఖాన్
   2) మహబూబ్ అలీఖాన్
   3) నాసిరుద్దౌలా 4) సికిందర్ జా
46. భారతదేశాన్ని తన రెండో మాతృభూమిగా పేర్కొన్న మహిళ?
   1) మేడం బ్లావట్ స్కీ 2) అనిబిసెంట్
   3) మదర్ థెరిస్సా 4) ఎవరూ కాదు
47. గోల్కొండ ఏ పరిశ్రమకు ప్రసిద్ధిగాంచింది?
   1) కలంకారి 2) నూలు వస్త్రాలు
   3) వజ్రాలు 4) ముత్యాలు
48. మహాపరినిర్యాణం అంటే ?
   1) బుద్ధుడి ధర్మప్రచారం
   2) బుద్ధుడి జననం
   3) బుద్ధుడి తపస్సు 4) బుద్ధుడి మరణం
49. మొదటి కర్ణాటక యుద్ధం నాటి ఆర్కాటు నవాబు?
   1) ముజఫర్ జంగ్ 2) సలాబత్ జంగ్
   3) అన్వరుద్దీన్ 4) మహ్మద్ అలీ
50. బయ్యారం శాసనం ఎవరి చరిత్రను గురించి తెలుపుతుంది?
   1) కొండవీటి రెడ్లు
   2) బాదామి చాళుక్యులు
   3) శాతవాహనులు
   4) కాకతీయులు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 3; 5) 4;
6) 4; 7) 3; 8) 4; 9) 1; 10) 1;
11) 1; 12) 1; 13) 1; 14) 4; 15) 4;
16) 4; 17) 2; 18) 1; 19) 3; 20) 1;
21) 3; 22) 2; 23) 3; 24) 1; 25) 1;
26) 3; 27) 2; 28) 2; 29) 3; 30) 2;
31) 1; 32) 3; 33) 4; 34) 1; 35) 2;
36) 4; 37) 3; 38) 3; 39) 3; 40) 2;
41) 3; 42) 2; 43) 3; 44) 4; 45) 2;
46) 2; 47) 3; 48) 4; 49) 3; 50) 4.

They act just like human beings!



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. When we moved (1)/ we have to put (2)/ our furniture in storage (3)/ for a while. (4) No error (5)
2. She knows that (1)/ child (2)/ had been telling (3)/ stories again. (4) No error (5)
3. The only stipulation is (1)/ that the topic you choose (2)/ must be related (3)/ to yours studies. (4) No error (5)
4. We are learning to (1)/ step back from ourselves (2)/ and identity (3)/ our strengths and weaknesses. (4) No error (5)
5. Books provides (1)/ with ideas (2)/ and a stimulus (3)/ for play. (4) No error (5)
6. Children from (1)/ certain backgrounds tend for (2)/ stereotyped by (3)/ their teachers. (4) No error (5)
7. The team coach (1)/ forced to step into stop (2)/ the two athletes from (3)/ coming to blows. (4) No error (5)
8. She stationed (1)/ at the window (2)/ to await for (3)/ his return. (4) No error (5)
9. The procession (1)/ made it's stately progress (2)/ through the streets (3)/ of the city. (4) No error (5)
10. The remains (1)/ of the building (2)/ stand as a stark remainders (3)/ of the fire. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. These ____ are intended to smooth the ___ to a peace treaty.
   1) negotiations; path
   2) talks; pavement
   3) arbitration; road
   4) dialogues; process
   5) confrontations; dispute
12. We tried to contact all ___ students, but one or two ____ the net.
   1) former; missed
   2) passed; forgotten
   3) failed; overlooked
   4) previous; forgot
   5) former; skip
13. The findings of the report _____ slanted in favour of the manufacturers.
   1) are been 2) were been
   3) had been 4) has been
   5) is been
14. The rise in _____ is a clear _____ that the government's policies are not working.
   1) popularity; signature
   2) population; progress
   3) prices; signal
   4) people; symptom
   5) places; pause
15. Chest pains can be a _____ of heart problems.
   1) recurring tension
   2) warning signal
   3) mounting pressure
   4) indicator 5) pulsation

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. As with people some monkeys are lazy, like those who sleep all day in the zoo, and some are industrious, like the little fellows who collect pennies for the organ-grinder.

B. If you invite them to dinner, they can sit quite comfortably in real chairs and use a knife and fork exactly as you.

C. As a matter of fact, Monkeys are like people, when certain kinds of monkeys are domesticated, they act just like human beings.

D. They smoke cigars, drink beer and look almost human when dressed.

E. Sometimes he even leads them in singing, first howling some weird notes, then signaling his companions to join in the chorus.

F. In speaking of monkeys which act like human beings, mention should be made of the Brazilian monkey which often balances himself on the top of a tree and makes a speech to the monkeys below him.

16. What is the LAST sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) D
17. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. No. 21 - 25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

21. When I arrived, I have the sensation that she had been expecting me.
   1) has 2) will have
   3) will be having 4) had
   5) No correction required
22. We are concrete seeking new ways of expanding our membership.
   1) evidently 2) firstly
   3) vastly 4) currently
   5) No correction required
23. You will perhaps discover, that practice does help, that success does come with effort and determination and a positive mind-set.
   1) has come
   2) will come
   3) would come
   4) will be coming
   5) No correction required
24. The brightest persons in a class are not always the good students.
   1) comparable 2) winner
   3) best 4) active
   5) No correction required
25. I hired a cleaning lady who comes in twice a month and is now in disposable.
   1) indisposable 2) indisputable
   3) indispensable 4) incorrigible
   5) No correction required

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Delivering mail to small villages in India was once a difficult, **perilous** and exciting job. The postman traveled on foot, often wading through swamps or crawling through jungles in order to reach the many villages on his route.

The Indian mailman might sometimes encounter a fierce tiger or panther along the way, yet the only weapon he carried was a sharp spear. He never went to work without his bells, which he would shake in order to **ward off** evil spirits. Wild animals or evil spirits, nothing ever interrupted his work.

The Indian letter carrier was an honoured and respected person; he was treated with great courtesy. So wise he thought to be that he was frequently called upon to solve the village disputes.

It is certainly evident that only a very brave man would take a job that **compelled** him to fight off wild animals in order to get his work done. You can understand why everyone in India looked upon the man who delivered mail as a true national hero.

26. Which statement is true?
   a. Mailmen in India were considered heroes.
   b. Some people in India used to believe in evil spirits.
   1) Only a 2) Only b
   3) Both a and b
   4) Neither a nor b
   5) Either a or b
27. Which statement is false?
   a. The letter carrier was often asked to settle disputes in the villages that he visited.
   b. An Indian mailman used to carry modern weapons as protection against wild animals.
   1) Only a 2) Only b
   3) Both a and b
   4) Neither a nor b
   5) Either a or b
28. The synonym of **ward off** is
   1) Encourage 2) Protest
   3) Keep 4) Deflect
   5) Depend
29. The antonym of **perilous**
   1) Hazardous 2) Bounty
   3) Terrifying 4) Harmless
   5) Detrimental
30. The antonym of **compelled**
   1) Obliged 2) Constrained
   3) Bound 4) Chained
   5) Liberated

Directions (Q. No. 31-40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A professor at an eastern college _____ (31) that the special sense the visually challenged people _____ (32) on is connected in some way with ___ (33) hearing. The professor _____ (34) described 1500 tests in which blind people and people with normal sight, but blindfolded, _____ (35) to avoid walking into walls. The visually challenged passed the tests with greater _____ (36) than those who could see. The blind would _____ (37) forward confidently, sensing the wall when they were as much as fifteen feet _____ (38) it. They claimed that their ears sent them a warning _____ (39) that the wall was near. This seems quite possible, for when their ears were covered so that they could not hear; they often ran right _____ (40) the wall. You can imagine how valuable this strange power must be to the blind. Do you think that it is nature's way of making up to them for their lost sight?

31. 1) believes 2) deem
   3) judge 4) accept 5) doubt
32. 1) grasp 2) depend
   3) relay 4) reel
   5) realize
33. 1) there 2) they
   3) their 4) them 5) that
34. 1) lately 2) newly 3) just
   4) recently 5) freshly
35. 1) attempt 2) attempting
   3) attempts 4) will attempt
   5) attempted
36. 1) ease 2) difficulty
   3) effort 4) relieve
   5) alleviate
37. 1) stepping 2) stride
   3) tramp 4) tumble
   5) amble
38. 1) through 2) thorough
   3) from 4) away 5) apart
39. 1) memo 2) letter
   3) meaning 4) message 5) point
40. 1) inside 2) outside
   3) inwards 4) in 5) into

Directions (Q. No. 41-42): choose the wrongly spelt word from the five options given.

41. 1) Cemetery 2) Scenary
   3) Scenario 4) Composure
   5) Predicament
42. 1) Stationery 2) Stationary
   3) Impeccabal 4) Juggernaut
   5) Delicious

Directions (Q. No. 43-45): In each of the following four sets of words a set is either synonymous or antonymous, identify that set and mark your answer.

43. 1) Luscious; Sacrilege
   2) Prophecy; Luxurious
   3) Somersault; Impediment
   4) Obnoxious; Abhorrent
   5) None of these
44. 1) Atrocious; Oblige
   2) Entourage; Tourist
   3) Ensemble; Entangle
   4) Pilfer; Embezzle
   5) None of these
45. 1) Ensconce; Shelve
   2) Acrimonious; Corrigible
   3) Sanctimonious; Succulent
   4) Corrigendum; Adjudicate
   5) None of these

Answers

1) 2; 2) 1; 3) 4; 4) 3; 5) 1;
6) 2; 7) 2; 8) 3; 9) 2; 10) 3;
11) 4; 12) 1; 13) 3; 14) 3; 15) 2;
16) 4; 17) 2; 18) 5; 19) 3; 20) 1;
21) 4; 22) 4; 23) 5; 24) 3; 25) 3;
26) 3; 27) 2; 28) 4; 29) 4; 30) 5;
31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5;
36) 1; 37) 2; 38) 3; 39) 4; 40) 5;
41) 2; 42) 3; 43) 4; 44) 4; 45) 1.